సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00

సంపుటి: 17
సంచిక: 354

ఆదివారం 16-3-2025



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'



ఆటల కుటుంబం!


ఆటలంటే బలం. కుటుంబం అంటే అమోఘ బలం. ఫ్యామిలీకి ఆటలు తోడైతే... ఆ బలం చెప్పలేనంత! 63 సంవత్సరాల కందుకూరి లావణ్య, ఆమె భర్త 69 సంవత్సరాల నాగేశ్వరరావు అథ్లెటిక్స్‌లో రాణిస్తూ 'ఆహా' అనిపిస్తున్నారు. తల్లిదండ్రుల బాటలోకి వచ్చిన 35 సంవత్సరాల అపర్ణ ఆటల్లో విజయకేతనం ఎగరేస్తోంది. 'ఆటలకు వయసు అడ్డు కాదు' అంటూ ఎంతోమందికి స్ఫూర్తి ఇస్తున్న కందుకూరి కుటుంబం గురించి...

– ఫ్యామిలీలో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


57 ఏళ్ళ నమ్మకం
150 షోరూమ్స్
20 నగరాలలో
విజయ్ సేల్స్
నమ్మకం ముఖ్యం
www.vijaysales.com
ఉచిత డెలివరీ
₹1* డౌన్ పేమెంట్
ఫ్లాట్ 50% తగ్గింపు
ఎంపిక చేసిన AC మోడల్స్‌పై
రెండు రోజులు మాత్రమే
2025 16 - 17 మార్చి
10% వరకు క్యాష్‌బ్యాక్ గరిష్ఠంగా ₹22,500 వరకు
15% వరకు క్యాష్‌బ్యాక్ గరిష్ఠంగా ₹25,000 వరకు
ఉచితం 1+4 సంవత్సరాలు అదనపు వారంటీ*
₹0 డౌన్ పేమెంట్ పేపర్ ఫైనాన్స్‌పై*
క్యాష్ బ్యాక్ ₹25,000 వరకు*
10 సంవత్సరాలు కంప్రెసర్ వారంటీ*
ఉచితం స్టాండర్డ్ ఇన్‌స్టలేషన్*
సామర్థ్యం - 1T / 1.5T / 1.8T / 2T / 2.5T / 3T / 4T
స్టార్ రేటింగ్ - 3 స్టార్ / 4 స్టార్ / 5 స్టార్
BLUE STAR ఈఎమ్ఐ ₹2,750 నుండి ప్రారంభం ₹16,000 వరకు తగ్గింపు
Carrier ఈఎమ్ఐ ₹2,625 నుండి ప్రారంభం ₹19,000 వరకు తగ్గింపు
DAIKIN ఈఎమ్ఐ ₹2,833 నుండి ప్రారంభం ₹17,000 వరకు తగ్గింపు
GENERAL ఈఎమ్ఐ ₹4,000 నుండి ప్రారంభం ₹9,800 వరకు తగ్గింపు
Godrej ఈఎమ్ఐ ₹2,208 నుండి ప్రారంభం ₹14,000 వరకు తగ్గింపు
HITACHI ఈఎమ్ఐ ₹2,792 నుండి ప్రారంభం ₹25,000 వరకు తగ్గింపు
LG ఈఎమ్ఐ ₹3,042 నుండి ప్రారంభం ₹35,000 వరకు తగ్గింపు
LLOYD ఈఎమ్ఐ ₹2,417 నుండి ప్రారంభం ₹22,000 వరకు తగ్గింపు
MITSUBISHI ELECTRIC ఈఎమ్ఐ ₹3,542 నుండి ప్రారంభం ₹17,000 వరకు తగ్గింపు
SAMSUNG ఈఎమ్ఐ ₹3,708 నుండి ప్రారంభం ₹22,490 వరకు తగ్గింపు
VOLTAS ఈఎమ్ఐ ₹2,417 నుండి ప్రారంభం ₹33,000 వరకు తగ్గింపు
Cassette ACs Available CAPACITY 1.5T to 5T
DIRECT COOL REFRIGERATORS
FROST-FREE REFRIGERATORS
SIDE BY SIDE REFRIGERATORS
Godrej UPTO ₹6,000 OFF
LIEBHERR UPTO ₹5,000 OFF Cashback Upto ₹1,000*/-
SAMSUNG UPTO ₹24,000 OFF Cashback Upto ₹6,000*/-
Whirlpool UPTO ₹28,000 OFF Cashback Upto ₹5,000*/-
Electrolux UPTO ₹35,000 OFF Cashback Upto ₹5,000*/-
LG UPTO ₹50,000 OFF Cashback Upto ₹10,000*/-
Haier UPTO ₹45,000 OFF Cashback Upto ₹7,000*/-
DEEP FREEZERS STARTING FROM ₹15,990 (100/150/200/300/400/500 ltr)
UPTO 52% OFF AIR COOLERS
Bring Old, Upgrade to NEW!
VISE 32 Google TV PRICE ₹34,000 OFFER PRICE ₹12,000 ZERO DOWN PAYMENT | EMI ₹1,500 x 8 mths
Panasonic 43 4K UHD Google TV EMI STARTING FROM ₹4,849 CASHBACK UPTO ₹2,500
TCL 55 4K UHD Google TV PRICE ₹78,990 OFFER PRICE ₹29,990 CASHBACK UPTO ₹1,000 DOWN PAYMENT ₹9,997 | EMI ₹2,499 x 8 mths
SANSUI 75 4K QLED Google TV PRICE ₹1,69,900 OFFER PRICE ₹84,990 DOWN PAYMENT ₹16,998 | EMI ₹8,499 x 8 mths
oppo Reno13 Series 5G Starting from ₹37,999 10% INSTANT CASHBACK Zero DOWN PAYMENT OWN AT ₹2111/- MONTHLY EMI
SAMSUNG NEW LAUNCH Awesome Intelligence Starting from ₹29,999* ₹3,000 Instant Discount NO COST EMI
NOTHING (R) phone (3a) ₹24,999 ₹22,999*
iPhone 16e 128 GB PRICE ₹59,900 VSP ₹57,900 Cashback ₹4,000 Exchange Value ₹15,000* Exchange Bonus ₹6,000* Effective Price ₹32,900* EMI Starting At ₹1,538
hp PAVILION, VICTUS, SPECTRE, OMEN, ENVY
Cashback Upto ₹10,000/-*
Exchange Bonus Upto ₹10,000/-
1 Year ADP + 1 Year Extended Warranty + 3 Year Antivirus ₹399/-*
Fossil Watch ₹999/-*
Lenovo LENOVO GAMING, YOGA SERIES, SLIM 5 & FLEX 5, LOQ
Cash Back Upto ₹10,000/-
Exchange Bonus Upto ₹25,000/-
2 Years Extended Warranty Starting at ₹2999/-
PS5 PLAYSTATION 5 DEALS SAVE ₹3,000/-
MacBook Air M2 (Space Grey) PRICE ₹85,900 VSP ₹74,900 Cashback ₹5,000 Exchange Value ₹13,000* Exchange Bonus ₹10,000* Effective Price ₹46,900* EMI Starting At ₹2,163
iPad 11th Gen PRICE ₹34,900 VSP ₹34,900 Cashback ₹3,000 Effective Price ₹31,900* EMI Starting At ₹1,454
LED TVs | Large Appliances | Air Conditioners
Mobiles | Laptops | Accessories
Kitchen Appliances
For special discounts on corporate and builder enquiries, please email us at b2b@vijaysales.com
HDFC BANK INSTANT DISCOUNT UPTO ₹7,500* WITH EASYEMI ON HDFC BANK DEBIT / CREDIT CARDS
AMERICAN EXPRESS INSTANT DISCOUNT UPTO ₹7,500* ON AMERICAN EXPRESS EMI TRANSACTIONS
UP TO ₹25,000/- INSTANT DISCOUNT & CASHBACK ON CREDIT CARD / DEBIT CARD & PAPER FINANCE
WE ACCEPT EMI CARDS
విజయ్ సేల్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్
హైదరాబాద్ | వరంగల్ | విజయవాడ | విశాఖపట్నం | రాజమండ్రి | తిరుపతి | కాకినాడ | ముంబై | ఢిల్లీ | థానే | నవీ ముంబై | పూనే | సూరత్ | వడోదర | అహ్మదాబాద్ | గురుగ్రామ్ | ఫరీదాబాద్ | నోయిడా | ఇందిరాపురం
ఎస్ ఆర్ నగర్ | అత్తాపూర్ | ఏఎస్ రావు నగర్ | చంపాపేట్ | చాంద్రాయణగుట్ట (హఫీజ్ బాబా నగర్ మెయిన్ రోడ్డు) | హస్తినాపురం | హాయత్‌నగర్ | కర్మన్‌ఘాట్ | కొత్తపేట | కొండాపూర్ | కూకట్‌పల్లి | మలక్‌పేట్ | మదీనాగూడ | మెహిదీపట్నం | షైలార్‌దేవ్‌పల్లి | నాగారం | నాగోల్ |
నల్లకుంట | నాదారం | పంజాగుట్ట | సీతాఫల్‌మండి (బోడుప్పల్) | ఆర్ సి పురం | షా అలి బండ | సుచిత్ర క్రాస్ రోడ్స్ | సనత్‌నగర్ | టోలిచౌకి | వనస్థలిపురం | వరంగల్ | హనమకొండ
హాయత్‌నగర్: విజయ డయాగ్నోస్టిక్ సెంటర్ ఎదురుగా | పంజాగుట్ట: దిగువ గ్రౌండ్ ఫ్లోర్, జీవీకే సెంటర్ పాయింట్ (హైదరాబాద్ సెంట్రల్) | ఆర్ సి పురం: సీసీ మార్ట్ ఎదురుగా
SCAN FOR STORES
Scan to Shop Online www.vijaysales.com
*Conditions apply. This offer includes all other discounts also. No other offer can be clubbed with this offer. Images shown are for illustrative purpose only. Offer till stocks last. Finance offer applicable at the sole discretion of Financier. #Processing Fees and other charges is applicable as per Financier. For Paper Finance: Please bring Aadhaar Card, Pan Card, Electric Bill & Cancelled Cheque. Offer is based on minimum transactions slabs defined by Finance company. Kindly speak to our store sales staff for the "Terms and Conditions" of all the bank offers, and for the respective Instant Discount/Cashback amounts applicable on each Bank. *In 1+4 Years Comprehensive Warranty, from 2nd Year onwards Visiting Charges, Transportation and Gas Charges extra as applicable.

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 17 సంచిక: 354
SUNDAY Special | ఆదివారం 16-3-2025
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'



డబ్ల్యూపీఎల్ చాంప్ ముంబై ఇండియన్స్

మహిళల ప్రీమియర్ లీగ్ మూడో సీజన్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని ముంబై విజేతగా నిలిచింది. ఫైనల్లో ముంబై 8 పరుగులతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించింది.

14 లో



మా పిల్లలేం చేస్తున్నారు.. ఓ కన్నేసి ఉంచండి

- డ్రగ్స్, సోషల్ మీడియా ప్రభావం నేపథ్యంలో డిటెక్టివ్ ఏజెన్సీలను ఆశ్రయిస్తున్న తల్లిదండ్రులు
- హైదరాబాద్‌లో కొత్త ధోరణి.. పెరిగిన టీనేజ్ మానిటరింగ్

16 లో



సునీత వచ్చేస్తోంది..

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో చిక్కుకుపోయిన సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ ఎట్టకేలకు భూమికి తిరిగి రానున్నారు.

వివరాలు 6లో ▸



214 మందిని చంపేశాం

తాము హైజాక్ చేసిన జాఫర్ ఎక్స్‌ప్రెస్‌లో బందీలుగా ఉన్న 214 మందిని చంపేశామని బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ మిలిటెంట్లు ప్రకటించారు.

వివరాలు 6లో ▸

భారత్.. ఆధ్యాత్మిక స్ఫూర్తి



- జాతీయ న్యాయ నిపుణుల సదస్సులో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- ప్రజలంతా విలువలు ఆచరించినప్పుడే ధర్మం పరిఢవిల్లుతుందని వెల్లడి
- న్యాయవాదులు సానుకూల దృక్పథాన్ని అలవాటు చేసుకోవాలి: జస్టిస్ ఎస్వీ భట్టి
- సదస్సులో పాల్గొన్న హైకోర్టు జడ్జీలు, ప్రముఖులు

- వివరాలు 12లో

'రాయలసీమ'పై కేంద్రం కొరడా



- డీపీఆర్ కోసం చేపట్టిన తాత్కాలిక నిర్మాణాలను తొలగించాలని ఏపీకి ఆదేశం
- తవ్వకాలను సైతం పూడ్చి సైట్ పూర్వ స్థితిని పునరుద్ధరించాలని సూచన
- ఇది తమ ప్రభుత్వ విజయమేనన్న మంత్రి ఉత్తమ్

- వివరాలు 12లో

హద్దు మీరితే ఖబడ్దార్

సోషల్ మీడియాలో ఇష్టమొచ్చినట్టు పోస్టులు పెడితే ఊరుకోం.. తోడ్క తీస్తాం..

గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై చర్చలో సీఎం రేవంత్‌రెడ్డి

- ప్రజా జీవితంలో ఉన్నామని ఓపిక పడుతున్నాం.. లేదంటే ఒక్కడూ బయట తిరగలేడు
- జర్నలిస్టులు ఎవరో మీడియా సంఘాలు జాబితా ఇవ్వండి..
- అలాగాకుండా జర్నలిస్టు ముసుగు వేసుకుని వస్తే బట్టలూడదీసి కొడతాం
- కోర్టుకు వెళ్లినా బెయిల్ రాకుండా చట్టాన్ని సవరిస్తాం
- డ్రగ్స్ విక్రయించేవారిని వదిలేది లేదు.. వారి ఇళ్లకు కరెంటు, నీళ్లు కట్ చేస్తాం
- విద్యార్థులు స్కూళ్లలో డ్రగ్స్ వాడితే యాజమాన్యాలదే బాధ్యత
- నగరం లోపలున్న పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటికి తరలిస్తామని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ''సోషల్ మీడియాలో భాష చూడండి. కుటుంబ సభ్యులు, ఆడబిడ్డల మీద ఇష్టం వచ్చినట్టు పోస్టులు పెడుతున్నారు. ప్రజాజీవితంలో ఉన్నాం కదా అని ఓపిక పడుతున్నాం. లేదంటే ఒక్కడు కూడా బయట తిరగలేడు. హద్దు దాటితే ఊరుకోబోం. మీడియా మిత్రులు, మీడియా సంఘాలు.. మీరైనా చెప్పండి. జర్నలిస్టులు ఎవరో మీరే జాబితా ఇవ్వండి. జాబితాలో లేని వాడు జర్నలిస్టు కాడు. జర్నలిస్టు కానోడిని క్రిమినల్‌గానే చూస్తాం. క్రిమినల్స్‌కు ఎట్లా జవాబు చెప్పాల్నో అట్లానే చెప్తాం. జర్నలిస్టు ముసుగేసుకుని వస్తే.. ముసుగుతీసి ఒక్కొక్కడిని బట్టలూడదీసి కొడతాం, తోడ్కలు (తోలు) తీస్తా..'' అని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. తాను సీఎం కుర్చీలో ఉన్నానని, అందువల్ల ఊరుకుంటానని అనుకుంటున్నారని.. కానీ ఇకపై ఊరుకునే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. శనివారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై చర్చలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''నేనూ మనిషినే.. చీమూనెత్తురు ఉన్నాయి. నన్ను తిట్టిన తిట్లకు మీపేరు పెట్టుకుని చూడండి. నేను ఓపికతో ఉన్నా..

మిగతా 3వ పేజీలో ▶

స్టేచర్ సరే.. స్టేట్ ఫ్యూచర్ సంగతేంటి?

గవర్నర్‌కు ధన్యవాదాలు తెలిపే తీర్మానంలో బీఆర్ఎస్‌ను ఉద్దేశించి సీఎం రేవంత్ వ్యాఖ్యలు

2 లో

రాష్ట్ర బడ్జెట్‌లో రూ. 70వేల కోట్ల కోత

అవసరమైతే వివిధ కార్యక్రమాల్లో కోతలు పెట్టాల్సిన పరిస్థితి వస్తుంది: సీఎం

మళ్లీ నేనే ముఖ్యమంత్రి

మీడియాతో ఇష్టాగోష్టిలో రేవంత్

సీఎం ప్రసంగాన్ని బహిష్కరించిన బీఆర్ఎస్

- కేసీఆర్‌పై రేవంత్ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ధ్వజం
- ప్రాణాలు పణంగా పెట్టి తెలంగాణ తెస్తే చావును కోరుతున్నారు: హరీశ్

3 లో

సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తే కార్యకర్తలే చూసుకుంటారు

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: సోషల్ మీడియా పేరుతో తప్పుడు వార్తలు రాసే వారిపై చర్యలకు సీఎం స్పీచ్‌తో గ్రీన్‌సిగ్నల్ వచ్చిందని, ఇక నుంచి సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తే తమ పార్టీ కార్యకర్తలే చూసుకుంటారని ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. శనివారం అసెంబ్లీ లాబీల్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ సోషల్ మీడియా విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అద్భుతంగా మాట్లాడారని అభిప్రాయపడ్డారు. శ్రీశైలంలో తాను చిన్న మాట దొర్లితే దాన్ని సోషల్ మీడియాలో ఉద్దేశపూర్వకంగా ట్రోల్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్‌మీడియా పేరుతో అడ్డూ అదుపూ లేకుండా వార్తలు రాస్తున్నారని కోమటిరెడ్డి మండిపడ్డారు.

సోషల్ మీడియా పోస్ట్‌లతో ఇబ్బంది పడ్డా

అసెంబ్లీ లాబీల్లో మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: సోషల్ మీడియా వల్ల తనకు చాలా ఇబ్బందులు ఏర్పడ్డాయని, తన ఫొటోలు మార్ఫింగ్ చేసి పెట్టిన పోస్ట్‌లతో మానసిక వేదనకు గురయ్యానని మంత్రి సీతక్క పేర్కొన్నారు. సోషల్ మీడియా పోస్ట్‌లు కొన్నిసార్లు తనను 'డీమోరలైజ్'చేశాయని, మహిళలు రాజకీయాల్లో ఎదగడమే కష్టమైన ఈ రోజుల్లో తాము ఈ స్థాయికి వస్తే ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. శనివారం అసెంబ్లీ లాబీల్లో ఆమె మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ.. సోషల్ మీడియాను ప్రజాసేవకు వాడుకున్న తాను, కొందరు ఈ మాధ్యమాలను దుర్వినియోగం చేయడంతో ఇబ్బందులకు గురయ్యానని చెప్పారు. సోషల్ మీడియా దుష్ప్రభావాల గురించి సీఎం రేవంత్‌రెడ్డి సభలో మాట్లాడడం అందరికీ ఊరట కలిగించిందన్నారు. సోషల్ మీడియాను కట్టడి చేయడం అవసరమన్నారు. ఈ మాధ్యమాలను బీఆర్ఎస్ అబద్ధాలకు ఉపయోగిస్తోందని ఆరోపించారు. బాడీ షేమింగ్, ఫొటోల మార్ఫింగ్, తాము చెప్పని మాటలను ఆపాదిస్తూ కుటుంబాలను సోషల్ మీడియా బజారుకీడుస్తోందన్నారు. ఈ మాధ్యమాలను మంచికి వినియోగించాలే తప్ప, చెడు ప్రయోజనాల కోసం కాదన్నారు.

ప్రధానితో దోస్తీ.. మాతో కుస్తీ

సీఎంపై బీజేపీ ఎమ్మెల్యేల ధ్వజం



మీడియాతో మాట్లాడుతున్న హరీశ్‌బాబు, పాయల్ శంకర్, సూర్యనారాయణ

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీతో దోస్తీ చేస్తూ.. ఇక్కడ తమతో కుస్తీకి దిగుతున్నారని పలువురు బీజేపీ ఎమ్మెల్యేలు వ్యాఖ్యానించారు. బీజేపీ ఎమ్మెల్యేలు పాల్వాయి హరీశ్‌బాబు, పాయల్ శంకర్, ధన్‌పాల్ సూర్యనారాయణ శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడారు. ఎంఐఎం ఎమ్మెల్యే ఒవైసీ ఏం కోరినా.. తక్షణం ఆదేశాలు ఇస్తున్న రేవంత్‌రెడ్డి.. రాష్ట్రానికి ముఖ్యమంత్రా..? లేకా ఎంఐఎం పార్టీకా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో అనేక అభివృద్ధి పనులకు కేంద్రం నిధులు ఇస్తోందని ముఖ్యమంత్రే చెబుతూ.. మరోవైపు అభివృద్ధికి నిధులు ఇవ్వడం లేదనడం హాస్యాస్పదమన్నారు. రాష్ట్రంలో 50 శాతం మంది రైతులకు రుణమాఫీ కాలేదని, డిస్కం, ఆర్టీసీ బకాయి నిధులు, మహాలక్ష్మి పథకం అమలు చేయడం లేదని ఆరోపించారు. 317 జీవోతో ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నా మాట్లాడలేదని, సీఎం ప్రసంగం మొత్తం చూస్తే ఆయన డొల్లతనం బయటపడిందన్నారు.

ఇదండీ సంగతి



... పాతా సామాన్లు కొంటాం!

స్టేచర్ సరే.. స్టేట్ ఫ్యూచర్ సంగతేంటి?

బీఆర్ఎస్‌కు స్టేచర్ మీద ఉన్న పట్టింపు రాష్ట్ర భవిష్యత్తు విషయంలో ఏది?

ఒకప్పుడు మీకు అధికార పార్టీ స్టేచర్ ఉండేది.. ఇప్పుడది గుండుసున్నా

- బీఆర్ఎస్‌ను జనం మార్చురీకి పంపారు
- గవర్నర్‌కు ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో సీఎం రేవంత్ వ్యాఖ్యలు
- నేను కేసీఆర్‌ను ఏదో అంటున్నానని కేటీఆర్, హరీశ్ అంటున్నారు
- ఆయనకేదైనా అయితే ప్రతిపక్ష నేత పదవి కోసం వారు పోటీపడతారేమో!
- నేను అలా కోరుకోను.. కేసీఆర్ వందేళ్లు ఆరోగ్యంగా, ప్రతిపక్ష నేతగా ఉండాలి.. నేను సీఎంగా ఉండాలి
- ఆయన అసెంబ్లీకి వస్తే పూర్తి చిట్టా విప్పుతా



సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ''బీఆర్ఎస్ నేతలు మాటకు ముందు, మాటకు తర్వాత స్టేచర్ అంటున్నారు. ఆ స్టేచర్ విషయంలో ఉన్న ఆసక్తి, పట్టింపు ఈ స్టేట్ ఫ్యూచర్ విషయంలో ఏదీ? ఒకప్పుడు మీకు అధికార పార్టీ స్టేచర్ ఉండేది, తర్వాత ప్రధాన ప్రతిపక్ష పార్టీ స్టేచర్ వచ్చింది. పార్లమెంటు ఎన్నికల్లో పార్టీని జనం మార్చురీకి పంపారు. స్టేచర్ గుండుసున్నా అయింది. నేను ఇదే చెప్పా, అందులో తప్పేముంది. నేను కేసీఆర్‌ను ఏదో అంటున్నానని కేటీఆర్, హరీశ్‌రావు అంటున్నారు. కేసీఆర్ నుంచి తీసుకునేందుకు ఇక ఏమీ లేదు. ఆయనది ప్రధాన ప్రతిపక్ష హోదా. ఆయనకు జరగరానిది ఏదైనా జరిగితే.. కేటీఆర్, హరీశ్‌రావు దానికోసం పోటీపడతారేమో. దాన్ని నేనైనే కోరుకోను కదా! కేసీఆర్ వందేళ్లు ఆరోగ్యంగా ఉండాలి. అదే ప్రతిపక్ష నేత పాత్ర పోషించాలి. నేను ముఖ్యమంత్రిగా ఉండాలి. ఇది మా భవిష్యత్తు కార్యాచరణ..''అని ముఖ్యమంత్రి రేవంత్ వ్యాఖ్యానించారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై జరిగిన చర్చకు శనివారం ఆయన సుదీర్ఘంగా సమాధానమిచ్చారు. ఈ క్రమంలో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌పై తీవ్రంగా విరుచుకుపడ్డారు. వివరాలు సీఎం రేవంత్ మాటల్లోనే..

''పార్టీలో పెద్ద మనిషి హోదాలో కేసీఆర్.. తాడు బొంగరం లేనట్టు వ్యవహరిస్తున్న కేటీఆర్, హరీశ్‌రావులను సరిదిద్దాలి. ఇకనుంచి నోటికొచ్చినట్టు మాట్లాడితే సహించేది లేదు. నా రాజకీయ అనుభవం గురించి మాట్లాడుతున్నారు. జెడ్పీటీసీగా, ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా పనిచేసిన నేను మంత్రి కాకుండా నేరుగా సీఎం అయ్యా. గతంలో ఎన్టీఆర్, నరేంద్ర మోదీ డైరెక్ట్‌గా సీఎం అయి పాలన అందించలేదా? 40ఏళ్ల రాజకీయ అనుభవం అంటారు కదా.. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి మాట్లాడితే.. అందులో మంచిని గుర్తించి నేర్చుకునేందుకు నేను సిద్ధం.. రైతులకు సంబంధించిన ఏ విషయంపై అయినా చర్చ జరగాలని కేసీఆర్ కోరితే నేను రెడీ. సభకు వచ్చి చర్చించాలి. పూర్తి చిట్టా విప్పుతా.

ఔను.. మోదీ బడే భాయే..

''దేశంలోని ముఖ్యమంత్రులకు ప్రధాని హోదాలో నరేంద్ర మోదీ బడే భాయే (పెద్దన్న). ఈ మాటను మరోసారి చెప్తున్నా. రాష్ట్ర ప్రయోజనాల కోసం నేను తరచూ ప్రధానిని కలుస్తూనే ఉంటాను. పార్టీపరంగా ఆయనతో విభేదించొచ్చు. కానీ ప్రధానిగా గౌరవిస్తా. గత 15 నెలల్లో ఢిల్లీకి 32 సార్లు వెళ్లా, మూడు పర్యాయాలు ప్రధానిని కలిశా. నేను కలవని కేంద్రమంత్రి అంటూ ఎవరూ లేరు. అవసరమైతే మరో 300సార్లు వెళ్తా. మీరు ప్రధానిని గౌరవించరు. గవర్నర్‌ను గౌరవించరు. ప్రజలను పట్టించుకోరు.''

ఇలానే ఉంటే వచ్చే ఎన్నికల్లో గుండు సున్నా..

భూకంపం కూడా ఒక్కసారి రాదు, రెండుమూడు సార్లు కదిలి కంపిస్తుంది. తుఫాన్ ముందు కొంత ప్రశాంతత ఉంటుంది. కొన్నేళ్లు అలాంటి ప్రశాంతత చూపిన ప్రజలు చివరికి ఎన్నికల్లో ప్రభావం చూపారు. అసెంబ్లీ ఓటమి, పార్లమెంటు ఎన్నికల్లో సున్నా వచ్చినా కేసీఆర్ ఆధ్వర్యంలోని బీఆర్ఎస్ నేతల్లో మార్పు రాలేదు. వారి అధికారాన్ని దూరం చేసినందుకు నామీద కోపం ఉండొచ్చు. కానీ సీఎం కుర్చీకైనా గౌరవం ఇవ్వాలి కదా.. ఇంకా కుల దురహంకారాన్ని వీడలేదు. ఇట్లానే ఉంటే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గుండుసున్నా ఖాయం.

గవర్నర్ ప్రసంగం అలానే ఉంటుంది..

గవర్నర్ ప్రసంగం కాంగ్రెస్ విధానంలా ఉందని బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారు. అవును.. గవర్నర్ ప్రసంగం కాంగ్రెస్ విధానంలానే ఉంటుంది. ఎందుకంటే మాది కాంగ్రెస్ ప్రభుత్వం. ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలతో కూడిన విధానాలనే పథకాలుగా అమల్లోకి తెచ్చాం. మా ఎన్నికల మేనిఫెస్టో ఆధారంగా రూపొందిన పథకాలకు కేబినెట్ ఆమోదం తెలిపిన విషయాలనే గవర్నర్ ప్రస్తావించారు. అలాంటప్పుడు విమర్శించడం ఏమిటి? ప్రతిపక్ష నేతలు అజ్ఞానమే విజ్ఞానంగా, అడ్డగోలుతనమే గొప్పతనంగా భావిస్తున్నట్టున్నారు''అని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

రాష్ట్రంలో నిరుద్యోగ రేటు తగ్గింది..

''అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే యువతకు 57,924 ఉద్యోగాలు ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం దేశంలో మరోటి లేదు. నేను సవాల్ విసురుతున్నా.. ఉంటే చెప్పండి. 2023 జూలై నుంచి సెప్టెంబర్ వరకు నిరుద్యోగ రేటు 22.9 శాతంగా ఉంటే.. 2024 జూలై నుంచి సెప్టెంబర్ మధ్య 18.1 శాతానికి తగ్గింది. కేంద్ర కార్మిక శాఖ ఆదేశం మేరకు లేబర్‌ఫోర్స్ సంస్థ నిర్వహించిన సర్వే నివేదిక చెప్పిన వాస్తవమిది. నిరుద్యోగ సమస్యను తగ్గించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది.''

మళ్లీ నేనే సీఎం

మీడియాతో ఇష్టాగోష్ఠిలో రేవంత్‌రెడ్డి

- పనిని మాత్రమే నమ్ముకుని ముందుకు వెళుతున్నా..
- సంక్షేమ పథకాల లబ్ధిదారులే నా ఓటర్లు
- మొదటిసారి బీఆర్ఎస్‌పై వ్యతిరేకతతో ఓటేశారు
- ఈసారి తమపై అనుకూలతతో ఓటేస్తారని వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్: రెండోసారి కూడా తానే ముఖ్యమంత్రి అవుతానని రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పనిని మాత్రమే నమ్ముకుని తాను ముందుకు వెళుతున్నానని, తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిదారులే తన ఓటర్లని చెప్పారు. శనివారం శాసనమండలిలో ప్రసంగం అనంతరం ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ రెండోసారి కూడా అధికారంలోకి వస్తుందని రేవంత్ చెప్పారు. మొదటిసారి బీఆర్ఎస్‌పై ఉన్న వ్యతిరేకతతో ప్రజలు కాంగ్రెస్‌కు ఓట్లు వేశారని, రెండోసారి కాంగ్రెస్‌పై అనుకూలతతో మళ్లీ ఓట్లు వేస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుకుంటూ వెళ్తున్నామన్నారు. తానేదీ దాచుకోవడం లేదని, రాష్ట్ర ఆదాయంతో పాటు ఖర్చుల గురించి ప్రజల ముందుపెట్టి పరిపాలన చేస్తున్నానని చెప్పారు. రాష్ట్రంలో 25లక్షలకు పైగా రైతు కుటుంబాలకు రుణమాఫీ జరిగిందని, ఒక్కో కుటుంబంలో నలుగురు ఉంటే.. వారే కోటి మంది ఓటర్లు అవుతారని పేర్కొన్నారు. మరో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని, వారు ఇప్పుడేమీ మాట్లాడకపోయినా తమకే ఓటేస్తారని ధీమా వ్యక్తం చేశారు. జాతీయ స్థాయి జనగణన గురించి బడ్జెట్ ఎంత అవుతుందనే అంచనాలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం కలెక్టర్లను కోరిందని.. ఈ లెక్కన 2026లోనే జనగణన చేపట్టి, 2027లో జనాభా లెక్కలు నోటిఫై చేస్తారనే అంచనా తనకు ఉందని రేవంత్ వెల్లడించారు. ఈ జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన చేయాలని కేంద్రం యోచిస్తోందని, అలా జరిగితే దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయని పేర్కొన్నారు.

సీఎం చెప్పిన అప్పుల 'లెక్క'

మేం వచ్చాక చేసింది రూ.1,58,041 కోట్లు

- పాత అప్పుల అసలు, వడ్డీల కింద కట్టింది రూ.1,53,359 కోట్లు
- మేం చేసిన నికర అప్పు రూ. 4,682 కోట్లే..
- బీఆర్ఎస్ హయాంలోనే రూ.6,69,257 కోట్ల అప్పు.. పెండింగ్, బ్యాక్‌లాగ్ బిల్లులు కలిపి రూ. 8,19,151 కోట్లు
- మా హయాంలో ఈ ఫిబ్రవరి 28 నాటికి ఉన్న అప్పుల పద్దు రూ.7,38,707 కోట్లేనని అసెంబ్లీలో సీఎం వెల్లడి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అప్పుల లెక్కలను సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. శనివారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సమాధానం ఇచ్చిన సమయంలో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. బీఆర్ఎస్ హయాంలో ఉన్న అప్పులు, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేసిన, తీర్చిన అప్పుల వివరాలను వెల్లడించారు.

అసెంబ్లీలో సీఎం చెప్పిన అప్పుల లెక్క ఇదీ..

2023 డిసెంబర్ 1 నాటికి రాష్ట్ర ప్రభుత్వ అప్పులు రూ.6,69,257 కోట్లు	వివిధ పనుల నిమిత్తం పెండింగ్‌లో ఉన్న బిల్లులు రూ.40,154 కోట్లు
ఇతర పెండింగ్, సబ్‌ప్లాన్ బ్యాక్‌లాగ్ నిధులు రూ.1,09,151 కోట్లు	గత ప్రభుత్వ అప్పుల కింద పరిగణించాల్సిన మొత్తం రూ.8,19,151 కోట్లు
కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక చేసిన అప్పు రూ.1,58,041 కోట్లు	గత సర్కారు అప్పుల్లో అసలు కింద చెల్లించింది రూ.88,591 కోట్లు
ఆ అప్పులపై వడ్డీల కింద చెల్లించినది రూ.64,768 కోట్లు	ఈ లెక్క ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన నికర అప్పు రూ.4,682 కోట్లు
పెండింగ్ బిల్లులు కాకుండానే.. బీఆర్ఎస్ నాటి అప్పు, కాంగ్రెస్ సర్కారు అప్పులు కలిపి ఉండాల్సిన రాష్ట్ర మొత్తం అప్పు రూ.8,27,298 కోట్లు	
కానీ ఫిబ్రవరి 28, 2025 నాటికి ఉన్న రాష్ట్ర ప్రభుత్వ నికర అప్పు రూ.7,38,707 కోట్లు	

ఇకపై సాయంత్రం 4–6 గంటల మధ్య ప్రజాప్రతినిధులను కలుస్తా

- వారంలో నాలుగు రోజులు సమయం కేటాయిస్తా... అసెంబ్లీలో సీఎం రేవంత్
- నేను బ్రష్ చేయకముందే, బెడ్‌రూమ్‌కు వెళ్లినా.. వచ్చాం, కలుస్తామంటే ఎలా?
- మేం లేకుంటే ఆయన సీఎం అయ్యేవారా అని కొందరు ఎమ్మెల్యేలు మా సిబ్బంది దగ్గర అంటున్నారు
- ఉదయం 6 గంటలకే మండల నాయకులు వస్తే మీరు కలుస్తారా?

సాక్షి, హైదరాబాద్: ''ప్రజాప్రతినిధులు, మాజీలు సమయం, సందర్భం లేకుండా నన్ను కలవడానికి ఇంటికి వస్తున్నారు. ఉదయం బ్రష్ చేయకముందే వస్తున్నారు. రాత్రి బెడ్రూమ్‌లోకి వెళ్లినా సరే.. బయట వేచి ఉన్నాం, ఒకసారి మాట్లాడి వెళ్తామని అంటున్నారు. ఇది ఇబ్బందిగా ఉంది. అధికారులు, విదేశీయులు, పారిశ్రామిక వేత్తలతో సమావేశంలో ఉన్నప్పుడు కొంత ఆలస్యమైతే.. తాము ఎన్నుకుంటేనే సీఎం అయ్యారంటూ కొందరు ఎమ్మెల్యేలు సిబ్బందితో వ్యాఖ్యానిస్తున్నారు. మీ నియోజకవర్గాల్లో మండల నాయకులు ఉదయం ఆరు గంటలకే వస్తే కలుస్తారా? మీది నియోజకవర్గ సమస్య అయితే నాది రాష్ట్ర సమస్య..''అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులకు సీఎం రేవంత్‌రెడ్డి సమయం ఇవ్వడం లేదని, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య వచ్చి సీఎంను కలవలేక తిరిగి వెళ్లారని శనివారం అసెంబ్లీలో సీపీఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు ప్రస్తావించగా.. సీఎం రేవంత్ ఇలా స్పందించారు. ఇంటి దగ్గర తనను కలిస్తే అధికారులు ఉండరని, ఫలితం ఉండదని.. సచివాలయానికి వస్తే అక్కడే సమస్య పరిష్కారం అవడానికి వీలుంటుందని చెప్పారు. తాను ఫోన్ ఎత్తడం లేదని కొందరు అంటున్నారని.. ముఖ్యమైన సమావేశాల్లో ఉన్నప్పుడు మాట్లాడటం కుదరకపోవచ్చని స్పష్టం చేశారు.



వారంలో నాలుగు రోజులు కలుస్తా..

ఇకపై తాను సచివాలయంలో సాయంత్రం 4 నుంచి 6 గంటల మధ్య ఎమ్మెల్యేలు, ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలను కలుస్తానని.. 24 గంటల ముందే తన కార్యాలయంలో అపాయింట్‌మెంట్ తీసుకుంటే.. ఎంతమందిని కలుస్తానన్నది క్లారిటీ ఉంటుందని రేవంత్ చెప్పారు. 'వారంలో 4 రోజులు ఇందుకోసం సమయం కేటాయిస్తా. గుమ్మడి నర్సయ్య వంటి ప్రజాప్రతినిధులు వస్తే కలవడానికి నాకేమీ ఇబ్బంది ఉండదు. నన్ను కలవకుండా వెళ్లినట్టు తెలిసిన వెంటనే కార్యాలయ సిబ్బందికి చెప్పి ఆయనతో మాట్లాడించా. వస్తే కలుస్తానని చెప్పా.. కానీ ఆయన అప్పటికే ఖమ్మం వెళ్లిపోయానని, మళ్లీ వచ్చినప్పుడు కలుస్తానని చెప్పారు.''అని వివరించారు. వామపక్ష నాయకులను కలవడానికి తనకు ఇబ్బందేమీ లేదన్నారు. తమ పార్టీ ప్రజాప్రతినిధులు కూడా పదేళ్లుగా ఇబ్బందిపడ్డారని, అందుకే సమస్యల పరిష్కారానికి వస్తున్నారని చెప్పారు. అన్ని పనులు చేసుకుంటూ వెళ్తున్నా కూడా.. ఒక పద్ధతిలో చేయడం లేదన్న అంశం నా దృష్టికి తెచ్చారని తెలిపారు. ఈ మేరకు తన కార్యాలయాన్ని మరింత సమన్వయం చేసుకుని ప్రజాప్రతినిధులకు అందుబాటులో ఉంటానని చెప్పారు.

కేసీఆర్‌కు సీఎం రేవంత్ క్షమాపణ చెప్పాలి

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వాడిన భాషను తెలంగాణ సమాజమంతా వ్యతిరేకిస్తోందని, తక్షణమే సీఎం క్షమాపణలు చెప్పాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ హుందాగా రాజకీయాలు చేస్తుందని, ముఖ్యమంత్రి ప్రయోగించిన భాషను తాము ప్రయోగించలేమని పేర్కొన్నారు. శనివారం శాసనమండలి ఆవరణలో కవిత మీడియాతో మాట్లాడుతూ.. ఇద్దరు మహిళా జర్నలిస్టులను పోలీసులు అరెస్టు చేశారని, ఆ నేపథ్యంలో ప్రభుత్వాన్ని ఎవరైనా విమర్శిస్తే బట్టలు ఊడదీసి ఊరేగిస్తామని అసెంబ్లీలో ముఖ్యమంత్రి వ్యాఖ్యలు చేయడం దారుణమని అన్నారు. తెలంగాణ చరిత్రలో ఇదీచీకటి రోజని పేర్కొన్నారు. మహిళలు రాజకీయాల్లోకి రావాలని పిలుపునిస్తూనే, వారిని దూషిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి అహంకార పూరితమైన వ్యాఖ్యలకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు. మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారికి మాట్లాడే అవకాశం ఇవ్వకుండా ప్రభుత్వం వివక్ష చూపిస్తోందని ఆమె మండిపడ్డారు.

భాష ప్రామాణికంగా ఉండాలి: మధుసూదనాచారి

బీఆర్ఎస్ శాసనమండలి పక్ష నాయకుడు మధుసూదనాచారి మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారి భాష సమాజానికి ప్రామాణికంగా ఉండాలన్నారు. తెలంగాణ కోసం ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పోరాడిన కేసీఆర్ పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంస్కార హీనమైన భాష వాడటం సరికాదన్నారు. ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తే.. ఎలాంటి సమాధానం రాకపోగా, మంత్రుల చేత కూడా మళ్లీ రెచ్చగొట్టేలా వారు మాట్లాడిస్తున్నారన్నారు.

బడ్జెట్‌లో రూ.70 వేల కోట్లు కోత

రాష్ట్రంపై ఆర్థిక మాంద్యం ప్రభావం తీవ్రంగా ఉంది: సీఎం రేవంత్

- అవసరమైతే వివిధ కార్యక్రమాల్లో కోతలు పెట్టాల్సిన పరిస్థితి వస్తుంది
- ఉద్యోగుల జీతాల కోసం రిజర్వు బ్యాంకు నుంచి చేబదులు తీసుకున్నాం
- గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చకు మండలిలో సీఎం సమాధానం



మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛమిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో మహేశ్‌గౌడ్, మహేందర్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక మాంద్యం ప్రభావం రాష్ట్రంపై తీవ్రంగా ఉందని.. రాష్ట్ర ఆదాయం తగ్గి, ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో భారీగా కోత పడే అవకాశం ఉందని వెల్లడించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చేసిన అప్పులకు ఇప్పుడు వడ్డీలు చెల్లించేందుకే ఆదాయం చాలడం లేదని వ్యాఖ్యానించారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై చర్చకు శనివారం శాసన మండలిలో సీఎం రేవంత్‌రెడ్డి సమాధానమిచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''రూ.2.91 లక్షల కోట్లతో గత బడ్జెట్ పెట్టినప్పటికీ.. ఖర్చు రూ.2.25 లక్షల కోట్ల వరకు మాత్రమే ఉండొచ్చు. దాదాపు రూ.70 వేల కోట్లు తగ్గే అవకాశం ఉంది. గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీ రూపంలోనే ఏటా రూ.75 వేల కోట్లు చెల్లిస్తున్నాం. నెల తిరిగే సరికి అప్పులకు వడ్డీలు, ఉద్యోగుల జీతాలు, కల్యాణలక్ష్మి.. షాదీముబారక్.. ఇలా ఒకదాని వెనుక ఒకటి ముంచుకొస్తున్నాయి. ప్రతినెలా ఉద్యోగుల వేతనాలను ఒకటో తేదీనే చెల్లిస్తున్నాం. ఈ నెల వేతన చెల్లింపుల కోసం రిజర్వు బ్యాంకు నుంచి రూ.4 వేల కోట్లు చేబదులుగా తీసుకున్నాం. ఆర్థిక పరిస్థితిని గాడిన పెట్టేందుకు ప్రభుత్వం వ్యూహాత్మక ప్రణాళికతో ముందుకు సాగుతోంది. ఇందుకు ప్రజలు, ఉద్యోగులు సహకరించాలి.

వచ్చే ఏడాది మార్చినాటికి క్లియర్ చేస్తాం..: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నెలవారీగా కొంతమేర నిర్దేశించుకుని పరిష్కరిస్తాం. వచ్చే ఏడాది మార్చి నెలాఖరు నాటికి ఉద్యోగుల పెండింగ్ బిల్లులన్నీ క్లియర్ చేస్తాం. ఈ విషయాన్ని ఉద్యోగులు గ్రహించాలి. నిరసన వ్యక్తం చేయడం వారి హక్కు. కానీ తక్షణమే పరిష్కరించాలని ధర్నాలు, ఆందోళనలు చేస్తామనడం సరికాదు. ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని కాస్త ఓపికతో ఉండాలి. రాష్ట్ర ఆదాయం పెంచేందుకు ఉద్యోగులు మరింత ఎక్కువ సమయం పనిచేసి నిరసన తెలపాలి. ఆర్థిక పరిస్థితిని దారిలోకి తెచ్చేందుకు వివిధ కార్యక్రమాల్లో కోతలు పెట్టాల్సిన పరిస్థితి వస్తుంది. అవసరమైతే ప్రజలను మరో ఏడాది సమయం అడిగి అయినా సరే.. ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేస్తాం. మేం ఎలాంటి చార్జీలను పెంచబోం. ప్రస్తుతమున్న వాటిలో లీకేజీలను సరిదిద్దుతాం. రాష్ట్ర ఆదాయం, అప్పులపై ఎక్స్‌రే మాదిరిగా రిపోర్టును ప్రజల ముందు ఉంచుతాం.

బీసీలకూ సబ్‌ప్లాన్ తెస్తాం..

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలకు సబ్‌ప్లాన్ తెచ్చి అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే. అదే మాదిరిగా బీసీలకు కూడా సబ్‌ప్లాన్ తీసుకువస్తాం. గత పదేళ్లు బీసీలకు జరిగిన అన్యాయాన్ని గుర్తించి న్యాయం చేస్తాం. సంక్షేమ శాఖలకు అనుబంధంగా ఉన్న కార్పొరేషన్లకు గత పదేళ్ల కేటాయించిన నిధులు, చేసిన ఖర్చులను ప్రజల ముందుంచుతాం. సభ్యులు ఏవీఎన్ రెడ్డి, తీన్మార్ మల్లన్న, మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు చేసిన సూచనలను తప్పకుండా పరిశీలిస్తాం. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను మెరుగుపర్చాలి. అందుకోసం ప్రొఫెసర్ కోదండరామ్ తదితరులతో చర్చిస్తాం. ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ప్రభుత్వ ప్రత్యేక ప్రాధాన్యతలు. నేను సీఎంగా ఉన్నప్పుడు ఈ రెండు జరగడం నా అదృష్టంగా భావిస్తున్నా..'' అని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

బీఆర్ఎస్ సభ్యుల ఆందోళన.. వాకౌట్..

శాసన మండలిలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతుండగా బీఆర్ఎస్ సభ్యులు లేచి నిరసన తెలిపారు. కేసీఆర్‌పై సీఎం చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ... సభ్యులు మధుసుదనాచారి, కవిత తదితరులు చైర్మన్ సీటు వద్దకు వచ్చారు. చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం సమాధానం తర్వాత మాట్లాడేందుకు అవకాశం కల్పిస్తానని చెప్పారు. బయట మాట్లాడిన అంశాలను సభ ముందుకు తీసుకురావొద్దని మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. కానీ బీఆర్ఎస్ సభ్యులు ఆందోళన కొనసాగిస్తూనే వాకౌట్ చేశారు.

రూ.57 లక్షలు జీతం తీసుకుని.. సభలో మాట్లాడరా?

'కేసీఆర్ గత 15 నెలల్లో కేవలం రెండు సార్లు మాత్రమే సభకు హాజరయ్యారు. ప్రభుత్వం నుంచి జీతం తీసుకునేవారిని ప్రభుత్వ ఉద్యోగులుగానే పరిగణించాలి. కేసీఆర్ రూ.57 లక్షలు వేతనం తీసుకున్నారు. సభలో మాట్లాడలేదు. ప్రజా సమస్యలు ప్రస్తావించలేదు. నియోజకవర్గంలో తిరగలేదు. రాష్ట్రంలో తిరగలేదు. మరి ఆయన ప్రజాసేవ ఏం చేస్తున్నట్టు?' అని సీఎం రేవంత్ ప్రశ్నించారు.

పసుపు పంటకు మద్దతు ధర ప్రకటించాలి

మండలి ఆవరణలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీల నిరసన



మండలి ఆవరణలో నిరసనలో పాల్గొన్న మధుసూదనాచారి, కవిత, మహమూద్‌అలీ తదితరులు

సాక్షి, హైదరాబాద్: పసుపు పంటకు క్వింటాల్‌కు రూ.15 వేలు మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేస్తూ శనివారం శాసనమండలి ఆవరణలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు నిరసన ప్రదర్శన చేపట్టారు. మద్దతు ధర కల్పించి పసుపు రైతులను ఆదుకోవాలని కోరారు. పసుపు బోర్డును ప్రకటించిన కేంద్రం.. దానికి చట్టబద్ధత కల్పించలేదని, సత్వరమే పసుపు బోర్డుకు చట్టబద్ధత కల్పించాలన్నారు. నిరసన ప్రదర్శనలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు జైజవాన్, జైకిసాన్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కల్వకుంట్ల కవిత, సిరికొండ మధుసూదనాచారి, మహమూద్‌అలీ, సురభి వాణీదేవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ, పసుపు పంటకు రూ. 9 వేలు మాత్రమే చెల్లిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.15 వేలు మద్దతు ధర చెల్లిస్తామని చెప్పినప్పటికీ.. ఇప్పటివరకు చెల్లించలేదని విమర్శించారు.

అసదుద్దీన్ ఒవైసీకి మెంటల్

బీజేపీ ఎమ్మెల్యే రాజా సింగ్



సాక్షి, హైదరాబాద్: 'ఎంఐఎం అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మెంటల్ అయిపోయిందు. సీఎం రేవంత్‌రెడ్డి... మీ కొత్త దోస్తులకు మెంటల్ హాస్పిటల్‌లో చికిత్స చేయించండి'అని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ సూచించారు. తెలంగాణలో హోలీ పండుగను ప్రజలు ప్రశాంతంగా.. అసదుద్దీన్ ఓ బహిరంగసభలో భయపడే వ్యక్తులు పాకిస్తాన్ పారిపోయారని, తాము ఇక్కడే ఉండి పోరాడుతామని మాట్లాడారని మండిపడ్డారు. ఈ మేరకు రాజాసింగ్ శనివారం మీడియాకు ఓ వీడియో సందేశం పంపారు. రంజాన్ మాసంలో విషం కక్కేలా ఉపన్యాసాలు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే మొదట పరుగెత్తేది లేదా శరణు జొచ్చేది అసదుద్దీనే అని వ్యాఖ్యానించారు. కొందరు ఫాల్తూగాళ్లు పార్టీ నుంచి వెళ్లిపోతే తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్ జిల్లాలో ఉన్న ఔరంగజేబు సమాధి నిర్వహణకు పురావస్తు సర్వేక్షణ సంస్థ చేసిన వ్యయంపై సమగ్ర సమాచారాన్ని ఇవ్వాలని కేంద్రమంత్రి షెకావత్‌కు రాజాసింగ్ లేఖ రాశారు.

క్లుప్తంగా...

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టండి

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దిశానిర్దేశం



సాక్షి, హైదరాబాద్‌: శాసనసభా బడ్జెట్‌ సమావేశాల సందర్భంగా సభలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు హామీల అమల్లో తిరోగమనం, ప్రభుత్వ పథకాలు, ప్రజాసమస్యలను ప్రస్తావించాలని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి పార్టీ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. బడ్జెట్‌పై స్పందన, వివిధ డిమాండ్లు, పద్దులు, ద్రవ్య వినిమయబిల్లు, ఇలా సభ్యులు వివిధ అంశాల వారీగా సబ్జెక్టులను విభజించుకుని మాట్లాడాలన్నారు. అసెంబ్లీలో తమ ప్రసంగాల సందర్భంగా ఉపయోగించే భాష పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని కిషన్‌రెడ్డి సూచించారు. శనివారం దిల్‌కుశ అతిథిగృహంలో కిషన్‌రెడ్డితో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఉపనేత పాయల్‌ శంకర్‌, ఎమ్మెల్యేలు పాల్వాయి హరీశ్‌బాబు, ధన్‌పాల్‌ సూర్యనారాయణగుప్తా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సభలో వ్యవహరించాల్సిన తీరు, ప్రభుత్వ వ్యవహారశైలిని ఎండగట్టేందుకు అనుసరించాల్సిన వ్యూహాలు, తదితర అంశాలు చర్చకు వచ్చినట్టు సమాచారం.



సినిమా ప్రివ్యూకు రండి..

- భట్టి, శ్రీధర్‌ బాబులకు.. నారాయణమూర్తి ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్‌: తాను దర్శకత్వం వహించి నటించిన 'యూనివర్సిటీ' సినిమా ప్రత్యేక ప్రదర్శనకు (ప్రివ్యూ) రావాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఐటీ, పరిశ్రమల మంత్రి డి.శ్రీధర్‌బాబులను నటుడు ఆర్‌.నారాయణ మూర్తి ఆహ్వానించారు. కోచింగ్‌ కేంద్రాల దోపిడీ, ఉద్యోగ నియామక పరీక్ష ప్రశ్న పత్రాల లీకేజీ వ్యవహారాల ఇతివృత్తంతో ఈ సందేశాత్మక చిత్రాన్ని నిర్మించినట్టు మంత్రులకు వివరించారు. ఆయన శనివారం అసెంబ్లీ ప్రాంగణంలో డిప్యూటీ సీఎం, మంత్రిని కలిసి ప్రివ్యూకు రావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డిని సైతం ఆహ్వానించాలని భావించిన ఆయన కొద్దిసేపు శ్రీధర్‌బాబు రూమ్‌లో నిరీక్షించారు. అయితే కలిసే వీలు లేకపోవడంతో మరోసారి కలుస్తానంటూ నారాయణమూర్తి వెళ్లిపోయారు.

నేడు ముడుమాల్‌కు జూపల్లి



కృష్ణా: ఆదిమానవుల కాలంనాటి ముడుమాల్‌ నిలువురాళ్లను ఆదివారం రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సందర్శించనున్నారు. అరుదైన ఈ నిర్మాణాలను కేంద్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు యునెస్కో తాత్కాలిక ప్రపంచ వారసత్వ సంపద జాబితాలో చేర్చటంతో తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో మంత్రి చర్చించనున్నట్లు సమాచారం. ముడుమాల్‌ నిలువురాళ్లకు యునెస్కో గుర్తింపు కోసం ఎంతో కాలంగా కృషి చేస్తున్నామని, ఇప్పుడు ఆ అవకాశం వచ్చిందని జై మక్తల్‌ ట్రస్టు అధ్యక్షుడు సందీప్‌ మక్తాల తెలిపారు.

జ్వరం గోలీలున్నాయ్‌

- 'సాక్షి' కథనానికి వివరణ ఇచ్చిన టీజీఎంఎస్‌ఐడీ ఎండీ

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలోని సెంట్రల్‌ మెడిసిన్స్‌ స్టోర్స్‌ (సీఎంఎస్‌)లలో పారాసిటమాల్‌, సిటిరిజైన్‌ వంటి మందులు సరిపడా ఉన్నాయని టీజీఎంఎస్‌ఐడీ మేనేజింగ్‌ డైరెక్టర్‌ హేమంత్‌ తెలిపారు. 'సాక్షి'లో శనివారం 'జ్వరం గోలీలూ లేవు' శీర్షికతో ప్రచురితమైన వార్తా కథనానికి స్పందించిన ఆయన ఈ మేరకు వివరణ ఇచ్చారు. ఇండెంట్‌ను బట్టి అవసరమైన పీహెచ్‌సీలకు మందులు సరఫరా చేయడానికి ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. పబ్లిక్‌ హెల్త్‌ సెంటర్లలో తగినన్ని పారాసిటమాల్‌ ట్యాబ్లెట్లు ఉన్నాయని, మూడు నెలలవరకు ఇవి సరిపోతాయని తెలిపారు. విటమిన్‌ ఏ లిక్విడ్‌, ఫ్రామైసెటిన్‌ స్కిన్‌ క్రీం, జింక్‌ ట్యాబ్లెట్లు, నియోమైసిన్‌ పౌడర్‌, రేబిస్‌ వ్యాక్సిన్‌, స్నేక్‌ వీనం, అమోక్సిలిన్‌ వంటి మందులన్నీ అందుబాటులో ఉన్నట్లు వివరించారు.

మెడికల్‌ బిల్లులు 85 శాతం క్లియర్‌ చేశాం

- 'సాక్షి' కథనానికి డీఎంఈ నరేంద్ర కుమార్‌ వివరణ

సాక్షి, హైదరాబాద్‌: ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని పెండింగ్‌ మెడికల్‌ బిల్లుల క్లియరెన్స్‌పై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని డీఎంఈ నరేంద్ర కుమార్‌ తెలిపారు. 'సాక్షి'లో శనివారం 'మెడికల్‌ బిల్‌ ఎప్పుడొస్తదో'శీర్షికతో ప్రచురితమైన వార్తా కథనానికి ఆయన వివరణ ఇచ్చారు. 2023కు ముందు మెడికల్‌ రీయింబర్స్‌మెంట్‌ బిల్లులు 67 వేలు పెండింగ్‌లో ఉన్నాయని అంగీకరించారు. వాటిలో ఇప్పటివరకు 57,500 బిల్లులను (85 శాతం) క్లియర్‌ చేసినట్లు తెలిపారు. మిగిలిన బిల్లులను ఈ నెల 31లోపు క్లియర్‌ చేస్తామని చెప్పారు. 2024 తరువాత వచ్చిన అన్ని బిల్లులను ఏప్రిల్‌ 15వ తేదీ నాటికి పరిష్కరిస్తామని వెల్లడించారు.

సీఎం ప్రసంగాన్ని బహిష్కరించిన బీఆర్‌ఎస్‌

- కేసీఆర్‌పై సీఎం రేవంత్‌ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ధ్వజం
- ప్రాణాలు పణంగా పెట్టి తెలంగాణ తెస్తే చావును కోరుతున్నారు: హరీశ్‌రావు
- కాంగ్రెస్‌ వల్లే కృష్ణా జలాల్లో తెలంగాణకు తీరని అన్యాయమని వెల్లడి



స్పీకర్‌కు వినతిపత్రం ఇస్తున్న హరీశ్‌రావు, తలసాని. చిత్రంలో సుధీర్‌రెడ్డి, గంగుల, కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, పాడి కౌశిక్‌రెడ్డి, వివేకానంద

సాక్షి, హైదరాబాద్‌: గవర్నర్‌ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శాసనసభలో జరిగిన చర్చలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని బీఆర్‌ఎస్‌ బహిష్కరించింది. పదేళ్లు ముఖ్యమంత్రిగా రాష్ట్ర పురోగతి కోసం శ్రమించిన కేసీఆర్‌ చావును రేవంత్‌రెడ్డి కోరుకున్నారని బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాణాలు ఫణంగా పెట్టి తెలంగాణ సాధించిన కేసీఆర్‌ చావును కోరుకోవడం దారుణమన్నారు. కేసీఆర్‌పై రేవంత్‌ చేసిన వ్యాఖ్యలకు నిరసనగానే ముఖ్యమంత్రి ప్రసంగాన్ని బహిష్కరించామని బీఆర్‌ఎస్‌ సభ్యుడు హరీశ్‌రావు అసెంబ్లీ లాబీల్లో వ్యాఖ్యానించారు.

ఉత్తమ్‌వి పచ్చి అబద్ధాలు

కృష్ణా జలాల్లో తెలంగాణకు జరిగిన అన్యాయానికి కాంగ్రెస్‌ పార్టీనే కారణమని హరీశ్‌రావు విమర్శించారు. సీఎం ప్రసంగాన్ని బహిష్కరించిన అనంతరం అసెంబ్లీ లాబీలో ఆయన మీడియాతో ఇష్టాగోష్టి నిర్వహించారు. 'నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌ కుమార్‌రెడ్డి అసెంబ్లీలో పచ్చి అబద్ధాలు మాట్లాడారు. కాంగ్రెస్‌ నిర్లక్ష్యం వహించి ప్రాజెక్టులు నిర్మించకపోవడం వల్లే కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలను పంపిణీ చేశారు. నాడు కృష్ణా జలాల్లో తెలంగాణకు తాత్కాలిక కేటాయింపులు మాత్రమే జరిగాయి. ఇటీవల తెలంగాణ అధికారులు రాహుల్‌ బొజ్జా, అనిల్‌ కుమార్‌ ఢిల్లీకి వెళ్లి 299 టీఎంసీలకు ఎందుకు ఒప్పుకుని వచ్చారు'అని హరీశ్‌ అన్నారు. 'పోతిరెడ్డిపాడు ప్రాజెక్టుతో జరిగే అన్యాయంపై నాడు కాంగ్రెస్‌ నాయకులు పి.జనార్దన్‌రెడ్డి ఒక్కరే కొట్లాడారు. నాడు నాతో పాటు ఆరుగురు కాంగ్రెస్‌ మంత్రివర్గం నుంచి బయటకు వచ్చాం. కానీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.. కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రివర్గంలో చోటుకోసం నోరు మూసుకున్నారు. ఆయనది ద్రోహ చరిత్ర అయితే బీఆర్‌ఎస్‌ది త్యాగాల చరిత్ర. ఉత్తమ్‌ దంపతులు ఏపీ సీఎం చంద్రబాబు దగ్గరకు వెళ్లి భోజనం చేసి వచ్చి కృష్ణా నీటిలో తెలంగాణకు అన్యాయం చేశారు. సీతారామ ప్రాజెక్టుతో ఖమ్మం జిల్లాకు కేసీఆర్‌ నీళ్లు ఇస్తే.. హుజూర్‌నగర్‌ను ముంచి పులిచింతల ద్వారా ఆంధ్రాలో మూడో పంటకు నీళ్లు ఇచ్చిన ఘనులు కాంగ్రెస్‌ నాయకులు'అని హరీశ్‌రావు మండిపడ్డారు.

సీఎం వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు కోసం ఎన్నో త్యాగాలు చేసిన మాజీ సీఎం కేసీఆర్‌ మార్చురీకి పోతారని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యేలు తీవ్రంగా ఖండించారు. శనివారం సీఎం ప్రసంగాన్ని బహిష్కరించిన అనంతరం మీడియా పాయింట్‌ వద్ద వేముల ప్రశాంత్‌రెడ్డి, కేపీ వివేకానంద, పల్లా రాజేశ్వరరెడ్డి మాట్లాడారు. కేసీఆర్‌ను కించపరచడం తప్ప సీఎం 3 గంటల పాటు అసెంబ్లీలో మాట్లాడిందేమీ లేదన్నారు. రాజముద్ర నుండి చార్మినార్‌, కాకతీయుల కళాతోరణం తీసే ప్రయత్నం జరుగుతోందని, దీనిని అడ్డుకుని తీరుతామని హెచ్చరించారు.

జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్‌ ఎత్తివేయండి

బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని బీఆర్‌ఎస్‌ శాసనసభాపక్షం విజ్ఞప్తి చేసింది. హరీశ్‌రావు నేతృత్వంలో బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యేలు శనివారం స్పీకర్‌ చాంబర్‌లో శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌తో భేటీ అయ్యారు. సీనియర్‌ సభ్యుడైన జగదీశ్‌రెడ్డి స్పీకర్‌ పట్ల అమర్యాదగా ప్రవర్తించలేదనే విషయాన్ని హరీశ్‌రావు ప్రస్తావించారు. జగదీశ్‌రెడ్డిని సస్పెండ్‌ చేసే అంశంలో విపక్ష ఫ్లోర్‌ లీడర్ల అభిప్రాయం కోరలేదన్నారు. జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌పై పునఃసమీక్షించి ఎత్తివేయాలని బీఆర్‌ఎస్‌ శాసనసభా పక్షం స్పీకర్‌కు విజ్ఞప్తి చేసింది. సభ ప్రారంభమైన తర్వాత హరీశ్‌రావు ఇదే విషయాన్ని మరోమారు అసెంబ్లీ దృష్టికి తీసుకొచ్చి సస్పెన్షన్‌ ఎత్తివేయాలని స్పీకర్‌ను కోరారు.

హద్దు మీరితే ఖబడ్దార్‌

▶ మొదటి పేజీ తరువాయి



కేసీఆర్‌ మీ పిల్లలకు బుద్ధిచెప్పు.. హద్దు దాటితే, మాటజారితే అనుభవిస్తరు. ఏది పడితే అది మాట్లాడితే ఊరుకోను. కోర్టుకు పోతే బెయిల్‌ వస్తుందని అనుకుంటున్నారు. అవసరమైతే చట్టాన్ని సవరిస్తాం. ఇకపై ఇలా పోస్టులు చేస్తే ఉప్పు పాతరేస్తం. చట్టపరిధిలో అన్ని చర్యలు ఉంటాయి. సోషల్‌ మీడియాపై చర్చ పెట్టండి. పరిష్కారం చూపకపోతే సమాజం దెబ్బతింటుంది. దీనిపై చట్టం చేద్దాం. ఇది నా ఒక్కరి వేదన కాదు.. అందరి ఆవేదన. స్వీయ నియంత్రణతోపాటు రాజ్యాంగ నియంత్రణ ఉండాలి. ఒకరోజు దీనిపై చర్చ పెట్టాలి. సమాచార శాఖ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు ఈ అంశంపై దృష్టి పెట్టాలి.

ఇష్టమొచ్చినట్టు అబద్ధాలు ఆడతారా?

రాష్ట్రంలో కులగణనను 1931 తర్వాత ఇప్పుడు మేమే చేశాం. ఈ సర్వేలో 96.9 శాతం మంది పాల్గొన్నారు. మిగతావారి కోసం మరో అవకాశం ఇచ్చాం. కానీ బీఆర్‌ఎస్‌ వాళ్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఆ కుటుంబం మొత్తం అబద్ధాలతోనే బతుకుతున్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లను అడ్డుకునేందుకే కులగణనపై అబద్ధాలు మాట్లాడుతున్నారు. అబద్ధాలపై జీఎస్టీ లేదని ఇష్టమున్నట్టు అబద్ధాలు ఆడుతారా? ప్రధాని మోదీకి చెప్పి అబద్ధాల మీద కూడా ట్యాక్స్‌ వేయించాలని బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డిని కోరుతున్నాను.

నామీద కోపం ఎందుకు ఉంటుంది?

మేం తెలంగాణ సంస్కృతిని గౌరవించాం. తెలంగాణ తల్లిని సచివాలయం లోపల ప్రతిష్ఠించాం. నామీద అన్ని వర్గాలకు కోపం ఉందని ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రంలో ఆడబిడ్డలకు, రైతులకు, యువతకు 15 నెలల్లోనే ఎన్నో చేశాం. కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేసే కార్యక్రమం చేపట్టాం. రైతులకు రుణమాఫీ, రూ.500 బోనస్‌ ఇస్తున్నాం. యువతకు ఉద్యోగాలిస్తున్నాం. గ్రూప్స్‌ పరీక్షలు నిర్వహించి, పోస్టులు భర్తీ చేస్తున్నాం. నామీద ఎందుకు కోపం ఉంటుంది?

15 ఏళ్లు పైబడ్డ వాహనాలు తిరగొద్దు

హైదరాబాద్‌ నగరంలో ప్రతీరోజు 1,600 కొత్త వాహనాలు వస్తున్నాయి. ఇంటికి నాలుగు వాహనాలు ఉంటున్నాయి. దీనితో ట్రాఫిక్‌ సమస్య పెరుగుతోంది. ఎన్ని ఫ్లైఓవర్లు కట్టినా, కొత్త రోడ్లు వేసినా పరిస్థితిలో మార్పు రాదు. ప్రజా రవాణాను పెంచుతున్నాం. కాలుష్యం నుంచి హైదరాబాద్‌ను కాపాడాలి. మరో ఢిల్లీ కాకుండా చూడాలి. నగరంలోని 3 వేల డీజిల్‌ ఆర్టీసీ బస్సులను గ్రామాలకు పంపి.. ఇక్కడ ఎలక్ట్రిక్‌ బస్సులు తీసుకొస్తం. 15 ఏళ్లు పైబడిన వాహనాలను నగరంలోకి అనుమతించం. పరిశ్రమలను ఓఆర్‌ఆర్‌ ఆవలికి తరలిస్తాం. పాతబస్తీలో రవాణా సదుపాయాలను మెరుగుపరుస్తాం. ఎమ్మెల్యే అక్బరుద్దీన్‌ ఒవైసీ సూచన మేరకు లాల్‌దర్వాజా ఆలయం అభివృద్ధికి స్పెషల్‌ డెవలప్‌మెంట్‌ ఫండ్‌ కింద రూ.20కోట్లు కేటాయిస్తున్నా. ఈ మేరకు జారీ చేసే జీవోలో అక్బరుద్దీన్‌ పేరును ప్రత్యేకంగా ప్రస్తావించాలి..''అని సీఎం రేవంత్‌ పేర్కొన్నారు.

డ్రగ్స్‌ విక్రేతల ఇళ్లకు కరెంటు, నీళ్లు కట్‌

''రాష్ట్రంలో గంజాయి, కొకైన్‌ వంటి మత్తు పదార్థాలను సరఫరా చేసే పెద్దల్లు ఎంత పెద్దవారైనా వదిలేది లేదు. డ్రగ్స్‌ విక్రయించే వారి ఇళ్లకు కరెంటు, నీటి సరఫరా నిలిపివేస్తాం. రూ.250 కోట్లు వెచ్చించి యాంటీ నార్కోటిక్స్‌ బ్యూరోను పటిష్టం చేశాం. ఇటీవల దుబాయిలో చనిపోయిన వ్యక్తికి సంబంధించిన పోస్టుమార్టం వివరాలన్నీ తెప్పించాం. డ్రగ్స్‌కు సంబంధించిన గుట్టంతా మా వద్ద ఉంది. స్కూళ్లలో డ్రగ్స్‌ వినియోగిస్తే ఆ స్కూల్‌ యాజమాన్యానిదే బాధ్యత. వారిపై కేసులు పెట్టాలని నిర్ణయించాం. లక్షలకొద్దీ ఫీజులు వసూలు చేస్తున్న స్కూళ్లలో ఏం జరుగుతోందో, పిల్లల మానసిక్థితి ఎలా ఉందో యాజమాన్యమే పర్యవేక్షించాలి. ప్రతి స్కూల్‌లో సైకాలజీ టీచర్‌ను విధిగా నియమించుకోవాలి. స్కూళ్లు, కాలేజీల వద్ద ప్రత్యేకంగా నిఘాపెడతాం.''

కేన్సర్‌ రోగుల్ని ఆదుకోండి

ఎంఐఎం శాసనసభ్యుడు అక్బరుద్దీన్‌ ఒవైసీ



సాక్షి, హైదరాబాద్‌: ఆరోగ్యశ్రీ కింద కేన్సర్‌ చికిత్సకు పూర్తిస్థాయిలో చికిత్స అందించేలా ముఖ్యమంత్రి కృషి చేయాలని ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్‌ ఒవైసీ కోరారు. గవర్నర్‌కు ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన సమాధానంపై అక్బరుద్దీన్‌ స్పందిస్తూ.. కిడ్నీ రోగులకు డయాలసిస్‌తో పాటు పెన్షన్‌ కూడా ఇచ్చేవారని, ఇప్పుడు పెన్షన్‌ లేదన్నారు. క్రిటికల్‌ కేర్‌ రోగులకు ఆరోగ్యశ్రీ కింద రూ.11 వేలు మాత్రమే రీయంబర్స్‌మెంట్‌ ఇస్తున్నారని, కానీ రోజూ రూ.23 వేలు ఖర్చవుతోందని వివరించారు. పాతబస్తీలో ట్రాఫిక్‌ సమస్య పరిష్కారంతో పాటు లాల్‌దర్వాజా ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించాలని సీఎంను కోరారు. ఏళ్ల తరబడి చార్మినార్‌ పాదచారుల ప్రాజెక్టు ముందుకు సాగడం లేదని, దాన్ని పూర్తి చేయాలన్నారు.

మహానుభావుడు వైఎస్‌

ఆరోగ్యశ్రీని తెచ్చిన మహానుభావుడు దివంగత నేత వైఎస్‌ రాజశేఖర్‌ రెడ్డి అని, ఆయనను ఏనాడూ మరువలేనని అక్బరుద్దీన్‌ ఒవైసీ కొనియాడారు. ప్రతిసారి రాజశేఖర్‌ రెడ్డిని పొగుడుతావని తనను పలుమార్లు కేటీఆర్‌ ప్రశ్నించారని గుర్తు చేశారు. వైఎస్సార్‌ ప్రజలకు, రాష్ట్రానికి చేసిన సేవలు అలాంటివి కాబట్టే.. జీవితాంతం కీర్తిస్తూనే ఉంటానని చెప్పినట్లు వెల్లడించారు. ప్రస్తుతం కేన్సర్‌ చికిత్స పేదలకు అందుబాటులో లేకుండా పోయిందని, కీమో థెరపీకి తోడు ఇమ్యూనోథెరపీ వచ్చిందని చెప్పారు. ఒక సెషన్‌ చికిత్సకు రూ.2.40 లక్షలు ఖర్చవుతోందని చెప్పారు. ఇలా 9 సెషన్లు లేదా 16 సెషన్ల చికిత్సను భరించే స్థాయిలో పేదలు లేరన్నారు.

మండలి మీడియా పాయింట్‌

55 వేలకు పైగా ఉద్యోగ నియామకాలు



సాక్షి, హైదరాబాద్‌: కాంగ్రెస్‌ ప్రభుత్వం 55 వేలకు పైగా ఉద్యోగ నియామకాలు చేపట్టింది. కేరళ ప్రభుత్వం మాదిరిగా ఖాళీలు ఎప్పటికప్పుడు గుర్తించి భర్తీ చేయాలి. జాబ్‌ కేలండర్‌ ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌ వచ్చింది. ప్రభుత్వ ఉద్యోగం సామాజిక అభివృద్ధికి దోహదపడుతుంది. ఈ ప్రభుత్వం విద్యార్థుల మెస్‌ చార్జీలను పెంచింది. విద్య, రైతు కమిషన్‌ ఏర్పాటు చేశారు. తెలంగాణ నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఏర్పడింది. నిరుద్యోగం వ్యక్తిగత విషయం కాదు.. సామాజిక బాధ్యతగా చూడాలని తెలంగాణ ఉద్యమ సమయంలో గుర్తించాం. 2018 నుంచి 2022 మధ్య ఒక్క నోటిఫికేషన్‌ వెలువడలేదు.

– ఎమ్మెల్సీ కోదండరాం

రికార్డుల నుంచి తొలగించాలి



మండలి చైర్మన్‌ బీఆర్‌ఎస్‌ సభ్యుడి మీద చేసిన వ్యాఖ్యలను రికార్డ్‌ నుంచి తొలగించాలి. ప్రభుత్వానికి ఒక పాలసీ అంటూ లేదు. శాసనసభ స్పీకర్‌ వెంటనే మా సభ్యుడి సస్పెన్షన్‌ ఎత్తి వేయాలి.

– ఎమ్మెల్సీ ఎల్‌.రమణ

పల్లా వర్సెస్‌ మంత్రులు

గవర్నర్‌ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సభలో వాడీవేడి చర్చ

- 100% రుణమాఫీ జరిగితే రాజీనామా చేస్తానన్న పల్లా
- హామీల అమలుపై బీఆర్‌ఎస్‌ నేతలు వాస్తవాలను వక్రీకరించారు: భట్టి
- బీఆర్‌ఎస్‌పై మంత్రులు ఉత్తమ్‌, కోమటిరెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ఫైర్‌



పల్లా రాజేశ్వర్‌రెడ్డి



భట్టి విక్రమార్క



ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



కోమటిరెడ్డి



శ్రీధర్‌బాబు



పొన్నం ప్రభాకర్‌

సాక్షి, హైదరాబాద్‌: గవర్నర్‌ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శనివారం శాసనసభలో జరిగిన చర్చలో హామీల అమలుతోపాటు పాలనలో ప్రభుత్వం విఫలమైందని బీఆర్‌ఎస్‌ సభ్యుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి దాడి చేయగా.. ఆయన చెప్పినవన్నీ అవాస్తవాలేనని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతోపాటు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌ తీవ్ర స్థాయిలో ప్రతిదాడి చేశారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి వరుస ఆరోపణలు చేస్తుండగా మంత్రులు పదేపదే కల్పించుకుని సమాధానాలిచ్చారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం చేసిన హామీల అమలుపై బీఆర్‌ఎస్‌ నేతలు వాస్తవాలను వక్రీకరించి ప్రచారం చేస్తున్నారని భట్టి విక్రమార్క మండిపడ్డారు. పల్లా సొంత నియోజకవర్గం జనగామలో 2018లో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ఐదేళ్లలో రూ.124 కోట్ల రుణమాఫీ చేస్తే.. తాము మూడు నెలల్లోనే రూ.263 కోట్లు మాఫీ చేశామన్నారు.

మా సీఎం కూడా మీ సీఎంలాగే ఉండాలా?: భట్టి

సీఎం రేవంత్‌రెడ్డి వద్దే విద్యా శాఖ ఉండడంతో పర్యవేక్షణ కొరవడిందని, 2 లక్షలమంది విద్యార్థులు డ్రాపౌట్‌ అయ్యారని పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపణలు చేయగా, భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో ఖండించారు. మీ సీఎం (కేసీఆర్‌) తరహాలోనే మా సీఎం ఉండాలని ఊహించుకుంటే ఎలా? అని మండిపడ్డారు. సీఎం రేవంత్‌ డీఎస్సీతో 11వేల టీచర్‌ పోస్టులను భర్తీ చేశారని, 22వేల మంది టీచర్లకు పదోన్నతులు ఇచ్చారని, 36 వేల మంది టీచర్లకు బదిలీలు కల్పించారన్నారు. గత ప్రభుత్వం వర్సిటీలను గాలికి వదిలేస్తే, 12 మంది వీసీలను నియమించారన్నారు. మహిళా వర్సిటీకి వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టడంతోపాటు నిర్మాణానికి రేవంత్‌ రూ.540 కోట్లు మంజూరు చేయాలని ఆదేశించారన్నారు. గత ప్రభుత్వం మీకు (పల్లాకు), ఇతరులకు ప్రైవేటు వర్సిటీలను ధారాదత్తం చేస్తే వాటికి దీటుగా తాము ప్రభుత్వ వర్సిటీలను తీర్చిదిద్దుతున్నామన్నారు.

బీఆర్‌ఎస్‌ ధోరణితోనే అన్యాయం: మంత్రి ఉత్తమ్‌

గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ ధోరణితోనే రాష్ట్రానికి కృష్ణా జలాల విషయంలో తీరని నష్టం జరిగిందని మంత్రి ఉత్తమ్‌ కుమార్‌రెడ్డి ప్రత్యారోపణలు చేశారు. రాయలసీమ ఎత్తిపోతల నిర్మాణం, పోతిరెడ్డిపాడు, ముచ్చుమర్రి, మల్యాల సామర్థ్యం పెంపు విషయంలో ఏపీకి గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం సహకరించిందన్నారు. తాము కేంద్రం, కృష్ణా బోర్డుతో కొట్లాడి సాగర్‌ కుడి కాల్వకు ఏపీ తీసుకుంటున్న జలాలను 10వేల నుంచి 5వేల క్యూసెక్కులకు తగ్గించామన్నారు. మంత్రి డి.శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. గత పదేళ్లలో ఒక్కసారి కూడా కాకతీయ ఉత్సవాలు నిర్వహించని బీఆర్‌ఎస్‌ వాళ్లు చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఒకేసారి రుణమాఫీ చేశామని, రైతులందరికీ బోనస్‌ చెల్లించామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌ రెడ్డి అన్నారు. మహిళా జర్నలిస్టు 'ఎక్స్‌'లో పెట్టిన వీడియోలోని భాషను చూసి కూడా ఆమెను సమర్థిస్తారా? అని పల్లా రాజేశ్వర్‌ రెడ్డిపై మంత్రి పొన్నం ప్రభాకర్‌ ఆగ్రహం వ్యక్తం చేశారు.

100% రుణమాఫీ జరిగితే ముక్కును నేలకు రాస్తా: పల్లా

రైతు రుణమాఫీ 50 శాతంలోపే జరిగిందని పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. జనగామతోపాటు భట్టి నియోజకవర్గం మధిరలోని ఏ ఒక్క గ్రామంలోనైనా 100శాతం రుణమాఫీ జరిగితే తాను ముక్కును నేలకు రాసి, రాజీనామా చేస్తానని ప్రకటించారు. 27 శాతం మంది రైతులకే బోనస్‌ లభించిందని, ఏడాదిలో 564 మంది రైతులు, 116 మంది ఆటోడ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని, గురుకులాల్లో 83 మంది విద్యార్థులు చనిపోయారని ఆరోపించారు. కరెంట్‌ కోతలపై ప్రశ్నించిన మహిళా జర్నలిస్టుపై కేసు పెట్టారని, అరెస్టైన జర్నలిస్టులు రేవతి, తన్వీ యాదవ్‌ని విడుదల చేయాలన్నారు. కాకతీయ కళాతోరణం, చార్మినార్‌ను రాష్ట్ర చిహ్నం నుంచి తొలగిస్తే పోరాడతామన్నారు. తెలంగాణ తల్లి సాధారణంగా ఉండాలని, నగలు, వడ్డాణం ఉండకూడదని చెప్పేటోళ్లు రూ.కోట్ల వాచీలు, వారి కుటుంబ సభ్యులు ఖరీదైన నగలు ధరిస్తున్నారన్నారు. ఏడాదిలో కాంగ్రెస్‌ ప్రభుత్వం రూ.లక్షా 55వేల కోట్ల అప్పులు చేసిందని ధ్వజమెత్తారు.



శివునిపల్లెలో సిద్ధమైన సీఎం బహిరంగ సభావేదిక

నేడు స్టేషన్‌ఘన్‌పూర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి

- రూ.800 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
- స్వయం సహాయక సంఘాలకు రూ.100 కోట్ల రుణాల పంపిణీ
- అనంతరం కృతజ్ఞత సభలో ప్రసంగించనున్న సీఎం
- ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా భారీగా ఏర్పాట్లు

సాక్షి ప్రతినిధి, వరంగల్‌: ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదివారం జనగామ జిల్లాలో పర్యటించనున్నారు. సుమారు రూ.800 కోట్ల విలువైన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఆదివారం మధ్యాహ్నం 1 గంటకు హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి స్టేషన్‌ఘన్‌పూర్‌ మండలం శివునిపల్లి వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు సీఎం చేరుకుంటారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఇందిర మహిళా శక్తి స్టాళ్లను సందర్శిస్తారు. ప్రజాపాలన కార్యక్రమాల్లో భాగంగా మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.100 కోట్ల మేర బ్యాంకు లింకేజీ రుణాల చెక్కులను అందజేస్తారు. రూ.700 కోట్ల విలువైన పనులను సీఎం వర్చువల్‌గా ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు. అనంతరం డివిజన్‌ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌ సమీపంలో నిర్వహించే కృతజ్ఞత సభలో పాల్గొంటారు. సీఎం పర్యటన సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు ఐదు రోజులుగా స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఏర్పాట్లు చేస్తున్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య, కలెక్టర్‌ షేక్‌ రిజ్వాన్‌బాషా, వరంగల్‌ పోలీసు కమిషనర్‌ సన్‌ప్రీత్‌ సింగ్‌ తదితరులు శనివారం బహిరంగ సభతోపాటు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు.

సీఎం టూర్‌ షెడ్యూల్‌ ఇలా..

- ➤ మధ్యాహ్నం 12.10 గంటలకు ఇంటినుంచి (హైదరాబాద్‌లో) బయలుదేరి బేగంపేట విమానాశ్రయం చేరుకుంటారు.
- ➤ 12.25 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరుతారు.
- ➤ మధ్యాహ్నం 1 గంటకు స్టేషన్‌ఘన్‌పూర్‌ మండలం శివునిపల్లె హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- ➤ 1.10 నుంచి 1.20 గంటల వరకు ఇందిర మహిళాశక్తి స్టాళ్లను పరిశీలించి, వివిధ సంఘాలకు కేటాయించిన బస్సులను ప్రారంభిస్తారు.
- ➤ 1.25 నుంచి 3 గంటలవరకు శివుని పల్లెలో ప్రజాపాలన కార్యక్రమాలు, కృతజ్ఞత సభలో పాల్గొంటారు.
- ➤ 3.10 గంటలకు శివునిపల్లె హెలిప్యాడ్‌ నుంచి బయలుదేరి 3.45 గంటలకు హెలికాప్టర్‌లో హైదరాబాద్‌ చేరుకుంటారు.

ఎన్నాళ్లీ డైవర్షన్‌ పాలిటిక్స్‌?

- డీలిమిటేషన్‌పై నిర్ణయమే లేదు, దక్షిణాదికి అన్యాయం ఎలా జరుగుతుంది?
- జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌ కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ డ్రామాలో భాగమే
- కేంద్ర మంత్రి బండి సంజయ్‌



కరీంనగర్‌టౌన్‌: తెలంగాణకు నిధులు ఇవ్వడం లేదని కేంద్ర ప్రభుత్వాన్ని నిందించడమంటే సూర్యుడిపై ఉమ్మేసినట్లేనని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ అన్నారు. శనివారం కరీంనగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. లోక్‌సభ నియోజకవర్గాల డీలిమిటేషన్‌పై కేంద్రం గైడ్‌లైన్స్‌ రూపొందించలేదని, ఇంకా ఎలాంటి నిర్ణయం కూడా తీసుకోలేదని ఆయన చెప్పారు. నిర్ణయమే తీసుకోనప్పుడు దక్షిణాదికి అన్యాయం చేస్తున్నారని ఆరోపించడం హాస్యాస్పదమన్నారు. తమిళనాడులో డీఎంకే, కర్ణాటక, తెలంగాణలో కాంగ్రెస్‌ ప్రభుత్వాల పరిస్థితి దారుణంగా ఉందని, ప్రజలు అసహ్యించుకుంటున్నారని పేర్కొన్నారు. అందుకే లేని సమస్యలను సృష్టించి కేంద్రాన్ని బద్నాం చేయాలని చూస్తున్నాయని, ఎన్నాళ్లు ఈ డైవర్షన్‌ పాలిటిక్స్‌ చేస్తారని మండిపడ్డారు. అసెంబ్లీలో బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌ నిర్ణయం.. కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ డ్రామాలో భాగమేనన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంతో ఆ రెండు పార్టీలకు దిక్కుతోచడం లేదన్నారు. బీఆర్‌ఎస్‌ పార్టీని జాకీ పెట్టి లేపినా ప్రజలు నమ్మడం లేదనే విషయాన్ని కాంగ్రెస్‌ గుర్తుంచుకోవాలని సూచించారు. రాష్ట్రంలో డ్రగ్స్‌ కారణంగా విద్యార్థులు, యువత జీవితాలు నాశనమవుతున్నా కనీసం విచారణ లేదన్నారు. ఫోన్‌ ట్యాపింగ్‌లో కేసీఆర్‌ పాత్ర ఉందని తెలిసినా ఎందుకు అరెస్ట్‌ చేయలేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వానికి దమ్ముంటే డ్రగ్స్‌, ఫోన్‌ ట్యాపింగ్‌ కేసులను సీబీఐకి అప్పగించాలని డిమాండ్‌ చేశారు.

డీలిమిటేషన్‌పై కాంగ్రెస్‌ దూకుడు

అఖిలపక్ష భేటీ కోసం రంగంలోకి భట్టి విక్రమార్క

- కాంగ్రెస్‌ సీనియర్‌ నేత జానారెడ్డితో చర్చలు
- అన్ని పార్టీలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం
- దక్షిణాది రాష్ట్రాల సీఎంలతో తెలంగాణలో సభకు ప్లాన్‌



మాజీ మంత్రి జానారెడ్డితో సమావేశమైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సాక్షి, హైదరాబాద్‌: లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరసన కార్యాచరణ రూపొందించే దిశలో అధికార కాంగ్రెస్‌ పార్టీ దూకుడుగా వ్యవహరిస్తోంది. ఈ అంశంపై జాతీయ స్థాయిలో తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌కు దీటుగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలతో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతున్నారు. ఇప్పటికే సీనియర్‌ నేత జానారెడ్డితో కలిసి అన్ని రాజకీయ పార్టీలకు బహిరంగ లేఖ రాసిన ఆయన.. శనివారం పలు పార్టీల నేతలతో మాట్లాడారు. రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణతో పాటు దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా చేపట్టాల్సిన కార్యక్రమాలు, కాంగ్రెస్‌ పార్టీ ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం నిర్వహణ గురించి చర్చించారు. డీలిమిటేషన్‌పై చర్చించేందుకు రాష్ట్ర సచివాలయం లేదంటే ప్రజా భవన్‌లో అఖిలపక్ష సమావేశం నిర్వహించడంపై అభిప్రాయాలను తీసుకున్నారు. అఖిలపక్ష సమావేశం ముగిసిన తర్వాత దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కలిసి రాష్ట్రంలో సభ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్‌ పార్టీ భావిస్తోంది. ఈ అంశంపై చర్చించేందుకు జానారెడ్డి నివాసంలో ఆయనతో భట్టి శనివారం భేటీ అయ్యారు. ముందుగా రాష్ట్రంలోని అన్ని పార్టీలతో మాట్లాడి అసెంబ్లీ బడ్జెట్‌ సమావేశాలు ముగిసేలోపు అఖిలపక్ష భేటీ నిర్వహించాలని, ఈ సమావేశంలో వచ్చిన సలహాలు, సూచనల ఆధారంగా ముందుకెళ్లాలని నిర్ణయించారు.



లోకము తన కుమారుని ద్వారా రక్షణ పొందుటకేగాని లోకమునకు తీర్పు తీర్చుటకు దేవుడాయనను లోకములోనికి పంపలేదు.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** బ.విదియ ప.2.50 వరకు తదుపరి తదియ, **నక్షత్రం:** హస్త ఉ.10.06 వరకు, తదుపరి చిత్త, **వర్జ్యం:** సా.6.56 నుండి 8.42 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.31 నుండి 5.19 వరకు, **అమృత ఘడియలు:** తె.5.32 నుండి 7.20 వరకు (తెల్లవారితే సోమవారం).

సూర్యోదయం : 6.13
సూర్యాస్తమయం : 6.06
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

సునీతా విలియమ్స్ (నాసా వ్యోమగామి)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

మై హ్యాపీ ప్లేస్! అంతరిక్షం!!

తొమ్మిది నెలలుగా ఇక్కడ రోజుకు పదహారు సూర్యోదయాలు, పదహారు సూర్యాస్తమయాలు!

"ఇంకెంత... కొన్ని గంటలే..." అని నవ్వారు బుచ్ విల్మోర్. ఆయన నవ్వు నక్షత్రంలా ప్రకాశిస్తోంది.

"గంటల్ని మీరు ఏ ఖగోళ కొలమానంతో లెక్కిస్తున్నారు మిస్టర్ విల్మోర్?" అన్నాను నేను నవ్వుతూ.

"ఖగోళం కాదు మిస్ విలియమ్స్, భూగోళంలో నా కూతుళ్ల ఎదురు చూపులతో కాలాన్ని కొలుస్తున్నాను..." అన్నారు విల్మోర్!

విల్మోర్ కూతుళ్లిద్దరూ కింద ఆయన కోసం నిరీక్షిస్తూ ఉన్నారు. పెద్ద కూతురు డ్యారిన్ సోషల్ మీడియాలో పెట్టిన ఎమోషనల్ పోస్టు అంతరిక్షం వరకు వచ్చేసింది.

"నాన్నా! మీరిక్కడ చాలా మిస్ అయ్యారు. క్రిస్మస్‌ని మిస్ అయ్యారు. మీ థర్టీయత్ వెడ్డింగ్ యానివర్సరీని మిస్ అయ్యారు. చెల్లి స్కూల్ ఫైనల్ దాటేసింది. మీరది చూడలేదు. కాలేజ్ ప్లే లో నేను యాక్ట్ చేశాను. అదీ మీరు చూడలేదు. మీరు కిందికి రాగానే, మీ మెడ చుట్టూ చేతులు వేసి మిమ్మల్ని గట్టిగా హగ్ చేసుకోవాలని ఉంది నాన్నా..." అని డ్యారిన్ అంటోన్న ఆ వీడియోను మళ్లీ మళ్లీ



చూసుకుంటూ... "మిస్ విలియమ్స్! భూమి పైన మీకు ప్రియమైన వారు ఎవరు?!" అని నన్ను అడిగారు విల్మోర్!

"ఇండియా" అని చెప్పాను. "ఇంకా?" అన్నారు. "భగవద్గీత" అని చెప్పాను. "ఇంకా?" అన్నారు. "ఉపనిషత్తులు" అన్నాను. "ఇంకా?" అన్నారు! "సబర్మతి ఆశ్రమం" అన్నాను.

నేను నా హజ్బెండ్ పేరు చెప్పేవరకు ఆయన ఇంకా... ఇంకా... ఇంకా... అని అంటూనే ఉంటారని నాకర్థమైంది. కానీ నేను మైఖేల్ పేరు చెప్పలేదు. గోర్బీ, గన్నర్, బైలీ, రోటర్‌ల పేర్లు చెప్పాను. అవి మా పెట్స్.

"ఐయామ్ సారీ..." అన్నారు విల్మోర్.

పెట్స్ పేర్లు చెప్పగానే మాకు పిల్లలు లేరన్న సంగతి ఆయనకు గుర్తొచ్చి ఉండొచ్చు.

"ఇట్స్ ఓకే..." అన్నాను నవ్వుతూ.

విల్మోర్ నా పట్ల గమనింపుతో ఉంటారు. "మనమేమీ ఇక్కడ ఒంటరిగా లేము..." అంటారు. "మనల్నెవరూ ఇక్కడ వదిలేసి వెళ్లలేదు" అంటారు. నేనెప్పుడైనా దీర్ఘాలోచనలో ఉంటే, "అంతరిక్షంలో నివసించటం గొప్ప అనుభూతి కదా..." అని నవ్వించే ప్రయత్నం చేస్తారు.

"మిస్టర్ విల్మోర్! మీరేమీ నాకు ధైర్యం చెప్పక్కర్లేదు. కావాలంటే నా ధైర్యంలోంచి మీక్కొంచెం ఇస్తాను..." అన్నానొకసారి.

ఈదురుగాలొచ్చి ఒక్క తోపు తోసినట్లుగా నవ్వారాయన! ఆ నవ్వుకు మేమున్న అంతరిక్ష కేంద్రం గతి తప్పుతుందా అనిపించింది!

'స్పేస్‌ఎక్స్ క్యాప్సూల్' మా కోసం బయల్దేరి వస్తోందని తెలియగానే... "మిస్ విలియమ్స్! అంతరిక్షంలో మీతో పాటుగా నేనూ ఉన్నానన్న సంగతిని భూమ్మీద అందరూ మర్చిపోయినట్లున్నారు..." అన్నారు విల్మోర్ నవ్వుతూ.

ఆ మాటకు నవ్వాన్నేను.

"చిక్కి నగమైన సునీతా విలియమ్స్', 'సునీతా విలియమ్స్ రాక మరింత ఆలస్యం', 'నేడో రేపో భూమి పైకి సునీతా విలియమ్స్'... భూగోళం మొత్తం మీ గురించే రాస్తోంది. మీ కోసమే ఎదురు చూస్తోంది మిస్ విలియమ్స్..." అన్నారు విల్మోర్.

నన్ను ఆహ్లాదపరచటం అది.

"ఆశ్చర్యం ఏముంది మిస్టర్ విల్మోర్! భూగోళం ఒక వైపుకు మొగ్గి ఉంటుందని తెలియకుండానే డ్యారిన్ వాళ్ల నాన్న గారు ఆస్ట్రోనాట్ అయ్యారా?" అని నవ్వాను.

దూరాన్నుంచి, చుక్క ఒకటి మా వైపుకు మెల్లిగా కదిలి వస్తూ ఉండటం కనిపించింది!

ఆ చుక్క... తన బిడ్డల్ని గుండెల్లోకి పొదువుకోవటానికి వస్తున్న తల్లిలా ఉంది. భుజాలపైకి ఎక్కించుకొని తిప్పటానికి వస్తున్న తండ్రిలానూ ఉంది.

"స్పేస్‌ఎక్స్ క్యాప్సూల్ వస్తున్నట్లుంది..." అన్నారు విల్మోర్, ఆ చుక్క వైపు చూస్తూ!

వీరమల్లు సైద్ధాంతిక విన్యాసం!



జనతంత్రం

వర్ధెల్లి మురళి

సినీనటుడు పవన్ కల్యాణ్ జనసేన పార్టీని స్థాపించి పుష్కర కాలం పూర్తయింది. పిఠాపురంలో నిన్న ఆ వేడుక వైభవంగానే జరిగింది. తాను అసెంబ్లీ గేటు తాకడానికి అవకాశం కల్పించిన పిఠాపురాన్ని ఈ రకంగా పవన్ గౌరవించారు. అసెంబ్లీ గేటును తాకే క్రమంలో పనిలో పనిగా కొన్ని తొడలు విరగ్గొట్టినట్టుగా కూడా ఆయన చెప్పారు. వీరమల్లు కదా, ఆ మాత్రం ఎలివేషన్ అవసరమే! పుష్కర సభ అంగరంగ వైభవంగా జరిగిందనీ, లక్షలాది జనసందోహంతో పొంగిపొరలిందనీ యెల్లో మీడియా వేనోళ్ల పొగిడింది.

యెల్లో మీడియా సాధారణంగా చంద్రబాబుకూ, ఆయన పార్టీకీ మాత్రమే పరిమితం చేసే ప్రచార గౌరవాన్ని పవన్ సభకు కూడా కల్పించి ఔదార్యాన్ని చాటుకున్నది. అందులో ఒక పత్రిక సభలో జనగణన కూడా చేసింది. సభలో జనం కూర్చోవడానికి 14 ఎకరాలు కేటాయించారనీ, ఆ స్థలంలో లక్షలాదిమంది కిక్కిరిసిపోయారని రాసింది. జనం కిక్కిరిసి కూర్చుంటే ఎకరాకు ఐదు వేల మందిని లెక్కవేయడం ఆనవాయితీ. అంతకంటే ఐదు రెట్లు లేదా పది రెట్లు ఎక్కువగా కిక్కిరిశారని యెల్లో మీడియా చెబుతున్నది. ఏమో గుర్రం ఎగరావచ్చు! ఎవరికీ అభ్యంతరం లేదు. జనం కూర్చోవడానికి కేటాయించిన స్థలం 14 ఎకరాలు కాదని, తొమ్మిదెకరాలు మాత్రమేనని స్థానికుల సమాచారం. ఆ స్థానికులు గిట్టనివారు కావచ్చు. యెల్లో మీడియా రాసిందే అక్షర సత్యం కావచ్చు. సభ విజయవంతమైనందుకు పవన్ కల్యాణ్‌కు సనాతనాభివందనాలు!

ఇప్పుడు పవన్ కల్యాణ్ అధికారంలో భాగస్వామి. ఉపముఖ్యమంత్రిగా ఉన్నారు. కనుక ఎన్నికల హామీల అమలు గురించో, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గాల గురించో మాట్లాడుతారని జనం ఆశించడం సహజం. కానీ, అటువంటి ఆశలకు ఆయన అవకాశం ఇవ్వలేదు. కాలువల కింద కూడా ఎండిపోతున్న పంటల గురించి ఆయన మాట్లాడలేదు. చెమటోడ్చి తెచ్చిన పంటలకు పడిపోతున్న ధరల గురించీ ఆయన మాట్లాడలేదు. అవసరమైన ఔషధాలతో, అందుబాటులో వైద్యులతో తొమ్మిది నెలల కిందటి దాకా ధైర్యం నింపిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఇప్పుడు వెలవెలబోతున్న వైనం కూడా ఆయన ప్రసంగంలో చోటు చేసుకోలేదు.

అధోముఖయానం చేస్తున్న జీఎస్టీ వసూళ్ల సాక్షిగా ప్రజల కొనుగోలు శక్తి పడిపోవడం గురించిన ప్రస్తావనే రాలేదు. పేద, మధ్యతరగతి వర్గాల్లో ఆత్మవిశ్వాసం నింపిన విద్యా విప్లవానికి ఎందుకు కళ్లెం వేశారన్నదానిపై వివరణే వినిపించ లేదు. డొక్కా సీతమ్మ పేరు పెట్టి ఇంటర్ విద్యార్థుల కోసం ప్రారంభించిన మధ్యాహ్న భోజన పథకం నెల తిరక్కుండానే పరమ నాసిరకంగా ఎందుకు దిగజారిందో ఆయన చెప్పలేదు. ఆర్‌బీకే సెంటర్లలో అందుబాటులో లేకుండా ఎరువులూ, విత్తనాలూ ఎందుకు అదృశ్యమయ్యాయో, ఇల్లిల్లూ తిరిగి సేవలందించిన వలంటీర్లు ఏమయ్యారో అనే విషయాల గురించి పవన్ మాట్లాడలేదు.

ఎమ్మెల్యేలూ, నాయకులూ జనం మీద పడి దోచుకుతింటున్నారని యెల్లో మీడియానే కోడై కూస్తున్నది. పంపకాల్లో తేడాలతో కూటమి నాయకులు కొట్లాడుకుంటున్నారని కూడా పచ్చ కోడి గూడెక్కి కూస్తున్నది. అధికారులు కలెక్షన్ కౌంటర్లు తెరిచి అక్కడ వారి సతీమణుల్ని కూర్చోబెడుతున్నారని కూడా ఆరోపణలు చేస్తున్నది. ఇటువంటి కీలక విషయాల జోలికి ఆయన వెళ్లలేదు. లౌకిక విషయాల గురించి ఆయన మాట్లాడ దలుచుకోలేదు. ఆయన ప్రసంగమంతా అలౌకిక పారవశ్యమే!

ఈ సభ ద్వారా ఆయన మూడు అంశాలను చెప్పదలుచుకున్నట్టు మనం అర్థం చేసుకోవాలి. మొదటి నుంచీ ఆయన రాజకీయ ప్రయాణమంతా సిద్ధాంతబద్ధంగానే సాగిందని జనం నమ్మాలనేది ఆయన మొదటి పాయింట్. బాల్యం నుంచే తాను సనాతన ధర్మం కోసం పోరాడుతున్నానని చెప్పుకోవడం, తద్వారా ఆ శ్రేణుల్లో అగ్రభాగాన నిలబడాలని కోరుకోవడం రెండో పాయింటు. కొందరు విశ్లేషకులు, మరికొందరు మీడియా వ్యక్తులు ఊహిస్తున్నట్టు కూటమిలో విభేదాలేమీ ఉండబోవనీ,

> పవన్ తన ప్రసంగంలో ఒకపక్క చంద్రబాబును పొగడ్తలతో ముంచెత్తుతూనే మోదీ తరఫున వకాల్తా పుచ్చుకొని తమిళనాడులోని డీఎమ్‌కే పార్టీ మీద దాడి చేశారు. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) పేరుతో దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం అన్యాయం చేయబోతున్నదనీ, దీనిపై ఐక్యంగా పోరాడదామనీ ఆ పార్టీ వాళ్లు వాళ్ల ప్రయత్నమేదో చేస్తున్నారు. బీజేపీ దీర్ఘకాల లక్ష్యాలకు ఇటువంటి చిన్నచిన్న ప్రయత్నాలు కూడా విఘాతం కలిగిస్తాయని బీజేపీ పెద్దలకు బాగా తెలుసు. వారి మనసెరిగి పవన్ ప్రసంగించారు. అప్పుడెప్పుడో చిన్నతనంలో ఆయన మద్రాస్‌లో ఉన్నప్పుడు తమిళుడెవరో 'గొల్టీ' అని గిచ్చాడట! దాన్నిప్పుడు గుర్తుచేసుకున్నారు.
>
> పవన్ సభ ప్రారంభానికి ముందే చంద్రబాబు, లోకేశ్‌బాబు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. యెల్లో మీడియా ఆ సభకు పూర్ణకుంభ స్వాగతం పలికింది. ఈ మూడు పార్టీల కూటమిలో లుకలుకలున్నాయనీ, విడిపోతాయనీ, బీజేపీ – జనసేన కలిసి ఒక కూటమిగా ఏర్పడుతాయనీ ఊహిస్తున్న విశ్లేషకులు ఇప్పటికైనా తమ ఆలోచనల్ని సరిదిద్దుకోవాలి. విభేదాలేమీ లేవు. ముగ్గురూ కలిసి పనిచేస్తారు. బీజేపీ-సంఘ్ పరివార్‌ల దీర్ఘకాలిక లక్ష్యానికి సహకరిస్తూనే మిగిలిన ఇద్దరు ఎవరి ఇంటిని వాళ్లు చక్కదిద్దుకుంటారు.

అక్కడ మోదీకీ – ఇక్కడ బాబుకూ విధేయుడనే అనే సందేశాన్ని శ్రేణులకు పంపించడం మూడో పాయింటు.

లెఫ్ట్ నుంచీ సెంటర్‌కూ, అక్కడి నుంచి రైట్‌కూ తన సిద్ధాంత విధేయత మారిందని మీడియాలో వస్తున్న విమర్శలపై పవన్ కల్యాణ్ అసహనం వ్యక్తం చేశారు. చేగువేరాను తాను అభిమానించడానికి కారణం అతను కమ్యూనిస్టు కావడం కాదట! వైద్యవృత్తిని వదిలేసి విప్లవకారుడుగా మారినందు వల్లనే అభిమానించానని చెప్పుకొచ్చిన పవన్ కల్యాణ్ భాషణపై సీపీఎం అగ్రనాయకుడు బీవీ రాఘవులు వ్యంగ్యంగా స్పందించారు. చేగువేరా మెడిసిన్ చదివిన మాట నిజమే కానీ, ఆయన వైద్యవృత్తిలో ఎప్పుడున్నారో నాకైతే తెలియదన్నారు. నిజంగానే వైద్యుడిగా చే ప్రాక్టీస్ చేసిందేమీ లేదు. అంతర్జాతీయ విప్లవకారుడుగానే ఆయన ప్రసిద్ధుడు. చేగువేరా మీద అభిమానానికి పవన్ చెప్పిన కారణమే నిజమైతే, విప్లవాలు – యుద్ధాల వీధి గుమ్మాల్లో నిలబడి వైద్యసేవలందించిన డాక్టర్ నార్మన్ బెథూన్, డాక్టర్ ద్వారకానాథ్ కోట్నీస్‌ల అభిమానిగా ఆయన మారి ఉండాలి. అసలు ప్రాక్టీసే చేయని చేగువేరాను విప్లవకర వైద్యుని కోటాలో అభిమానించడం అనే కథ సరిగ్గా అతకలేదు.

తాను బాల్యం నుంచే సనాతనవాదినని పవన్ ఈ సభలో చెప్పుకున్నారు. సనాతన ధర్మం తన రక్తంలోనే వుందని చెప్పారు. పద్నాలుగేళ్ల వయసు నుంచే దీక్షలు చేస్తున్నట్టు కూడా చెప్పారు. తనపై సినిమాల ప్రభావం బాగా ఎక్కువని కూడా పవన్ అంగీకరించారు. సినిమాలు, కథలు, నవలలతో బాగా ప్రభావితమయ్యే వ్యక్తులు కొందరు వాటిలోని పాత్రలతో తమను పోల్చుకోవడం అనే ఫ్యాంటసీలో మునిగి తేలుతుంటారు. చేగువేరా ప్రభావం బాగా ఉన్న రోజుల్లో తమ తండ్రిగారు కమ్యూనిస్టని పవన్ చెప్పేవారు. అంతటితో ఆగకుండా, నానమ్మ దీపారాధన చేస్తుంటే ఆ దీపంతో నాన్నగారు సిగరెట్ కాల్చుకునేవారని కూడా ఒక సందర్భంలో ఆయన చెప్పారు. ఇంతకన్నా అవగాహనా రాహిత్యం ఇంకొకటి ఉండదు. కమ్యూనిస్టులంటే దైవదూషకులనే అర్థం ఇందులో స్ఫురిస్తున్నది. కమ్యూనిస్టు అయినంత మాత్రాన నాస్తికుడై ఉండాలనేదేమీ లేదు. నాస్తికుడైనంత మాత్రాన దైవదూషణ చేస్తారనీ, అవమానిస్తారనీ అర్థం కాదు. వారి వారి విశ్వాసాలకు, నమ్మకాలకు కట్టుబడి ఉంటారంతే! దైవదూషణ వంటి పనులకు విశ్వాసాలతో సంబంధం లేదు. అది వ్యక్తిగతం. పూజా పునస్కారాలు చేసే సంప్రదాయ కుటుంబాల్లో పుట్టిన నిగమశర్మ వంటి వారి కథలు కూడా మనం విన్నాము.

ఇప్పుడాయన సనాతన ధర్మ ప్రభావానికి లోనైన తర్వాత కుటుంబ కథలో కొంత మార్పు చేశారు. కేవలం ఇరవయ్యేళ్ల వయసులోనే నాన్నగారు కమ్యూనిస్టు భావజాలంతో ఉండేవారని, ఆ తర్వాత రామభక్తుడిగా మారారని పిఠాపురం సభలో పవన్ చెప్పారు. తన చిన్నతనం నుంచే ఇంట్లో రామనామ జపం వినిపించేదని ఆయన అన్నారు. తన సనాతనధర్మ నిబద్ధతపై ఎవరూ సర్టిఫికెట్ ఇవ్వాల్సిన అవసరం లేదనీ, ఈ దేశం కోసం ప్రాణత్యాగానికైనా సిద్ధమేనని మరోసారి ఆవేశం ప్రదర్శించారు. ఇదంతా ఎందుకంటే, తాను చిన్నతనం నుంచీ సిద్ధాంత నిబద్ధతతోనే ఉన్నాననీ, ఆ సిద్ధాంతం సనాతన ధర్మమేననీ ఇప్పుడాయన సవరణ చేయదలుచుకున్నారు.

చేగువేరా కమ్యూనిస్టని కాదు... మంచి వైద్యుడూ, విప్లవకారుడైనందువల్ల అభిమానించారు. మరి శ్రీశ్రీ, దాశరథి, శేషేంద్ర వంటి వారి సంగతేంది? అవకాశం దొరికిన ప్రతిసారీ వారి కవితా పంక్తుల్ని వల్లెవేయడం పవన్‌కు అలవాటు. వారు సనాతనవాదులా? సామ్యవాదులా? పిఠాపురం సభలో కూడా దాశరథినీ, శ్రీశ్రీని ఆయన తలచుకున్నారు. "ఆ చల్లని సముద్ర గర్భం దాచిన బడబానలమెంతో, ఆ నల్లని ఆకాశంలో కానరాని భాస్కరులెందరో..." అనే దాశరథి గేయం సామ్యవాద గీతమా? సనాతనవాద గీతమా?. ప్రసంగాన్ని ముగిస్తూ శ్రీశ్రీ మహాప్రస్థానంలోని 'అవతారం' కవితను ఆసాంతం చదివి వినిపించారు. "యముని మహిషపు లోహ ఘంటలు మబ్బుచాటున ఖణేల్‌మన్నాయి / నరకలోకపు జాగిలమ్ములు / గొలుసు త్రెంచుకు ఉరికి పడ్డాయి / ఉదయ సూర్యుని సప్త హయములు / నురుగులెత్తే పరుగు పెట్టేయి / కనకదుర్గా చండసింహం జూలు దులిపీ, ఆవులించింది..." ... ఇలా పురాణ ప్రతీకలతో సాగిపోతుందా కవిత.

> ఇప్పుడు పవన్ కల్యాణ్ అధికారంలో భాగస్వామి. ఉపముఖ్యమంత్రిగా ఉన్నారు. కనుక ఎన్నికల హామీల అమలు గురించో, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గాల గురించో మాట్లాడుతారని జనం ఆశించడం సహజం. కానీ, అటువంటి ఆశలకు ఆయన అవకాశం ఇవ్వలేదు. కాలువల కింద కూడా ఎండిపోతున్న పంటల గురించి ఆయన మాట్లాడలేదు. చెమటోడ్చి తెచ్చిన పంటలకు పడిపోతున్న ధరల గురించీ ఆయన మాట్లాడలేదు. అవసరమైన ఔషధాలతో, అందుబాటులో వైద్యులతో తొమ్మిది నెలల కిందటి దాకా ధైర్యం నింపిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఇప్పుడు వెలవెలబోతున్న వైనం కూడా ఆయన ప్రసంగంలో చోటు చేసుకోలేదు.
>
> అధోముఖయానం చేస్తున్న జీఎస్టీ వసూళ్ల సాక్షిగా ప్రజల కొనుగోలు శక్తి పడిపోవడం గురించిన ప్రస్తావనే రాలేదు. పేద, మధ్యతరగతి వర్గాల్లో ఆత్మవిశ్వాసం నింపిన విద్యా విప్లవానికి ఎందుకు కళ్లెం వేశారన్న దానిపై వివరణే వినిపించ లేదు. డొక్కా సీతమ్మ పేరు పెట్టి ఇంటర్ విద్యార్థుల కోసం ప్రారంభించిన మధ్యాహ్న భోజన పథకం నెల తిరక్కుండానే పరమ నాసిరకంగా ఎందుకు దిగజారిందో ఆయన చెప్పలేదు.

ఇంతకాలం ఈ ప్రతీకలన్నీ ప్రభవించబోయే విప్లవానికి సూచికలుగా భావించారంతా! మరి సనాతన ధర్మ పరిరక్షణా యాత్రికునికి ఈ కమ్యూనిస్టు విప్లవ ప్రతీకలెందుకో! ఆయన విడమరిచి చెబితే తప్ప సామాన్యులకు అర్థం కాదు. ఆయన ప్రసంగంలో ఒకపక్క చంద్రబాబును పొగడ్తలతో ముంచెత్తుతూనే మోదీ తరఫున వకాల్తా పుచ్చుకొని తమిళనాడులోని డీఎమ్‌కే పార్టీ మీద దాడి చేశారు. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) పేరుతో దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం అన్యాయం చేయబోతున్నదనీ, దీనిపై ఐక్యంగా పోరాడదామనీ ఆ పార్టీ వాళ్లు వాళ్ల ప్రయత్నమేదో చేస్తున్నారు. బీజేపీ దీర్ఘకాల లక్ష్యాలకు ఇటువంటి చిన్నచిన్న ప్రయత్నాలు కూడా విఘాతం కలిగిస్తాయని బీజేపీ పెద్దలకు బాగా తెలుసు. వారి మనసెరిగి పవన్ ప్రసంగించారు. అప్పుడెప్పుడో చిన్నతనంలో ఆయన మద్రాస్‌లో ఉన్నప్పుడు తమిళుడెవరో 'గొల్టీ' అని గిచ్చాడట! దాన్నిప్పుడు గుర్తుచేసుకున్నారు.

పవన్ సభ ప్రారంభానికి ముందే చంద్రబాబు, లోకేశ్ బాబు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. యెల్లో మీడియా ఆ సభకు పూర్ణకుంభ స్వాగతం పలికింది. ఈ మూడు పార్టీల కూటమిలో లుకలుకలున్నాయనీ, విడిపోతాయనీ, బీజేపీ – జనసేన కలిసి ఒక కూటమిగా ఏర్పడుతాయనీ ఊహిస్తున్న విశ్లేషకులు ఇప్పటికైనా తమ ఆలోచనల్ని సరిదిద్దుకోవాలి. విభేదాలేమీ లేవు. ముగ్గురూ కలిసి పనిచేస్తారు. బీజేపీ-సంఘ్ పరివార్‌ల దీర్ఘకాలిక లక్ష్యానికి సహకరిస్తూనే మిగిలిన ఇద్దరు ఎవరి ఇంటిని వాళ్లు చక్కదిద్దుకుంటారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం లోకేశ్‌ను సీఎం కుర్చీలో త్వరగా కూర్చోబెట్టాలనే ఒత్తిడి బాబు మీద పెరుగుతున్నది. ఆ పరిస్థితుల్లో డిప్యూటీగా ఉండటం పవన్‌కు ఇబ్బంది కనుక ఆయన కేంద్రానికి వెళతారనీ, వచ్చే ఎన్నికల నాటికి దక్షిణాదిన బీజేపీ తరఫున సనాతన ప్రచారానికి ఆయనను నియోగిస్తారని తెలుస్తున్నది. పవన్ స్థానంలో నాగబాబు రాష్ట్ర కేబినెట్‌లోకి రావచ్చు. జనసేన కార్యకర్తలు ఇంతకంటే పెద్ద దృశ్యాన్ని ఆశిస్తే నిరాశ తప్పకపోవచ్చు.

vardhelli1959@gmail.com

ప్రభుత్వం చేయాల్సింది కొండంత!

అభిప్రాయం



దినేశ్ సి. శర్మ

ప్రధాని మోదీ ఆ మధ్య తన 'మన్ కీ బాత్' ప్రసారంలో ఒక ప్రధానమైన ప్రజారోగ్య సవాలు గురించి నొక్కి చెప్పారు. అదేమిటంటే... అధిక బరువు లేదా ఊబకాయం సమస్య. ఒక వ్యక్తి నుండి మరొకరికి నేరుగా సంక్రమించని మధుమేహం, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి వ్యాధులు (ఎన్‌సీడీలు) పెరగడానికి దారితీసే కారకాల్లో ఊబకాయం ఒకటి. వంట నూనె వినియోగాన్ని తగ్గించడం వంటి చిన్న ప్రయత్నాలతో దేశం ఊబకాయం సవాలును పరిష్కరించగలదని ప్రధాని అన్నారు. 'ప్రతి నెలా 10 శాతం తక్కువ నూనె వాడితే సరి. అది ఊబకాయాన్ని తగ్గించే ముందడుగు అవుతుంది' అన్నారాయన.

ఆహారంలో తక్కువ నూనె వాడటం, ఊబకాయాన్ని ఎదుర్కోవడం కుటుంబం పట్ల బాధ్యత కూడా అని ప్రధాని అన్నారు. ప్రధాని ఇచ్చిన ప్రజారోగ్య సందేశం ముఖ్యమైనదే. కానీ అది మొత్తం కథలో ఒక భాగం మాత్రమే. కొవ్వుల అధిక వినియోగం, ప్రధానంగా ఆహారంలో ఉండే ఒక రకమైన ట్రాన్స్ ఫ్యాట్స్ లేదా అసంతృప్త కొవ్వు (ట్రాన్స్ ఫ్యాటీ యాసిడ్) లేదా అనేది ఎన్‌సీడీ వ్యాధులకు కారణమయ్యే వాటిల్లో ఒకటి మాత్రమే. అసంతృప్త కొవ్వు మూలాలలో పాల ఉత్పత్తులు, నెయ్యి, మాంసం, వనస్పతి ఉన్నాయి. ఇతర కొవ్వులను ఎక్కువగా తీసుకోవడం కూడా హానికరం. హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ జారీ చేసిన ఆహార మార్గ దర్శకాల ప్రకారం... కొబ్బరి నూనె, నెయ్యి, పామోలిన్ నూనెలో సంతృప్త కొవ్వుల నిష్పత్తి అత్యధికంగా ఉంటుంది. ప్రధాని సూచించినట్లుగా, వంట చేసేటప్పుడు లేదా డ్రెస్సింగ్ చేసేటప్పుడు ఆహారానికి జోడించే కొవ్వుల వినియోగాన్ని తగ్గించడం అనేది మనం వేసే ముందడుగులో సగం మాత్రమే. ప్రాసెస్ చేసిన ఆహారం, ఫాస్ట్ ఫుడ్, వేయించిన స్నాక్స్, కుకీలు వంటి వాటిద్వారా మనం అసంతృప్త కొవ్వులను తీసుకుంటాం. సంతృప్త, అసంతృప్త కొవ్వుల వనరులు కూడా మారుతూ ఉంటాయి. అలాగే వంట నూనెలూ ఉంటాయి. ప్రజారోగ్యంపై ఆరోగ్యకర ప్రభావం కోసం... నూనెలు మాత్రమే కాక నెయ్యి, వనస్పతి అలాగే అల్ట్రా–ప్రాసెస్డ్ ప్యాకేజ్డ్ ఫుడ్, పాల ఉత్పత్తులు తీసుకోవడాన్ని తగ్గించడం అవసరం. అనారోగ్యకరమైన ఆహారం, కూర్చుని పనిచేసే జీవనశైలికి వ్యతిరేకంగా కూడా ఊబకాయంపై జాతీయ ప్రచారాన్ని విస్తరించాలి.

వంట నూనె వినియోగాన్ని 10 శాతం తగ్గించుకోవాలని కోరడం ద్వారా ఊబకాయ మహమ్మారిని ఎదుర్కోవాల్సిన బాధ్యతను వ్యక్తులపై పెట్టారు ప్రధాని. ఆరోగ్యకర ఆహారపుటలవాట్లను అవలంబించడం అనేది వ్యక్తుల బాధ్యతతోపాటు, సామాజిక బాధ్యత కూడా అంటూ దశాబ్దాలుగా సాగించిన ప్రచారానికి ఇది విరుద్ధం. ఆరోగ్యకరమైన ఆహారాన్ని ప్రజలు తినడానికి వీలు కల్పించే, ప్రోత్సహించే వాతావరణపరికల్పనకు తగిన విధానాలను రూపొందించడం ప్రభుత్వ విధి.



ఊబకాయాన్ని పరిష్కరించడానికి వ్యక్తిగతమైన చర్యలతో పాటు ఇతర చర్యలూ అవసరం. ఉదాహరణకు, భారతదేశం వంటనూనె దిగుమతులపై ఎక్కువగా ఆధారపడి ఉంది. పైగా ప్రభుత్వ విధానాలు పామాయిల్ దిగుమతిని ప్రోత్సహిస్తాయి. దిగుమతి చేసుకున్న అన్ని నూనెలలో ఇది దాదాపు 60 శాతం ఉంటుంది. ప్రాసెస్డ్ ఫుడ్ పరిశ్రమకు పామాయిల్ చాలా ఇష్టమైనది. అయినా అనేక అధ్యయనాలు పామాయిల్ వినియోగంతో హృదయ సంబంధ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని తెలిపాయి. వంట నూనెల ఉత్పత్తినీ, దిగుమతినీ నియంత్రించే ప్రభుత్వ విధానాలను ప్రజలకు తక్కువ హానికరమైన వంట నూనెలను అందించే విధంగా రూపొందించాలి.

గత కొన్ని దశాబ్దాలుగా... పెరుగుతున్న ఆదాయాలు, పట్టణీకరణ, ఆహార ఉత్పత్తుల ప్రపంచీకరణ పెరగడంతో దేశంలో ఆహారపుటలవాట్లు మారాయి. ఫలితంగా ఉప్పు, చక్కెర, కొవ్వులు అధికంగా ఉండే అల్ట్రా ప్రాసెస్డ్ ఆహారాలు ప్రజాదరణ పొందాయి. ఈ ఉత్పత్తులు ఆహార పర్యావరణాన్ని మార్చాయి. ప్రతి చోటా జంక్ ఫుడ్ అందుబాటులో ఉంది. ఈ మార్పుకు ప్రభుత్వ విధానాలు పెద్ద ఎత్తున దోహదపడ్డాయి. ప్రభుత్వాలు చిప్స్, కోలాస్, కుకీలు, నమ్‌కీన్ వంటి వాటిని తయారు చేసే, ప్రాసెస్ చేసే ఫుడ్ కంపెనీలకు సబ్సిడీలను అందిస్తాయి.

ఆరోగ్యకరమైన ఎంపిక కాబట్టి తాజా పండ్లు, కూరగాయలు అందుబాటులో ఉండేలా ప్రోత్సహించాలి. కానీ మన విధానాలు పండ్లు, కూరగాయలను ప్రాసెస్ చేసే కంపెనీలను ప్రోత్సహిస్తాయి. మరోవైపు, జంక్ ఫుడ్‌ను నియంత్రించే ఏ చర్యనైనా ఆహార నియంత్రణ సంస్థలు, పరిశ్రమ ఆదేశం మేరకు నిలిపివేస్తున్నాయి. హాస్యాస్పదం ఏమిటంటే, ఆహార భద్రతా రెగ్యులేటర్, సుప్రసిద్ధ జంక్ ఫుడ్ కంపెనీల భాగస్వామ్యంతో కొన్ని సంవత్సరాలుగా 'ఈట్ రైట్' ప్రచారాన్ని నిర్వహిస్తోంది. జంక్ ఫుడ్‌పై కఠిన నియంత్రణకు మద్దతు పొందే బదులుగా, ఆహార భద్రతా నియంత్రణ సంస్థ అది నియంత్రించాల్సిన వాటితో భాగస్వామ్యం కుదుర్చుకుంది. 2022 నాటికి ఆహార గొలుసు నుండి పారిశ్రామికంగా ఉత్పత్తి చేయబడిన అసంతృప్త కొవ్వులను తొలగించడానికి 'ఇండియా@75: ఫ్రీడమ్ ఫ్రమ్ ట్రాన్స్ ఫ్యాట్స్' కార్యక్రమాన్ని ఆహార నియంత్రణ సంస్థ 2019లో ప్రారంభించింది. కానీ జంక్ ఫుడ్ పరిశ్రమ నుండి తీవ్ర వ్యతిరేకత వల్ల ఈ లక్ష్యసాధన సాధ్యం కాలేదు.

'కూర్చుని పనిచేసే' జీవనశైలి, అసలు వ్యాయామం చేసే అవకాశం లేనిస్థితులు కూడా గమనార్హం. శారీరకంగా చురుకుగా ఉండటం, వ్యాయామం చేయడం వ్యక్తిగత ఎంపికే అయినా, సమాజ స్థాయిలో శారీరక దృఢత్వాన్ని ప్రోత్సహించే చురుకైన వాతావరణాన్ని సృష్టించడంలో ప్రభుత్వ విధానాలు కీలక పాత్ర పోషిస్తాయి. ఉదాహరణకు, నడక, వ్యాయామానికి అనుకూలమైన బహిరంగ ప్రదేశాలను అందించడం; ప్రజా రవాణా, పాదచారులకు ప్రత్యేక కాలిబాటలు, సైక్లింగ్ మార్గాలు ఏర్పాటు ప్రజారోగ్యాన్ని కాపాడడంలో కీలకం. వంటనూనె వినియోగాన్ని తగ్గించడం వంటి వ్యక్తిగత చర్యలు ఊబకాయపు చక్రంలో ఒక చిన్న భాగం మాత్రమే. ప్రభుత్వాలు చేయాల్సింది చాలా ఉంది.

వ్యాసకర్త సైన్స్ వ్యవహారాల వ్యాఖ్యాత

శిక్ష తప్పదు!

జ్యోతిర్మయం

ఇది రామాయణ ఇతిహాసానికి చెందిన సంఘటన. ఒక రోజు శ్రీరామచంద్రుడు సభలో కూర్చుని ఉన్నాడు. ఆ సమయంలో ఓ శునకం సభకు వచ్చింది. దాని తలకు గాయమై రక్తం కారుతోంది. సభలో ఉన్నవారందరూ దాని వంక ఆశ్చర్యంగా చూస్తున్నారు. రాముడు కూడా దానిని చూశాడు. 'నువ్విక్కడికి ఏ పని మీద వచ్చావు... ఏం జరిగింది. జరిగిందేదైనా సరే ధైర్యంగా చెప్పుకో. భయపడకు' అన్నాడు రాముడు.

అప్పుడా శునకం... 'అయ్యా, నేను వీధిలో వెళ్తున్నాను. మార్గ మధ్యంలో వేదశాస్త్రాలు చదువుకున్న ఒక పెద్దా యన ఎదురొచ్చాడు. ఆయన ఏ కారణమూ లేకుండా తన దగ్గరున్న కర్రతో నా తల మీద దెబ్బ వేశాడు. అందువల్ల రక్తం కారుతోంది. ఈ వ్యవహారంలో తగిన తీర్పు ఇవ్వండి' అంది శునకం. రాముడు వెంటనే తన భటులను పంపించి నిందితుణ్ణి రప్పించాడు. అతడు 'నేను వీధిలో వస్తుండగా ఈ కుక్క నాకు అడ్డొచ్చింది. అందువల్ల దానిని కొట్టాను. శాస్త్రాలు చదవుకున్నా... నేను హద్దు మీరాను. నాకు మీరు ఏ శిక్ష వేసినా సరే' అన్నాడు. రాముడు శునకాన్నే అడిగాడు ఏ శిక్ష విధించాలని. అందుకు ఆ శునకం 'ఆయనను ఏదైనా గుడికి ధర్మకర్తగా నియమించండి. అదే ఆయనకు సరైన శిక్ష' అన్నది. అది విన్న రాముడు చిరునవ్వు నవ్వాడు. కానీ అక్కడున్న వారికి ఆశ్చర్యమేసింది. 'అదెలాగూ... తప్పు చేసిన వారికి శిక్ష విధించడమే సముచితం. కానీ అది మానేసి అతనికి ధర్మకర్త హోదా కల్పించమని కోరడమేమిటీ' అని వారు ఆ శునకాన్నే అడిగారు. దానికి శునకం... 'నేను క్రితం జన్మలో ఓ ఆలయానికి ధర్మకర్తగా ఉండేదానిని. ఎంతో అప్రమత్తంగానే నా విధులను నిర్వహిస్తూ వచ్చాను. అయినా మానవ సహజమైన కక్కుర్తితో ఆలయ సంపదను తప్పుగా అనుభవించాను. ఫలితంగా మరుజన్మలో కుక్కగా జన్మించి అవస్థలు పడుతున్నాను. ఇవే అవస్థలు ఈ పెద్దమనిషి కూడా పడాలి' అని పలికింది. హిందువుల్లో తప్పు చేసినవారు ఈ జన్మలో కాకపోయినా మరో జన్మలోనైనా శిక్ష అనుభవించాల్సిందే అనే నమ్మకం ఉంది. ప్రజల్లో నైతికత, ధర్మం వర్ధిల్లడానికి ఇటువంటి నమ్మకాలు దోహదం చేస్తాయి. సమాజానికి ఈ తరహా నీతి బోధనలు చేయడమే పురాణ కథల లక్ష్యం. – యామిజాల జగదీశ్

వడివడిగా బురద తొలగింపు

- వ్యాక్యూమ్ ట్యాంకర్ ద్వారా తొలగింపునకు యత్నాలు
- సింగరేణి, ర్యాట్ హోల్ మైనర్స్ ఆధ్వర్యంలో తవ్వకాలు
- చివరి 40 మీటర్ల స్థలంలో తవ్వేందుకు రోబోల వినియోగం



వ్యాక్యూమ్ ట్యాంక్‌ను సొరంగంలోనికి తీసుకెళ్లేందుకు సిద్ధం చేస్తున్న అధికారులు

సాక్షి, నాగర్‌కర్నూల్: ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో మిగతా ఏడుగురు కార్మికుల జాడ కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాదస్థలంలో చివరి 40 మీటర్లలో తవ్వకాలు జరిపేందుకు రెస్క్యూ బృందాలకు సైతం ప్రమాదం పొంచి ఉండగా, ఇందుకోసం రోబోలతో ఆపరేషన్ చేపడుతున్నారు. ఇప్పటికే సొరంగంలోకి ఆటోమేటివ్ స్లడ్జ్ రిమూవల్ రోబో మిషినరీని తీసుకెళ్లారు. శనివారం దానికి అనుసంధానంగా పనిచేసే వ్యాక్యూమ్ ట్యాంక్‌ను సొరంగంలోకి తరలించారు. దీని ద్వారా వేగంగా బురద, మట్టిని కన్వేయర్ బెల్టు మీదుగా బయటకు తరలించవచ్చని భావిస్తున్నారు. ఈ పనులు పూర్తిస్థాయిలో ఆదివారం ప్రారంభమవుతాయని చెబుతున్నారు.

డీ1 వద్ద తవ్వకాలు పూర్తయితేనే..

ఇప్పటికే కడావర్ డాగ్స్ గుర్తించిన డీ2 ప్రాంతంలో పూర్తిస్థాయిలో తవ్వకాలు చేపట్టారు. అక్కడ గురుప్రీత్‌సింగ్ మృతదేహం లభించగా, మిగతా వారి ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో మరో పాయింట్ డీ1 వద్ద సింగరేణి, ర్యాట్‌హోల్ మైనర్స్ ఆధ్వర్యంలో తవ్వకాలు ముమ్మరం చేశారు. డీ1 వద్ద 9 మీటర్ల ఎత్తులో పేరుకుపోయిన మట్టి, శిథిలాలను తొలగిస్తేనే మిగతా కార్మికుల జాడ తెలిసే అవకాశం ఉంది. డీ1 వద్ద టీబీఎంలో సెగ్మెంట్ ఎరెక్టర్ ఉండే చోట కార్మికులు ఉండే అవకాశం ఉందని భావిస్తున్నారు. మరో రెండ్రోజుల్లో తవ్వకాలు పూర్తికావచ్చని, అప్పుడే కార్మికుల జాడ తెలిసే వీలుందని తెలుస్తోంది. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రత్యేక కార్యదర్శి అరవింద్‌కుమార్, కలెక్టర్ బదావత్ సంతోష్ సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

టీబీ పేషెంట్లకు ఉచిత పౌష్టికాహారం కోసం రూ.25 లక్షలు

- మంత్రి దామోదరకు మొత్తాన్ని అందజేసిన టీజీఎస్‌ఎస్‌ఐఏ

సాక్షి, హైదరాబాద్: టీబీ పేషెంట్లకు పౌష్టికాహారంతో కూడిన ఫుడ్ కిట్స్‌ను అందించేందుకు తెలంగాణ స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ (సర్జికల్ ఐటమ్స్ మాన్యుఫాక్చరర్స్) రూ.25 లక్షల మొత్తాన్ని ఆరోగ్య శాఖమంత్రి దామోదర రాజ నర్సింహకు అందజేసింది. సీఎస్‌ఆర్ నిధుల కింద అసోసియేషన్ అందించిన ఈ మొత్తాన్ని పెద్దపల్లి జిల్లాలోని టీబీ పేషెంట్లకు ఆరు నెలల పాటు ఉచితంగా పౌష్టికాహారం అందించేందుకు ఖర్చు పెట్టనున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలో టీబీ పేషెంట్లకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని ఉచితంగా అందించేందుకు కార్పొరేట్ సంస్థలు ముందుకు రావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు 100 లోపే

- మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి వెల్లడి
- ఐజీ సమక్షంలో 64 మంది మావోయిస్టుల లొంగుబాటు



లొంగిపోయిన మావోయిస్టు సభ్యురాలికి నగదు అందజేస్తున్న ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి. చిత్రంలో భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ తదితరులు

కొత్తగూడెంటౌన్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ చేయూత పథకం సత్ఫలితాలు ఇస్తోందని మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో శనివారం 64 మంది మావోయిస్టులు ఐజీ సమక్షంలో లొంగిపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీ ల్లో మావోయిస్టులపై నమ్మకం, ఆదరణ సన్నగిల్లుతున్నాయని చెప్పారు. తెలంగాణ వెలుపల ప్రస్తుతం 100 మంది లోపే మావోయిస్టులు అజ్ఞాతంలో ఉన్నారని పేర్కొన్నారు. వారి కుటుంబసభ్యులతో మాట్లాడి వారు కూడా జనజీవన స్రవంతిలో కలిసేలా ప్రయత్నిస్తున్నామని తెలిపారు. గత రెండున్నర నెలల్లో 122 మంది మావోయిస్టులు లొంగిపోయారని, జనజీవన స్రవంతిలో కలిసేందుకు పెద్ద ఎత్తున ముందుకు వస్తున్నారని వివరించారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం అనేక సౌకర్యాలు కల్పిస్తోందని, ఈ నేపథ్యంలో పలువురు నక్సలిజాన్ని వీడుతున్నారని అన్నారు. మావోయిస్టులు కాలం చెల్లిన సిద్ధాంతాలను నమ్ముకుని, ఏజెన్సీ ప్రాంత అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఐజీ విమర్శించారు. కాగా, శనివారం లొంగిపోయిన వారిలో 16 మంది మహిళలు ఉన్నారు. లొంగిపోయినవారికి ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున తక్షణ ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్, భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వీడియోతో బాలికకు వేధింపులు

- ముగ్గురు మైనర్లను అరెస్టు చేసిన పోలీసులు

గచ్చిబౌలి: వీడియో చూపించి ఓ మైనర్ బాలికను ముగ్గురు మైనర్లు వేధింపులకు గురిచేశారు. బాలిక ఫిర్యాదుతో పోలీసులు వారిని అరెస్టు చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. గచ్చిబౌలి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఓ స్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని తన క్లాస్‌మేట్‌తో సన్నిహితంగా ఉండగా మరో విద్యార్థి వీడియో చిత్రీకరించాడు. వీడియో చిత్రీకరించిన మైనర్ తనతోనూ సన్నిహితంగా గడపాలని బాలికను వేధించాడు. ఈ క్రమంలో తరగతి గదిలో ఎవరూ లేని సమయంలో బాధితురాలు ఆ బాలుడి బ్యాగులోని సెల్‌ఫోన్ పగులగొట్టింది. ఈ వ్యవహారాన్ని మరో విద్యార్థి గమనించాడు. కొద్దిసేపటికి వచ్చిన మైనర్ బాలుడు తన సెల్‌ఫోన్ కోసం వెతుకుతుండగా.. ఫలానా విద్యార్థిని తీసిందని తన స్నేహితుడితో విషయం చెప్పాడు. ఈ క్రమంలో పగిలిన సెల్‌ఫోన్ నుంచి ఆ వీడియోను స్నేహితునికి కూడా షేర్ చేశాడు. దీంతో ఆ వీడియోను చూపిస్తూ తనతోనూ సన్నిహితంగా గడపాలని మరో మైనర్ కూడా బాలికను వేధించడం మొదలుపెట్టాడు. అలాగే ఫోన్ పగలగొట్టినందున కొత్త సెల్‌ఫోన్ కొనివ్వాలని బాలికను ఒత్తిడి చేయడంతో బాధితురాలి స్నేహితులు ఈ విషయాన్ని ఆమె తల్లిదండ్రులకు వివరించారు. దీంతో తల్లిదండ్రులతో కలిసి బాధిత విద్యార్థిని మూడు రోజుల క్రితం గచ్చిబౌలి ఠాణాలో ఫిర్యాదు చేసింది. పోక్సో కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. బాలికతో సన్నిహితంగా ఉన్న మైనర్‌ను, వేధింపులకు గురిచేసిన మరో ఇద్దరు బాలురను అరెస్ట్ చేశారు. శనివారం మేజిస్ట్రేట్ ముందు ముగ్గురినీ హాజరు పరిచారు.

మూతిపై మైకు

లేడీ రిపోర్టర్ అత్యుత్సాహం ● కోపంగా లుక్కిచ్చిన ట్రంప్





వాషింగ్టన్: ఓ లేడీ రిపోర్టర్ అత్యుత్సాహం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఇబ్బందికర పరిస్థితి తెచ్చిపెట్టింది. శుక్రవారం వాషింగ్టన్ డీసీలో గాజాపై మీడియా ప్రశ్నలకు బదులిస్తుండగా ఒక రిపోర్టర్ తన మైక్‌ను ట్రంప్‌కు మరీ దగ్గరగా పెట్టేందుకు ప్రయత్నించింది. దాంతో అది కాస్తా అనుకోకుండా ఆయన మూతికి తాకింది. దాంతో అధ్యక్షుడు తీవ్ర అసహనానికి లోనయ్యారు. ఆమెకేసి ఆగ్రహంగా చూడటమే గాక ఇదేం పని అన్నట్టుగా కనుబొమ్మలు ఎగరేశారు. 'ఏం చేశావ్ నువ్వు!' అంటూ నిలదీశారు. తర్వాత మీడియా ప్రశ్నలకు బదులిస్తూ, 'ఈ రాత్రి ఆమె టీవీ షోగా, బిగ్ స్టోరీగా మారిపోయింది' అంటూ తనదైన శైలిలో స్పందించారు. ఈ ఉదంతంపై నెటిజన్లు విపరీతంగా స్పందిస్తున్నారు. వారి జోకులు, కామెంట్లతో ఇంటర్నెట్ హోరెత్తిపోతోంది. ''ఇందులోనూ కుట్రకోణముందేమో! మైక్‌కు ప్రాణాంతక ఆంత్రాక్స్ పొడి, ఫెంటానిల్ డ్రగ్ వంటివేమైనా రుద్దారేమో. ఏమైనా దీన్నంత తేలిగ్గా తీసుకోరాదు'' అని ఒక ఎక్స్ యూజర్ చెణుకు విసిరాడు. 'ట్రంప్ గనుక మరికొన్ని గంటల్లో అనుమానాస్పదంగా మరణిస్తే అందుకు ఆ లేడీ రిపోర్టరే కారకురాలు' అని మరొకరు, ''మైక్‌పై విషం పూసి ఉండొచ్చు. కాస్త అతిగా అనిపించినా సరే, దీనిపై లోతైన విచారణ జరగాల్సిందే'' అని ఇంకొకరు రాసుకొచ్చారు. ఇది క్షమించరాని భద్రతా లోపమంటూ ట్రంప్ మద్దతుదారులు ఆగ్రహిస్తున్నారు. రిపోర్టరైనా సరే, మైక్‌తో అంత దగ్గరికి ఎలా రానిస్తారని ప్రశ్నిస్తున్నారు.

ఇష్టం లేకున్నా నవ్వాల్సిందే పాపం!

భార్య ఉషను ఉద్దేశించి వాన్స్ వ్యాఖ్యలు ● చౌకబారు హాస్యమంటూ నెటిజన్ల ధ్వజం

వాషింగ్టన్: అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తన భార్య ఉషా చిలుకూరిని ఉద్దేశించి చేసిన సరదా వ్యాఖ్యలు కాస్తా గురి తప్పి బెడిసికొట్టాయి. మిషిగాన్‌లో ఒక కార్యక్రమానికి ఆయన భార్యాసమేతంగా హాజరయ్యారు. తన భార్య అమెరికా సెకండ్ లేడీగా గొప్పగా బాధ్యతలు నిర్వర్తిస్తోందంటూ పొగడ్తలు కురిపించారు. పనిలో పనిగా, ''అయితే ఒక్కటి మాత్రం నిజం. నేనెంత అర్థంపర్థం లేని మాటలు మాట్లాడినా ఆమె నవ్వాల్సిందే పాపం! ఎందుకంటే చుట్టూ కెమెరాలుంటాయి! నవ్వుతూ నాతో శ్రుతి కలపాలి. మరో దారి లేదు''అంటూ చెణుకులు విసిరారు. కానీ ఆ కామెంట్లు విమర్శలకు దారితీశాయి. తనకు సెన్సాఫ్ హ్యూమర్ అస్సలు లేదని వాన్స్ మరోసారి నిరూపించుకున్నారంటూ నెటిజన్లు తప్పుబడుతున్నారు. చౌకబారు వ్యాఖ్యలతో భార్యను చీర్‌లీడర్‌గా చిత్రించారంటూ తూర్పారబడుతున్నారు. హాస్యం అనుకుని వాన్స్ చేసే కామెంట్లు ఎప్పుడూ ఇలాగే గురి తప్పుతూ ఉంటాయంటూ ఎద్దేవా చేశారు. వాన్స్ ఈ వ్యాఖ్యలు చేస్తున్నప్పుడు కూడా ఉష ఎప్పట్లాగే ఆయన వెనకాల నుంచుని నవ్వుతూ చూస్తుండిపోవడం విశేషం! గత ఉపాధ్యక్షునిగా వాన్స్ ప్రమాణస్వీకారం సందర్భంగా ఆయనకేసి ఉష ఆప్యాయంగా, గర్వంగా, చిరునవ్వుతో చూస్తున్న ఫొటోలు, వీడియోలు వైరల్ కావడం తెలిసిందే. తెలుగు మూలాలున్న ఉష 2014లో వాన్స్‌ను పెళ్లాడారు. వారికి ముగ్గురు పిల్లలు. వాన్స్ దంపతులు ఈ నెలాఖర్లో భారత్ రానున్నారు. సెకండ్ లేడీ హోదాలో ఉషకు ఇది తొలి భారత పర్యటన.




భర్త వాన్స్ మాటలకు నవ్వుతున్న ఉష

సునీత వచ్చేస్తోంది!

ఎట్టకేలకు ఐఎస్ఎస్‌కు బయల్దేరిన స్పేస్ఎక్స్ డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్

కేప్ కెనావెరాల్: సుదీర్ఘ నిరీక్షణకు తెరపడే సమయం వచ్చేసింది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో తొమ్మిది నెలలుగా చిక్కుకుపోయిన వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ ఎట్టకేలకు భూమికి తిరిగి రానున్నారు. వారిని వెనక్కు తీసుకురావడానికి స్పేస్ఎక్స్ సంస్థ 'నాసా' సహకారంతో క్రూ–10 మిషన్ ప్రారంభించింది. అమెరికాలోని కెనెడీ స్పేస్ సెంటర్ నుంచి స్థానిక కాలమానం ప్రకారం శనివారం తెల్లవారుజామున ఫాల్కన్–9 రాకెట్ ద్వారా డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్‌ను అంతరిక్షంలోకి పంపింది. ఇందులో నలుగురు వ్యోమగాములు అన్నె మెక్‌క్లెయిన్, నికోల్ అయేర్స్ (అమెరికా), తుకుయా ఒనిషీ (జపాన్), కిరిల్ పెస్కోవ్ (రష్యా)లున్నారు. వారు ఆర్నెల్లపాటు ఐఎస్ఎస్‌లోనే ఉంటారు. గత సెప్టెంబర్‌లో స్పేస్ఎక్స్ వ్యోమనౌకలో ఐఎస్ఎస్‌కు వెళ్లిన ఇద్దరు వ్యోమగాములతో కలిసి సునీత, విల్మోర్ తిరిగొస్తారు. వాతావరణం అనుకూలిస్తే ఆ నలుగురూ వారం రోజుల్లో తిరిగొచ్చే అవకాశం ఉంది. వారు అమెరికాలోని ఫ్లోరిడా తీరంలో దిగుతారు.



నింగిలోకి దూసుకెళ్తున్న స్పేస్‌క్రాఫ్ట్ (ఇన్‌సెట్‌లో సునీత)

వారం అనుకుంటే...

బోయింగ్ సంస్థ అభివృద్ధి చేసిన స్టార్‌లైనర్ స్పేస్‌క్రాఫ్ట్ తొలి మానవసహిత అంతరిక్ష ప్రయోగంలో భాగంగా 2024 జూన్ 5న సునీత, విల్మోర్ ఐఎస్ఎస్‌కు చేరుకున్నారు. షెడ్యూల్ ప్రకారం ఎనిమిది రోజుల్లో వెనక్కి రావాలి. కానీ స్టార్‌లైనర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో అది వీలవలేదు. స్పేస్‌షిప్ థ్రస్టర్లు విఫలమవడంతో పాటు హీలియం గ్యాస్ లీకవుతున్నట్లు గుర్తించారు. మరమ్మత్తులకు ప్రయత్నించినా లాభం లేకపోయింది. దాంట్లో వారిని వెనక్కు తీసుకురావడం ప్రాణాలకే ప్రమాదమని నిపుణులు హెచ్చరించడంతో స్టార్‌లైనర్ ఖాళీగానే తిరిగొచ్చింది. తర్వాత వారిని తీసుకొచ్చేందుకు పలుమార్లు ప్రయత్నించినా కుదర్లేదు. చివరికి ఇటీవలి అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో కూడా ఈ అంశం ప్రచారాస్త్రంగా మారింది. తాము అధికారంలోకి వస్తే సునీత, విల్మోర్‌ను సాధ్యమైనంత త్వరగా రప్పిస్తామని జో బైడెన్, డొనాల్డ్ ట్రంప్ ఇద్దరూ ప్రకటించారు. ట్రంప్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టగానే దీనిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. వారిని తీసుకొచ్చేందుకు స్పేస్ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ సాయం కోరారు. మస్క్ చొరవతో క్రూ–10 మిషన్ ప్రారంభమైంది. అంతా అనుకున్నట్టు జరిగితే వారం రోజుల్లో సునీత, విల్మోర్ మళ్లీ భూమిపై అడుగుపెడతారు.



శుక్రవారం క్రూ-10 మిషన్‌లో భాగంగా ఐఎస్ఎస్‌కు బయలుదేరిన వ్యోమగాములు వీరే...

మీ దేశానికో నమస్కారం!

అమెరికాకు భారత విద్యార్థిని గుడ్‌బై

- పాలస్తీనాకు మద్దతిచ్చిందంటూ ట్రంప్ సర్కారు కన్నెర్ర
- ఉగ్రవాద సానుభూతిపరురాలంటూ స్టూడెంట్ వీసా రద్దు
- సెల్ఫ్ డిపోర్టేషన్ ద్వారా స్వచ్ఛందంగా తిరిగొచ్చిన రంజని



భారత్‌కు బయల్దేరే ముందు న్యూయార్క్ ఎయిర్‌పోర్టులో రంజని

న్యూయార్క్/వాషింగ్టన్: డిపోర్టేషన్. అమెరికా అధ్యక్షునిగా డొనాల్డ్ ట్రంప్ పగ్గాలు చేపట్టినప్పటి నుంచీ అంతటా మారుమోగుతున్న పదం. అక్రమంగా చొరబడ్డారంటూ భారతీయులతో సహా ఎంతోమందిని ఎడాపెడా తిప్పి పంపిన వైనం రేపిన కలకలం అంతా ఇంతా కాదు. కరడుగట్టిన నేరస్తుల్లా కాళ్లూ చేతులకు సంకెళ్లు వేసి, సరుకు మూటల మాదిరిగా సైనిక విమానాల్లో కుక్కి మరీ రవాణా చేసిన అమానుషత్వంపై వెల్లువెత్తిన విమర్శలు అన్నీ ఇన్నీ కాదు. అలాంటి ట్రంప్ సర్కారుకు రంజనీ శ్రీనివాసన్ అనే భారత విద్యార్థిని మర్చిపోలేని షాకిచ్చారు. పాలస్తీనా ఆందోళనలకు మద్దతిచ్చిందంటూ అమెరికా ప్రభుత్వం ఆమెపై ఉగ్రవాద సానుభూతిపరురాలు అనే ముద్ర వేసింది. ఆ అభియోగాలకు రుజువులేమీ చూపకుండానే తన ఎఫ్–1 స్టూడెంట్ వీసాను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. దాంతో చిర్రెత్తుకొచ్చిన రంజని, మితిమీరిన దురభిమానంతో మతిలేని దూకుడు ప్రదర్శిస్తున్న ట్రంప్ సర్కారుకు దిమ్మతిరిగే నిర్ణయం తీసుకున్నారు. 'నువ్వు నన్ను వెళ్లగొట్టేదేమిటి? నేనే నీ దేశంలో ఉండదలచుకోలేదు పో'మ్మంటూ తనను తానే డిపోర్ట్ చేసుకున్నారు! విద్యార్థులంతా అపురూపంగా భావించే అమెరికా స్టూడెంట్ వీసాను 'ఆఫ్ట్రాల్' అంటూ వదులుకుని స్వచ్ఛందంగా భారత్ తిరిగొచ్చారు. వలసదారులను తిప్పి పంపే ప్రక్రియను వేగవంతం చేసేందుకు ట్రంప్ సర్కారు ఇటీవల ఏరికోరి అందుబాటులోకి తెచ్చిన సెల్ఫ్ డిపోర్టేషన్ సదుపాయాన్నే రంజని ఇందుకు ఉపయోగించుకోవడం విశేషం! తద్వారా అమెరికా తీరును ప్రతీకాత్మకంగా ఎండగట్టారామె. కొలంబియా వర్సిటీ కొన్నాళ్లుగా గాజా అనుకూల నిరసన ఉద్యమానికి కేంద్రబిందువుగా తయారవడం తెలిసిందే. అక్కడి విద్యార్థులు హమాస్ ఉగ్ర సంస్థకు పరోక్షంగా మద్దతిస్తూ దాని సానుభూతిపరులుగా మారారని ట్రంప్ సర్కారు తీవ్ర ఆగ్రహంతో ఉంది. రంజని కూడా హమాస్‌కు మద్దతిచ్చే కార్యకలాపాల్లో పాలుపంచుకున్నారని ఇటీవల అభియోగాలు మోపింది. ఆమె ఎఫ్–1 స్టూడెంట్ వీసాను రద్దు చేస్తూ హోమ్‌లాండ్ సెక్యూరిటీ విభాగం మార్చి 5న నిర్ణయం తీసుకుంది. దాంతో కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ (సీబీపీ) హోం యాప్‌లోని సెల్ఫ్ డిపోర్టేషన్ సదుపాయం ద్వారా రంజని మార్చి 11న స్వచ్ఛందంగా అమెరికాను వీడారు. న్యూయార్క్ విమానాశ్రయంలో ఆమె హడావుడిగా బోర్డింగ్ కేసి వెళ్తున్న వీడియోను హోమ్‌లాండ్ సెక్యూరిటీ కార్యదర్శి క్రిస్టీ నోయెమ్ ఎక్స్‌లో షేర్ చేశారు.

ఏమిటీ స్వీయ బహిష్కరణ యాప్?

కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ (సీబీపీ) హోం యాప్‌ను ప్రయాణ, రవాణా సదుపాయాల నిమిత్తం బైడెన్ సర్కారు 2022లో అందుబాటులోకి తెచ్చింది. తర్వాత శరణార్థుల దరఖాస్తులను కూడా ప్రాసెస్ చేసేలా దాని పరిధిని పెంచారు. ట్రంప్ వచ్చాక 'దేశం వీడాలని భావిస్తున్నా' అంటూ సెల్ఫ్ డీపోర్ట్ ఆప్షన్ కొత్తగా చేర్చారు. ప్రభుత్వం తిప్పి పంపేయాల్సిన పని లేకుండా తమంత తాముగానే దేశం వీడటానికి వీలు కల్పించే ఈ ఆప్షన్‌ను మార్చి 10న అందుబాటులోకి తెచ్చారు. అదే రోజు రంజని దాన్ని వినియోగించుకున్నారు. ఆ మర్నాడే న్యూయార్క్ ఎయిర్‌పోర్ట్‌లో విమానమెక్కి అమెరికాను వీడారు.

ఎవరీ రంజని?

భారత్‌కు చెందిన రంజని అహ్మదాబాద్‌లో సెంటర్ ఫర్ ఎన్విరాన్మెంటల్ ప్లానింగ్, టెక్నాలజీ యూనివర్సిటీలో డిగ్రీ చేశారు. తర్వాత ఫుల్‌బ్రైట్ నెహ్రూ, ఇన్‌ల్యాక్స్ స్కాలర్‌షిప్‌లపై అమెరికా వెళ్లి ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీలో డిజైన్ విభాగంలో మాస్టర్ డిగ్రీ చేశారు. తర్వాత న్యూయార్క్‌లోని ప్రఖ్యాత కొలంబియా వర్సిటీలో ఎం.ఫిల్ చేశారు. తర్వాత అక్కడే గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్, ప్లానింగ్, ప్రిజర్వేషన్ విభాగంలో డాక్టోరల్ విద్య అభ్యసిస్తున్నారు. వాతావరణ మార్పులకు తొలుత ప్రభావితమయ్యే వర్గాలకు కాపాడేందుకు వాషింగ్టన్ కేంద్రంగా పని చేసే ఓ స్వచ్ఛంద సంస్థలోనూ రంజని పని చేశారు. ప్రఖ్యాత మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో వెస్ట్ ఫిలడెల్ఫియా ల్యాండ్‌స్కేప్ ప్రాజెక్ట్‌లో పరిశోధకురాలిగా కూడా సేవలందించారు. 'బంగారం, సైనేడ్: కుటుంబం, కులం, కర్ణాటకలోని కోలార్ గోల్డ్ ఫీల్డ్స్(కేజీఎఫ్)లో ఖనిజ తవ్వకాల తర్వాత అక్కడి కులరాజకీయాలు'' అంశంపై పరిశోధన చేశారు. 'భారత్‌లో పట్టణ సమీప ప్రాంతాల్లో భూములు–కూలీల మధ్య సంబంధాలు, నిరుద్యోగం' అంశంపై అమెరికాలో పరిశోధన చేస్తున్నారు.

తిండి పెట్టకుండా కొట్టారు

- తెల్ల కాగితాలపై సంతకాలు చేయించుకున్నారు
- బంగారం స్మగ్లింగ్ కేసులో అరెస్టయిన రన్యారావు ఆరోపణలు
- డీఆర్ఐ డీజీకి లేఖ రాసిన నటి



బెంగళూరు: బెంగళూరులోని కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి అక్రమంగా బంగారం తరలిస్తూ పట్టుబడిన కేసులో నిందితురాలు, కన్నడ నటి రన్యా రావు తాజాగా రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులపై ఆరోపణలు గుప్పించారు. ఈ మేరకు డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ)కు మార్చి ఆరో తేదీన హర్షవర్ధిని రన్యా పేరిట ఆమె రాసిన లేఖ తాజాగా బహిర్గతమైంది. పరప్పన అగ్రహార జైలు చీఫ్ సూపరింటెండెంట్ ద్వారా ఆమె ఈ లేఖను డీఆర్ఐకు పంపించారు. దుబాయ్ నుంచి ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నప్పుడు తాను బంగారాన్ని తీసుకురాలేదని ఆ లేఖలో పేర్కొన్నారు. కస్టడీలో ఉన్న సమయంలో రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు పలుమార్లు చెంప దెబ్బ కొట్టారని, తెల్ల కాగితాలపై బలవంతంగా సంతకాలు చేయించుకున్నారని చెప్పారు. ''ఈ అంశంలో నేను నిరపరాధినని వివరించేందుకు ఎంత ప్రయత్నించినా అధికారులు నా మాటల్ని వినిపించుకోలేదు. ఎయిర్‌పోర్ట్ బయటకాకుండా విమానంలోనే నన్ను అరెస్ట్‌చేశారు. కోర్టులో హాజరుపరచడానికి ముందు వరకు అధికారులు మొత్తంగా 10, 15 సార్లు చెంపదెబ్బ కొట్టారు. కొట్టినా, చెంపదెబ్బ తిన్నాసరే వాళ్లు టైప్‌చేసిన పేజీలపై సంతకాలు చేయబోనని చెప్పా. దీంతో అన్యాయంగా మా తండ్రి పేరును ఈ కేసులోకి లాగి పరువు తీస్తామని బెదిరించారు. తీవ్రమైన ఒత్తిడి కారణంగా వాళ్లు చెప్పినపనిచేశా. దాదాపు 60 టైప్‌చేసిన పేజీలపై, 40 తెల్లకాగితాలపై సంతకాలు చేశా''అని అన్నారు. రన్యా రావు సవతి తండ్రి కె.రామచంద్రరావు ప్రస్తుతం కర్ణాటక రాష్ట్ర పోలీసుల గృహ, మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా సేవలందిస్తున్నారు. ''మూడో తారీఖు సాయంత్రం అరెస్టయితే నాలుగో తేదీ రాత్రి కోర్టులో హాజరుపరిచేదాకా నన్ను నిద్రపోనివ్వలేదు, తిండి పెట్టలేదు. ఆరోజు ఢిల్లీ నుంచి వచ్చిన అధికారుల్లా నటించిన కొందరు వ్యక్తులు ఆ విమానంలోని కొందరు ప్రయాణికులను రక్షించేందుకు నన్ను ఈ కేసులో అన్యాయంగా ఇరికించారు. జడ్జి ఎదుట హాజరుపరిచేందుకు కారులో తీసుకెళ్లేటప్పుడూ అధికారులు బెదిరించారు. కొట్టిన విషయం చెప్తే నాన్న సంగతి, నా సంగతి చూస్తామని బెదిరించారు. రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారుల కస్టడీలో ఉన్నకాలంలో బలవంతంగా తీసుకున్న నా వాంగ్మూలాలకు విలువ ఇవ్వకండి''అని డీఆర్ఐకు లేఖలో విజ్ఞప్తి చేశారు. కస్టడీలో ఉన్న కాలంలో కళ్ల కింద నల్లని చారలతో, నిస్సత్తువగా ఉన్న రన్యా రావు ఫొటో ఒకటి వైరల్‌గా మారిన విషయం తెల్సిందే. మూడ్రోజులు రెవెన్యూ ఇంటెలిజెన్స్ కస్టడీలో ఉన్న ఆమెను ఆ తర్వాత జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. గతంలో రన్యా రావు భిన్న వాదనలు చేశారు. అరెస్టసమయంలో తన నుంచి పోలీసులు 17 బంగారు కడ్డీలను స్వాధీనం చేసుకున్నారని ఏడోతేదీన వాంగ్మూలంలో ఒప్పుకున్నారు. అధికారులు ఇష్టమొచ్చినట్లు తిట్టారని పదో తేదీన కోర్టులో ఆమె చెప్పారు. అయితే కొట్టలేదని ఒప్పుకున్నారు. మరోవైపు, రన్యారావు సవతి తండ్రి రామచంద్రరావును కర్ణాటక ప్రభుత్వం తాజాగా సెలవుపై పంపించింది. ఈ మేరకు శనివారం నిర్ణయం తీసుకుంది.

ట్రంప్ ప్రతిపాదనతో ఆటలొద్దు

శాంతి ప్రయత్నాలకు విఘాతం కలిగించొద్దు

- పుతిన్‌కు యూకే ప్రధాని కియర్ స్టార్మర్ హెచ్చరిక



లండన్: ఉక్రెయిన్– రష్యా మధ్య శాంతి కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన ఒప్పందంతో ఆటలాడొద్దని రష్యా అధినేత పుతిన్‌ను యునైటెడ్ కింగ్‌డమ్(యూకే) ప్రధాన మంత్రి కియర్ స్టార్మర్ హెచ్చరించారు. పుతిన్ నిజంగా శాంతిని కోరుకుంటే అది చాలా సులభంగా సాధ్యమవుతుందని అన్నారు. కాల్పుల విరమణ ఒప్పందానికి అంగీకరించాలని, ఉక్రెయిన్‌పై వెంటనే దాడులు నిలిపివేయాలని చెప్పారు. శాంతి ప్రయత్నాలకు విఘాతం కలిగించాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని తేల్చిచెప్పారు. 30 రోజులపాటు కాల్పుల విరమణ పాటించాలంటూ డొనాల్డ్ ట్రంప్ చేసిన చక్కటి ప్రతిపాదనకు రష్యా ప్రభుత్వం అడ్డుపుల్లలు వేస్తోందని మండిపడ్డారు. శాంతియుత పరిస్థితులు నెలకొనడం పుతిన్‌కు ఇష్టం లేదా? అని ప్రశ్నించారు. ఇలాగే మొండిగా వ్యవహరిస్తే రష్యాపై ఆర్థిక ఆంక్షలు తీవ్రతరం చేస్తామని, అప్పుడు మరో గత్యంతరం లేక ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని ముగించక తప్పదని వెల్లడించారు. ఉక్రెయిన్‌తో చర్చలకు పుతిన్ సిద్ధమైతే, రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం సజావుగా కొనసాగేలా తాము బాధ్యత తీసుకుంటామని స్టార్మర్ తెలిపారు. ఆయన శనివారం యూరప్‌తో పాటు మిత్రదేశాల అధినేతలతో వర్చువల్‌గా సమావేశమయ్యారు. ఈ భేటీలో 25 దేశాల నేతలు పాల్గొన్నారు. ఉక్రెయిన్–రష్యా యుద్ధం, తాజా పరిణామాలపై, పుతిన్ వైఖరిపై చర్చించారు. రెండు దేశాల మధ్య శాశ్వతంగా శాంతి నెలకొనాలని ఈయూ, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, జపాన్ తదితర దేశాలన్నీ కోరుకుంటున్నట్లు స్టార్మర్ తెలిపారు. రష్యా మెడలు వంచడానికి అవసరమైతే సైన్యాన్ని సైతం రంగంలోకి దించడానికైనా సిద్ధమేనని సంకేతాలిచ్చారు. ప్రాక్టికల్ ప్లానింగ్‌తో 'ఆచరణ దశ'ప్రారంభించేలా ముందుకు సాగుతున్నామని ఉద్ఘాటించారు. వర్చువల్ సమావేశంలో ఉక్రెయిన్ అధినేత జెలెన్‌స్కీ పాల్గొన్నారు. ఉక్రెయిన్–రష్యా మధ్య కాల్పుల విరమణ ప్రక్రియ ఎప్పుడో ప్రారంభం కావాల్సి ఉండగా, రష్యా మొండి వైఖరితో ఆగిపోయిందని జెలెన్‌స్కీ విమర్శించారు. కాల్పుల విరమణను అడ్డుకోవడానికి రష్యా కుట్రలు సాగిస్తోందని ఆరోపించారు. ఇదిలా ఉండగా, శాంతి కోసం మరింత చొరవ తీసుకోవాలని యూరప్ దేశాలు నిర్ణయానికొచ్చాయి. కాల్పుల విరమణకు అంగీకరించేలా పుతిన్‌పై ఒత్తిడి పెంచడమే లక్ష్యంగా ఏం చేయాలన్న దానిపై చర్చించడానికి యూరప్ దేశాల మిలిటరీ ప్లానింగ్ సమావేశం వచ్చేవారం జరగబోతోంది.

అమెరికాలో పెను తుపాను

17 మంది దుర్మరణం

ఓక్లహోమా సిటీ (యూఎస్): అమెరికాలో ప్రకృతి ప్రకోపించి 17 మంది ప్రాణాలను బలితీసుకుంది. కొన్ని రాష్ట్రాలు పెను తుపాను బారినపడితే మరికొన్ని చోట్ల టోర్నడోలు విజృంభించాయి. మరికొన్ని చోట్ల కార్చిచ్చు ఘటనలు స్థానికులను కకావికలం చేస్తున్నాయి. మిస్సోరీ రాష్ట్రంలో టోర్నడో కారణంగా 11 మంది చనిపోయారు. పలువురు గాయపడ్డారు. శుక్రవారం రాత్రి అర్కాన్సాస్‌లో ముగ్గురు, టెక్సాస్‌లో సిటీలో దుమ్ము తుపాను కారణంగా జరిగిన ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు.

మయన్మార్‌లో సైన్యం దాడి..

30 మంది మృతి

బ్యాంకాక్: మయన్మార్‌లోని సైనిక ప్రభుత్వం ప్రజాస్వామ్య అనుకూల రెసిస్టెన్స్ గ్రూప్‌పై జరిపిన వైమానిక దాడిలో కనీసం 30 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 30 మంది వరకు గాయపడ్డారు. వీరిలో ఏడుగురి పరిస్థితి విషమంగా ఉంది. దేశంలోని రెండో అతి పెద్ద నగరం మాండలేకు 65 కిలోమీటర్ల దూరంలో ఉన్న సింగు టౌన్‌షిప్ సమీప లెట్ పన్ హ్లా గ్రామంపై శుక్రవారం సాయంత్రం ఈ వైమానిక దాడి జరిగిందని ప్రతిపక్షాలకు చెందిన ఆన్‌లైన్ మీడియా వెల్లడించింది. మృతుల్లో చిన్నారులు కూడా ఉన్నట్లు సమాచారం. మార్కెట్ వద్ద జరిగిన దాడిలో 10 నివాసాలు నేలమట్టమయ్యాయని తెలిసింది.

అస్సాంలో అశాంతికి కాంగ్రెసే కారణం

ప్రధాని మోదీ హయాంలో శాంతి, అభివృద్ధి ● హోం మంత్రి అమిత్ షా వెల్లడి

దెర్‌గావ్‌/జ్వాల్: అస్సాంలో శాంతియుత వాతావరణం నెలకొల్పి, మౌలిక వనరులను అభివృద్ధి చేసింది ప్రధాని మోదీయేనని హోం మంత్రి అమిత్ షా చెప్పారు. యువతకు ఉపాధి అవకాశాలను కల్పించిందని తెలిపారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు రాష్ట్రంలో శాంతి నెలకొనకుండా అడ్డుకున్నాయని ఆయన ఆరోపించారు. అప్పట్లో రాష్ట్రానికి ఎటువంటి గ్రాంట్లు అందకపోవడంతో ఆందోళనలు, హింసాత్మక కార్యక్రమాలకు, వెనుకబాటుకు మారుపేరుగా మారిందని విమర్శించారు. శనివారం మంత్రి అమిత్ షా గోలాఘాట్ జిల్లా దెర్‌గావ్‌లోని లచిత్ బార్‌ఫుకాన్ పోలీస్ అకాడెమీ పునరుద్ధరణ మొదటి దశ పనులను ప్రారంభించడంతోపాటు రెండో దశ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'అస్సాంలో 10 వేల మందికి పైగా యువకులు ఆయుధాలు వదిలేసి జనజీవన స్రవంతిలో కలిశారు. దీంతో గత పదేళ్లుగా రాష్ట్రంలో శాంతి నెలకొంది. ఆందోళనలు, హింస, వేర్పాటువాదానికి పేరున్న అస్సాంలో నేడు రూ.27 వేల కోట్లకు పైగా పెట్టుబడితో అత్యాధునిక సెమీ కండక్టర్ పరిశ్రమ నడుస్తోంది. ఇది అస్సాం భవిష్యత్తునే మార్చనుంది'అని అన్నారు. ఇటీవల ముగిసిన అడ్వాంటేజ్ అస్సాం 2.0లో మరో రూ.3 లక్షల కోట్ల విలువైన పెట్టుబడుల ప్రతిపాదనలు అందాయి. ఇవి ఏర్పాటైతే యువతకు ఎన్నో అవకాశాలు అందుబాటులోకి వస్తాయి'అని మంత్రి చెప్పారు. మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్‌లతో ఉన్న సరిహద్దు వివాదాలను పరిష్కరించామన్నారు. విద్యార్థిగా ఉండగా అస్సాంకు వచ్చినప్పుడు జరిగిన పరిణామాలను ఆయన గుర్తు చేసుకుంటూ.. 'అప్పట్లో కాంగ్రెస్ నేత హితేశ్వర్ సైకియా సీఎంగా ఉండేవారు. ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి చేశారు. అరెస్టయిన వారిలో నేనూ ఉన్నా. అస్సాం జైలులో వారం పాటు నన్ను ఉంచారు'అని తెలిపారు. అప్పటి కాంగ్రెస్ హయాంతో, ఇప్పటి బీజేపీ పాలనతో పోల్చుకుంటే అస్సాంలో గుర్తు పట్టలేనన్ని మార్పులు సంభవించాయన్నారు. వచ్చే ఐదేళ్లలో లచిత్ బార్‌ఫుకాన్ పోలీస్ అకాడెమీ దేశంలోనే అగ్రగామిగా మారనుందని చెప్పారు. అనంతరం అమిత్ షా మిజోరం రాజధాని ఐజ్వాల్‌లో అస్సాం రైఫిల్స్ క్యాంప్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. మిజోరంలో అభివృద్ధి పనుల పురోగతిపై స్వయంగా ప్రధాని మోదీయే సమీక్ష చేస్తున్నారని ఆయన అన్నారు. అస్సాం రైఫిల్స్ క్యాంప్‌ను ఐజ్వాల్ వెలుపలికి మార్చడం కీలక పరిణామంగా పేర్కొన్నారు. మిజో ప్రజల అభీష్టానికి అనుగుణంగా కేంద్రం పనిచేస్తుందనడానికి ఇదే ఉదాహరణ అని ఆయన తెలిపారు. 2014కు పూర్వం ప్రధానమంత్రులంతా కలిసి ఈశాన్య రాష్ట్రాలకు వచ్చింది 21 సార్లు మాత్రమే రాగా, ప్రధాని మోదీ ఈ ప్రాంతంలో 78 పర్యాయాలు పర్యటించారని అమిత్ షా చెప్పారు.



ప్రభుత్వ టెండర్లలో ముస్లింలకు

4 శాతం కోటా

కేటీపీపీ చట్ట సవరణకు కర్ణాటక కేబినెట్ అంగీకారం

బెంగళూరు/న్యూఢిల్లీ: కర్ణాటక మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ టెండర్లలో ముస్లిం కాంట్రాక్టర్లకు 4 శాతం కోటా కల్పించాలని నిర్ణయించింది. ఇందుకోసం కర్ణాటక ట్రాన్స్‌పరెన్సీ ఇన్ పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్(కేటీపీపీ) చట్టంలో సవరణ చేయడానికి అంగీకారం తెలియజేసింది. ఈ చట్ట సవరణతో ప్రభుత్వ కాంట్రాక్టుల్లో 4 శాతం పనులు ముస్లింలకే లభిస్తాయని అధికార వర్గాలు వెల్లడించాయి. కర్ణాటక మంత్రివర్గం శుక్రవారం సమావేశమైంది. కర్ణాటక గ్రామ స్వరాజ్, పంచాయతీరాజ్ (సవరణ) బిల్లుకు ఆమోదం తెలిపింది. దీనిప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో అనధికారిక ఆస్తులకు 'బి'ఖాతాలు కేటాయిస్తారు. ఇలాంటి ఆస్తుల సంఖ్య 90 లక్షల వరకు ఉండొచ్చని అంచనా. రాష్ట్ర పబ్లిక్ సర్వీసు కమిషన్(కేపీఎస్సీ)లో చేపట్టాల్సిన సంస్కరణలపై కేబినెట్ భేటీలో చర్చించారు.

ముస్లింలకు కోటా రాజ్యాంగ విరుద్ధం: బీజేపీ

ప్రభుత్వ కాంట్రాక్టుల్లో ముస్లింలకు 4 శాతం కోటా కేటాయిస్తూ కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి రవిశంకర్ ప్రసాద్ శనివారం ఆగ్రహం వ్యక్తంచేశారు. ముస్లింలకు కోటా ఇవ్వడం రాజ్యాంగవిరుద్ధమని తేల్చిచెప్పారు.

214 మందిని చంపేశాం

బలూచిస్తాన్ మిలిటెంట్ల ప్రకటన

ఇస్లామాబాద్: తాము హైజాక్ చేసిన జాఫర్ ఎక్స్‌ప్రెస్‌లోని 214 మందిని చంపేశామని బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ(బీఎల్ఏ) మిలిటెంట్లు ప్రకటించారు. మృతుల్లో పాకిస్తాన్ సైనికులతోపాటు సాధారణ ప్రయాణికులు ఉన్నట్లు వెల్లడించారు. పాక్ జైళ్లలో ఖైదీలుగా ఉన్న తమ సహచరులను విడుదల చేయాలంటూ ప్రభుత్వానికి ఇచ్చిన 48 గంటల గడువు శుక్రవారంతో ముగిసినట్లు పేర్కొన్నారు. వారి విడుదల విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూల స్పందన రాకపోవడంతో తమ వద్ద బందీలుగా ఉన్న 214 మందిని అంతం చేసినట్లు తెలియజేశారు. అయితే, దీనికి వారు ఎలాంటి ఆధారాలు చూపలేదు. క్వెట్టా నుంచి పెషావర్ వెళ్తున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలును బీఎల్ఏ మిలిటెంట్లు మంగళవారం హైజాక్ చేసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో రైలులో 440 మంది ప్రయాణికులు ఉన్నారు. మిలిటెంట్ల దాడిలో 21 మంది పౌరులు, నలుగురు సైనికులు మరణించినట్లు తొలుత వార్తలొచ్చాయి. రైలును హైజాక్ చేసిన మిలిటెంట్లందరినీ హతమార్చి ప్రయాణికులను విడుదల చేసినట్టు పాక్ సైన్యం వెల్లడించింది. అయితే, సైన్యం ప్రకటనను మిలిటెంట్లు కొట్టిపారేశారు. కాల్పులు కొనసాగుతూనే ఉన్నాయని స్పష్టంచేశారు. మరోవైపు పాకిస్తాన్ సైనిక ప్రతినిధి అహ్మద్ షరీఫ్ చౌదరి స్పందిస్తూ... 33 మంది మిలిటెంట్లను అంతం చేశామని, 354 మంది ప్రయాణికులను రక్షించామని చెప్పారు. మిలిటెంట్ల దాడిలో 23 మంది సైనికులు, ముగ్గురు రైల్వే ఉద్యోగులు, ఐదుగురు ప్రయాణికులు.. మొత్తం 31 మంది మృతిచెందారని వివరించారు.

ఐఎస్ కీలక నేత హతం

ఇరాక్ ప్రధాని వెల్లడి

బాగ్దాద్: ఉగ్ర సంస్థ ఇస్లామిక్ స్టేట్(ఐఎస్) ఇరాక్, సిరియా చీఫ్‌ను మట్టుబెట్టామని ఇరాక్ ప్రధాన మంత్రి మహ్మద్ షియా అల్–సుడానీ ప్రకటించారు. అమెరికా సారథ్యంలోని మిత్ర దేశాల బలగాల సాయంతో ఇరాక్ నేషనల్ ఇంటెలిజెన్స్ సభ్యులు జరిపిన ఆపరేషన్‌లో అబ్దుల్లా మకీ మొస్లెహ్ అల్–రిఫయ్ అలియాస్ అబూ ఖదీజా హతమయ్యాడని ఆయన శుక్రవారం 'ఎక్స్'లో తెలిపారు. ఇరాక్ మాత్రమే కాదు ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన ఉగ్రవాదుల్లో ఇతడొకడని తెలిపారు. దీనిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. ఇరాక్ ప్రభుత్వం, స్థానిక కుర్దిష్ ప్రభుత్వం సహకారంతో తమ బలగాలు అలుపెరగకుండా కొనసాగించిన వేటలో ఐఎస్ నేత హతమైనట్లు ఆయన పేర్కొన్నారు.కాగా, ఇరాక్ పశ్చిమ ప్రాంతంలోని అన్బార్ ప్రావిన్స్‌లో గురువారం రాత్రి జరిపిన వైమానిక దాడిలో అల్–రిఫయ్ హతమైనట్లు అధికారులు శుక్రవారం ధ్రువీకరించారు. ఐఎస్ అంతమే లక్ష్యంగా ఇరాక్, సిరాయా, జోర్డాన్, లెబనాన్, తుర్కియేలు కలిసి అమ్మాన్‌లో ఏర్పాటు చేసిన ఆపరేషన్స్ రూం త్వరలోనే పని ప్రారంభించనుందని ఇరాక్ ప్రకటించింది.

సాక్షి హైదరాబాద్

ఆదివారం । 16 । మార్చి । 2025



57 కిలోల గంజాయి పట్టివేత

గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని సికింద్రాబాద్ జీఆర్‌పీ, నార్కోటిక్ పోలీసులు పట్టుకున్నారు. 57 కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. -8లో




నడక 'యోగం'

నడక, యోగా రెండూ దేనికవే ప్రత్యేకం. ప్రస్తుతం ఈ రెండింటినీ మిళితం చేసిన సరి కొత్త వ్యాయామంగా అందుబాటులోకి వచ్చింది వాకింగ్ యోగా. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 38.0/24.0

నగరంలో ఆదివారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్ఠంగా 38, కనిష్ఠంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయి.



బేగంపేటకు ఆధునిక హంగులు



స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఎస్కలేటర్



అందంగా రూపుదిద్దుకున్న బేగంపేట రైల్వేస్టేషన్ ముఖ ద్వారం



ప్రయాణికుల కోసం లిఫ్ట్

- సరికొత్త రూపాన్ని సంతరించుకున్న రైల్వే స్టేషన్
- తొలి దశలో రూ.26 కోట్లతో అభివృద్ధి
- 95 శాతం పనులు పూర్తి..
- త్వరలో రెండో ఫేజ్‌కు శ్రీకారం
- అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా..

సనత్‌నగర్: బేగంపేట రైల్వేస్టేషన్ సరికొత్త రూపును సంతరించుకుంది. ఆధునిక హంగులతో.. అంతర్జాతీయ ప్రమాణాలను అద్దుకుంది. 'అమృత్ స్టేషన్' పథకం కింద మొత్తం రూ.38 కోట్లతో బేగంపేట రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను గత ఏడాది ఫిబ్రవరి 26న ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. రూ.26 కోట్ల వ్యయంతో ప్రారంభమైన మొదటి ఫేజ్ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఇప్పుడు బ్రాహ్మణవాడీ వైపు నుంచి చూస్తే ఇది బేగంపేట రైల్వేస్టేషనేనా? అనే రీతిలో కనువిందు చేసేలా ముఖద్వారాన్ని అందంగా తీర్చిదిద్దారు. రైల్వే స్టేషన్ ప్రాంగణంలోకి అడుగుపెట్టే ముందే రాష్ట్ర పక్షి పాలపిట్టల బొమ్మలు ప్రయాణికులను ఆకట్టుకుంటాయి. రైల్వేసేషన్ లోపలికి వెళ్లక ముందే బయట ప్రకృతి అందాలతో మైమరిపించే రీతిలో తీర్చిదిద్దుతున్నారు. ప్రాంగణంలో ఉన్న రాక్‌ను అందమైన ఫౌంటెన్‌గా మలిచి పచ్చటి లాన్‌లతో ప్రకృతి ప్రేమికులు మంత్రముగ్ధులయ్యే విధంగా అభివృద్ధి చేస్తున్నారు.

ప్రయాణికులకు సకల వసతులు..

ఎస్కలేటర్లు, ర్యాంప్‌లు, లిఫ్టులు, చూడముచ్చటగా తీర్చిదిద్దిన వెయిటింగ్ హాల్, రైళ్ల సమాచారాన్ని ప్రయాణికులు ప్రత్యక్షంగా చూసుకునేలా వివరాల డిస్‌ప్లే, రద్దీకి అనుగుణంగా టికెట్ కౌంటర్ల నిర్మాణం, స్టేషన్‌లో ఏ సేవలు ఎక్కడున్న విషయాలను సులభంగా తెలుసుకునేలా ఎల్ఈడీ సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. స్టేషన్ ప్రాంగణాన్ని ఆహ్లాదంగా తీర్చిదిద్దే పనులు కొనసాగుతున్నాయి. రైల్వే స్టేషన్‌ను అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా తీర్చిదిద్దారు. మొదటి ఫేజ్ కింద రైల్వేస్టేషన్‌కు ఒకవైపు చేపట్టిన అభివృద్ధి పనులు 95 శాతం పూర్తయ్యాయి. త్వరలో మరో 5 శాతం పనులు కూడా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురానున్నారు. ఆ తర్వాత రెండో ఫేజ్‌లో మరోవైపు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు.

తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే..

- చార్మినార్ భాగ్యలక్ష్మి మందిరాన్ని గోల్డెన్ టెంపుల్‌గా మారుస్తాం: అంజిరెడ్డి



చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి తదితరులు

దూద్ బౌలి: తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే చార్మినార్ భాగ్యలక్ష్మి మందిరాన్ని గోల్డెన్ టెంపుల్ తీర్చిదిద్దుతామని ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. ఇటీవల జరిగిన గ్రాడ్యుయేట్స్, ఉపాధ్యాయ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించడంతో శనివారం ఆ పార్టీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో కలిసి చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికార కాంగ్రెస్‌ను కాదని బీజేపీకి పట్టం కట్టిన మేధావులకు తమ విజయాన్ని అంకితం చేస్తున్నట్లు చెప్పారు. భాగ్యలక్ష్మి అమ్మవారి ఆశీస్సులతో గత ఎంపీ ఎన్నికల్లో, ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన 420 హామీల అమలులో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఆ పార్టీ మోసపూరిత మాటలను ప్రజలు గమనిస్తూనే ఉన్నారని, రాబోయే ఎన్నికల్లో బీజేపీకి తెలంగాణలో పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కొమరయ్య, ఎమ్మెల్యేలు కాటిపల్లి వెంకట రమణారెడ్డి, పాయల శంకర్, మాజీ ఎమ్మెల్సీ రామచంద్ర రావు, బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు టి.ఉమా మహేందర్, కునాల్ రావు, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో ఆందోళనలపై నిషేధం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఆందోళనలు, ధర్నాలు, నిరసన ర్యాలీలు, నినాదాలు తదితర కార్యక్రమాలపై నిషేధం విధిస్తూ అధికారులు సర్క్యులర్ జారీ చేశారు. యూనివర్సిటీ క్యాంపస్‌లో విద్యా వాతావరణం నెలకొల్పేందుకు, ఆందోళనల పేరుతో బోధన, పరిశోధనలకు విఘాతం తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు రిజిస్ట్రార్ ప్రొ.నరేష్ రెడ్డి పేర్కొన్నారు.

మేధావులు నోరు విప్పాలి..

ఓయూలో ఆందోళనలపై విధించిన నిషేధాజ్ఞలపై మేధావులు, విద్యావేత్తలు నోరు విప్పాలని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకులు చటారి దశరథ్, జంగయ్య, ఏబీవీపీ నాయకులు అలివేలి రాజు తదితరులు డిమాండ్ చేశారు. ఓయూ అధికారుల తీరు అప్రజాస్వామికమన్నారు. ఓయూ వీసీ ప్రొ. కుమార్ అనాలోచిత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పర్మిషన్ పరేషాన్

హెచ్‌ఎండీఏ విస్తరణతో డీటీసీపీకి బ్రేక్

- లే అవుట్‌లు, నిర్మాణ రంగంపై సందిగ్ధం
- విస్తరణ జీఓ వెల్లడితో అంతా గందరగోళం
- సమగ్ర మాస్టర్‌ప్లాన్ లేకుండా అనుమతులు కష్టమే

సాక్షి, సిటీబ్యూరో: ఎలాంటి ముందస్తు ప్రణాళికలు లేకుండా, సమగ్రమైన మాస్టర్ ప్లాన్‌ను రూపొందించకుండానే ఆగమేఘాల మీద హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ)ను ట్రిపుల్ ఆర్ వరకు విస్తరిస్తూ తెచ్చిన జీఓ.. రియల్ ఎస్టేట్ రంగాన్ని కుదేలు చేసేలా మారింది. నిర్మాణ రంగం కూడా మరింత బలహీన పడే పరిస్థితి నెలకొంది. ఇంచుమించు ఏడాదిన్నరగా చతికిల పడ్డ 'రియల్ భూమ్'ను ఇది మరింత భూస్థాపితం చేసేలా మారిందని నిర్మాణరంగ నిపుణులు భావిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించినప్పటి నుంచి రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల నుంచే ప్రభుత్వ ఖజానాకు అత్యధిక ఆదాయం లభించింది. నగరం చుట్టుపక్కల ఉన్న భూములు బంగారం కంటే ప్రియంగా మారాయి. అపార్ట్‌మెంట్‌లు, బహుళ అంతస్తుల భవనాలు పెద్ద ఎత్తున ఏర్పాటయ్యాయి. హెచ్ఎండీఏ భూములకు సైతం భారీ డిమాండ్ వచ్చింది. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో ఎక్కడ హెచ్ఎండీఏ భూములను అమ్మకానికి పెట్టినా రూ.వందల కోట్ల ఆదాయం లభించింది. కానీ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత చోటుచేసుకుంటున్న పరిణామాలతో రియల్ రంగం వెనుకంజ వేసింది. ఈ క్రమంలో హెచ్ఎండీఏ విస్తరణతో తిరిగి కొంత రియల్ భూమ్ రావచ్చని మొదట్లో భావించారు. కానీ.. ఏ విధమైన ప్రణాళికలు, విధి విధానాలు లేకుండానే ఆకస్మికంగా జీఓ తేవడంతో అనుమతులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. ముఖ్యంగా ఇప్పటి వరకు డైరెక్టరేట్ ఆఫ్ టౌన్‌ప్లానింగ్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డీటీసీపీ) నుంచి లభించే అనుమతులకు తాజాగా బ్రేక్ పడింది. దీంతో తీవ్ర గందరగోళం నెలకొంది.

అనుమతులు ఇచ్చేదెవరు?

ఇప్పటికే డీటీసీపీ పరిధిలో భూములు కొనుగోలు చేసి లేఅవుట్ అనుమతుల కోసం ఎదురుచూస్తున్న రియల్టర్లకు ఎలాంటి సమాధానం లభించడం లేదు. ప్రస్తుతం లే అవుట్ అనుమతుల అంశం తమ పరిధిలో లేదంటూ డీటీసీపీ అధికారులు చేతులెత్తేస్తున్నారు. దీంతో వివిధ ప్రాంతాలకు చెందిన నిర్మాణదారులు రెండు, మూడు రోజులుగా హెచ్ఎండీఏకు తరలి వస్తున్నారు. కానీ.. హెచ్ఎండీఏలో సైతం చుక్కెదురే కావడం గమనార్హం. ట్రిపుల్ ఆర్ వరకు తమ పరిధి పెరిగినప్పటికీ ఇంకా ఎలాంటి విధివిధానాలు రాలేదని చెబుతున్నారు. మరోవైపు కొత్త మాస్టర్‌ప్లాన్ వస్తే తాము అనుమతులు ఇవ్వలేమంటున్నారు. దీంతో రియల్టర్లు, వ్యాపార వర్గాలు, ఆర్కిటెక్టర్లు తదితర వర్గాలు ఆందోళనకు గురవుతున్నాయి. 'అనుమతుల కోసం కొంత కాలం ఆగాల్సిందేనంటున్నారు. కానీ.. ఎంతకాలం అనే దానిపై స్పష్టత లేకుండా పోయింది. పైగా మాస్టర్ ప్లాన్ లేకుండా అనుమతులను ఇవ్వడం కూడా సాధ్యం కాదు. రియల్ ఎస్టేట్ వ్యాపారానికి ఇది నష్టదాయకంగా మారింది' అని కందుకూరు ప్రాంతానికి చెందిన రియల్టర్ ఒకరు విస్మయం వ్యక్తం చేశారు. మరోవైపు బ్యాంకుల నుంచి, ఇతరత్రా రుణాలు తీసుకుని భూములు కొనుగోలు చేసిన వ్యాపారుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది.

మాస్టర్‌ప్లాన్‌కు మరో ఏడాది..

మొత్తం తెలంగాణ ప్రాంతాన్ని మూడు భాగాలుగా చేసి సమగ్రమైన మాస్టర్ ప్లాన్‌ను రూపొందించేందుకు ప్రభుత్వం ఏడాది క్రితం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఔటర్‌రింగ్ రోడ్డు వరకు కోర్ అర్బన్‌గా, ఔటర్‌రింగ్ రోడ్డు నుంచి రీజనల్ రింగ్ రోడ్డు వరకు సెమీ అర్బన్‌గా, రీజినల్ రింగ్ రోడ్డు నుంచి మిగతా తెలంగాణ అంతా రూరల్‌గా పరిగణిస్తూ రీజినల్ రింగ్ రోడ్డు వరకు ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి కోసం అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా సమగ్రమైన మాస్టర్‌ప్లాన్- 2050ని రూపొందించాల్సి ఉంది. కానీ.. ఈ దిశగా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. మాస్టర్‌ప్లాన్ రూపకల్పన కోసం ఆసక్తి గల అంతర్జాతీయ సంస్థల నుంచి రిక్వెస్ట్ ప్రపోజల్స్‌ను ఆహ్వానించేందుకు త్వరలో నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు హెచ్ఎండీఏ అధికారులు చెప్పారు. ఎంపిక చేసిన సంస్థ పూర్తిగా అధ్యయనం చేసి సమగ్రమైన మాస్టర్‌ప్లాన్‌ను సిద్ధం చేసేందుకు కనీసం ఏడాది సమయం పట్టవచ్చని అంచనా. మాస్టర్ ప్లాన్ సిద్ధమైతే తప్ప హెచ్ఎండీఏ నుంచి అనుమతులు లభించవు. అంటే అప్పటి వరకు ట్రిపుల్ ఆర్ వరకు అన్ని రకాల నిర్మాణాలు, లే అవుట్‌లు, వెంచర్‌లు నిలిచిపోవాల్సిందేనా అనే సందేహం నెలకొంది. ఈ పరిణామం రియల్ ఎస్టేట్ భవిష్యత్‌ను మరోసారి ప్రశ్నార్థకంగా మార్చిందని ఆ రంగానికి చెందిన నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

పరిస్థితి అగమ్యగోచరం..

హైదరాబాద్ విస్తరణ పట్ల ఎలాంటి అభ్యంతరం లేదు. కానీ.. అసలు మాస్టర్‌ప్లాన్ లేకుండానే విస్తరణ జీఓ ఇవ్వడం వల్ల స్పష్టత లేకుండా పోయింది. రియల్ ఎస్టేట్ రంగం పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈ రంగానికే కాదు హైదరాబాద్ అభివృద్ధికి కూడా ఇది నష్టమే.

– సత్యనారాయణ చిట్టి, రియల్ ఎస్టేట్ నిపుణులు



ఆ భవన నిర్మాణ అనుమతి రద్దు

- సెల్లార్‌లో ముగ్గురు కార్మికుల మృతి ఘటనపై జీహెచ్ఎంసీ చర్యలు
- ఆర్కిటెక్ట్, స్ట్రక్చరల్ ఇంజినీర్ లైసెన్సులు రద్దు



ప్రమాదం జరిగిన ప్రాంతం (ఫైల్)

సాక్షి, సిటీబ్యూరో: ఎల్‌బీనగర్ జోన్‌లోని మన్సూరాబాద్‌లో గత నెలలో భవన నిర్మాణ పనుల్లో భాగంగా సెల్లార్ పనులు చేస్తుండగా మట్టిదిబ్బలు మీదపడి ముగ్గురు కార్మికుల మరణానికి కారణమైన భవన నిర్మాణానికి జీహెచ్ఎంసీ అనుమతులు రద్దు చేసింది. సంబంధిత ఆర్కిటెక్ట్, స్ట్రక్చరల్ ఇంజినీర్లపైనా చర్యలు తీసుకుంది. వారి లైసెన్సులు రద్దు చేయడంతో పాటు బ్లాక్‌లిస్టులో ఉంచినట్లు తెలిసింది. ఫిబ్రవరి 5న జరిగిన ఆ ప్రమాదంలో ముగ్గురు కార్మికులు మృతి చెందారు. మరొకరు తీవ్ర గాయాల పాలయ్యారు. విచారణ జరిపిన జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం భవన యజమానితో పాటు మరికొందరికి అప్పుడే షోకాజ్ నోటీసులు జారీ చేసింది. తాజాగా భవన నిర్మాణానికి జారీ చేసిన అనుమతిని రద్దు చేసింది. రెండు సెల్లార్లతో పాటు జీ+ 4 అంతస్తులుగా నిర్మిస్తున్న భవనానికి నిర్మాణ సమయంలో తగిన జాగ్రత్తలు పాటించకపోవడం, నేల జారిపోకుండా అవసరమైన పటిష్ఠత చర్యలు చేపట్టకపోవడం, తగిన సెట్ బ్యాక్‌లు లేకపోవడాన్ని గుర్తించారు. నేల బలహీనంగా ఉన్నా పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించడాన్ని నిర్ధారించారు. అప్పట్లోనే క్రిమినల్ కేసు కూడా నమోదు చేశారు. జీహెచ్ఎంసీ నిబంధనల మేరకు, సెల్లార్ తవ్వకానికి ముందు నిర్మాణదారు సంబంధిత అధికారికి సమాచారమివ్వాల్సి ఉండగా, ఆ పనీ చేయలేదు. ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యల గురించి సంబంధిత సర్కిల్ అధికారి నోటీసు జారీ చేసినా నిర్లక్ష్యం ప్రదర్శించడాన్ని గుర్తించారు. వదులుగా ఉన్న మట్టి దిబ్బలు మీదపడటంతోనే ముగ్గురు కార్మికులు మరణించారు. భవన నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యంతో ప్రజల ప్రాణాలు పోయేందుకు కారణమైన వారిపై జీహెచ్ఎంసీ తగిన చర్యలు తీసుకోవడం ఇటీవల కాలంలో ఇదే కావడం గమనార్హం.

రూ.100 కోట్ల భూమికి ఎసరు!

- నకిలీ డాక్యుమెంట్ల సృష్టి
- అప్రమత్తమైన యంత్రాంగం
- పలువురిపై కేసు నమోదు



ఇది ప్రభుత్వ స్థలమని బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు

కుత్బుల్లాపూర్: దాదాపు రూ.100 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాజేసేందుకు కొందరు అక్రమార్కులు పన్నిన పన్నాగాన్ని అధికారులు గుర్తించారు. స్థలాన్ని కాజేసేందుకు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించిన వ్యక్తులపై పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. కుత్బుల్లాపూర్ మండల పరిధిలోని సర్వేనెంబర్ 48లో యూఎల్‌సీ భూమి 5,800 గజాలు జీడిమెట్ల పేట్ బషీరాబాద్ గ్రామ పరిధిలో ఉన్నట్లు పాత రెవెన్యూ రికార్డులు చెబుతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఓ ఎమ్మెల్సీ ప్రోత్బలంతో కొందరు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి హెచ్ఎండీఏ నుంచి 15 ఫ్లోర్లకు అనుమతులు పొంది నిర్మాణం చేపట్టారు. ఈ విషయాన్ని గుర్తించిన రెవెన్యూ అధికారులు 2001లో అర్బన్ ల్యాండ్ సీలింగ్ అధికారులు నిర్వహించిన సర్వే మ్యాప్‌తో పాటు ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణం పరిశీలించి మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు నివేదించారు. సమగ్ర విచారణ జరిపించి అది యూఎల్‌సీ స్థలమే అని నిర్ధారించారు. వెంటనే అప్రమత్తమైన అధికారులు ఇది ప్రభుత్వ భూమి అంటూ బోర్డు పాతారు. ఈ క్రమంలో రెవెన్యూ అధికారి విజయ్ కుమార్ ఫిర్యాదు మేరకు రతన్ కుమార్, శ్రీనివాసరావు, శేఖర్ బాబు, వెంకట్రావు, సతీష్ బాబులతోపాటు జిష్ణు ఇన్ఫ్రా కన్‌స్ట్రక్షన్స్‌పై కేసు నమోదు చేశారు. ఈ స్థలం విలువ దాదాపు రూ.100 కోట్ల పైగానే ఉంటుందని అంచనా వేశారు. ఎట్టకేలకు రెవెన్యూ అధికారులు సదరు స్థలాన్ని స్వాధీనం చేసుకోవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. . కోట్ల రూపాయల విలువచేసే ఈ స్థలం కబ్జా కాకుండా జిల్లా కలెక్టర్, మండల రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించడంతో ఎట్టకేలకు విలువైన స్థలం ప్రభుత్వ సొంతం అయింది.

పాట్‌హోల్స్ పనుల్లో అవకతవకలు!

విజిలెన్స్ విచారణలో వెల్లడి?

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీలో రెండేళ్ల క్రితం జరిగిన ఇంజినీరింగ్ మెయింటెనెన్స్ పనులపై విచారణ జరిపిన విజిలెన్స్ విభాగం తన నివేదికను కమిషనర్ ఇలంబర్తికి అందజేసినట్లు తెలిసింది. దాదాపు రూ.250 కోట్ల పనులకు సంబంధించి జరిపిన విచారణలో రోడ్ల పాట్‌హోల్స్ పేరిట చేసిన మరమ్మతులు, గణేశ్ నిమజ్జనం సందర్భంగా రోడ్ల మరమ్మతులు, చెరువుల్లో గుర్రపు డెక్క తొలగింపు వంటి పనుల్లో అవకతవకలను గుర్తించినట్లు సమాచారం. తమ బిల్లుల చెల్లింపులకు సంబంధించి కాంట్రాక్టర్లు తరచూ ధర్నాలు చేయడం, ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా ఒకరు కిరోసిన్ పోసుకొని ఆత్మహత్య యత్నానికి పాల్పడటం వంటి ఘటనలు జరిగిన నేపథ్యంలో.. రెండేళ్ల పూర్వం జరిగిన పనులకు సంబంధించిన బిల్లులు సైతం పెండింగ్‌లో ఉండటం, తదితరమైనవి గుర్తించిన కమిషనర్ దాదాపు 20 శాతం పనులను, బిల్లులను తనిఖీ చేయాల్సిందిగా విజిలెన్స్ విభాగానికి సూచించిన నేపథ్యంలో, సదరు విభాగం నివేదికను అందజేసినట్లు తెలిసింది.

శాటిలైట్ ఇమేజింగ్.. నాలాల మ్యాపింగ్



- వరద నీటి సమస్యల పరిష్కారానికి మాస్టర్‌ప్లాన్
- చర్యలు చేపట్టాలని అధికారులకు కమిషనర్ సూచన?

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని నాలాలను శాటిలైట్ ఇమేజింగ్ ఆధారంగా మ్యాపింగ్ చేయడం ద్వారా వర్షాకాలంలో వరద ముంపు సమస్యలను తగ్గించవచ్చని జీహెచ్ఎంసీ భావిస్తోంది. వర్షం వచ్చినప్పుడు నీరు నాలాల్లో చేరినప్పటి నుంచి ఎక్కడి నుంచి వెళ్లి ఎక్కడ కలుస్తుంది వంటి వివరాలు, నీరు నిల్వ ఉండే ప్రాంతాలను కూడా గుర్తించి తగిన నిర్వహణ ద్వారా వరద సమస్యలను పరిష్కరించవచ్చని కమిషనర్ ఇలంబర్తి భావించారు. ఈ మేరకు చర్యలు చేపట్టాల్సిందిగా సంబంధిత అధికారులకు సూచించినట్లు తెలిసింది. వరద సమస్యల పరిష్కారానికి, తగిన నిర్వహణకు నాలాల మాస్టర్‌ప్లాన్ అవసరమని, ఆ దిశగా పని చేయాల్సిందిగా సూచించినట్లు సమాచారం. జీహెచ్ఎంసీ చేపట్టిన జీఐఎస్ సర్వేలోనూ ఇళ్లతో పాటు రోడ్లు, పార్కులు, చెరువులు, నాలాలు, ఆక్రమణలు తదితరమైనవి కూడా నమోదవుతాయి. అందుకు శాటిలైట్, డ్రోన్ సర్వేలు చేశారు. వాటిలోని వివరాలతోనే నాలాలను ప్రత్యేకంగా మ్యాపింగ్ చేయిస్తారా? లేక.. ప్రత్యేకంగా శాటిలైట్ సర్వే చేయిస్తారా? అనేది తెలియాల్సి ఉంది. ప్రస్తుతానికి ఇది ఆలోచన దశలోనే ఉందని, ఎలా చేయాలన్న దానిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉందని సంబంధిత అధికారి తెలిపారు.

నాలా.. ఎన్నాళ్లుగానో..

నగరంలో వరద సమస్యలకు నాలాలు కారణమని దాదాపు రెండున్నర దశాబ్దాల క్రితమే గుర్తించారు. 2000 సంవత్సరంలో భారీ వర్షాలతో నగరం చెరువుగా మారినప్పుడు అందుకు కారణమైన నాలాలపై అధ్యయనం చేసి వరద ముంపు లేకుండా తగిన చర్యలు చేపట్టేందుకు కిర్లోస్కర్ కమిటీని నియమించారు. అది అధ్యయనం చేసి నాలాల విస్తరణకు తగిన సిఫారసులు చేసింది. కానీ.. ఆ సిఫారసుల్లో కొన్నింటిని అమలు చేసిన అధికారులు.. తర్వాత జీహెచ్ఎంసీ ఏరియా మొత్తానికని వాయెంట్స్ సొల్యూషన్స్‌తో సర్వే చేయించారు. దాని సిఫారసులూ అమలు చేయలేదు. వాటిని అమలు చేయాలంటే వేల కోట్ల నిధులతో పాటు వేల సంఖ్యలో ప్రజల ఇళ్లను తొలగించాల్సి ఉంటుందని భావించి పనులు చేయలేదు.

క్షేత్రస్థాయి అధ్యయనంతో మాస్టర్ ప్లాన్

అనంతరం జేఎన్‌టీయూ నిపుణులతో వరద నివారణ కోసం మరో సర్వే జరిపించారు. భూగర్భం నుంచే వరద నీరు పోయేలా దాన్ని అమలు చేయాలన్నా వేల కోట్లు కావాలనే దాన్నీ అమలు చేయలేదు. ఎస్ఎన్‌డీపీ పేరిట ఆస్తి నష్టం వాటిల్లకుండా, నాలాల ఆధునికీకరణ చేపట్టి దాదాపు రూ. 950 కోట్ల మేర పనులు చేశారు. కిర్లోస్కర్, వాయెంట్స్ సిఫార్సులను కూడా పరిగణనలోకి తీసుకునే ఎస్ఎన్‌డీపీ పనులు చేసినట్లు ఇంజినీర్లు చెబుతున్నారు. తిరిగి ఇప్పుడు వానొస్తే నీరు ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్తుంది? నాలాల నుంచి వెళ్లి ఎక్కడ కలుస్తుంది? తదితర వివరాలు తెలుసుకునేందుకు నాలాల మ్యాపింగ్, క్షేత్రస్థాయి అధ్యయనంతో మాస్టర్‌ప్లాన్ అవసరమని కమిషనర్ భావిస్తున్నట్లు తెలిసింది.

మద్యం మత్తులో యాసిడ్ తాగి వృద్ధుడి మృతి

శంషాబాద్ రూరల్: మద్యం తాగిన మత్తులో ఓ వృద్ధుడు యాసిడ్ తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. నర్కూడ వాసి ఆనంద్ చారి(62) ఈ నెల 14న హోలీ ఆడి సాయంత్రం మద్యం తాగి ఇంటికి వచ్చాడు. రాత్రి తాగిన మత్తులో బాత్రూంలోకి వెళ్లి అక్కడ ఉన్న యాసిడ్ తాగి బయటకు వచ్చాడు. గమనించిన భార్య లక్ష్మి.. వెంటనే అతన్ని శంషాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి..అక్కడి నుంచి ఉస్మానియా తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

అంబులెన్స్ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

సాక్షి, సిటీబ్యూరో: అంబులెన్స్‌లు ప్రాణాలను రక్షించే వాహనాలని, వాటిని దుర్వినియోగం చేయకూడదని రవాణా శాఖ సంయుక్త కమిషనర్ సి.రమేష్ అన్నారు. పన్నులు చెల్లించకుండా, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు లేకుండా అంబులెన్స్‌లు రోడ్లపై తిరుగుతున్నాయని అన్నారు. ఈ పద్ధతులు మారకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులతో కలిసి ఆసుపత్రుల యాజమాన్యాలు, ప్రైవేట్ అంబులెన్స్ ఏజెన్సీలు, డయాగ్నోస్టిక్స్ సెంటర్ల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయెల్ డేవిస్ మాట్లాడుతూ.. అంబులెన్స్ డ్రైవర్లు ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడుతుండటం ఆందోళనకరమైన అంశమని చెప్పారు. ఆసుపత్రులు, అంబులెన్స్ ఏజెన్సీలు డ్రైవర్లు ఉద్యోగానికి వెళ్లేముందు విధిగా బ్రీత్ అనలైజర్లతో డ్రంకెన్ డ్రైవ్ (డీడీ) పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఆసుపత్రి యాజమాన్యం, అంబులెన్స్ ఏజెన్సీలు, డ్రైవర్లు, ట్రాఫిక్ పోలీసులతో కలిసి వర్కింగ్ గ్రూప్‌ను ఏర్పాటు చేసుకోవాలని, దీంతో కార్యకలాపాలు మరింత క్రమబద్ధీకరణ అవుతాయని సూచించారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ డీసీపీలు రాహుల్ హెగ్డే, వెంకటేశ్వర్లు, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య

పోచారం: ప్రేమించిన యువతి దూరమవడంతో మద్యానికి బానిసైన యువకుడు చివరకు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో చోటు చేసుకుంది. సీఐ రాజు తెలిపిన ప్రకారం.. అన్నోజిగూడలోని రాజీవ్ గృహకల్ప కాలనీకి చెందిన బండారి సాయి ప్రసాద్ (24) పెయింటింగ్ పనులు చేస్తూ గతంలో ఓ యువతిని ప్రేమించాడు. కొద్ది కాలం తర్వాత ఆమెకు వేరే వ్యక్తితో వివాహమైంది. అప్పటి నుండి సాయిప్రసాద్ మద్యానికి బానిసయ్యాడు. తల్లి మందలించినా అతనిలో ఏమాత్రం మార్పు రాలేదు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. ఎప్పటిలాగే తల్లి మందలించింది. అనంతరం రాత్రి 8 గంటలకు బెడ్‌రూమ్‌లోకి వెళ్లి పడుకున్నాడు. తల్లి మరో గదిలో పడుకుంది. అదే రాత్రి 9 గంటల సమయంలో తల్లి నిద్రలేచి బాత్‌రూమ్‌కు వెళ్లేందుకు తలుపు తెరిస్తే సాయిప్రసాద్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని వేలాడుతూ కన్పించాడు. వెంటనే అతన్ని కిందకు దించి, ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. ప్రేమ విఫలమవడంతోనే తన కొడుకు ఆత్మహత్యకు పాల్పడినట్లు తల్లి బండారు లక్ష్మీకుమారి పోలీసులకు చెప్పారు. కేసు దర్యాప్తులో ఉంది.

కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో 57 కిలోల గంజాయి పట్టివేత

ఇరువురు నిందితుల రిమాండ్



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ జావేద్

సికింద్రాబాద్: ఒడిశా నుంచి దాదర్‌కు గంజాయి రవాణా చేస్తున్న ఇరువురు వ్యక్తులను సికింద్రాబాద్ జీఆర్పీ, నార్కోటిక్ పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి రూ.28.50 లక్షల విలువ చేసే 57 కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రవాణా తీరును శనివారం రైల్వే డీఎస్పీ ఎస్ఎన్ జావెద్ విలేకరులకు వెల్లడించారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ఈనెల 14న జీఆర్పీ, నార్కోటిక్ పోలీసులు సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా..10వ నెంబర్ ప్లాట్‌ఫామ్‌పై ఆగిన కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఇరువురు ప్రయాణికులు అనుమానాస్పదంగా కనిపించారు. వారి లగేజీని తనిఖీ చేయగా అందులోంచి 57 కిలోల గంజాయి ప్యాకెట్లు బయట పడ్డాయి. ముంబైకి చెందిన జీవన్ అనే వ్యక్తి అక్కడే టీవీ నటులకు మేకప్ మెన్‌గా పనిచేసే వాడు. ఒడిశాకు చెందిన సుశాంత్‌కుమార్ స్వైన్ (23) ప్రైవేటు ఉద్యోగి, మహారాష్ట్ర విహార్‌వెస్ట్‌కు చెందిన కరణ్ అయ్యప్పన్‌శెట్టి (26) కారు డ్రైవర్. గంజాయికి బానిసైన సుశాంత్ కుమార్, ఆర్థిక సమస్యల్లో ఉన్న కరణ్ అయ్యప్పన్ వేరువేరు సందర్భాల్లో జీవన్‌కు పరిచయం అయ్యారు. తమ ఇబ్బందులను జీవన్‌కు చెప్పుకుని సహాయం అడిగారు. ఆర్థిక సహాయం కావాలని సుశాంత్‌కుమార్, ఉద్యోగం చూపించాలని కరణ్ అయ్యప్ప జీవన్‌ను వేడుకున్నారు. వీరిద్దరికి సహాయం చేస్తానని నమ్మబలికిన జీవన్ ఇరువురిని బెర్హంపూర్‌కు రప్పించి అక్కడ ఒక లాడ్జిలో బస ఏర్పాటు చేశాడు. నాలుగు రోజులు బస చేసిన అనంతరం గంజాయి రవాణా ప్రణాళికను ఇరువురికి వివరించాడు. ఒడిశా నుంచి గంజాయి రవాణా చేయడం ద్వారా పెద్దమొత్తంలో డబ్బు వస్తుందని, ముగ్గురం సమానంగా పంచుకుందామని చెప్పడంతో అప్పటికే మాదక ద్రవ్యాల వినియోగం, క్రికెట్ బెట్టింగులతో ఆర్థికంగా చితికిపోయి ఇబ్బందుల్లో ఉన్న సుశాంత్ కుమార్, కరణ్ అయ్యప్పన్ చేతులు కలిపారు. లాడ్జి నుంచి అటవీ ప్రాంతానికి వెళ్లి అక్కడ ఒక వ్యక్తి నుంచి గంజాయిని స్వీకరించారు. 28 ప్యాకెట్ల గంజాయిని మూడు ట్రాలీ సూట్‌కేసుల్లో భర్తీ చేసుకుని కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో ముగ్గురు కలిసి బయలుదేరారు. సుశాంత్‌కుమార్, కరణ్ అయ్యప్పన్ జనరల్ బోగీలో నిద్రపోయారు. రైలు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంటున్న సందర్భంలో పోలీసుల సోదాలను పసిగట్టిన జీవన్ బోగీ నుంచి తప్పించుకుని పారిపోగా మిగతా ఇరువురు పోలీసులకు పట్టుబడ్డారు. కేసు నమోదు చేసుకుని జీవన్ కోసం గాలిస్తున్నారు. పోలీసులు సుశాంత్‌కుమార్, కరణ్ అయ్యప్పన్‌లను రిమాండ్‌కు తరలించారు.

లారీ ఢీకొని ద్విచక్ర వాహనదారుడి మృతి


ప్రమాదానికి కారణమైన లారీ

కేపీహెచ్‌బీకాలనీ: ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఓ వ్యక్తిని వెనుక నుంచి వేగంగా వచ్చిన ట్రాలీ లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హైదర్‌నగర్ వద్ద ప్రధాన రహదారిపై జరిగిన ఈ ప్రమాదం భారీ ట్రాఫిక్ జామ్‌కు దారితీసింది. వివరాల్లోకి వెళితే జీడిమెట్ల ప్రాంతంలోని సుభాష్ నగర్‌లో నివాసం ఉండే ఫిన్నీ రాజన్ (39) చింతల్ వద్ద భార్గవి ఎంటర్ ప్రైజెస్ పేరుతో ఎలక్ట్రికల్ పరికరాల వ్యాపారం చేస్తున్నాడు. శనివారం మియాపూర్ వెళ్లి సుమారు 2.30 గంటల సమయంలో తిరిగి వస్తుండగా హైదర్‌నగర్ వద్దకు రాగానే వెనుక నుంచి వేగంగా వచ్చిన ట్రాలీ లారీ ద్విచక్ర వాహనాన్ని పక్క నుంచి తాకుతూ వెళ్లగా వాహనం నడుపుతున్న ఫిన్నీ రాజన్ లారీ వెనుక చక్రాల కింద పడిపోయాడు. దీంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ వాహనం దిగి పారిపోయినట్లు స్థానికులు తెలిపారు. మృతుడికి భార్య కూతురు ఉన్నారు.

ఆలయ పూజారే సూత్రధారి?

యాసిడ్ దాడి కేసులో నిందితులను గుర్తించిన పోలీసులు!

సైదాబాద్: ఐఎస్ సదన్‌లో కలకలం సృష్టించిన ఆలయంలో ఉద్యోగిపై యాసిడ్ దాడి ఘటనలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. అదే ఆలయంలో పూజారిగా పనిచేస్తున్న వ్యక్తే దాడికి సూత్రధారి అని తెలిసింది. అతని స్నేహితుడైన మరో పూజారి ద్వారా ఈ దాడికి పాల్పడినట్లుగా తెలుస్తోంది. అయితే వివరాలు వెల్లడించడానికి పోలీసులు స్పందించడం లేదు. శుక్రవారం ఆలయంలో విధుల్లో ఉన్న ఎకౌంటెంట్ నర్సింగరావుపై యాసిడ్ దాడి జరిగిన విషయం విదితమే. ఈ ఘటనపై సీసీ టీవీ ఫుటేజ్ ద్వారా విచారణ చేపట్టిన పోలీసులు శనివారం నిందితులను గుర్తించారని తెలుస్తోంది. బాధితుడు నర్సింగరావుతో కొంత కాలంగా ఆలయ పూజారితో విభేదాలు ఉన్నాయని గుర్తించారు. అతను షేక్‌పేటలోని ఒక ఆలయంలో పూజారిగా చేస్తున్న తన స్నేహితుడితో యాసిడ్ దాడి చేయించాడని తెలుస్తోంది. సూత్రధారి, పాత్రధారిలను సైదాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారని సమాచారం. వివరాలు ఆదివారం వెల్లడించే అవకాశం ఉంది.

మోస్ట్ వాంటెడ్ సైబర్ క్రిమినల్ అరెస్టు!

- దుబాయ్‌లో ఉంటూ సైబర్ మోసాలు
- డిజిటల్ అరెస్టు పేరుతో రూ.55 లక్షల మోసం
- నిందితుడు మహ్మద్ జుబేర్‌పై ఎల్ఓసీ జారీ
- శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో అదుపులోకి తీసుకున్న పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: మోస్ట్ వాంటెడ్ సైబర్ క్రిమినల్ మహ్మద్ జుబేర్‌ను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. వివిధ జాతీయ బ్యాంక్‌ల ఖాతాలతో దుబాయ్‌లో ఉంటూ దేశవ్యాప్తంగా సైబర్ మోసాలకు పాల్పడుతున్న కేటుగాడు జుబేర్‌పై ఇప్పటికే హైదరాబాద్ పోలీసులు లుక్ ఔట్ సర్క్యులర్ (ఎల్ఓసీ) జారీ చేశారు. ఈక్రమంలో నిందితుడు జుబేర్ శనివారం రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్జీఐఏ)లో దిగిన వెంటనే విమానాశ్రయ సిబ్బంది సమాచారం మేరకు హైదరాబాద్ పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. న్యాయస్థానంలో హాజరుపరిచిన అనంతరం జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గతేడాది జులైలో ఓ బాధితుడుకి +919256037425 నంబరు నుంచి ఫోన్ చేసి..డిజిటల్ అరెస్టు అంటూ భయపెట్టి రూ.55 లక్షలు కాజేశారు. ఈమేరకు బాధితుడు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు బ్యాంక్ లావాదేవీలు, ఇతరత్రా సాంకేతిక ఆధారాలతో నిందితుడు అహ్మద్ జుబేర్‌గా గుర్తించారు. తన స్నేహితులు మీర్ రజాక్ అలీ అలియాస్ జునైద్, మహ్మద్ సయీద్, జుబేర్, దస్తగిరి షాల నుంచి బ్యాంక్ ఖాతాలను సేకరించి మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. మరో స్నేహితుడు సాదిఖ్‌తో కలిసి దుబాయ్‌లో ఉంటూ సైబర్ మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. ఇప్పటికే సాదిక్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ ముఠాపై దేశవ్యాప్తంగా 124 కేసులు నమోదు కాగా.. తెలంగాణలోనే 23 కేసులు ఉన్నాయి. నిందితుడి నుంచి రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

విశ్వక్సేన్ సోదరి ఇంట్లో చోరీ

ఫిలింనగర్: ఫిలింనగర్ రోడ్డునెంబర్-8లో నివసించే సినీ హీరో విశ్వక్సేన్ సోదరి గదిలో భారీ చోరీ జరిగింది. ఈ మేరకు ఆమె తండ్రి సి.రాజు ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే..రాజు కూతురు మూడో అంతస్తులో ఉంటుంది. తెల్లవారి తన గదిలో వస్తువులు చిందరవందరగా పడి ఉండడం చూసి ఆమె ఆందోళన చెందింది. పరిశీలించగా రెండు బంగారు డైమండ్ ఉంగరాలతో పాటు ఒక హెడ్‌ఫోన్ కనిపించలేదు. దీంతో విషయాన్ని తన తండ్రి దృష్టికి తీసుకువచ్చింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని చేరుకుని క్లూస్ టీం సహాయంతో వేలిముద్రలు సేకరించారు. ఇక్కడి సీసీ ఫుటేజీలను పరిశీలించారు. గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి తెల్లవారుజామున 5.50 గంటల ప్రాంతంలో ఇంటి ముందు బైక్ పార్కు చేసినట్లుగా గుర్తించారు. సదరు వ్యక్తి గేటు తీసుకుని నేరుగా మూడో అంతస్తుకు వెళ్లి వెనుక డోర్ నుంచి బెడ్‌రూమ్‌లోకి వెళ్లి అల్మరాలో నుంచి బంగారు వస్తువులు తస్కరించినట్లుగా గుర్తించారు. సరిగ్గా 20 నిమిషాల్లోనే దొంగిలించిన సొత్తుతో సదరు వ్యక్తి బయటకు రావడం, వెళ్లిపోవడం కూడా సీసీ ఫుటేజీలో నమోదైంది. చోరీకి గురైన బంగారం విలువ రూ.2.20 లక్షలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిలింనగర్ పోలీసులు దొంగ కోసం గాలింపు చేపట్టారు. ఇక్కడి సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. అనుమానితుల కదలికలపై దృష్టి పెట్టారు. పాత నేరస్తుల కదలికలను కూడా గమనిస్తున్నారు. ఇంత ధైర్యంగా గేటు తీసుకుని నేరుగా మూడో అంతస్తుకు వెళ్లడం, దర్జాగా బయటకు వెళ్లిపోవడం చూస్తుంటే ఇది తెలిసిన వారి పని అయి ఉంటుందని భావిస్తున్నారు. ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ దొంగకు రిమాండ్


హాజీ

ఆమనగల్లు: బైక్‌ను చోరీ చేసిన వ్యక్తిని శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఆమనగల్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. మున్సిపల్ పరిధిలోని విఠాయిపల్లి గ్రామానికి చెందిన సబావత్‌వాల్య గత ఏడాది డిసెంబర్‌లో తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ఎదుట పార్క్ చేయగా గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌కు చెందిన హాజీ బైక్‌ను చోరీ చేసినట్లు గుర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకుని, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం హాజీని కోర్టులో హాజరు పర్చి, రిమాండ్‌కు తరలించారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరిట ఘరానా మోసం

గచ్చిబౌలి: సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి నమ్మించి ఫేక్ ఆఫర్ లెటర్లు ఇచ్చిన ఘరానా మోసగాడిని రాయదుర్గం పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ సీహెచ్.వెంకన్న తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా మందమూరు మండలం అయోధ్యనగర్‌కు చెందిన నర్రావుల గోపీ అలియాస్ గోపీరెడ్డి (24) నాలెడ్జి సిటీలోని ఓ ఐటీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. ముగ్గురు నిరుద్యోగుల నుంచి అడ్వాన్స్‌గా రెండున్నర లక్షల తీసుకొని జాబ్ వచ్చిన తరువాత మరో ఐదు లక్షలు ఇవ్వాలని ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఆఫర్ లెటర్ తీసుకొని కంపెనీకి వెళ్లగా ఫేక్ అని తెలియడంతో బాధితులు రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

వెల్డింగ్ సిలిండర్ గ్యాస్‌లీకై.. నిప్పురవ్వలు ఎగసిపడి..

ఆరుగురికి గాయాలు


ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న డీఆర్ఎఫ్ బృందం

మణికొండ: ఐటీ సంస్థలకు నిలయమైన ఓ బహుళ అంతస్తుల టవర్‌లో క్యాంటీన్ ఏర్పాటు పనులు చేస్తున్న క్రమంలో వెల్డింగ్ సిలిండర్ లీకై ..నిప్పురవ్వలు ఎగసిపడి ఆరుగురికి గాయాలయ్యాయి. నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోకాపేటలోని ఘర్ (జీఏఆర్) భవనంలో అనేక ఐటీ సంస్థలు కొనసాగుతున్నాయి. వారికి అనుకూలంగా ఉండేలా గ్రౌండ్ ఫ్లోర్‌లో కొత్తగా క్యాంటీన్ ఏర్పాటు చేసే పనులు చేపట్టారు. శనివారం సాయంత్రం వెల్డింగ్ చేస్తున్న క్రమంలో ఒక్కసారిగా సిలిండర్ నుంచి గ్యాస్ అధికంగా విడుదలై నిప్పు రవ్వలు చెలరేగాయి. దీంతో అక్కడే ఉన్న క్యాంటీన్ యజమాని రాకేష్‌తో పాటు కార్మికులు రిజ్వాన్, అన్వర్ మాలిక్, శివ, ఫరూఖ్ మాలిక్, రాజు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని వెంటనే సమీపంలోని కాంటినెంటల్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అందులో ఒకరికి 50 శాతం, మరొకరికి 40 శాతం, నలుగురికి 30 శాతం కాలిన గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న నార్సింగి ఏసీపీ రమణగౌడ్, వట్టినాగులపల్లి అగ్నిమాపక శాఖ అధికారులు, హైడ్రా డీఆర్ఎఫ్ బృందాలు అక్కడికి చేరుకున్నారు. అయితే అది అగ్ని ప్రమాదం కాదని, వెల్డింగ్ మిషన్ వద్ద గ్యాస్, అగ్గి రవ్వలు అధికంగా రావటంతో ప్రమాదం జరిగిందని ఏసీపీ తెలిపారు.

హజ్ వీసా జారీకి ఏప్రిల్ 18 వరకు గడువు

సాక్షి, సిటీబ్యూరో : హజ్ వీసా జారీకి ఏప్రిల్ 18వ తేదీని తుది గడువుగా సౌదీ అరేబియా హజ్, ఉమ్రా మంత్రిత్వశాఖ నిర్ణయించినట్లు హజ్ ఉమ్రా గ్రూప్ ఆర్గనైజర్స్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ అధ్యక్షుడు అల-హాజ్ మహమ్మద్ అబ్దుల్‌రజాక్ క్వమర్ తెలిపారు. నాంపల్లిలోని మీడియా ప్లస్ ఆడిటోరియంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హజ్ యాత్రికులు గడువులోగా తమ బుకింగ్‌లను తెలంగాణ, ఏపీ ప్రైవేట్ హజ్ గ్రూప్ ఆపరేటర్ల ద్వారా పూర్తి చేసుకోవాలన్నారు. సాధారణంగా హజ్ వీసాలు ఒక వారం ముందు వరకూ జారీ చేస్తారని..అయితే మారిన కొత్త నిబంధనల ప్రకారం నెల ముందే వీసా జారీ చేస్తారని చెప్పారు. సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ సిరాజ్ ఖాన్, ఫహీమ్ దియానీ, మహమ్మద్ అజీముద్దీన్ పాల్గొన్నారు.

ఆస్తి పన్ను సమస్యల పరిష్కార వేదిక



బంజారాహిల్స్: ఆస్తి పన్ను సమస్యల పరిష్కారం కోసం శనివారం జూబ్లీహిల్స్ సర్కిల్–18 కార్యాలయంలో ఆస్తి పన్ను సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆరుగురు తమ ఆస్తి పన్నుకు సంబంధించిన పరిష్కారానికి దరఖాస్తు అందజేశారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఆస్తి పన్ను సమస్యలు, పునః సమీక్ష అభ్యర్థనలు, ఆస్తి పన్ను సవరణలు, కోర్టు కేసుకు సంబంధించిన సమస్యలను తెలియజేశారు. ఆస్తి పన్ను పరిష్కార వేదిక గతనెల 28వ తేదీన ప్రారంభమైంది. ఈ నెల 29 వరకు ప్రతి శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సర్కిల్ కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. ఖైరతాబాద్ సర్కిల్–17 కార్యాలయంలో కూడా ఆస్తి పన్ను పరిష్కార వేదికను నిర్వహించారు.

అన్ని రంగాల్లో రాణిస్తున్న నేటి మహిళలు



ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ బీజేఆర్‌నగర్ బస్తీ మహిళా భవన్‌లో సమాఖ్య–2 లీడర్ మల్లీశ్వరి ఆధ్వర్యంలో శనివారం మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఫిలింనగర్ ప్రభుత్వ పాఠశాలతో పాటు ఫిలింనగర్ మహిళా పోలీస్ స్టేషన్, పారిశుద్ధ్య కార్మికులను మహిళా సమాఖ్య సభ్యులు ఘనంగా సత్కరించారు. మహిళ అంటే ఒకప్పుడు గృహిణి మాత్రమేనని, ఇప్పుడు మహిళలు లేని రంగం లేదని వారు అన్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు కోట రాములమ్మ, యాదగిరి, బాలరాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు.. కిలో టమాటా రూ.11, నల్లవంకాయ 18, పొడుగువంకాయ 18, బెండకాయ 40, పచ్చిమిర్చి 35, బజ్జిమిర్చి 21, క్యాప్సికం 31, కాకరకాయ 45, పందిరి బీర 40, క్యాబేజీ 08, క్యారెట్ 15, దొండకాయ 40, గుండు బీన్సీస్ 45, గింజచిక్కుడు 55, గోకరకాయ 40, కీర 18, బీట్‌రూట్ 15, ఉల్లిగడ్డ 24.

అప్రమత్తంగా ఉండకుంటే అనర్థాలే..

- స్కూళ్లకు విస్తరించిన మాదకద్రవ్యాలు
- పిల్లల దినచర్యను తల్లిదండ్రులు గమనిస్తుండాలి
- ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి
- రాజ్‌భవన్ స్కూల్‌లో అవగాహన సదస్సులో వక్తలు



రాజ్‌భవన్ హైస్కూల్‌లో మాట్లాడుతున్న యాంటీ నార్కోటిక్ డీఎస్పీ నర్సింగరావు

బంజారాహిల్స్: మాదకద్రవ్యాల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని యాంటీ నార్కోటిక్ డీఎస్పీ నర్సింగరావు సూచించారు. సోమాజీగూడలోని రాజ్‌భవన్ ప్రభుత్వ పాఠశాలలో మాదకద్రవ్యాల నివారణ కోసం శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు కొంత సమయాన్ని తమ పిల్లల కోసం కేటాయించి వారి దినచర్యను గమనిస్తూ ఉండాలన్నారు. పాఠశాలల్లో కూడా మాదకద్రవ్యాలు ప్రవేశించడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఇలాంటి విషయాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా మాదకద్రవ్యాలు సరఫరా చేసినట్లు తెలిస్తే 1908 సమాచారం ఇవ్వాలన్నారు. యాంటీ నార్కోటిక్ కో–ఆర్డినేటర్ కళ్యాణి మాట్లాడుతూ ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు మాదకద్రవ్యాల నివారణ కోసం విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, విద్యాశాఖ సెక్టార్ ఆఫీసర్ ఫాతిమా, పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం భూపాల్, ఉపాధ్యాయులు పీర్‌కొండ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల గొంతుకగా మీడియా పనిచేయాలి

ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో ముగిసిన శిక్షణ



మీడియా ప్రతినిధుల శిక్షణ ముగింపులో శశాంక్‌గోయల్

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి (ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ) సంస్థలో వివిధ దేశాలకు చెందిన మీడియా ప్రతినిధుల కోసం రెండు వారాల పాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. భారత ప్రభుత్వ విదేశాంగ మంత్రిత్వ శాఖ ఐటీఈసీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమానికి గయానా, నేపాల్, శ్రీలంక, టాంజానియా, సురినామ్ నుంచి 26 మంది మీడియా ప్రతినిధులు హాజరయ్యారు. ముగింపు వేడుకల్లో శిక్షణ పొందిన ప్రతినిధులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి, ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ డైరెక్టర్ జనరల్ శశాంక్ గోయల్ మాట్లాడుతూ జర్నలిజం.. ప్రజాస్వామ్య సమాజాలకు మూల స్తంభం అన్నారు. ప్రజల గొంతుకగా పనిచేయాలన్నారు. కోర్సు డైరెక్టర్ డాక్టర్ మాధవి రావులపాటి తదితరులు పాల్గొన్నారు.

కరడుగట్టిన మోసగాడి అరెస్టు



జోగడ వంశీకృష్ణ (ఫైల్)

బంజారాహిల్స్: నకిలీ గుర్తింపు కార్డులతో నకిలీ ప్రొఫైల్ సృష్టించడం, ఎన్‌ఆర్‌ఐగా నటిస్తూ మహిళలను వివాహం చేసుకుంటానంటూ నమ్మించి మోసం చేయడంతో పాటు ఆర్థిక నేరాలు, బ్లాక్‌మెయిల్, మనీల్యాండరింగ్ వంటి నేరాలకు పాల్పడుతున్న కరడుగట్టిన మోసగాడిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన జోగడ వంశీకృష్ణ(33) అలియాస్ హర్ష చెరుకురి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో అనేక మోసాలకు పాల్పడుతూ తప్పించుకొని తిరుగుతున్నాడు. మహిళలను లక్ష్యంగా చేసుకుని వివాహ వెబ్‌సైట్లు, సోషల్ మీడియా ప్లాట్‌ఫాంల ద్వారా మోసాలకు పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో జూబ్లీహిల్స్‌కు చెందిన ఓ డాక్టర్‌ను వివాహం చేసుకుంటానని నమ్మించి రూ.10,94,827లను తీసుకుని మోసం చేయడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు వలపన్ని వంశీకృష్ణను అరెస్టు చేశారు. నిందితుడు షాదీ.కామ్, ఇన్‌స్టాగ్రాం, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియాలో నకిలీ గుర్తింపు కార్డులతో నకిలీ ప్రొఫైల్ సృష్టించి నమ్మకం కలిగించి మోసాలకు తెరలేపుతాడు. అలాగే ధనవంతుడైన వ్యాపారవేత్త, ఐటీ నిపుణుడు, ఎన్‌ఆర్‌ఐగా నటిస్తూ వివాహం చేసుకుంటానని నమ్మిస్తాడు. వైద్య అవసరాలు, వ్యాపార నష్టాలు వంటి అత్యవసర పరిస్థితులు అంటూ పెద్ద మొత్తంలో నగదు బదిలీ చేయించుకుంటాడు. బాధితులు తాము మోసపోయామని గ్రహించి డబ్బులు తిరిగి అడిగినప్పుడు వ్యక్తిగత ఫొటోలను ఆన్‌లైన్‌లో పోస్ట్ చేస్తానని బ్లాక్ మెయిలింగ్ చేస్తుంటాడు. మోసపూరితంగా సంపాదించిన డబ్బును అనేక బ్యాంక్ ఖాతాలు, డిజిటల్ చెల్లింపుల యాప్‌ల ద్వారా బదిలీ చేసి ఆన్‌లైన్ బెట్టింగ్, జూదానికి ఉపయోగిస్తుంటాడు. నిందితుడు పలు కేసుల్లో జైలుకు వెళ్లినరాగా మారువేషాల్లో మోసాలు చేస్తున్నాడు. వంశీకృష్ణపై హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ, విజయవాడ, ఖమ్మం ఇతర ప్రాంతాల్లో 20 కంటే ఎక్కువ కేసులు నమోదై ఉన్నాయి. నిందితుడి వద్ద నుంచి రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని పరిశీలించగా అందులో వాట్సాప్ చాట్‌లు, నకిలీ ప్రొఫైల్స్, బాధితులకు సంబంధించిన బ్యాంక్ లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు.

భవిష్యత్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌దే..



మాట్లాడుతున్న డీఈఓ రోహిణి

వెంగళరావునగర్: భవిష్యత్‌లో ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్‌కు ప్రాధాన్యం ఉంటుందని జిల్లా విద్యాశాఖాధికారి రోహిణి అన్నారు. యూసుఫ్‌గూడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌పై శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ ఏఐ ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. ప్రాథమిక స్థాయి నుంచే ఏఐ శిక్షణను ప్రభుత్వం అందిస్తోందన్నారు. ప్రధానోపాధ్యాయురాలు పరమేశ్వరమ్మ, డీఐఓఎస్ శ్రావణ్‌కుమార్, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం శ్రీదేవి, ఇన్‌చార్జి నరసింహ, ఎన్‌సీసీ టీచర్ ప్రభాకర్, టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం మాట నిలబెట్టుకోవాలి



ఫిలింనగర్ మహనీయుల విగ్రహాల వద్ద నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నేతలు



రహమత్‌నగర్‌లో నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఫిలింనగర్: అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు ఇచ్చిన మాట ప్రకారం ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించిన తర్వాతే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ నేతలు శనివారం ఫిలింనగర్‌లోని అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద నిరసన చేపట్టారు. ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి కండె కుమార్ మాదిగ మాట్లాడుతూ మాదిగలు, మాదిగ ఉపకులాలకు జనాభా దామాషా ప్రకారం శాస్త్రీయంగా, సామాజికంగా, షెడ్యూల్ కులాల రిజర్వేషన్లు, వర్గీకరణ బిల్లు చేపట్టి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కొంద్రు శివకుమార్ మాదిగ, జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షులు బొప్పారం వేణుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రహమత్‌నగర్‌లో..

రహమత్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రూప్–1, గ్రూప్–2 నియామకాలను వెంటనే నిలిపి వేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ నాయకులు రహమత్‌నగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం నిరసన చేపట్టారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొంద్రపల్లి శివకుమార్ మాదిగ, జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఇన్‌చార్జి రామకృష్ణ మాదిగ, రహమత్‌నగర్ డివిజన్ సమన్వయకర్త చిన్నా మాదిగ, నాయకులు పరశురామ్ మాదిగ, సోమరాజు మాదిగ, పురుషోత్తం మాదిగ, ప్రేమ్ మాదిగ, బన్ని మాదిగ, భానుప్రకాష్ మాదిగ, త్రిపుల్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



శ్రీనగర్‌కాలనీ: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, పేదలకు తోడుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. ఎర్రగడ్డకు చెందిన లబ్ధిదారుడు రామనర్సయ్యగౌడ్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రిలీజ్ అయిన రూ.38వేల చెక్కును శనివారం అందజేశారు. నేతలు దూడల రవిగౌడ్, యాదగిరియాదవ్ ఉన్నారు.

నగరంలో నేడు

- తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్, హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఉమెన్స్ డేని పురస్కరించుకుని చిక్కడపల్లిలోని త్యాగరాయ గాన సభలో 'జర్నలిజం- మహిళలు-సవాళ్లు'అనే అంశంపై సెమినార్ ఉదయం 10.30 గంటలకు జరుగుతుంది.
- శ్రీ ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ 7వ వార్షికోత్సవం సందర్భంగా మాసబ్ ట్యాంక్‌లోని నఫీజ్ రెసిడెన్సీలో పాత్రికేయులకు సత్కారం, వివిధ రంగాల మహిళలకు శ్రీధాత్రి పురస్కారాల ప్రదానం కార్యక్రమాలు ఉదయం 10.08 గంటలకు జరుగుతుంది.
- ఉయ్ ఆర్ వన్ సొసైటీ ఆధ్వర్యంలో మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమం రెడ్‌హిల్స్‌లోని ఎఫ్‌టీసీసీఐలో ఉదయం 10.30 గంటలకు జరుగుతుంది.
- శ్రీనివాస సమాజ చారిటబుల్ ట్రస్ట్ ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రి సహకారంతో బీకే గూడలోని ట్రస్ట్ పార్థసారథి నివాసం వద్ద ఉదయం 9 గంటలకు వృద్ధుల ఆరోగ్య సంరక్షణ కోసం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తారు.
- షిరిడీ సాయి అష్టాంగ యోగ ఆధ్వర్యంలో యోగ శిక్షణ తరగతులను హస్తినాపురం సెంట్రల్ కాలనీలోని మేజర్ పద్మపాణి ఆచార్య కమ్యూనిటీ హాల్‌లో ఉదయం 5.30 నుంచి ఉదయం 7 గంటల వరకు యోగా గురువు ఇస్మాయిల్ గురూజీ నిర్వహిస్తారు.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

బీమాపై సైబర్ వల

పాలసీలు, పునరుద్ధరణ పేరిట మోసాలు

- డేటా ప్రొవైడర్ల నుంచి పాలసీదారుల సమాచార సేకరణ
- అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేస్తే నిండా మునిగినట్టే..
- సైబర్ క్రైమ్ ఠాణాల్లో పెరుగుతున్న ఈ తరహా కేసులు



సాక్షి, సిటీబ్యూరో: మీ ఫోన్‌కు ఇన్సూరెన్స్ పాలసీలు, రెన్యూవల్ పేరుతో సందేశాలు వచ్చిపడుతున్నాయా.. ఫోన్ కాల్స్, లింకులు వస్తున్నాయా.. అయితే జాగ్రత్త! ఇది సైబర్ దొంగల పనికావచ్చు!. ఏమరుపాటున వాటికి స్పందించారో.. ఇక అంతే! పార్ట్ టైం జాబ్‌ల పేరిట గృహిణులు, నిరుద్యోగులను, అధిక వడ్డీల ఆశ చూపి ఉద్యోగులను, పెట్టుబడిదారులను, యాత్రలు, రాయితీలని చెప్పి వృద్ధులు, రిటైర్డ్ ఉద్యోగస్తులను నట్టేట ముంచుతున్నా సైబర్ నేరస్తులు బీమా రంగంపైనా వల విసురుతున్నారు. ఆశలు చూపి నిలువెల్లా మోసాలు చేస్తున్నారు. ఏమాత్రం ఆలోచించుకోకుండా స్పందిస్తే నిండా మునిగినట్టే. బహుమతులు, ఉద్యోగాలు, బీమా బదలాయింపులు, సాంకేతిక సమస్యల సాకుతో, రెన్యూవల్ పేరుతో సైబర్ నేరగాళ్లు వల విసురుతున్నారు. ప్రముఖ బీమా కంపెనీల పేర్లతో నకిలీ ఈ-మెయిల్స్, సందేశాలు పంపి డబ్బు కొల్లగొడుతున్న సంఘటనలు ఇటీవల కాలంలో పెరిగిపోయాయని సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపారు. బాధితుల్లో ఎక్కువ మంది విద్యావంతులు, వృద్ధులు ఉండటం గమనార్హం.

ప్రొవైడర్ల నుంచి డేటా కొనుగోలు..

బీమా వివరాలు, వాటి గడువు, ఇతరత్రా సమాచారం ఇటు పాలసీదారులకు, అటు బీమా సంస్థలకు మాత్రమే తెలుస్తాయి. సైబర్ నేరగాళ్లు ఈ వ్యక్తిగత సమాచారాన్ని అడ్డదారుల్లో కొంటున్నారు. డేటా ప్రొవైడర్లు, బ్రోకింగ్ కంపెనీలు రూ.10 వేలు ఇస్తే లక్షలాది మంది పాలసీదారుల వివరాలను అందిస్తున్నాయి. ఇందులో పాలసీ వివరాలు, వాటి గడువు, వాహనాల నంబర్లు, వాటి ఇన్సూరెన్స్ పాలసీలు.. ఇలా పూర్తిగా వ్యక్తిగత వివరాలు ఉంటున్నాయి. ఈ సమాచారంతో సైబర్ నేరగాళ్లు పాలసీదారులకు ఫోన్లు చేస్తూ, మెసేజ్‌లు పంపుతూ కొత్త బీమా, రెన్యూవల్‌తో అధిక లాభాలు, బహుమతులు అందుకోవచ్చని ఆశ చూపుతున్నారు. నమ్మించి బ్యాంకు ఖాతా వివరాలను సేకరిస్తున్నారు. ఆనక అకౌంట్లు ఖాళీ చేసేస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలివే..

- రెన్యూవల్, పాలసీ బదలాయింపు పేరుతో వచ్చే ఈ-మెయిల్స్, సందేశాలను నమ్మొద్దు.
- ప్రస్తుతం ఉన్న బీమా పాలసీకి బదులుగా కొత్తది తీసుకుంటే అధిక లాభాలు వస్తాయని చెప్పేవి మాయమాటలని గ్రహించండి.
- బీమా పాలసీలో మార్పులు చేసుకోవాల్సి వస్తే సదరు బీమా సంస్థను సంప్రదించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలి.
- ఇన్సూరెన్స్ వెరిఫికేషన్ కోసమని చెప్పి మీ పాన్, ఆధార్ నంబర్లు, బ్యాంకు వివరాలను అడిగితే అది సైబర్ మోసమేనని గుర్తించాలి.

కూల్చివేత..మూసివేత

హైడ్రా చర్యను బేఖాతరు చేసిన స్థల యజమాని



రేకుల షీట్‌లను తొలగించిన హైడ్రా అధికారులు

మణికొండ: హైడ్రా చర్యను ఓ స్థల యజమాని బేఖాతరు చేశాడు. రోడ్డు వేసేందుకు కేటాయించిన స్థలంలో ఉన్న రేకుల షీట్లను హైడ్రా కూల్చివేయగా, సదరు యజమాని తిరిగి ఆ స్థలాన్ని మూసివేశాడు. వివరాల్లోకి వెళితే... మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలోని ట్రైల్స్ విల్లా ముందు నుంచి పంచవటి కాలనీ మీదుగా రోడ్డు వేయాలని గతంలో జీహెచ్‌ఎంసీ ప్రతిపాదనలు చేసింది. అయితే పంచవటి కాలనీ పక్క నుంచి వెళ్లే పండెన్ వాగు అక్కడికి వచ్చే సరికి సన్నగా మారుతోంది. దీంతో వర్షాకాలంలో వరదనీరు నిలిచి కాలనీలో కొంతభాగం మునిగిపోతోంది. ఆ సమస్యను పరిష్కరించాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్, మున్సిపాలిటీ అధికారులు సదరు భూ యజమానితో సంప్రదింపులు జరిపి నాలాను పెద్దగా నిర్మించేందుకు కొంత స్థలం ఇవ్వాలని ఒప్పించారు. ఈ మేరకు నాలా పూర్తి అయింది. అయితే దానిపై రోడ్డు వేయకుండా భూయజమాని రేకుల షీట్‌లు అడ్డుగా పెట్టారని గురువారం మణికొండకు వచ్చిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు కొందరు స్థానికులు ఫిర్యాదు చేశారు. దాంతో రంగనాథ్ ఆదేశాల మేరకు సిబ్బంది శనివారం వాటిని తొలిగించారు. సాయంత్రం భూ యజమాని వచ్చి ఆ స్థలానికి అడ్డుగా మరో కవర్‌ను ఏర్పాటు చేశారు. తనకు నష్ట పరిహారం ఇచ్చిన తర్వాతే రోడ్డు పనులు చేపట్టాలని ఆయన హైడ్రా అధికారులతో వాదించారు. కాగా, మల్లన్న దేవాలయం వెళ్లే దారిలో మరో నిర్మాణ సంస్థ బుల్కాపూర్ నాలా బఫర్ జోన్‌లో ఏర్పాటు చేసిన రేకుల షీట్‌లను హైడ్రా సిబ్బంది తొలగించారు.

'వక్ఫ్' సవరణలు రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకం

వక్ఫ్ బోర్డు సభ్యుడు బందగీ బాదేషా ఖాద్రీ



సాక్షి,సిటీబ్యూరో: వక్ఫ్ చట్టాన్ని నీరుగార్చడమంటే రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగించడమేనని తెలంగాణ వక్ఫ్ బోర్డ్ సభ్యుడు బందగీ బాదేషా ఖాద్రీ అన్నారు. శనివారం హైదరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వక్ఫ్ సవరణలకు ఉద్దేశించిన జేపీసీపై కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ చేసిన వ్యాఖ్యలను ఆయన బలపర్చారు. విధివిధానాలపై జేపీసీకి స్పష్టత లేదని, కేవలం ప్రభుత్వ సవరణలను అందరి మీద రుద్దడమే దాని ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోందని దుయ్యబట్టారు. నిజానికి అది జాయింట్ వర్కింగ్ కమిటీ ఆఫ్ పార్లమెంట్ మాత్రమే తప్ప, జాయింట్ పార్లమెంట్ కమిటీ కాదన్నారు. జేపీసీ తన ముందుకు వచ్చిన ప్రతి అంశాన్ని పరిశీలించి వాటిలో మార్పులను తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తుందని, కానీ వర్కింగ్ కమిటీకి ఆ అధికారాలు ఉండవని ఆయన గుర్తు చేశారు. కొత్త చట్టాలపై చర్చల కంటే ముందే సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసి ప్రజలను బలవంతంగా ఒప్పించి ఆమోదింపచేసుకునే పరంపర సాగుతోందని, వక్ఫ్ సవరణ విషయంలోనూ ఇదే జరుగుతోందని ఆరోపించారు. దాతలు దేవుడి పేరు మీద దానం చేసిన ఆస్తిలో ఇతరుల జోక్యం తగదన్నారు. వక్ఫ్ స్థలాల రిజిస్ట్రేషన్ అధికారాన్ని వక్ఫ్ బోర్డు నుంచి జిల్లా కలెక్టర్లకు బదిలీ చేయడం సమంజసం కాదన్నారు.

తప్పుడు సమాచారమే ఎక్కువగా వ్యాప్తి



సమావేశంలో ఏషియన్ జర్నలిజం కళాశాల అసోసియేట్ డీన్ మోహన్ రామ్మూర్తి

బంజారాహిల్స్: డిజిటల్ మీడియా అందుబాటులోకి వచ్చిన తర్వాత విలువైన సమాచారం కంటే తప్పుడు సమాచారమే ఎక్కువగా వ్యాప్తి అవుతోందని ఏషియన్ జర్నలిజం కళాశాల(చెన్నై) అసోసియేట్ డీన్ మోహన్ రామ్మూర్తి అన్నారు. శనివారం ప్రముఖ పాత్రికేయుడు దివంగత నార్ల వెంకటేశ్వరరావు జయంతి సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో నార్ల స్మారకోపన్యాసం చేశారు. అయితే సమాచారాన్ని వేగంగా స్వీకరించడం, విశ్లేషించడం, మీడియా సంస్థలకు త్వరగా పంపడం, వార్తల ప్రచురణలో సాంకేతికత సహాయపడుతుందని అన్నారు. వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో నార్ల వంటి పాత్రికేయులు సమాజానికి చాలా అవసరమని అన్నారు. నార్ల రాసిన, సేకరించిన పుస్తకాలను అంబేడ్కర్ వర్సిటీ లైబ్రరీకి ఆయన కుటుంబ సభ్యులు అందించడం, నార్ల పేరిట ప్రత్యేక లైబ్రరీని విశ్వవిద్యాలయంలో నెలకొల్పడం గర్వకారణంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్.విజయకృష్ణారెడ్డి, మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, విశ్వవిద్యాలయ అకాడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.పుష్పా చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

ఆ 400 ఎకరాల భూమి వేలం తగదు

ప్రభుత్వానికి 'సేవ్ సిటీ ఫారెస్ట్'సంస్థ విజ్ఞప్తి

రాయదుర్గం: కంచె గచ్చిబౌలిలో అత్యంత విలువైన, పర్యావరణాన్ని దశాబ్దాలుగా కాపాడుతున్న భూమిని ప్రభుత్వం వేలంలో విక్రయించాలని నిర్ణయించడం తగదని గచ్చిబౌలిలోని 'సేవ్ సిటీ ఫారెస్ట్ సంస్థ'ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ మేరకు ఆ భూమిని కాపాడాలనిముఖ్యమంత్రి, అటవీ, రెవెన్యూ శాఖలు, జిల్లా కలెక్టర్, టీజీఐఐసీ సంస్థకు వినతిపత్రాలను సమర్పించాలని నిర్ణయించినట్లు తెలిపింది. టీజీఐఐసీ సంస్థ ద్వారా రూ.10 వేల కోట్ల విలువ చేసే కంచె గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిని 15వ తేదీ వరకు వేలం వేయాలని నిర్ణయించిందని పేర్కొంది. ఈ భూమి పరిధిలోనే అరుదైన జింకలు, స్టార్ టార్టాయిస్, ఇండియన్ రాక్ పైథాన్, ఇతర పలు రకరకాల జంతుజాలం, 237 రకాల పక్షి జాతులు మనుగడ సాగిస్తున్నాయని, వీటిని పరిరక్షించాల్సిన అవసరాన్ని ప్రభుత్వం గుర్తించాలని కోరింది.

బ్రదర్ పీటర్ అంత్యక్రియలు పూర్తి



గోల్కొండ హెబ్రోన్ చర్చి నుండి బయలుదేరిన పీటర్ అంతిమయాత్ర వాహనం, భక్తులు

చిక్కడపల్లి: హెబ్రోను చర్చి ట్రస్టు వ్యవస్థాపకుడు బ్రదర్ ఎఫ్‌సీఎస్ పీటర్ అంత్యక్రియలు శనివారం సాయంత్రం నారాయణగూడలోని క్రైస్తవుల సమాధుల తోటలో నిర్వహించారు. ఆయన నాలుగురోజుల క్రితం మృతి చెందిన విషయం తెలిసిందే. శనివారం ప్రత్యేక ప్రార్థనల అనంతరం భౌతిక కాయాన్ని చర్చి నుంచి నారాయణగూడ వరకు అంతమయాత్రగా తీసుకెళ్లారు. పీటర్ విశ్రాంత ఉన్నతాధికారి కావడం, హెబ్రోను చర్చి ట్రస్టును స్థాపించి వివిధ హోదాల్లో పనిచేసిన నేపథ్యంలో కడసారి చూసేందుకు రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా ఉన్న అభిమానులు, క్రైస్తవులు తరలి వచ్చారు. కార్యక్రమంలో పీటర్ సతీమణి రాజేశ్వరి, కుటుంబసభ్యులు, చర్చి ప్రతినిధులు జోసెఫ్ పి.కురియన్, అద్దంకి ఇమ్మానుయేల్. జయప్రకాష్, వీరాచారి, కడప జయరాజ్, ఆనంద్‌రాజు, మత్తయి, వివిధ ప్రాంతాల దైవ సేవకులు తదితరులు పాల్గొన్నారు. పీటర్ భౌతికకాయానికి నివాళులర్పించిన వారిలో భారత క్రిస్టియన్ కౌన్సిల్ నేషనల్ ప్రెసిడెంట్ బిషప్ భాస్కర్ ముల్కల, రెవరెండ్ శావల జోసఫ్, బ్రదర్ మోసెస్ నల్లిమల్లి తదితరులు ఉన్నారు.

ఇఫ్తార్ విందులో ఎంపీ అసదుద్దీన్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని నవజ్యోతి యూత్ క్లబ్ ఆవరణలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ లోక్‌సభ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ హాజరయ్యారు.ఆ పార్టీ నాయకుడు ముర్తుజా అలీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు, సామూహిక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం ఇఫ్తార్ వేడుకల్లో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి ఉపవాస దీక్షలను విరమించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రహమత్ బేగ్, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్సీ కవిత హాజరు



ఇఫ్తార్ విందుకు హాజరైన ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ మహ్మద్‌గూడలో శనివారం సాయంత్రం జరిగిన ఇఫ్తార్ విందుకు బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, సికింద్రాబాద్ ఎమ్మెల్యే టి.పద్మారావుగౌడ్ హాజరయ్యారు. మైనారిటీ నాయకులు అబ్దుల్, మునావర్ నేతృత్వంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో బీఆర్‌ఎస్ నాయకులు తీగుళ్ల కిషోర్ కుమార్ గౌడ్, రామేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరిజ్ఞానాన్ని పంచుకోవడమూ సేవలో భాగమే

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



హైదరాబద్ ఆర్థోస్కోపి కాంక్లేవ్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సాక్షి, సిటీబ్యూరో: వైద్య రంగంలో అత్యాధునిక వైద్య విధానాలను, శస్త్ర చికిత్సా పరిజ్ఞానాన్ని పంచుకోవడం కూడా సేవా కార్యక్రమాల్లో భాగమేనని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. యశోద హాస్పిటల్స్ ఆధ్వర్యంలో శనివారం ఇక్కడ జరిగిన 'హైదరాబాద్ ఆర్థోస్కోపీ కాంక్లేవ్-2025'రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు, వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ క్రీడారంగంలో ఆర్థోపెడిక్ గాయాలు చాలా సాధారణమని, వీటికి ఆధునిక టెక్నాలజీ సాయంతో చికిత్సలు అందుబాటులోకి వచ్చాయన్నారు. యశోద ఆసుపత్రికి తమ త్రిపుర రాష్ట్రంలోనూ ఎంతో గుర్తింపు ఉందని తెలిపారు. వివిధ దేశాలకు చెందినవారు వైద్య సేవల కోసం హైదరాబాద్‌కు వస్తున్నారని, ఇది గర్వ కారణమని పేర్కొన్నారు. జాతీయ, అంతర్జాతీయ అధ్యాపకులు రోబోటిక్ శిక్షణ, లైవ్ సర్జరీ, వీడియో ఆధారిత బోధనతో పరిజ్ఞానాన్ని ఇచ్చిపుచ్చుకుని తమ నైపుణ్యాన్ని విస్తరించుకోవడానికి యువ ఆర్థోపెడిక్ వైద్యులకు ఇది సరైన వేదిక అని అన్నారు. యశోద హాస్పిటల్స్ గ్రూప్ డైరెక్టర్, డా. పవన్ గోరుకంటి మాట్లాడుతూ ఆర్థోస్కోపీ శస్త్రచికిత్సలో అత్యాధునిక పద్ధతులు, పురోగతిపై దృష్టి సారించే ఈ అంతర్జాతీయ సదస్సు, లైవ్ వర్క్ షాప్ మినిమల్లీ ఇన్వాసివ్ సర్జరీ ప్రాముఖ్యతను తెలియజేస్తుందన్నారు. అత్యాధునిక రోబోటిక్ సహాయం, ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్, ఇంటిగ్రేషన్ వంటి అత్యాధునిక వైద్య విధానాల ద్వారా ఆర్థోపెడిక్ సర్జరీలు విజయవంతంగా ఎలా నిర్వహించాలో 600 మందికిపైగా యువ సర్జన్లకు లైవ్ సర్జికల్ వర్క్‌షాప్ ద్వారా వివరించామన్నారు. కార్యక్రమంలో యశోద ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ జీఎస్ రావు, సికింద్రాబాద్ యశోద హాస్పిటల్స్ సీనియర్ స్పోర్ట్స్ ఆర్థోపెడిక్స్, ఆర్థోస్కోపీ సర్జన్ డా.ఆర్‌ఏ పూర్ణచంద్ర తేజస్వి తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యాన్ని అరికట్టాలని పీసీబీ వద్ద ధర్నా



సనత్‌నగర్: బాచుపల్లి పరిసర ప్రాంతాల్లో పెరిగిపోతున్న వాయు కాలుష్యాన్ని నియంత్రించాలని కోరతూ ఆ ప్రాంతవాసులు శనివారం సనత్‌నగర్‌లోని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి కేంద్ర కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మితోపాటు వివిధ కాలనీల ప్రతినిధులు పీసీబీ అధికారుల వైఖరికి నిరసనగా నినాదాలు చేస్తూ ప్లకార్డులను ప్రదర్శించారు. విజయలక్ష్మీ మాట్లాడుతూ కాలుష్యం బారిన పడి బాచుపల్లి పరిసర ప్రాంతాల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని, పిల్లలు శ్వాసకోశ సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని అన్నారు. కాలుష్యాన్ని వెదజల్లుతున్న కంపెనీలు, పరిశ్రమలు నిబంధనల మేరకు వ్యవహరించకపోవడం వల్లే ఈ పరిస్థితులు తలెత్తుతున్నాయని విచారం వ్యక్తం చేశారు. 2016 నుంచి కాలుష్యంపై పోరాటాలు చేస్తున్నా పరిస్థితిలో మార్పు రావడం లేదన్నారు. బొల్లారం, ఖాజిపల్లి, బొంతపల్లి, పాశమైలారం ప్రాంతాల్లోని పరిశ్రమల నుంచి వాయు కాలుష్యం తీవ్రంగా ఉందన్నారు. అనంతరం పీసీబీ చీఫ్ ఇంజనీర్ రఘుకు వినతిపత్రం అందజేశారు.

కృష్ణా జలాల్లో దక్షిణ తెలంగాణకు అన్యాయం

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘాల సమాఖ్య

పంజగుట్ట: కృష్ణా నదీ జలాల విషయంలో గత బీఆర్‌ఎస్, కేంద్ర ప్రభుత్వాలు దక్షిణ తెలంగాణ రైతులకు తీవ్ర అన్యాయం చేశాయని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘాల సమాఖ్య ఆరోపించింది. ఈ మేరకు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమాఖ్య అధ్యక్షుడు శ్రీరాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి దూదిపాల విజయ్‌పాల్‌రెడ్డి, లీగల్ అడ్వైజర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. గత ముఖ్యమంత్రులు పాలమూరును పట్టించుకోలేదని, ఇప్పుడున్న ముఖ్యమంత్రి పాలమూరు బిడ్డ కావడంతో కృష్ణా జలాలు మహబూబ్‌నగర్, నల్లగొండ, రంగారెడ్డి కొంతభాగం, ఖమ్మం కొంతభాగం రైతులకు కృష్ణా జలాలు అందించేందుకు బడ్జెట్‌లో ఎక్కువ నిధులు కేటాయించి ప్రాజెక్టులు పూర్తి చేయాలని అన్నారు. కృష్ణా నది వెంబడి పరిశ్రమలు స్థాపించడానికి, హైదరాబాద్‌కు తాగునీరు కూడా అందించడానికి కూడా అవకాశం ఉంటుందని తెలిపారు. సమావేశంలో రిటైర్డ్ ప్రొఫెసర్ రమేష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ లిటరసీతో విద్యార్థులకు మేలు

మల్లాపూర్: డిజిటల్ లిటరసీతో విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని మేడ్చల్ జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ రవీందర్ అన్నారు. శనివారం మల్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్‌ను ప్రారంభించారు. రవీందర్ మాట్లాడుతూ భవిష్యత్తు ఏఐతోనే ముడిపడి ఉంటుందన్నారు. దిగువ తరగతుల నుంచే విద్యార్థులకు క్రిటికల్ థింకింగ్‌పై అవగాహన పెరుగుతుందని చెప్పారు. ఆకృతి ప్రాజెక్ట్ సంస్థ 10 ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌టీవీని ల్యాబ్‌లో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పద్మారావు, సబిత, నూకల స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ముందుగా గుర్తిస్తే కేన్సర్ నయమవుతుంది

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- డాక్టర్ రఘురాంకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సర్టిఫికెట్ ప్రదానం



గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు సర్టిఫికెట్‌ను వెంకయ్య నాయుడు చేతుల మీదుగా అందుకుంటున్న డాక్టర్ రఘురాం

రాంగోపాల్‌పేట్: తొలిదశలోనే కేన్సర్‌ను గుర్తిస్తే అధునాతన వైద్య పద్ధతులతో నయం చేసుకోవచ్చని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉషాలక్ష్మి బ్రెస్ట్ కేన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మౌంట్ అబూలో బ్రహ్మకుమారిలతో కలిసి డాక్టర్ రఘురాం అవగాహన కార్యక్రమం నిర్వహించగా దాన్ని ప్రత్యక్షంగా 5,020, యూ ట్యూబ్‌లో 6,218 మంది 24 గంటల్లో వీక్షించారు. దీంతో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ శనివారం సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో రఘురాంకు సర్టిఫికెట్ అందజేసింది. వెంకయ్యనాయుడు మాట్లాడుతూ వైద్యులు వీలున్నప్పుడు తమ సమీపంలోని బస్తీలకు వెళ్లి రొమ్ము కేన్సర్‌పై మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి వ్యక్తి జీవనశైలిని మార్చుకోవాల్సిన అవసరం ఏర్పడిందని, రోజూ సూర్యోదయానికి ముందే వ్యాయా మం చేయాలని సూచించారు. ఇన్‌స్టంట్ ఫుడ్ వదిలి ఇంటి వంటలను తిని ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు.

ఇతర భాషలకు హిందీ హానికరం కాదు

మాతృ భాషతోపాటు వీలైనన్ని ఇతర భాషలు నేర్చుకోవాలని వెంకయ్యనాయుడు సూచించారు. చిన్నప్పుడు హిందీకి వ్యతిరేకంగా పోరాటాలు చేశానని, బీజేపీ కార్యదర్శిగా అయినప్పుడు దాని ఆవశ్యకత గుర్తించానని, హిందీ ఏ ఇతర భాషలకు హానికరం కాదని అన్నారు. కార్యక్రమంలో కిమ్స్ ఎండీ డాక్టర్ భాస్కర్‌రావు, ఆస్కి చైర్మన్ పద్మనాభయ్య, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ఆసియా పసిఫిక్ జడ్జి రిషినాథ్ తదితరులు పాల్గొన్నారు.

దక్షిణాది భాషలపై దాడిని అరసం నిరసించాలి



రచయిత పెనుగొండ లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న పలువురు ప్రముఖులు

జూలూరి గౌరీశంకర్

గన్‌ఫౌండ్రీ: దక్షిణాది రాష్ట్రాల మాతృభాషలపై హిందీ భాష పెత్తనాన్ని నిరసిస్తూ జరగబోయే మాతృభాష పరిరక్షణ ఉద్యమాలకు అభ్యుదయ రచయితల సంఘం(అరసం) పెద్దన్న పాత్ర పోషించాలని తెలంగాణ సాహిత్య అకాడమి మాజీ అధ్యక్షుడు జూలూరి గౌరీ శంకర్ కోరారు. శనివారం రవీంద్రభారతిలో తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో అరసం జాతీయ అధ్యక్షుడు పెనుకొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు వచ్చిన సందర్భంగా ఆత్మీయ సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జూలూరి గౌరీ శంకర్ మాట్లాడుతూ మాతృభాషలు మరణిస్తే ఆ జాతుల మనుగడకే ప్రమాదం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. భిన్న సంస్కృతులు, భాషల పరిరక్షణతోనే భిన్నత్వంలో ఏకత్వం సాధ్యమవుతుందన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఎస్వీ సత్యనారాయణ మాట్లాడుతూ అనేక దశాబ్దాలుగా అభ్యుదయ సాహిత్యోద్యమ విస్తృతికి లక్ష్మీనారాయణ చేసిన కృషి అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం వీరస్వామి రచించిన వీక్షణం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ రియాజ్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, సినీ రచయిత సుద్దాల అశోక్ తేజ, నవచేతన పబ్లిషింగ్ హౌస్ సంపాదకుడు డాక్టర్ ఏటుకూరి ప్రసాద్, అరసం జాతీయ కార్యదర్శి వేల్పుల నారాయణ, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సాహిత్య అకాడమి కార్యదర్శి బాలాచారి, అరసం అధ్యక్షులు వీరస్వామి, ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

గౌడ కులస్తులు రాజకీయ ఉచ్చులో పడొద్దు

సీఎం, మంత్రుల చిత్రపటాలకు నీరాభిషేకం



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న గౌడ సంఘాల నేతలు

ఖైరతాబాద్: గౌడ కులస్తులు రాజకీయాల ఉచ్చులో పడొద్దని టీపీసీసీ గీత కార్మిక విభాగం చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ అన్నారు. టూరిజం శాఖలో ఉన్న నీరా కేఫ్‌ను తెలంగాణ గీత పారిశ్రామిక సహకార సంస్థలో చేర్చినందుకు హర్షం వ్యక్తం చేస్తూ గౌడ కులస్తులు నెక్లెస్ రోడ్డు పీవీ మార్గ్‌లోని నీరాకేఫ్ వద్ద శనివారం ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్, మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ గౌడ్, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాస్కి గౌడ్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం, నీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాగరాజు గౌడ్ మాట్లాడుతూ మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ గౌడ కులస్తులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. జనగామ జిల్లాకు సర్వాయి పాపన్న గౌడ్ పేరుతోపాటు ఆయన విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై పెట్టాలనే విషయాలు బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు విస్మరించారని ప్రశ్నించారు. కార్యక్రమంలో గౌడ సంఘాల నాయకులు టి.రేవతి గౌడ్, రమణ గౌడ్, ఆనంద్ గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, నళినితో పాటు గౌడ నాయకులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, ఆదివారం, 16, మార్చి 2025

నడక, యోగా రెండూ దేనికవే ప్రత్యేకం. ఆరోగ్యకరమైన వ్యాయామ మార్గాలు. ప్రస్తుతం ఈ రెంటినీ మిళితం చేసిన సరి కొత్త వ్యాయామంగా అందుబాటులోకి వచ్చింది వాకింగ్ యోగా. అటు నడక ద్వారా లభించే ప్రయోజనాలతో పాటూ.. ఇటు యోగా ఫలితాలను ఒకే వ్యాయామం ద్వారా అందుకునేందుకు ఇది సహకరిస్తుంది. ఇటీవలే నగరంలో అనేక మందిని ఆకట్టుకుంటున్న ఈ వాకింగ్‌యోగా విశేషాలివి..

- సాక్షి, సిటీబ్యూరో

నడక యోగం

నడక, యోగాను మిళితం చేస్తూ సాగే వ్యాయామం



కదలికల్ని మెరుగుపరిచే లక్ష్యంతో ప్రత్యేక ఆకారం	అన్ని వయసుల వారికీ అనుకూలం, ప్రయోజనకరం	1950 ప్రాంతం నుంచే ఉందంటున్న నిపుణులు



నడక మన ఆరోగ్యానికి మేలు చేస్తుంది. కానీ నడక- యోగా ఆ ప్రయోజనాలను మరింత ముందడుగు వేయిస్తుంది. ఆధునిక సౌకర్యాలు, పని విధానాల వల్ల చలన రహితంగా మారుతున్న శరీరాన్ని చురుకుగా కదపడానికి విభిన్న రకాలుగా సాగదీయడానికి, సరైన రీతిలో శ్వాస పీల్చుకోడానికి వీలుగా ఈ వాకింగ్ యోగా రూపుదిద్దుకుంది. ఇది నడిచేటప్పుడు మన శరీర భంగిమను మెరుగుపరచడానికి, నడకను మరింత ప్రయోజనకరంగా మార్చడానికి సహకరిస్తుంది. ఏదో నడిచాం అన్నట్టుగా కాకుండా అవగాహనతో నడవడం నేర్పిస్తుంది. ఇందులో ప్రతి అడుగు లోతైన శ్వాస, సున్నితమైన స్ట్రెచ్‌లతో కలిపి ఉంటుంది.

భంగిమకు మేలు..

మనలో చాలా మంది మన శరీర భంగిమ ఎలా ఉంటుందో పట్టించుకోకుండా నడుస్తూ ఉంటారు. తద్వారా నడవడం వల్ల కలిగే ప్రయోజనాలను కోల్పోతుంటారు. వాకింగ్ యోగా భంగిమను మెరుగుపరుస్తుంది. చేతులు, కాళ్లు, మెడ.. వీటిని సరైన రీతిలో ఉంచేలా సహాయపడుతుంది. నిటారుగా నిలిచేలా, నడుము భాగం, వీపుతో నడకను అనుసంధానిస్తుంది. కండరాల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది.



మానసికంగానూ ఎంతో మేలు..

నడక యోగా ఒత్తిడిని తగ్గించడానికి విశ్రాంతిని అందించడానికి ఒక గొప్ప మార్గం. ఇది నడుస్తున్నప్పుడు లోతుగా శ్వాస తీసుకోవడం అలవాటు చేస్తుంది. తద్వారా ఆందోళనను, ప్రతికూల ఆలోచనలను తగ్గించి మనసును ప్రశాంతపరుస్తుంది. ఇది చురుకుగా ఉంటూనే మెదడుకు రిఫ్రెష్ బటన్ ప్రెస్ చేయడం లాంటిదని చెప్పొచ్చు. మనసు శరీరానికి క్రమబద్ధమైన అభ్యాసం ఇది. ఒత్తిడిని తగ్గించడానికి, మానసిక స్థితిని, ఏకాగ్రతను పెంచడానికి శరీరం పై అవగాహనను మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

కొందరికి అననుకూలం..

ఒక వ్యక్తి తమ నడకను మరింత విశ్రాంతిగా అదే సమయంలో మరింత ఉపయుక్తంగా మార్చే నడక యోగా టీనేజర్స్‌తో సహా అన్ని వయసుల వారికీ ఉపయుక్తమే. అయితే అనేక ప్రయోజనాలు ఉన్నప్పటికీ, ఇది అందరికీ అనుకూలం కాకపోవచ్చు. వేగవంతమైన నడక లేదా తీవ్రమైన వ్యాయామాలను ఇష్టపడే వ్యక్తులకు నప్పకపోవచ్చు. అలాగే, దీనికి ఏకాగ్రత, ఎక్కువ సహనం అవసరం. అది లేనివారు దీన్ని సాధన చేయడం కష్టం. నప్పుతుందో లేదో తెలుసుకోడానికి ఒక వారం పాటు దీనిని ప్రయత్నించి పరిశీలించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.



ప్రకృతిలో లీనమయ్యేలా..

మన వాకింగ్ యోగా మరింత ప్రయోజనకరంగా చేయడానికి పర్వత భంగిమ, వృక్షాసన భంగిమ వంటివి మేళవించవచ్చని చెబుతున్నారు. అలాగే నడుస్తున్నప్పుడు భుజాలను ముందుకు వెనుకకు తిప్పడం, చేతులను పైకి లేదా శరీరం అంతటా విస్తరించేలా సాగదీయడం, కోర్ (నడుము కింది భాగం)ను నడకతో అనుసంధానించడానికి వెన్నెముక పనితీరును మెరుగుపరచడానికి అడుగులు వేసేటప్పుడు నడుము వద్ద కొద్దిగా ట్విస్ట్ చేయడం.. వంటివి చేయాల్సి ఉంటుంది. సాధారణంగా వాకింగ్ చేసేటప్పుడు చాలా మంది వినియోగించే హెడ్‌ఫోన్‌లు, సంగీతాన్ని మాత్రమే కాదు ఆలోచనలను సైతం విడిచి పెట్టాలి. సహజమైన ప్రకృతి, శబ్దాలను ఆనందించేలా ఇది ప్రోత్సహిస్తుంది.

రోజుకు 5 నిమిషాలతో..

బాగా పరిచయం ఉన్న కాస్త ప్రశాంతంగా ఉండే ప్రదేశంలో రోజుకు ఐదు నిమిషాలతో ఈ వాకింగ్ యోగాని ప్రారంభించాలి. రోజుకు క్రమంగా ఐదు నిమిషాల చప్పున పెంచుకోవచ్చు. తద్వారా రొటీన్ వ్యవహారాలకు, వ్యాయామాలతో సర్దుబాటు కావడానికి కండరాలకు సమయాన్ని ఇవ్వాలి. 'రోజుకు 20 నిమిషాలు వచ్చే వరకూ ఈ విధంగా పెంచుతూపోవాలి. ప్రతిరోజూ 20 నిమిషాలు కేటాయించలేకపోతే.. కనీసం వారానికి మూడు రోజులు 30 నిమిషాలు చేస్తే సరిపోతుందని నిపుణులు సూచిస్తున్నారు.

50 ఏళ్ల క్రితమే..



మైండ్‌ఫుల్ వాకింగ్ అనే ప్రక్రియను యోగా శిక్షకురాలు, యోగా ఫర్ పెయిన్ యాప్ సృష్టికర్త, లండన్‌కు చెందిన సోఫియా డ్రోజ్ వ్యాప్తిలోకి తెచ్చారు. అయితే ఇదేమీ కొత్తది కాదని, దాదాపు 50 ఏళ్ల క్రితం.. అంటే 19 70 ప్రాంతంలోనే రోజువారీ కార్యకలాపాలతో యోగా, బ్రీత్‌వర్క్‌లను కలిపే సాధనంగా ఇది ప్రప్రథమంగా వినియోగంలోకి వచ్చిందని డ్రోజ్ అంటున్నారు.

ప్రకృతితో మమేకం.. మైండ్ ఫుల్ వాక్..

దృష్టిని పూర్తిగా శ్వాస మీదే కేంద్రీకరిస్తూ.. ఆలోచనలు మరే విషయం మీదకూ మళ్లించకుండా శరీరాన్ని కదిలించడమే మైండ్ ఫుల్ నెస్. నడిచే సమయంలో ఈ ప్రక్రియను సాధన చేస్తే.. అద్భుత ప్రయోజనాలు లభిస్తాయి. అది కూడా ప్రకృతిలో మమేకమవుతూ చేయడం మరింత ప్రయోజనకరం. నడకను, యోగాను మేళవించడమే వాకింగ్ యోగా. మైండ్ ఫుల్ బ్రీతింగ్, మైండ్ ఫుల్ నేచర్ వాక్, పచ్చని గడ్డి మీద నడిచే బేర్ ఫుట్ వాక్, క్లౌడ్ గేజింగ్.. వంటివన్నీ ఇందులో భాగంగానే చెప్పవచ్చు. నగరంలో పలువురు వాకింగ్ యోగాను సాధన చేస్తున్నారు.

- రీనా హిందోచా,
యోగా శిక్షకురాలు



సిటీ యూనియన్ బ్యాంక్‌తో సన్‌రైజర్స్

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ ప్రైవేటు రంగ బ్యాంకుల్లో ఒకటైన సిటీ యూనియన్ బ్యాంక్ (సీయుబీ), సన్ రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్)తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. నగరంలోని తాజ్ కృష్ణా హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో సిటీ యూనియన్ బ్యాంక్ ఎండీ, సీఈఓ డా.ఎస్ కామకోటి, సన్‌రైజర్స్ హైదరాబాద్ సీఈఓ కే.షణ్ముగం ఈ విషయాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా తమ భాగస్వామ్యం అందించే ప్రయోజనాలను వివరించారు. ఎస్‌ఆర్‌హెచ్ ఆటగాళ్లకు, అలాగే అభిమానులకు అత్యుత్తమ బ్యాంకింగ్ సేవలు, ఆఫర్లను అందించేందుకు, అదే విధంగా క్రికెట్ ప్రపంచానికి అభిమానులను మరింతగా చేరువ చేసేందుకు ఇది ఉపకరిస్తుందని ఎస్‌ఆర్‌హెచ్ జెర్సీలు, క్యాప్స్ వంటి వస్తువులను ప్రత్యేక ఆఫర్‌లతో అందించనున్నట్లు తెలిపారు. అలాగే మొబైల్ బ్యాంకింగ్, కాంటాక్ట్‌లెస్ చెల్లింపు ఎంపికలు తదితర డిజిటల్ బ్యాంకింగ్ సేవలను అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఆర్‌హెచ్ జట్టు క్రికెటర్లను బ్యాంక్ ఆధ్వర్యంలో సన్మానించారు.



అభి'రుచుల' ఆస్వాదన

నగర వంటకాలను టేస్ట్ చేసిన ఆస్ట్రేలియా ప్రతినిధులు





సాక్షి, సిటీబ్యూరో: రంజాన్ సందర్భంగా విభిన్న రకాల ఆకర్షణలతో ఆహ్వానించే నగరాన్ని సందర్శించడం నగరేతరులకు ఓ చక్కని అనుభవం. అలాంటి వారిలో విదేశీయులూ పెద్ద సంఖ్యలోనే ఉంటారు. అదే విధంగా ఆస్ట్రేలియా డిప్యూటీ కాన్సులేట్ జనరల్ స్టీవెన్, కాన్సుల్ ఆండ్రూలు రెండు రోజుల పాటు నగరంలో పర్యటించారు. దీనిలో భాగంగా నగరంలోని చారిత్రక విశేషమైన కులీ కుతుబ్ షాహీ టూంబ్స్‌ను సందర్శించడంతో పాటు రంజాన్ పండుగ సందడిని తిలకించి పులకించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ హలీమ్, దహీ వడ, పత్తర్‌కీ ఘోస్త్.. వంటి నగర ప్రత్యేక వంటకాల రుచులను ఆస్వాదించారు. ఈ వివరాలను ఫొటోలతో సహా బెంగళూర్‌లోని ఆస్ట్రేలియన్ కాన్సులేట్ తమ అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది.

హైలైఫ్ సమ్మర్ స్ప్రింగ్ ఎడిషన్

ఈ నెల 21 నుంచి ప్రదర్శన



బంజారాహిల్స్: ఈ నెల 21 నుంచి హెచ్‌ఐసీసీలోని నోవోటెల్ హోటల్‌లో హైలైఫ్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. బంజారాహిల్స్‌లో హైలైఫ్ ఎగ్జిబిషన్‌కు సంబంధించిన సమ్మర్ స్ప్రింగ్ ఎడిషన్ సన్నాహక కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో సినీ నటులు రితికా చక్రబర్తితో పాటు ప్రీతి సుందర్, పలువురు మోడల్స్ పాల్గొని కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌లో సమ్మర్ కలెక్షన్స్‌తో పాటు ప్రసిద్ధిగాంచిన డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మోడల్స్ డిజైనరీ దుస్తులు, వజ్రాభరణాలను ప్రదర్శించారు.



ఇంద్రియాలో ప్రణీత సందడి..

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆదిత్య బిర్లా గ్రూప్ ప్రీమియం ఆభరణాల బ్రాండ్ ఇంద్రియా స్టోర్‌ను సినీనటి ప్రణీత సుభాష్ ముఖ్య అతిథిగా హాజరై శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టోర్ ఆర్‌ఎస్‌వీపీ అజామ్‌ఖాన్ మాట్లాడుతూ తమ ఇంద్రియా స్టోర్‌లో సంప్రదాయం, ఆధునికతల మేళవింపుతో 15వేలకు పైగా క్యూరేటెడ్ ఆభరణాలు, 5వేలకు పైగా ప్రత్యేకమైన డిజైన్లతో అందుబాటులో ఉంచామన్నారు. క్లిష్టమైన కుందన్ పోల్కి డిజైన్లతో పాటు బస్రా ముత్యాల డిజైన్లతో ఆభరణాలు, నగల కొనుగోలుదారులను ఆకట్టుకోనున్నాయని తెలిపారు. దేశ వ్యాప్తంగా 100 స్టోర్‌లను విస్తరించే దిశగా అడుగులు వేస్తున్నామని అజామ్‌ఖాన్ పేర్కొన్నారు.



లవ్ ఎట్ పెట్ సైట్..



నగర వాసుల్లో పెరుగుతున్న జంతు పోషణ అభిరుచి

ఒక్కొక్కరిదీ ఒక్కో రకమైన విధానం	అందుబాటులో వివిధ రకాల బ్రీడ్స్	వేల రూపాయల ఖర్చుకు వెనుకాడని వైనం

జంతు ప్రేమికులు అమితంగా ఇష్టపడే వాటిలో అగ్ర తాంబూలం శునకానిదే.. ప్రస్తుతం నగరంలో ఏ ఇంట చూసినా కుక్క పిల్లలను పెంచుకోవడం సర్వసాధారణం అయిపోయింది. ఎందుకంటే విశ్వాసానికి మారుపేరుగా ఉండే పెంపుడు జంతువు కావడం, మానసికోల్లాసానికి, ఇంటి రక్షణకు ఎంతగానో సహకరిస్తుంది. దీంతో చాలా మంది కుక్కలను పెంచుకుంటున్నారు. వేల రూపాయలు మొదలు లక్షల రూపాయలు వెచ్చించి దేశ, విదేశీ జాతుల కుక్కపిల్లలను కొనుగోలు చేస్తున్నారు. వాటి పోషణకు, సంరక్షణకు వేల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. మరికొంత మంది స్టేటస్ సింబల్‌గా భావిస్తూ విదేశీ జాతులకు లక్షలు వెచ్చిస్తున్నారు.

- బౌద్ధనగర్



కుటుంబంలో ఒకటిగా..

ఇంట్లో ల్యాబ్‌ను పెంచుకుంటున్నాము. మార్కెటింగ్ జాబ్ చేసే నాకు భయట ఎంతో ఒత్తిడి. ఇంటికి వచ్చి పెట్‌ను చూడగానే రిలాక్స్ అవుతాను. ఒత్తిడంతా పోయి రిలాక్స్ అవుతాను. కుక్కలు నిజమైన ప్రేమను చూపిస్తాయి. మనం కనిపించకపోతే అన్నం కూడా ముట్టవు. ఇది మా కుటుంబ సభ్యుల్లో ఒకటిగా ఉంటుంది. దీని కోసం ప్రతి నెలా రూ.15 వేలు ఖర్చు చేస్తాను.

- ప్రవర్ధన్, తార్నాక





జంతు ప్రేమికుల అభిరుచికి అనుగుణంగా కుక్కపిల్లలను అందించడం ప్రధాన వృత్తిగా మార్చుకుని కొంత మంది వ్యాపారం నిర్వహిస్తున్నారు. వాటికి అందించే ఆహారం, ఇతర అలంకరణ వస్తువుల దుకాణాలను ఏర్పాటు చేసి లక్షలు గడిస్తున్నారు. దీంతో పాటు వాటికి సంక్రమించే వ్యాధుల నివారణకు ప్రత్యేక క్లినిక్‌లు, వాటిద్వారా ఇతరులకు సంక్రమించే వ్యాధుల నిరోధానికి వాక్సిన్‌లు సమకూర్చే మందుల దుకాణాలు ఇలా పెట్ డాగ్స్‌కు సంబంధించిన మార్కెట్ నానాటికీ విస్తరిస్తూ పలువురికి ఉపాధి మార్గంగా మారుతోంది.

శునకాల్లో రకాలు..

ప్రజలు ఎక్కువగా ఇష్టపడి కొనుగోలు చేస్తున్న శునకాల్లో ప్రధానంగా డాబర్‌మెన్, డ్యాషన్, గోల్డెన్ రిట్రైనర్, ల్యాబ్‌రేడర్, పామోలీన్, పగ్ వంటి జాతుల కుక్కలు ఉన్నాయి. వీటి ధర సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండటమే. కొంతమంది మధ్య తరగతి, ధనికులు మాత్రం జర్మన్ షెపర్డ్, బుల్‌డాగ్, లాబరేడర్ రిట్రైవర్, గోల్డెన్ రిట్రైవర్, ఫ్రెంచ్ బుల్‌డాగ్, సైబీరియన్ హస్కీబీగల్, అలస్కన్ మలమ్యూట్ డ్యాషన్, పగ్ వంటి ఖరీదైన కుక్కలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

పోషణకు వెనకాడటం లేదు..

సర్వ భక్షకులైన శునకాల పోషణకు ఆయా రకాలను బట్టి అహారాన్ని అందించేందుకు యజమానులు వేల రూపాయలు వెచ్చిస్తున్నారు. సాధారణంగా వండిన మాంసం, ఫ్లూరీ చేసిన కూరగాయలతో పాటు ఆయా బ్రాండ్‌లకు చెందిన ఆహార పదార్థాలను కొనుగోలు చేస్తున్నారు. ఎముకలతో పాటు టౌరిన్ సప్లిమెంట్లు, మల్టీ విటమిన్ సప్లిమెంట్లు కొనుగోలు చేస్తూ వాటి పోషణకు రూ.వేలు ఖర్చు చేసేందుకు వెనుకాడటం లేదు. దీంతో పాటు ఇన్‌ఫ్లూయంజా వంటి వ్యాధులు రాకుండా వ్యాక్సిన్‌లు వేయిస్తున్నారు. శునకాల ద్వారా మనుషులకు వ్యాపించే రేబిస్, నోరోవైరస్ వంటి వ్యాధులకూ వ్యాక్సిన్లు వేయిస్తున్నారు.

క్లుప్తంగా...

ఎస్సీ వర్గీకరణపై నివేదికను రద్దు చేయాలి

- సీఎం రేవంత్‌రెడ్డికి మాల సంఘాల జేఏసీ వినతి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎస్సీ కులాల వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ ఇచ్చిన నివేదికను రద్దు చేసి ఎస్సీ, ఎస్టీ కుటుంబాలను రీ సర్వే చేసేలా ఆదేశించాలని మాల సంఘాల జేఏసీ సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేసింది. ఏకసభ్య కమిషన్ నివేదిక రాజ్యాంగ విరుద్ధమైనదని, అశాస్త్రీయంగా, అసంపూర్తిగా దానిని తయారు చేశారని జేఏసీ పేర్కొంది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, నమూనాలకు విరుద్ధంగా 2011 ఎస్సీ జనాభా వివరాలను 2025లో పరిగణనలోకి తీసుకోలేరని స్పష్టంచేసింది. అందువల్ల జస్టిస్ షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్ నివేదిక అమలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టవద్దని సూచించింది. ఈ అంశంపై సీఎం నిష్పక్షపాతంగా, వాస్తవ దృష్టితో ఆలోచించి అమలును నిలిపేసేలా తగిన ఉత్తర్వులు జారీ చేయాలని కోరింది. ఈ మేరకు శనివారం అసెంబ్లీలోని సీఎం చాంబర్‌లో ఎమ్మెల్యేలు జి.వివేక్ వెంకటస్వామి, జి.వినోద్, మట్ట రాగమయి, కె.ఆర్. నాగరాజు, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య, ఇతర సంఘాల నాయకులు వినతిపత్రం సమర్పించారు. కాగా, తమ విజ్ఞప్తిపై సీఎం స్పందిస్తూ.. ఆయా అంశాలపై చర్చకు త్వరలో ఎమ్మెల్యేలతో సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని జేఏసీ నాయకులు తెలిపారు.

మా పెండింగ్ బిల్లులు చెల్లించండి

- సీఎంకు తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: తాము సర్పంచ్‌లుగా ఉన్నప్పుడు అప్పులు చేసి మరీ గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినందున పెండింగ్ బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డికి తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ విజ్ఞప్తిచేసింది. తమ 15 నెలల పాలనలో రూ.1,58,041 కోట్ల అప్పు చేసినట్టు అసెంబ్లీ సాక్షిగా సీఎం ఒప్పుకున్నారని, అదనంగా మరో రూ.600 కోట్లు అప్పుచేసి తమ పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరింది. సర్పంచ్‌లుగా ఉన్నప్పుడు చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక వేధింపులకు గురవుతున్న తమకు చావుకాలం వచ్చిందని జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తంచేశారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యస్థాపనకు 'మా భూమి రథయాత్ర'

సాక్షి, హైదరాబాద్: బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యస్థాపన కోసం 'మా భూమి రథయాత్ర'చేయనున్నామని ధర్మసమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఏప్రిల్ 20న ఆదిలాబాద్ నుంచి ప్రారంభించనున్నట్లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ రథయాత్రలో కాంగ్రెస్ పార్టీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తామన్నారు. అలాగే 'బ్రాహ్మణ బనియా బీజేపీ, బీఆర్ఎస్ వెలమ దొరల'ఆధిపత్యం నుంచి ప్రజలను బయటకు తెస్తామన్నారు. కులగణన తర్వాత కులాల లెక్కలు తేలాయని, 80 శాతం ఉన్న బీసీలకు ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని విశారదన్ డిమాండ్ చేశారు.

'స్థానిక' పోటీకి ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తేయాలి

- సీఎంకు తెలంగాణ పంచాయతీ రాజ్ చాంబర్ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: నియోజకవర్గాల పునర్విభజన ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని స్థానిక ఎన్నికల్లో పోటీకి ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తేయాలని తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్.. సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తిచేసింది. గ్రామీణ ప్రజాస్వామ్యానికి పంచాయతీరాజ్ వ్యవస్థ పునాది అని, స్థానిక ప్రజలకు పాలనలో భాగస్వామ్యం కల్పించే ఈ వ్యవస్థలో ముగ్గురి కంటే ఎక్కువ మంది పిల్లలున్న తల్లిదండ్రులు పోటీచేయలేకపోతున్నారని చాంబర్ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి తెలిపారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని వారు రాజకీయంగా వెనుకబడిపోతున్నారని ఒక ప్రకటనలో వెల్లడించారు. నియోజకవర్గాల పునర్విభజన నేపథ్యంలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న భావన ప్రజల్లో ఏర్పడినందున, తెలంగాణ ప్రభుత్వం ప్రస్తుత జనాభా పెంపుదలను ప్రోత్సహించే దశలో ఉన్నందున ఈ నిబంధనను ఎత్తేయాలని కోరారు.

మయన్మార్ సైబర్ ముఠా మోసాలపై మరో కేసు

టీజీ సీఎస్‌బీకి ఫిర్యాదు చేసిన బాధితుడు

సాక్షి, హైదరాబాద్: విదేశాల్లో డేటా ఎంట్రీ ఉద్యోగం పేరిట మయన్మార్‌లోని సైబర్ ముఠాలకు స్థానిక యువకులను విక్రయించిన మోసాలపై కేసులు నమోదవుతూనే ఉన్నాయి. తాజాగా నగరంలోని ఆసిఫ్ నగర్‌కు చెందిన షేక్ హుస్సేన్ అనే యువకుడు టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీ సీఎస్‌బీ) అధికారులకు శనివారం ఫిర్యాదు చేశాడు. ఇంటర్మీడియట్ వరకు చదివిన తాను స్థానికంగా పలు ఉద్యోగాలు చేస్తున్న సమయంలో విదేశాల్లో ఉద్యోగం కోసం ప్రయత్నించానని చెప్పాడు. ఆ సమయంలో బ్యాంకులో డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగాన్ని ఇప్పిస్తానని నగరానికి చెందిన సయ్యద్ ఇర్ఫాన్, ఉత్తరాఖండ్‌కు చెందిన కమల్ తనను బ్యాంకాక్ పంపించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. అక్కడి నుంచి తాను చైనా దేశీయుల సైబర్ ముఠాకు చిక్కిన క్రమాన్ని ఫిర్యాదులో వివరించాడు. తనను మోసపూరితంగా చైనా సైబర్ ముఠాలకు విక్రయించిన స్థానిక ఏజెంట్లైన సయ్యద్ ఇర్ఫాన్, కమల్‌పై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని కోరాడు.

భారత్.. ఆధ్యాత్మిక స్ఫూర్తి

జాతీయ న్యాయ నిపుణుల సదస్సులో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

- ప్రజలంతా విలువలు ఆచరించినప్పుడే ధర్మం పరిఢవిల్లుతుందని వెల్లడి
- న్యాయవాదులు సానుకూల దృక్పథాన్ని అలవాటు చేసుకోవాలి: జస్టిస్ ఎస్వీ భట్టి


కార్యక్రమంలో ప్రసంగిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ. చిత్రంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎస్వీ భట్టి, జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: ఆధ్యాత్మికత, ధర్మ పరిరక్షణలో ప్రపంచానికి భారత్ స్ఫూర్తిదాయకమని.. ప్రజలంతా వాటిని ఆచరించి శాంతి పొందాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఉద్ఘాటించారు. ధర్మ రాజ్యం అంటే.. రూల్ ఆఫ్ లా అని.. సరైన విలువలు, సరైన ఆలోచన, సేవలు, కరుణ, నీతి, నైతికత పాటించడమే ధర్మమని వివరించారు. దేశం ధర్మ రాజ్యంగా ప్రగతి బాట పయనించాలని మహాత్ముడు అభిలషించారని చెప్పారు. ఆర్థిక భారతమే కాదు.. వికసిత్, విరాసిత్ భారత్ ఆవశ్యకతనూ ప్రధాని మోదీ వెల్లడించారన్నారు. మనసును నిగ్రహించుకుని చట్టపరమైన, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవడంపై బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో జాతీయ న్యాయనిపుణుల సదస్సు శనివారం హైదరాబాద్‌లోని శాంతి సరోవర్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో గవర్నర్‌తోపాటు సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్వీ భట్టితోపాటు పలువురు హైకోర్టు న్యాయమూర్తులు, సీనియర్ న్యాయవాదులు మాట్లాడారు. గుడిలో పూజలు, అర్చన, ప్రదక్షిణలు చేయడం మాత్రమే కాదు, ధర్మాన్ని పాటించడం కూడా ఆధ్యాత్మికమే అని గవర్నర్ అభిప్రాయపడ్డారు. శాంతి లేని బతుకు నిరర్థకమని.. స్వామి వివేకానందుడే స్ఫూరిగా ఆధ్యాత్మికాన్ని ఆచరించాలని సూచించారు. ఆధ్యాత్మికాన్ని పెంపొందించడంలో బ్రహ్మకుమారీల పాత్ర అభినందనీయమన్నారు. మితిమీరిన 'ఇన్‌స్టంట్'కు అలవాటుపడితే అనారోగ్యాన్ని ఆహ్వానించినవారవుతారని హెచ్చరించారు.

ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వండి: జస్టిస్ ఎస్వీ భట్టి

న్యాయమూర్తులు, న్యాయవాదులు సానుకూల దృక్పథంతో ముందుకు సాగినప్పుడే అసాధ్యాలు కూడా సుసాధ్యం కాగలవని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సారస వెంకటనారాయణ భట్టి చెప్పారు. న్యాయవాదులకు స్వీయ అవగాహన ఉండాలని, కేసును, కక్షిదారుడిని అర్థం చేసుకున్నప్పుడే సమర్థ వాదన సాధ్యపడుతుందన్నారు. గెలుపోటములను ఒకేలా స్వీకరించాలని.. అపజయానికి కుంగిపోవడం, విజయానికి పొంగిపోవడం వృత్తినే కాదు, వ్యక్తిత్వాన్నీ దెబ్బతీస్తాయని వ్యాఖ్యానించారు. ఏం చేస్తున్నాం.. ఎలా చేస్తున్నాం.. అనే సమీక్ష అందరికీ అవసరమన్నారు. వృత్తిపరంగా ప్రతికూల ఆలోచనలు వస్తుంటాయని.. కొన్నిసార్లు మనసు కలుషితం అవుతుందని చెప్పారు. సానుకూలత లేకుండా సరైన నిర్ణయం తీసుకోలేమని చెబుతూ.. జరిగిందేదో జరిగిపోయింది.. సానుకూలంగా ముందుకెళ్తాను అనే ధోరణిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి, జస్టిస్ సూరేపల్లి నంద, జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి, త్రిపుర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అమర్‌నాథ్‌గౌడ్, మాజీ న్యాయమూర్తులు జస్టిస్ వి.ఈశ్వరయ్య, జస్టిస్ బీడీ రాథి, బార్ కౌన్సిల్ మాజీ చైర్మన్ ఎం.రాజేందర్‌రెడ్డి, మాజీ అడ్వొకేట్ జనరల్‌లు దేశాయి ప్రకాశ్‌రెడ్డి, బీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

జీఎస్టీ.. దేశ ఆర్థిక చరిత్రలో ఓ మలుపు: గవర్నర్

వస్తువులు, సేవల పన్ను (జీఎస్టీ) ప్రవేశపెట్టడం మన దేశ ఆర్థిక చరిత్రలో ఒక మలుపు అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అభిప్రాయపడ్డారు. శనివారం తాజ్ దక్కన్ హోటల్‌లో తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) ఆధ్వర్యంలో జీఎస్టీ రూపకల్పనలో కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థ పాత్రపై సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థ మధ్య సమన్వయం అవసరమన్నారు. ఒకే దేశం.. ఒకే పన్ను విధానానికి జీఎస్టీ దోహదం చేసిందన్నారు. సాహసోపేతమైన సంస్కరణల మాదిరిగానే జీఎస్టీని ప్రవేశపెట్టినప్పుడు అవాంతరాలు తప్పలేదని పేర్కొన్నారు. ఎక్కడైతే ప్రజలకు న్యాయం అందుతుందో.. అక్కడ ధర్మంతోపాటు రాజుకు బలమైన పునాది ఏర్పడుతుందని కౌటిల్యుడు చెప్పిన మాటలను ఉదహరించారు. పన్ను చెల్లింపుదారులందరూ ప్రభుత్వం అందిస్తున్న వన్ టైమ్ వడ్డీ మాఫీ పథకాన్ని ఈ నెల 31లోగా పన్ను చెల్లించి లబ్ధి పొందాలని రాష్ట్ర వాణిజ్య పన్నుల కమిషనర్ కె.హరిత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్వీ భట్టి మాట్లాడారు. ఎఫ్‌టీసీసీఐ జీఎస్టీ కమిటీ చైర్మన్ మొహమ్మద్ ఇర్షాద్ అహ్మద్, బాంబే హైకోర్టు సీనియర్ న్యాయవాదులు లక్ష్మీకుమారన్, శ్రీధరన్ తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ జర్నలిస్టుల అధ్యయన వేదిక డైరీని ఆవిష్కరిస్తున్న సీఎం ఎ.రేవంత్‌రెడ్డి. చిత్రంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, బోదనపల్లి వేణుగోపాల్‌రెడ్డి, సాదిక్, కె.శ్రీనివాసరావు, కంచె రాజు

గ్రూప్–1 ఫలితాలు రీవాల్యుయేషన్ చేయాలి

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ డిమాండ్



పంజగుట్ట (హైదరాబాద్): గ్రూప్–1 ప్రశ్నపత్రాలను రీకౌంటింగ్ కాదు, రీవాల్యుయేషన్ చేయాలని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ డిమాండ్ చేశారు. ఫలితాల్లో తెలుగు మీడియం అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగినట్లు భావిస్తున్నారన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో కోచింగ్ సెంటర్ నిర్వాహకులు అశోక్, జర్నలిస్టు తెలంగాణ విఠల్‌తో కలిసి ప్రసన్న హరికృష్ణ మాట్లాడారు. టాప్–100లో 10 మంది కూడా తెలుగు మీడియం విద్యార్థుల్లేరని, 37 శాతం మంది అగ్రకులస్తులే ఉండటం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. నాన్ సీరియస్ అభ్యర్థులు, మొదటిసారి పరీక్ష రాసినవారు, 2023లో పాసైన అభ్యర్థులు పెద్ద సంఖ్యలో ఎంపిక కావడం కూడా అనుమానాలకు బలం చేకూరుస్తోందని తెలిపారు. ఉర్దూ మీడియం అభ్యర్థులు 9 మందే ఉన్నారని, వీరి పేపర్లు దిద్దిన వారు ఉర్దూ వారే కాబట్టి మతప్రాతిపదికన వీరికి అధికమార్కులు వచ్చాయన్న పుకార్లు వస్తున్నాయని చెప్పారు. జీఆర్ఎల్ ప్రకటిస్తే అభ్యర్థి నేపథ్యం, ఎక్కడ చదువుకున్నాడు అన్న అన్ని విషయాలు బయటపడతాయన్నారు. కొంతమంది ఆంధ్రా ప్రాంతానికి సంబంధించిన ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లతో తెలంగాణ చరిత్ర పేపర్లు దిద్దించినట్లు తెలుస్తోందని హరికృష్ణ తెలిపారు. వెంటనే మొదటి 600 ర్యాంకుల్లో ఇంగ్లిష్, తెలుగు, ఉర్దూ మీడియం అభ్యర్థుల సంఖ్య బయటపెట్టాలన్నారు. 2023లో డిగ్రీ పొంది 2024లో అర్హత సాధించిన వారి వివరాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఈమేరకు సీఎంకు బహిరంగ లేఖ రాస్తున్నట్లు చెప్పారు.

'రాయలసీమ'పై కేంద్రం కొరడా

డీపీఆర్ తయారీ ముసుగులో నిర్మాణ పనులు చేస్తున్నట్టు వచ్చిన ఫిర్యాదుపై తీవ్ర చర్యలు

- డీపీఆర్ కోసం చేపట్టిన తాత్కాలిక నిర్మాణాలను తొలగించాలని ఏపీకి ఆదేశం
- తవ్వకాలను పూడ్చి సైట్ పూర్వస్థితిని పునరుద్ధరించాలని సూచన
- ఇది తమ ప్రభుత్వ విజయమేనన్న మంత్రి ఉత్తమ్




సాక్షి, హైదరాబాద్: రాయలసీమ ఎత్తిపోతల పథకం విషయంలో ఏపీ ప్రభుత్వానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) ఆదేశాలను ఉల్లంఘించి డీపీఆర్ తయారీ ముసుగులో ఏపీ ప్రాజెక్టు నిర్మాణ పనులు కొనసాగిస్తోందని అందిన ఫిర్యాదులపై కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ తీవ్ర చర్యలకు ఉపక్రమించింది. డీపీఆర్ తయారీ కోసం చేపట్టిన తాత్కాలిక నిర్మాణాలన్నింటినీ తొలగించాల్సిందేనని, ఎక్కడైనా తవ్వకాలు జరిపితే వాటినీ పూడ్చివేయాల్సిందేనని స్పష్టం చేసింది. ప్రాజెక్టు నిర్మిత స్థలాన్ని దాని వాస్తవ పూర్వస్థితికి పునరుద్ధరించిన తర్వాతే పర్యావరణ అనుమతులకు దరఖాస్తు చేసుకోవాలని ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. గత నెల 27న రాయలసీమ ప్రాజెక్టుపై వచ్చిన ఫిర్యాదుపై చర్చించి కేంద్ర నిపుణుల మదింపు కమిటీ ఈ మేరకు ప్రభుత్వానికి అదనపు మార్గదర్శకాలను జారీ చేసింది. ప్రాజెక్టుకి పర్యావరణ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకునే సమయంలో, డీపీఆర్ తయారీకి సంబంధించిన పనులు మినహా ఇతర ఏ చర్యలు ప్రాజెక్టు సైట్‌లో చేపట్టలేదని పేర్కొంటూ అఫిడవిట్ రూపంలో స్వీయధ్రువీకరణ సమర్పించాలని స్పష్టంచేసింది. సైట్ పునరుద్ధరణకు తీసుకున్న చర్యలను ఫొటోలు, ఇతర ఆధారాలతో సహా సమర్పించాలని, ఇందుకు వాడిన పద్ధతులను, గడువులనూ తెలపాలని ఆదేశించింది. అఫిడవిట్‌లో అవాస్తవాలను పొందుపరిస్తే జల, వాయు, పర్యావరణ చట్టాల కింద సంబంధిత అధికారులు శిక్షార్హులవుతారని హెచ్చరించింది. ప్రాంతీయ అధికారి, కేంద్ర జలసంఘం, జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ), సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రిసెర్చ్ స్టేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడిగా ప్రాజెక్టు సైట్‌ను తనిఖీ చేశాక ఈ ధ్రువీకరణ పత్రం జారీ చేయాలని కోరింది. డీపీఆర్ తయారీ ముసుగులో పర్యావరణానికి ఏదైనా హానీ చేసినట్టు తనిఖీల్లో గుర్తిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని చెప్పింది.

రాష్ట్ర ప్రభుత్వ విజయం: మంత్రి ఉత్తమ్

రాయలసీమ ఎత్తిపోతల పథకానికి కేంద్రం పర్యావరణ అనుమతులు నిరాకరించడం రాష్ట్ర ప్రభుత్వం సాధించిన విజయమేనని నీటిపారుదల శాఖమంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ప్రాజెక్టును అడ్డుకోవడానికి ఇప్పటికే ప్రభుత్వం కృష్ణా బోర్డు, ఎన్జీటీ, కృష్ణా ట్రిబ్యునల్–2, సుప్రీం కోర్టులను ఆశ్రయించిందన్నారు. ఈ ప్రాజెక్టును అడ్డుకోవాలని తాను కేంద్ర జలశక్తి శాఖకు లేఖ రాయగా, శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా కేంద్ర పర్యావరణ శాఖ కార్యదర్శికి లేఖ రాశారన్నారు.

చంద్రబాబుని మించిన అవకాశవాది పవన్: అంబటి



సాక్షి, అమరావతి: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ టీడీపీ అధినేత చంద్రబాబుని మించిన అవకాశవాది అని వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సూపర్ సిక్స్, 143 హామీల అమలుపై జయకేతనం సభలో పవన్ ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. మెడికల్ కాలేజీలు, పోర్టులను చంద్రబాబు ప్రైవేటుకు ధారాదత్తం చేస్తుంటే ఎందుకు నోరెత్తడంలేదని అన్నారు. అంబటి రాంబాబు శనివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. పైకి నిజాయితీపరుడినని చెప్పుకొనే పవన్‌కు జనసేన ఎమ్మెల్యేల దోపిడీ, అవినీతి, బెదిరింపులు కనిపించడం లేదని దుయ్యబట్టారు. పవన్‌కి ప్రియాతి ప్రియమైన మంత్రి నాదెండ్ల మనోహర్ రేషన్ దోపిడీకి అడ్డే ఉండటంలేదని అన్నారు. నాయకులు ప్రజల నుంచే పుట్టాలని, వారసత్వ రాజకీయాలేమిటంటూ మాటలు చెప్పే పవన్.. వచ్చిన ఒక్క ఎమ్మెల్సీ పదవినీ అన్న నాగబాబుకే ఇచ్చుకున్నాడన్నారు. ఎన్నికల్లో గెలిపించే బాధ్యత నీదేనంటూ సీటు త్యాగం చేసిన వర్మతో పనిచేయించుకుని, ఆయన వల్ల గెలిచామంటే నీ ఖర్మ అంటూ ఆయన్ని ఎగతాళి చేశారని అన్నారు. అక్కర గడుపుకొని మోసం చేయడంలో, అవకాశవాదంలో చంద్రబాబునే మించిపోయారని చెప్పారు. 40 ఏళ్ల టీడీపీ పడిపోతుంటే నిలబెట్టామని మాత్రం పవన్ నిజం చెప్పారని తెలిపారు. ఇదే విషయాన్ని తాము మొదట్నుంచి చెబుతూనే ఉన్నామని తెలిపారు. పవన్ ప్రజల కోసం పోరాడే వ్యక్తి కాదని, చంద్రబాబుకు ఊడిగం చేయడానికి, టీడీపీకి బి టీమ్‌గా జనసేనను స్థాపించారని చెప్పారు.

ఈనాడు ఆస్తుల జప్తు

గూడవల్లి వద్ద ఉన్న ఆస్తులపై కోర్టు ఆదేశం

- ఆ ఆస్తులను ఎవరికీ బదలాయించరాదు
- తాకట్టుపెట్టడం, విక్రయించడం, బహుమతిగా ఇవ్వడం కుదరదు
- విజయవాడలో లీజు గడువు ముగిసినా ఖాళీ చేయని ఈనాడు
- స్థల యజమానికి రూ.5.2 కోట్లను 6 శాతం వడ్డీతో చెల్లించాలని గతంలో ఆదేశించిన కోర్టు
- పట్టించుకోని ఈనాడు యాజమాన్యం.. దాంతో ఈనాడు ఆస్తుల జప్తు కోరిన బాధితుడు
- గతంలో విశాఖ స్థల యజమానికీ ముప్పుతిప్పలు..
- కొనసాగుతున్న ఈనాడు దౌర్జన్యం.. కోర్టులు ఆదేశించినా లెక్కలేనితనం



సాక్షి, అమరావతి: అందరికీ నిత్యం ఉదయాన్నే నీతులు చెప్పే ఈనాడు (ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్) దౌర్జన్యం కొనసాగుతోంది. తమ పత్రిక ద్వారా జనాలకు నీతులు మాత్రమే చెబుతామని, వాటిని తాము మాత్రం ఆచరించమని ఈనాడు మరోమారు నిరూపించింది. గతంలో విశాఖపట్నం ఈనాడు కార్యాలయం స్థలం విషయంలో దాని యజమాని ఆదిత్య వర్మను ముప్పుతిప్పలు పెట్టిన ఈనాడు యాజమాన్యం, ఇప్పుడు విజయవాడలో ఉన్న కార్యాలయ స్థలం విషయంలో కూడా దాని యజమాని ముసునూరు అప్పారావును సైతం అలాగే ముప్పుతిప్పలు పెడుతోంది. ఈనాడు పత్రిక కోసం తీసుకున్న స్థలం లీజు గడువు ముగిసినా.. దాన్ని అప్పారావుకు అప్పగించకుండా చుక్కలు చూపిస్తోంది. కోర్టుకెళ్లి అప్పారావు విజయం సాధించినా.. న్యాయస్థానం ఆదేశాలను సైతం ఈనాడు బేఖాతరు చేసింది. దీంతో కోర్టు ఈనాడు తీరును తీవ్రంగా ఆక్షేపించింది. స్థల యజమానిని వేధించడానికే ఆ స్థలాన్ని ఖాళీ చేయడం లేదని కూడా ఘాటుగా వ్యాఖ్యానించింది. కాగా.. బాధితుడు అప్పారావుకు రూ.5.20 కోట్లను 6 శాతం వార్షిక వడ్డీతో పరిహారం చెల్లించాలంటూ కోర్టు ఇచ్చిన ఆదేశాలను సైతం ఈనాడు యాజమాన్యం పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో ఈనాడు ఆస్తుల జప్తునకు న్యాయస్థానం తాజాగా ఆదేశాలు ఇచ్చింది. విజయవాడ గ్రామీణ మండలం గూడవల్లిలో ఉన్న ఈనాడు ఆస్తులను బదలాయించడం, తాకట్టు పెట్టడం, అమ్మడం, బహుమతిగా ఇవ్వడం చేయరాదని ఈనాడు యాజమాన్యాన్ని ఆదేశించింది. ఈ ఆస్తులను ఎవరూ కొనడం, బహుమతిగా తీసుకోవడం చేయరాదంది. తదుపరి ఆదేశాలు ఇచ్చేంతవరకు ఈ ఉత్తర్వులు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. విచారణను ఈ నెల 20వ తేదీకి వాయిదా వేసింది. ఆ రోజు విచారణకు వ్యక్తిగతంగా హాజరు కావాలని ఈనాడు ఎండీ కిరణ్‌ను ఆదేశించింది.

అసలు కథ ఏమిటంటే..

ఈనాడు యజమాని రామోజీరావు 1975లో విజయవాడ పటమటలంకలో ముసునూరి అప్పారావుకు చెందిన 92 సెంట్ల స్థలాన్ని 33 ఏళ్ల పాటు లీజుకు తీసుకున్నారు. నెలకు రూ.725 అద్దె చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆ పక్కనే అప్పారావు సమీప బంధువైన వల్లూరు వెంకటేశ్వరరావుకు చెందిన ఎకరా 47 సెంట్ల భూమిని కూడా రామోజీరావు లీజుకు తీసుకున్నారు. లీజు గడువు 30.04.2008న ముగిసింది. దీంతో మరో 33 ఏళ్ల పాటు లీజు పొడిగించాలని స్థల యజమాని అప్పారావును రామోజీరావు కోరారు. రామోజీ సంగతి బాగా తెలిసిన అప్పారావు లీజు పొడిగింపునకు నిరాకరించారు. 6 నెలల్లో స్థలాన్ని ఖాళీ చేసి ఇవ్వాలని రామోజీరావుకు తేల్చిచెప్పారు. 6 నెలల గడువు 2008 అక్టోబర్‌తో ముగిసింది. అయినా రామోజీరావు ఆ స్థలాన్ని ఖాళీ చేయలేదు. ఇదే సమయంలో మరో 33 ఏళ్లపాటు లీజు పొడిగించేలా అప్పారావును ఆదేశించాలంటూ విజయవాడ జిల్లా కోర్టులో రామోజీరావు సూట్ దాఖలు చేశారు. దానిని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు 2013లో కొట్టేసింది. అప్పారావుకు చెందిన స్థలంపై ఈనాడుకు ఎలాంటి హక్కు లేదని తేల్చింది. అంతేకాక ఈనాడు ఆ స్థలంలో ఉండటం అక్రమమేనని స్పష్టం చేసింది. దీనిపై ఈనాడు అప్పీల్ దాఖలు చేసింది. ఈ అప్పీల్‌ను సైతం కోర్టు కొట్టేసింది.

పరిహారంగా రూ.5.20 కోట్లు చెల్లించాలని కోర్టు ఆదేశించినా..

ఈ నేపథ్యంలోనే 2015లో ముసునూరి అప్పారావు తన స్థలం నుంచి ఈనాడును ఖాళీ చేయించాలని కోరుతూ విజయవాడ కోర్టులో సూట్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు అప్పారావుకు అనుకూలంగా తీర్పునిచ్చింది. దాదాపు 60 పేజీల తీర్పు వెలువరించింది. 2012–15 వరకు అప్పారావుకు రూ.5.20 కోట్లను 6శాతం వార్షిక వడ్డీతో పరిహారంగా చెల్లించాలని ఈనాడు యాజమాన్యాన్ని ఆదేశించింది. మిగిలిన కాలానికి పరిహారం కోసం పిటిషన్ దాఖలు చేసుకునే వెసులుబాటును అప్పారావుకు ఇస్తూ 2024 అక్టోబర్ 3న తీర్పునిచ్చింది. అయితే.. ఈ తీర్పును ఈనాడు బేఖాతరు చేసింది. దీంతో తీర్పు అమలుకు అప్పారావు కింది కోర్టులో ఈపీ దాఖలు చేశారు. విజయవాడ గ్రామీణ మండలం గూడవల్లిలో ఉన్న ఈనాడు కార్యాలయాన్ని జప్తు చేయాలని అందులో కోరారు. దానిపై విచారణ జరిపిన కోర్టు తాము ఇచ్చిన ఆదేశాల మేరకు రూ.5.20 కోట్ల పరిహారం చెల్లించడంలో ఈనాడు విఫలమైందని తేల్చింది. ఇందుకు గాను ఈనాడు ఆస్తుల జప్తునకు ఆదేశిస్తున్నట్టు ఈ నెల 7న ఉత్తర్వులు జారీ చేసింది. ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ ఎండీ కిరణ్ వ్యక్తిగత హాజరుకు ఆదేశాలిస్తూ విచారణను ఈ నెల 20వ తేదీకి వాయిదా వేసింది.

హాజరు నుంచి హోంవర్క్ దాకా..

హుస్నాబాద్‌లోని జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థుల పర్యవేక్షణకు ప్రత్యేక యాప్

- విద్యార్థి బడికి హాజరు కాకుంటే వెంటనే తల్లిదండ్రులకు మెసేజ్
- ప్రోగ్రెస్ రిపోర్టులు, సెలవులు, సిలబస్ వంటివి కూడా అందుబాటులోకి తెచ్చేందుకు ఏర్పాట్లు


హుస్నాబాద్ ప్రభుత్వ పాఠశాల యాప్



హుస్నాబాద్ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల

సాక్షి, సిద్దిపేట: విద్యార్థి బడికి గైర్హాజరైతే వెంటనే తల్లిదండ్రులకు మెసేజ్ వెళుతుంది.. విద్యార్థికి ఆ రోజు ఇచ్చే అసైన్‌మెంట్లు/హోంవర్క్ వివరాలు కూడా యాప్‌లో వచ్చేస్తాయి.. అంతేకాదు పరీక్షల్లో వచ్చిన మార్కులు, ప్రోగ్రెస్ రిపోర్ట్, సెలవులు, సిలబస్ వంటి వివరాలూ తల్లిదండ్రులకు ఎప్పటికప్పుడు చేరుతాయి. ఇదేదో ప్రైవేట్ స్కూల్‌లో అమలవుతున్న ఆధునిక విధానం కాదు.. సిద్దిపేట జిల్లాలో హుస్నాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రత్యేకత. మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ మనుచౌదరి ప్రత్యేక చొరవ తీసుకుని ఓ ప్రైవేట్ కంపెనీ రూపొందించిన యాప్‌లో ఈ పాఠశాలకు ప్రత్యేక లాగిన్ అందించారు.

విద్యార్థులపై మంచి పర్యవేక్షణతో..

ఈ పాఠశాలలో 364 మంది విద్యార్థులున్నారు. రోజూ ఉదయం 9 గంటలకే యాప్‌లో, రిజిస్టర్‌లో విద్యార్థుల అటెండెన్స్ తీసుకుంటారు. పాఠశాలకు గైర్హాజరైన విద్యార్థి తల్లిదండ్రుల ఫోన్‌కు వెంటనే ఎస్సెమ్మెస్ వెళుతుంది. అలాగే విద్యార్థులకు రోజువారీగా ఇచ్చే అసైన్‌మెంట్లను క్లాస్ టీచర్లు యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఈ వివరాలు తల్లిదండ్రులకు చేరుతాయి. దీనితో పిల్లలు స్కూల్‌కు వెళ్తున్నామని డుమ్మాకొట్టే చాన్స్ ఉండదు. హోంవర్క్/రీడింగ్ లేదంటూ ఇళ్లలో చెప్పి తప్పించుకోవడానికీ వీలుండదని టీచర్లు చెబుతున్నారు. ఈ యాప్‌తో విద్యార్థులపై పర్యవేక్షణ సులువైందని అంటున్నారు.

త్వరలో విద్యార్థి ప్రోగ్రెస్ రిపోర్ట్ కూడా..

విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్ట్, లీవ్ అనుమతులు, నెలవారీ సిలబస్, పేరెంట్స్ ఫీడ్ బ్యాక్, పరీక్షల టైం టేబుల్, హాలిడేస్ లిస్ట్ వంటివి సైతం యాప్ ద్వారానే అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిద్వారా తల్లిదండ్రులు తమ పిల్లల పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. ప్రతి విద్యార్థికి సంబంధించి కనీస సామర్థ్యాలు సాధించే దిశగా విద్యార్థి సూచిక (స్టూడెంట్ ప్రొఫైల్) ఉంటుంది. సబ్జెక్టుల వారీగా వెనుకబడిన తీరు, పురోగతి సాధిస్తున్న అంశాలను ఇందులో పొందుపర్చనున్నారు.

హాజరుశాతం పెరిగింది



యాప్ ద్వారానే విద్యార్థుల అటెండెన్స్ తీసుకుంటున్నాం. విద్యార్థి స్కూల్‌కు గైర్హాజరైతే వెంటనే పేరెంట్స్‌కు సమాచారం వెళ్తుంది. పర్యవేక్షణ పెరగడంతో విద్యార్థుల హాజరు శాతం పెరిగింది. ప్రోగ్రెస్ రిపోర్ట్, ఫీడ్ బ్యాక్ వంటివి కూడా త్వరలో అందుబాటులోకి తీసుకువస్తాం.

– వాసుదేవరెడ్డి ప్రధాన ఉపాధ్యాయుడు, జెడ్పీ ఉన్నత పాఠశాల, హుస్నాబాద్

పిల్లలు గైర్హాజరైతే వెంటనే మెసేజ్ వస్తుంది



మా పిల్లలు ప్రభుత్వ స్కూల్‌లోనే చదువుతున్నారు. వాళ్లు స్కూల్‌కు వెళ్లకుంటే నా ఫోన్‌కు మెసేజ్ వస్తుంది. ఇలా తల్లిదండ్రులకు విద్యార్థుల సమాచారం తెలపడం బాగుంది. టీచర్లు అసైన్‌మెంట్లను యాప్‌లో పెడుతుండటంతో.. పిల్లలు ఇంటికి వచ్చాక వారిని దగ్గరుండి చదివిస్తున్నాం.

– ముక్కెర రమేశ్, విద్యార్థి తండ్రి

రిజర్వేషన్ల అమలుకు న్యాయపరమైన పునాదులుండాలి

సీఎంకు వకుళాభరణం బహిరంగలేఖ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను చట్టబద్ధంగా అమలు చేయనున్నప్పటికీ, దీన్ని శాసనసభలో ప్రవేశపెట్టే ముందు న్యాయపరమైన, గణాంకపరమైన పునాదులను బలంగా ఏర్పాటు చేయాల్సిన అవసరముందని బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు సూచించారు. బీసీ బిల్లుల అమలు నిర్ణయాన్ని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి కమిటీ నివేదిక ఆధారంగా తీసుకోవాలన్నారు. ఈ మేరకు శనివారం సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన బహిరంగ లేఖరాశారు. కులగణన, న్యాయస్థానాల తీర్పులు, కేంద్ర ప్రభుత్వ అనుమతుల వంటి అంశాలపై పూర్తిస్థాయి స్పష్టత లేకుండా బిల్లులను ప్రవేశపెడితే, భవిష్యత్తులో వివాదాలు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కులగణనను సమగ్రంగా అధ్యయనం చేసేందుకు జస్టిస్ సుదర్శన్ రెడ్డి నేతృత్వంలో ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసిందని, ఈ కమిటీ రాష్ట్రంలోని కులగణన గణాంకాలను అధ్యయనం చేసి, పూర్తిస్థాయి నివేదిక సమర్పించిన తర్వాతే బీసీ బిల్లులను శాసనసభలో ప్రవేశపెట్టాలని కోరారు. బీసీ రిజర్వేషన్లపై బూసాని వెంకటేశ్వరరావు నేతృత్వంలోని డెడికేటెడ్ కమిషన్ నివేదిక పూర్తిస్థాయిలో పరిశీలించకుండా రూపొందించారని, కులగణన నివేదిక పూర్తికాకముందే, డెడికేటెడ్ కమిషన్ తన నివేదికను సిద్ధం చేసిందన్నారు.



ఆటలంటే బలం. కుటుంబం అంటే అమోఘ బలం. ఫ్యామిలీకి ఆటలు తోడైతే... ఆ బలం చెప్పలేనంత! 63 సంవత్సరాల కందుకూరి లావణ్య, ఆమె భర్త 69 సంవత్సరాల నాగేశ్వరరావు అథ్లెటిక్స్‌లో రాణిస్తూ 'ఆహా' అనిపిస్తున్నారు. తల్లిదండ్రుల బాట లోకి వచ్చిన 35 సంవత్సరాల అపర్ణ ఆటల్లో విజయకేతనం ఎగరేస్తోంది. 'ఆటలకు వయసు అడ్డు కాదు' అంటూ ఎంతోమందికి స్ఫూర్తి ఇస్తున్న కందుకూరి కుటుంబం గురించి..

ఆటల కుటుంబం!

విశాఖ జిల్లా భీమిలికి చెందిన లావణ్య చిన్నప్పటి నుంచే పరుగు పందేలలో పాల్గొనేది. షటిల్, రింగ్‌టెన్నిస్ బాగా ఆడేది. నాగేశ్వరరావుకు కూడా ఆటలంటే ఇష్టం. కబడ్డీ నుంచి షటిల్ వరకు ఎన్నో ఆటల్లో ప్రావీణ్యం సంపాదించాడు. భార్యాభర్తలిద్దరికీ ఆటలంటే ప్రాణం కావడంతో ఇంటినిండా ఆటల కబుర్లే!

ఆటలకు సంబంధించి తమ చిన్ననాటి విశేషాలను ఒకరితో ఒకరు పంచుకునేవారు. 'ఆరోజులు మళ్లీ వస్తే బాగుణ్ణు' అనుకునేవారు.

'చరిత్ర పునరావృతమవుతుంది' అంటారు కదా!

'ఆంజనేయా వెటరన్స్ అసోసియేషన్' పుణ్యమా అని అలాగే జరిగింది. భీమిలిలో కోనాడ జయరాముడు అనే వెటరన్ క్రీడాకారుడు ఏర్పాటు చేసిన 'ఆంజనేయా వెటరన్స్ అథ్లెట్ అసోసియేషన్'లో లావణ్య, నాగేశ్వరరావు సభ్యులుగా చేరారు. విశాఖలోని 'మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్'లో సభ్యత్వం తీసుకున్నారు. అలా... మళ్లీ ఆటల ప్రపంచంలోకి అడుగు పెట్టే అపూర్వ అవకాశం వచ్చింది. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనడం మొదలైంది.

విజయపరంపర

కరీంనగర్‌లో జరిగిన 800,1500 మీటర్ల పరుగు పందెంలో లావణ్య ప్రథమ స్థానంలో, నాగేశ్వరరావు ద్వితీయ స్థానంలో నిలిచారు. మహబూబ్‌నగర్, గుంటూరులో జరిగిన పోటీల్లో ప్రథమ స్థానాల్లో నిలిచారు. చెన్నైలో జరిగిన జాతీయ పోటీల్లో 800, 1500 మీటర్ల పరుగులో ప్రథమ, 5 కిలోమీటర్ల పరుగులో ద్వితీయ స్థానంలో నిలిచింది లావణ్య. బెంగళూరులో జరిగిన 800, 1500 మీటర్ల పరుగులో భార్యాభర్తలిద్దరూ ప్రథమ స్థానంలో నిలిచారు. 200 మీటర్ల హర్డిల్స్‌లో ద్వితీయస్థానంలో నిలిచారు. చండీగఢ్, భోపాల్, హరియాణా కురుక్షేత్రలో జరిగిన పోటీల్లోనూ విజయకేతనం ఎగరేశారు.

అంతర్జాతీయ స్థాయిలో...

లావణ్య మరో అడుగు ముందుకు వేసి అంతర్జాతీయ పోటీల్లోనూ సత్తా చాటుతోంది. చైనాలో జరిగిన పోటీలతో అంతర్జాతీయ పోటీల్లోకి అడుగుపెట్టింది. 800 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానంలో నిలిచింది. శ్రీలంకలో 400, 800, 1500 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఫిలిప్పీన్స్‌లో పది వేల మీటర్ల పరుగులో ప్రథమ స్థానంలో నిలిచింది, సింగపూర్, థాయ్‌లాండ్‌లో జరిగిన పోటీల్లోనూ పాల్గొంది.



అనంతపురంలో మెడల్స్, ప్రశంస పత్రాలతో లావణ్య, కూతురు అపర్ణ

వారి సాయం మరువలేనిది



నా భార్యకు అన్ని విధాలుగా సహకరించి, తోడుగా ఉండాలని నేను కూడా తనతోపాటు పోటీల్లో పాల్గొంటున్నాను. ఆటల వల్ల చాలా ఉత్సాహంగా ఉంది. ఎన్నో ప్రాంతాలకు వెళుతున్నాం. కొత్తగా జీవితం మొదలు పెట్టినట్లుగా ఉంది. పోటీలకు వెళ్లడానికి పలువురు దాతలు అందిస్తున్న సాయం మరువలేనిది.

– కందుకూరి నాగేశ్వరరావు

కూతురు కూడా...

లావణ్య కుమార్తె అపర్ణకు చిన్నప్పటి నుంచి ఆటలంటే ఇష్టం. రన్నింగ్‌తో పాటు వాలీబాల్‌లో ప్రతిభ చూపేది. పెళ్లి తరువాత ఆటలకు దూరమైంది. అయితే తల్లిదండ్రుల స్ఫూర్తితో 35 సంవత్సరాల అపర్ణ 'విశాఖ అథ్లెటిక్స్ అసోసియేషన్'లో సభ్యత్వం తీసుకుంది. తల్లి,కూతుళ్లు కలిసి తొలిసారిగా గత నెలలో అనంతపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌లో పాల్గొన్నారు. లావణ్య 100, 800మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానంలో, 200 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచింది. అయిదు కిలోమీటర్ల పరుగు పందెంలో అపర్ణ ప్రథమ స్థానం, 100 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఇకపై తల్లితండ్రులతో కలిసి పోటీల్లో పాల్గొనాలని నిర్ణయించుకుంది అపర్ణ.

– సింగారెడ్డి రమణ ప్రసాద్, సాక్షి, భీమిలి

అమ్మతో పాటు...



అమ్మానాన్నలు ఒకరికొకరు స్ఫూర్తి. వారి నుంచి నేను స్ఫూర్తి పొంది 35 సంవత్సరాల వయసులో ఆటల ప్రపంచంలోకి అడుగు పెట్టాను. అమ్మతో పాటు పోటీల్లో పాల్గొనడం, విజయం సాధించడం సంతోషంగా ఉంది. ఉత్సాహం ఉండాలేగానీ ఆటలకు వయసు ఎప్పుడూ అడ్డు కాదు.

– అపర్ణ

కొత్త ప్రపంచంలోకి...



ఆటల వల్ల కొత్త ప్రపంచాన్ని చూడగలుగుతున్నాను. దేశంలోని ఎన్నో ప్రాంతాలతోపాటు విదేశాలకు వెళ్లగలిగాను. 'ఈ వయసులో ఆటలు ఎందుకు?' అని నా భర్త నాగేశ్వరరావు అని ఉంటే నేను ఇంటికే పరిమితమయ్యేదాన్ని. ఆయన నన్ను ఎంతో ప్రోత్సహించారు. తాను కూడా మళ్లీ ఆటల్లోకి వచ్చారు. మా ఇద్దరి స్ఫూర్తితో మా అమ్మాయి కూడా ఆటల్లోకి రావడం చాలా సంతోషంగా ఉంది.

– కందుకూరి లావణ్య

బ్యూటిప్స్ / హెయిర్ కేర్

- మందార ఆకుల్ని నూరి షాంపూగా వాడితే జుత్తు బాగా పెరుగుతుంది. చుండ్రు నివారణలోనూ, తెల్ల వెంట్రుకల నిరోధకంలోనూ బాగా సాయమవుతుంది. ఒక కప్పు నీటిలో ఒక పూవు చొప్పున వేసి ఆ నీళ్లను తాగితే రక్తంలో ఐరన్ పెరుగుతుంది.



- కలబంద గుజ్జు అదేనండీ... అలోవెరా జెల్... ఒక సహజసిద్ధమైన కండీషనర్. మాయిశ్చరైజర్ కూడా. ఈ గుజ్జును చర్మం మీద, మాడు మీద రుద్దితే, చుండ్రు సమస్యలు, చర్మ వ్యాధులు చాలా వరకు తగ్గుతాయి. ఈ గుజ్జుతో కాలిన గాయాలు కూడా త్వరగా మానిపోతాయి.



- గోరింటాకు, జుత్తుకు సహజసిద్ధమైన రంగుగానే కాకుండా, ఫంగల్ ఇన్‌ఫెక్షన్ నివారణలోనూ బాగా తోడ్పడుతుంది. వెంట్రుక కుదుర్లను పటిష్ఠం చేయడం ద్వారా ఇది చుండ్రును, జుత్తు రాలడాన్ని నివారిస్తుంది.

● ఫ్యూచర్ టెన్స్

విజన్ 2030

మధురా దాస్ గుప్తా



పాతిక సంవత్సరాలు బ్యాంకర్‌గా పనిచేసిన ముంబైకి చెందిన మధురా దాస్ గుప్తా సిన్హా ఉద్యోగమే జీవితం అనుకోలేదు. ఇతర మహిళల జీవితాల గురించి ఆలోచించింది. ప్రసవం తరువాత దాస్ గుప్తా స్నేహితురాలు ఉద్యోగ విరామం తీసుకుంది. ఆమె ఉన్నత విద్యావంతురాలు. కొన్ని కారణాల వల్ల ఆ ఉద్యోగ విరామం అలాగే ఉండిపోయింది.

'పెళ్లయిన తరువాత ఉద్యోగం ఎందుకు?' అనే భావనతో ఒక యువతి తన ఉద్యోగానికి రాజీనామా చేసింది... ఇలాంటి సంఘటనలు మధురా దాస్ గుప్తాను లోతుగా ఆలోచించేలా చేశాయి.


'యాస్పైర్ ఫర్ హర్' అనే సంస్థను ప్రారంభించేలా చేశాయి.

భారతదేశ శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యం తగ్గడాన్ని దృష్టిలో పెట్టుకొని 'యాస్పైర్ ఫర్ హర్'కు శ్రీకారం చుట్టింది మధురా దాస్ గుప్తా. మెంటార్‌షిప్, స్కిలింగ్, రోల్‌మోడల్స్, నెట్‌వర్కింగ్ ద్వారా మహిళలు శ్రామిక శక్తిలోకి వచ్చేలా ప్రేరేపించడానికి ఉద్దేశించిన కమ్యూనిటీ ఆధారిత వేదిక ఇది. 2030 నాటికి పది మిలియన్‌ల మంది మహిళలను శ్రామిక శక్తిలో చేర్చే లక్ష్యంతో 'యాస్పైర్ ఫర్ ఉమెన్' పనిచేస్తుంది.

● వికాసం

మార్పు... మంచిదే కదా!





'తన క్యారెక్టరే తనకు శాపం అయింది'

'పుట్టుకతో వచ్చిన బుద్ధులు పుడకలతోగానీ పోవు'... ఇలాంటి మాటలు వింటూ ఉంటాం. వ్యక్తిత్వం(క్యారెక్టర్) అనేది మార్పుకు వీలులేనంత జటిలమైనదా?

ఒకే సంవత్సరంలో మన వ్యక్తిత్వాన్ని మార్చుకోవడం సాధ్యమేనా?

'సాధ్యమే' అంటుంది 'మీ, బట్, బెటర్: ది సైన్స్ అండ్ ప్రామిస్ ఆఫ్ పర్సనాలిటీ చేంజ్' పుస్తకం.

అవార్డు విన్నింగ్ అమెరికన్ జర్నలిస్ట్ ఓల్గా ఖాజాన్ రాసిన ఈ పుస్తకం శాశ్వత మార్పు వెనుక ఉన్న శాస్త్రాన్ని వెల్లడిస్తుంది. వాటీజ్ పర్సనాలిటీ, వాటీజ్ పర్సనాలిటీ చేంజ్, ఓపెన్‌నెస్ టు ఎక్స్‌పీరియన్స్... మొదలైన చాప్టర్‌లు ఈ పుస్తకంలో ఉన్నాయి. ఈ పుస్తకం కోసం ఎంతోమందిని ఇంటర్వ్యూ చేసింది రచయిత్రి.


ఎంతోమందికి నచ్చిన 'మీ, బట్, బెటర్' పుస్తకం రాసిన ఖాజాన్‌కు ఇష్టమైన పుస్తకం... జాక్ హార్ట్ రాసిన స్టోరీ క్రాఫ్ట్.

హెల్త్

● పెద్దలకు ఇద్దాం!

ఇమ్యూనిటీకాలు





మామూలుగా వ్యాక్సిన్లు అంటే పిల్లలకే అని చాలామంది అనుకుంటుంటారు. అవి పెద్దవాళ్లకూ అవసరమవుతాయి. కోవిడ్ టైమ్‌లో వ్యాక్సిన్‌కు విశేష ప్రాచుర్యం వచ్చింది. పెద్దవాళ్లకు ఇచ్చే వ్యాక్సిన్ అంటే అది కోవిడ్ కోసమే కాదు... ఇంకా చాలా రకాల వ్యాధులను నివారించగలిగే వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి. వీటిని పెద్దవాళ్లకు ఇవ్వాల్సిన కారణం ఏమిటంటే... వయసు పెరుగుతున్న కొద్దీ వ్యాధి నిరోధక వ్యవస్థ మునపటి అంత బలంగా ఉండకపోవచ్చు. దాంతో ఇమ్యూనిటీకి బలం పెంచడం కోసం ఇలా తీసుకోవచ్చు. అలాగే చిన్నప్పుడు తీసుకున్న వ్యాక్సిన్లు క్రమంగా ప్రభావం కోల్పోతూ ఉండవచ్చు. అందుకే వాటిని మరింత బలోపేతం చేసేందుకు 50 ఏళ్ల వయసు దాటిన దగ్గర్నుంచి కొన్ని వ్యాక్సిన్లు తీసుకోవాల్సి ఉంటుంది. వాటి వివరాలివి...

సాధారణంగా 19 ఏళ్ల నుంచి 65 ఏళ్ల మధ్య వయసులో కొన్ని రకాల జబ్బులు ఉండి, వాళ్లలో వ్యాధి నిరోధక వ్యవస్థ కాస్త బలహీనంగా (ఇమ్యూనో కాంప్రమైజ్ కండిషన్) ఉన్నప్పుడు 65 ఏళ్ల వయసు తర్వాత కొన్ని జబ్బులు వచ్చే ముప్పు ఉంది. పెద్దవాళ్లకు ఇవ్వాల్సిన టీకాలు ఇవ్వడం ద్వారా ఆ ముప్పును దాదాపుగా నివారించవచ్చు. అందుకే ఈ వ్యాక్సిన్లు.

పెద్ద వయసు వారు తీసుకోవాల్సిన రకరకాల వ్యాక్సిన్లు


ఇన్‌ఫ్లుయెంజా వ్యాక్సిన్

ఇది ఇన్‌ఫ్లుయెంజా వైరస్ వల్ల కలిగే ఫ్లూ వ్యాధికి నివారణగా ఇచ్చే వ్యాక్సిన్. జలుబు చేసినప్పుడు కనిపించే లక్షణాలే ఇన్‌ఫ్లుయెంజా వైరస్ సోకినప్పుడూ కనిపిస్తాయి. అయితే ఇన్‌ఫ్లుయెంజా నేరుగా హాని చేయకపోవచ్చు. జలుబు తగ్గినట్లే అదీ తగ్గిపోతుంది. కానీ ఒక్కోసారి ఇన్‌ఫ్లుయెంజా వైరస్ కారణంగా వచ్చే రెండో దశ దుష్పరిణామాలైన శ్వాసకోశ సమస్యల వంటివి తీవ్రంగా బాధిస్తాయి. పైగా ఇన్‌ఫ్లుయెంజా వైరస్ ఎప్పటికప్పుడు తన జన్యుస్వరూపాన్ని మార్చుకుంటుంది. అందుకే జలుబు వైరస్‌కు ఒకే వ్యాక్సిన్ రూపొందించడం కష్టసాధ్యం. అందుకే అరవై ఐదేళ్లు పైబడిన వారు, ఇమ్యూనోకాంప్రమైజ్ స్టేటస్‌లో ఉన్నవాళ్లు (వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉన్నవాళ్లు) ఈ ఇన్‌ఫ్లుయెంజా వ్యాక్సిన్‌ను ప్రతి ఏడాదీ తీసుకోవాలి. దీన్ని ప్రతి ఏడాదీ సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో తీసుకోవడం మంచిది.

సూచన : గుడ్డుతో అలర్జీ ఉన్నవారు దీని బదులు రీకాంబినెంట్ వ్యాక్సిన్ కూడా తీసుకోవాలి.

హెపటైటిస్-బి వ్యాక్సిన్

హెపటైటిస్-బీ వైరస్ కూడా కాలేయాన్నే ప్రభావితం చేసే మరింత ప్రమాదకరమైన వ్యాధి. హెచ్ఐవీ వ్యాప్తి చెందే మార్గాల్లోనే దీని వ్యాప్తి జరుగుతుంది. కాలేయాన్ని పూర్తిగా దెబ్బతీసి ప్రాణాంతకంగా మార్చే ముప్పు ఉంటుంది. ఇంత ప్రమాదకరమైన వైరస్‌కు అదృష్టవశాత్తూ వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. దీన్ని మూడు డోసుల్లో ఇవ్వాలి. మొదటిది ఇచ్చిన నెల తర్వాత రెండో డోసూ, అలాగే మొదటిది ఇచ్చిన ఆర్నెల్లకి మూడో డోసు ఇవ్వాలి. యుక్తవయస్కులూ దీన్ని తీసుకోవడం మేలు.





డాక్టర్ టీఎన్‌జే రాజేశ్
సీనియర్ కన్సల్టెంట్ ఫిజీషియన్

నిమోకోకల్ వ్యాక్సిన్ : వయసు పైబడిన వారిలో స్ట్రెప్టోకాకల్ నిమోనియా అనే బ్యాక్టీరియాతో నిమోనియా, మెనింజైటిస్, బ్యాక్టీరిమియా అనే సమస్యలు ఎక్కువగా వస్తుంటాయి.

నిమోకాకల్ కాంజుగేట్ వ్యాక్సిన్ (పీసీవీ 13): 65 ఏళ్ల వయసు పైబడిన ప్రతివారూ ఈ వ్యాక్సిన్ ఒక డోస్ తీసుకోవాలి. ఇది తీసుకున్న ఏడాది తర్వాత నిమోకాకల్ పాలీసాకరైడ్ వ్యాక్సిన్ (పీపీఎస్‌వీ 23) తీసుకోవాలి.

నిమోకాకల్ పాలీసాకరైడ్ వ్యాక్సిన్ (పీపీఎస్‌వీ 23): ప్రస్తుతం వేర్వేరు నిమోకాకల్ బ్యాక్టీరియా స్ట్రెయిన్స్ కారణంగా వచ్చే అనేక రకాల వ్యాధులకు 'నిమోకాకల్ పాలీసాకరైడ్ వ్యాక్సిన్' తో ప్రయోజనం చేకూరుతుంది. ఇది కేవలం ఒక్క నిమోనియాకు మాత్రమే కాకుండా మెనింజైటిస్, బ్యాక్టీరిమియా (బ్లడ్ ఇన్ఫెక్షన్) లకు నివారణ ఔషధంగా కూడా పనిచేస్తుంది. అయితే దీనివల్ల నూరు శాతం నివారణ జరగకపోవచ్చు. కాకపోతే చాలా వరకు రక్షణ లభించడంతో పాటు ఒకవేళ టీకా తీసుకుని ఉంటే పైన పేర్కొన్న వ్యాధులు చాలా వరకు తగ్గి, కాంప్లికేషన్లు కూడా చాలా వరకు నివారితమవుతాయి. అయితే నిమోకాకల్ పాలీసాకరైడ్ వ్యాక్సిన్ తీసుకున్న ఐదేళ్ల తర్వాత మళ్లీ మరో డోస్ తీసుకోవాలి. అలా ప్రతి ఐదేళ్లకోమారు ఈ వ్యాక్సిన్ తీసుకుంటూ ఉండాలి.

హెపటైటిస్ ఏ వ్యాక్సిన్

కాలేయాన్ని ప్రభావితం చేసేదే ఈ హెపటైటిస్-ఏ వైరస్. కలుషితాహారం, కలుషితమైన నీటి ద్వారా ఈ వైరస్ వ్యాపిస్తుంది. పెద్ద వయసు వారిలో వ్యాధి నిరోధకత తక్కువగా ఉన్నప్పుడు ఈ వ్యాక్సిన్ తీసుకోవడం అవసరం. దీని నివారణకు ఒక డోసు వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత, ఆర్నెల్లకు మరో విడత కూడా తీసుకోవాలి.

వ్యారిసెల్లా వ్యాక్సిన్

వ్యారిసెల్లా జోస్టర్ వైరస్ (వీజడ్‌వీ) అనే ఈ వైరస్ 'చికెన్‌పాక్స్'ను కలిగిస్తుంది. వ్యారెసెల్లా వ్యాక్సిన్ వృద్ధుల్లో ఈ చికెన్ పాక్స్ నుంచి రక్షణ కల్పిస్తుంది. అప్పటికే ఏవైనా వ్యాధులతో బాధపడుతున్నవాళ్లకూ, గతంలో ఈ వ్యాక్సిన్ ఇచ్చినప్పుడు తీవ్రమైన అలర్జీ వచ్చినవాళ్లకూ, హెచ్ఐవీ వ్యాధి ఉండి, సీడీ4 సెల్స్ కౌంట్స్ 200 లోపు ఉన్నవారికీ, వ్యాధి నిరోధక శక్తి బాగా తగ్గిపోయి, ఇమ్యూనో కాంప్రమైజ్‌డ్ స్టేటస్‌లో ఉన్నవారికి, స్టెరాయిడ్స్ మీద ఉన్నవారికి డాక్టర్లు ఈ వ్యాక్సిన్‌ను సిఫార్సు చేయరు. అలాగే క్యాన్సర్ కోసం కీమోథెరపీ తీసుకుంటున్నవారు, గత ఐదు నెలల వ్యవధిలో రక్తమార్పిడి / రక్తంలోని ఏదైనా అంశాన్ని తీసుకున్నవారు కూడా ఈ వ్యాక్సిన్‌ను తీసుకోకూడదు. గర్భవతులకూ దీన్ని ఇవ్వకూడదు.

టైఫాయిడ్ వ్యాక్సిన్

టైఫాయిడ్ వ్యాక్సిన్ : అందరూ తీసుకోవాల్సిన మరో ముఖ్యమైన వ్యాక్సిన్ ఇది. మరీ ముఖ్యంగా ఆహార పరిశ్రమలో పనిచేసే వారూ, వంటలు చేసేవారు తప్పనిసరిగా తీసుకోవాల్సిన వ్యాక్సిన్. ఆహార తయారీ రంగంలో ఉండేవారికి టైఫాయిడ్ ఉంటే... ఓ క్యారియర్‌గా వారు అనేక మందికి ఈ వ్యాధిని సంక్రమింపజేసే అవకాశం ఉన్నందున వాళ్లు తప్పనిసరిగా తీసుకోవాలన్నది డాక్టర్ల సిఫార్సు.

డిఫ్తీరియా అండ్ టెటనస్ వ్యాక్సిన్

డిఫ్తీరియా అండ్ టెటనస్ వ్యాక్సిన్ : ప్రతి చిన్నారికీ తమ చిన్నతనంలో డీటీపీ వ్యాక్సిన్ ఇస్తారు. కానీ 40 ఏళ్ల వయసు వచ్చేనాటికి వాళ్లలో ఆ టెటనస్ వ్యాక్సిన్ ప్రభావం సగానికి తగ్గుతుంది. అదే 60 ఏళ్ల వయసుకు రాగానే టెటనస్ వ్యాక్సిన్ ప్రభావం కేవలం 10 శాతం మాత్రమే ఉంటుంది. కాబట్టి ఈ టెటనస్ డోస్‌ను 60 దాటిన వారికి మరోసారి ఇవ్వాలి. అది బూస్టర్ డోస్‌లా పనిచేసి టెటనస్ (ధనుర్వాతం) నుంచి రక్షణ కల్పిస్తుంది. అలాగే డిఫ్తీరియా వ్యాక్సిన్ కూడా తీసుకోవాలి. చిన్నప్పుడు ఇచ్చే డీపీటీలలో పెర్టుసిస్ (కోరింత దగ్గు) అనే సమస్య పెద్ద వయసులో రాదు కాబట్టి ఈ పెర్టుసిస్ వ్యాక్సిన్ పెద్దలకు ఇవ్వాల్సిన అవసరం ఉండదు. నిజానికి 'టీ-డ్యాప్' అనే వ్యాక్సిన్ ప్రతి పదేళ్లకు ఒకసారి తీసుకోవడం మంచిది.

హెర్పిస్ జోస్టర్ వ్యాధి

హెర్పిస్ జోస్టర్ అనే వైరస్‌తో మొదట చికెన్‌పాక్స్ వచ్చి, అటు పిమ్మట అది హెర్పిస్ జోస్టర్ వ్యాధికి దారితీస్తుంది. దాన్నే షింగిల్స్ అంటారు. జోస్టర్ వైరస్ సోకిన వారిలో పోస్ట్ హెర్పెటిక్ న్యూరాల్జియా అనే నరాలకు సంబంధించిన కాంప్లికేషన్ ఎక్కువగా కనిపిస్తుంది. హెర్పిస్ జోస్టర్ వైరస్ సోకిన వాళ్లలో 60 ఏళ్లు దాటాక ఈ పోస్ట్ హెర్పిటిక్ న్యూరాల్జియా వచ్చే అవకాశాలు ఎక్కువ. జోస్టర్ వ్యాక్సిన్ అన్నది ఈ హెర్పిస్ జోస్టర్ వ్యాధి నుంచి నివారణ ఇస్తుంది. అయితే ఈ వ్యాక్సిన్ వల్ల 100 శాతం వ్యాధి రాకుండా ఉంటుందనే గ్యారంటీ లేదు గానీ... వ్యాక్సిన్‌తో బాధితుల జీవన ప్రమాణం మెరుగవుతుందని చెప్పవచ్చు.



హ్యూమన్ పాపిలోమా వ్యాక్సిన్ (హెచ్‌పీవీ వ్యాక్సిన్)

ఇది మహిళల్లో సర్వైకల్ క్యాన్సర్‌నుంచి నివారణ కల్పిస్తుంది. మహిళలకు 26 ఏళ్ల వయసు వచ్చే వరకు ఈ వ్యాక్సిన్ ఇవ్వవచ్చు. 15 ఏళ్లు పైబడ్డ అమ్మాయిలు మొదలుకొని మూడు విడతలుగా ఈ వ్యాక్సిన్ ఇస్తారు. మొదటి డోసు ఇచ్చిన నెల తర్వాత రెండో డోసు, ఆర్నెల్ల తర్వాత మూడో డోసు ఇస్తారు. ఇందులో రెండు రకాలు అందుబాటులో ఉన్నాయి. ఒకటి రెండు రకాల స్ట్రెయిన్స్ నుంచి, మరొకటి నాలుగు రకాల స్ట్రెయిన్స్ నుంచి రక్షణ ఇస్తుంది. డాక్టర్ సలహా మేరకే అవసరమైన వాటిని వాడాల్సి ఉంటుంది.

మరికొన్ని వ్యాక్సిన్లు

ఇప్పుడు డెంగ్యూ వ్యాధికి వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చిందిగానీ దాన్ని కొన్ని పరిమితులకు లోబడి మాత్రమే ఇస్తారు. ఇవేగాక జపనీస్ ఎన్‌కెఫలైటిస్, రేబీస్, పోలియో, ఎల్లో ఫీవర్ వంటి వ్యాధుల నివారణకూ వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉన్నాయి ఎల్లో ఫీవర్ వ్యాధి మన దేశంలో లేదు కాబట్టి అది ఉన్నచోటికి వెళ్లే ప్రయాణికులు అక్కడికి వెళ్లే 15 రోజుల ముందుగా ఈ వ్యాక్సిన్ తీసుకోవాలి. అలాగే పశ్చిమాసియా దేశాలకు వెళ్లే వాళ్లు మెనింగోకోకల్ వ్యాక్సిన్ తీసుకోవడం మంచిది.



ఐపీఎల్‌కు నితీశ్ కుమార్ రెడ్డి సిద్ధం

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి ఐపీఎల్ కొత్త సీజన్‌లో బరిలోకి దిగేందుకు సిద్ధమయ్యాడు. గత కొంత కాలంగా పక్కటెముల గాయంతో బాధపడుతున్న అతను పూర్తిగా కోలుకున్నాడు. స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరిగిన టి20 సిరీస్ సమయంలో అతనికి ఈ గాయమైంది. చికిత్సతో పాటు జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో ఇప్పటి వరకు అతను రీహాబిలిటేషన్‌లో ఉన్నాడు. వైద్యులు ఫిట్‌గా తేల్చిన తర్వాత నితీశ్ యోయో టెస్టుకు కూడా హాజరయ్యాడు. ఇందులో కనీస స్కోరు 16.5 సాధించాల్సి ఉండగా నితీశ్ 18 స్కోరుతో ఈ పరీక్షను విజయవంతంగా పూర్తి చేశాడు. ఆదివారం అతను రైజర్స్ జట్టుతో చేరతాడు. మార్చి 23న హైదరాబాద్ సీజన్‌లో తమ తొలి మ్యాచ్ ఉప్పల్ స్టేడియంలోనే ఆడనుంది. 2024 ఐపీఎల్‌లో 142.92 స్ట్రైక్ రేట్‌తో నితీశ్ రెడ్డి 303 పరుగులు సాధించి జట్టు ఫైనల్ చేరడంలో కీలక పాత్ర పోషించాడు. అనంతరం భారత టి20 జట్టులోకి ఆ పై టెస్టు జట్టులోకి ఎంపికైన అతను ఆసీస్ గడ్డపై సత్తా చాటి అందరి దృష్టిని ఆకర్షించాడు. మెల్‌బోర్న్ మైదానంలో నితీశ్ చేసిన సెంచరీ హైలైట్‌గా నిలిచింది.



జై ముంబై

డబ్ల్యూపీఎల్ విజేత ముంబై ఇండియన్స్

- రెండో సారి టైటిల్ సాధించిన హర్మన్ బృందం
- వరుసగా మూడో ఫైనల్లో క్యాపిటల్స్ పరాజయం
- 8 పరుగులతో ఓడిన ఢిల్లీ

మహిళల ప్రీమియర్ లీగ్‌లో ముంబై ఇండియన్స్ మరో సారి జయకేతనం ఎగురవేసింది. రెండేళ్ల క్రితం టోర్నీ తొలి విజేతగా నిలిచిన జట్టు ఇప్పుడు మళ్లీ టైటిల్‌ను తమ ఖాతాలో వేసుకుంది. ఢిల్లీతో తుది పోరులో తక్కువ స్కోరుకే పరిమితమైనా... పట్టుదల, సమష్టితత్వంతో ఆడిన జట్టు లక్ష్యాన్ని కాపాడుకోగలిగింది. ఆల్‌రౌండర్ నాట్ సివర్ బ్రంట్, కెప్టెన్ హర్మన్ ఆఖరి పోరులో కీలక పాత్ర పోషించారు. మరో వైపు ఢిల్లీ క్యాపిటల్స్ బృందం విషాదంలో మునిగిపోయింది. వరుసగా మూడు సీజన్ల పాటు గ్రూప్‌లో టాపర్... వరుసగా మూడు ఫైనల్ మ్యాచ్‌లు... మూడింటిలోనూ పరాజయాలు. ఛేదనలో 17 పరుగులకే ఇద్దరు టాప్ బ్యాటర్లను కోల్పోయిన తర్వాత జట్టు కోలుకోలేకపోయింది. ఆ తర్వాత కొంత పోరాడినా లాభం లేకపోయింది.

ముంబై: డబ్ల్యూపీఎల్ సీజన్-3లో ముంబై ఇండియన్స్ చాంపియన్‌గా నిలిచింది. శనివారం జరిగిన ఫైనల్లో ముంబై 8 పరుగుల స్వల్ప తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 149 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హర్మన్‌ప్రీత్ కౌర్ (44 బంతుల్లో 66; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్ కాగా... నాట్ సివర్ బ్రంట్ (28 బంతుల్లో 30; 4 ఫోర్లు) రాణించింది. 14 పరుగులకే 2 వికెట్లు కోల్పోయిన దశలో వీరిద్దరు మూడో వికెట్‌కు 62 బంతుల్లోనే 89 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. అనంతరం ఢిల్లీ 20 ఓవర్లలో 9 వికెట్లకు 141 పరుగులే చేయగలిగింది. మరిజాన్ కాప్ (26 బంతుల్లో 40; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), జెమీమా రోడ్రిగ్స్ (21 బంతుల్లో 30; 4 ఫోర్లు) రాణించగా, నికీ ప్రసాద్ (23 బంతుల్లో 25 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) ఫర్వాలేదనిపించింది. నాట్ సివర్ బ్రంట్ 3 కీలక వికెట్లతో ఢిల్లీని దెబ్బ తీసింది. 523 పరుగులు చేసి 12 వికెట్లు తీసిన నాట్ సివర్ బ్రంట్ 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'గా నిలిచింది.

మరిజాన్ కాప్ తన వరుస ఓవర్లలో హేలీ మాథ్యూస్ (3), యస్తిక భాటియా (3)లను వెనక్కి పంపడంతో ముంబై ఒత్తిడిలో పడింది. అయితే సివర్, హర్మన్ కలిసి దూకుడుగా ఆడారు. సదర్లాండ్ ఓవర్లో సిక్స్, ఫోర్ కొట్టిన హర్మన్...జొనాసెన్ వేసిన తర్వాత ఓవర్లో వరుసగా మూడు ఫోర్లు బాదింది. 33 బంతుల్లోనే ఆమె హాఫ్ సెంచరీ పూర్తయింది. వీరిద్దరి భాగస్వామ్యం తర్వాత ముంబై తడపడింది. 15 పరుగుల వ్యవధిలో 4 వికెట్లు కోల్పోవడంతో భారీ స్కోరు సాధ్యం కాలేదు. ఛేదనలో ఢిల్లీ అవకాశాలన్నీ ఓపెనింగ్ భాగస్వామ్యంపైనే ఉన్నాయి. అయితే ఫామ్‌లో ఉన్న లానింగ్ (13), షఫాలీ (4) రెండు పరుగుల తేడాతో వెనుదిరగడంతో జట్టు స్కోరు వేగం బాగా తగ్గిపోయింది. మధ్యలో జెమీమా కొంత జోరుగా ఆడే ప్రయత్నం చేసినా చేయాల్సిన రన్‌రేట్ బాగా పెరిగిపోయి చేయిదాటిపోయింది. మరిజాన్ కాప్ ప్రయత్నం కూడా వృథా అయింది.

స్కోరు వివరాలు

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: యస్తిక (సి) జెమీమా (బి) కాప్ 8; హేలీ (బి) కాప్ 3; నాట్‌సివర్ (సి) మణి (బి) చరణి 30; హర్మన్‌ప్రీత్ (సి) కాప్ (బి) సదర్లాండ్ 66; కెర్ (సి) షఫాలీ (బి) జొనాసెన్ 2; సజన (ఎల్బీ) (బి) జొనాసెన్ 0; కమలిని (స్టంప్డ్) బ్రైస్ (బి) చరణి 10; అమన్‌జోత్ (నాటౌట్) 14; సంస్కృతి (నాటౌట్) 8; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 149. వికెట్ల పతనం:** 1-5, 2-14, 3-103, 4-112, 5-112, 6-118, 7-132. **బౌలింగ్:** మరిజాన్ కాప్ 4-0-11-2, శిఖా పాండే 4-0-29-0, అనాబెల్ సదర్లాండ్ 4-0-29-1, జొనాసెన్ 3-0-26-2, శ్రీ చరణి 4-0-43-2, మిన్ను మణి 1-0-10-0.

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: లానింగ్ (బి) సివర్ 13; షఫాలీ (ఎల్బీ) (బి) షబ్నిమ్ 4; జెస్ జాన్సన్ (సి) యస్తిక (బి) కెర్ 13; జెమీమా (సి అండ్ బి) కెర్ 30; అనాబెల్ (స్టంప్డ్) యస్తిక (బి) సైకా 2; మరిజాన్ కాప్ (సి) హేలీ (బి) సివర్ 40; సారా (రనౌట్) 5; నికీ (నాటౌట్)25; శిఖ (బి) సివర్ 0; మిన్ను మణి (సి) సజన (బి) హేలీ 4; శ్రీ చరణి (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 141. వికెట్ల పతనం:** 1-15, 2-17, 3-37, 4-44, 5-66, 6-83, 7-123, 8-123, 9-128. **బౌలింగ్:** షబ్నిమ్ ఇస్మాయిల్ 4-0-15-1; నాట్‌సివర్ బ్రంట్ 4-0-30-3; హేలీ మాథ్యూస్ 4-0-37-1; అమేలియా కెర్ 4-0-25-2; సైకా 4-0-33-1.

హ్యాట్సాఫ్ హర్మన్



డబ్ల్యూపీఎల్‌లో 2023 టైటిల్ నెగ్గిన ముంబై ఇండియన్స్ గత ఏడాది డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగింది. అయితే అనూహ్యంగా ఎలిమినేటర్ మ్యాచ్‌లో బెంగళూరు చేతిలో 5 పరుగుల తేడాతో ఓడి నిష్క్రమించింది. హర్మన్‌ప్రీత్ క్రీజ్‌లో ఉన్నంత వరకు జట్టు గెలుపు దిశగానే వెళ్లినా...ఆమె వెనుదిరిగాక ఇతర బ్యాటర్లు 12 బంతుల్లో 16 పరుగులు కూడా చేయలేకపోయారు. ఇది హర్మన్‌ను తీవ్రంగా బాధించింది. 2025 సీజన్‌కు ముందు జట్టు కోచ్ దేవిక పల్షికర్‌తో కలిసి హర్మన్ ఇదే విషయంపై ప్రత్యేకంగా చర్చించింది. చివర్లో ధాటిగా ఆడే ప్రయత్నంలో ఒత్తిడి పెంచుకోవడంకంటే తొలి బంతినుంచే హర్మన్ తనదైన శైలిలో ధాటిగా ఆడాలనేది ప్రణాళిక. ఇందులో తొందరగా అవుటయ్యే ప్రమాదం ఉన్నా... ఇది సరైందిగా వారు భావించారు. ఈసారి టీమ్ విజయంలో బ్యాటర్‌గా హర్మన్ కీలక పాత్ర పోషించింది. ఏకంగా 154.87 స్ట్రైక్‌రేట్‌తో 302 పరుగులు సాధించి తన విలువను చాటింది. టోర్నీలో 11 సిక్స్‌లు బాదిన తీరు ఆమె ఆధిక్యాన్ని చూపించింది. ఈ టోర్నీలో ప్రతీ మ్యాచ్‌లో ఆమె దాదాపు చివరి వరకు నిలిచి పని పూర్తయ్యేలా చూసింది. 10 ఇన్నింగ్స్‌లలో 5 అర్ధసెంచరీలతో 523 పరుగులు చేసిన నాట్ సివర్ ఎవరికీ అందనంత ఎత్తులో నిలిచింది. పరుగుల పట్టికలో మూడో స్థానంలో ఉన్న హేలీ మాథ్యూస్ (307) జట్టుకు అదనపు బలంగా మారింది. బౌలింగ్‌లో అమేలియా కెర్ (18 వికెట్లు), హేలీ మాథ్యూస్ (18), నాట్ సివర్ (12) ప్రత్యర్థులను పడగొట్టడంలో సఫలమయ్యారు. మరో ప్రధాన పేసర్ షబ్నిమ్ ఇస్మాయిల్ అంచనాలకు తగినట్లుగా రాణించకపోయినా... ఆ ప్రభావం జట్టుపై పడకుండా ఈ ముగ్గురు బాధ్యత తీసుకున్నారు. ఫైనల్లో మాత్రం షబ్నిమ్ తన స్థాయి ప్రదర్శనను చూపించింది.

తొలి మ్యాచ్‌లో ఢిల్లీ చేతిలో పరాజయంతో ముంబై టోర్నీ మొదలైంది. అయితే ఆ తర్వాత వరుసగా మూడు విజయాలతో జట్టు కోలుకుంది. తర్వాతి మ్యాచ్‌లో మళ్లీ ఢిల్లీ చేతిలోనే పరాజయం. ఈ సారి హర్మన్, సివర్ ఇద్దరూ విఫలమయ్యారు. ఆ తర్వాత మరో రెండు మ్యాచ్‌లు గెలిచి ప్లే ఆఫ్స్ ఖాయమైనా... టాప్ స్థానం కోసం జట్టు గట్టిగానే పోరాడింది. అయితే బెంగళూరు చేతిలో ఓటమి తప్పలేదు. దాంతో ఎలిమినేటర్ మ్యాచ్‌లో ప్రదర్శనపై సందేహాలు వచ్చాయి. అయితే సంపూర్ణ ఆధిక్యంతో విజయం సాధించిన ముంబై అలవోకగా ఫైనల్ చేరింది. గత రెండు లీగ్ మ్యాచ్ తరహాలో ఈ సారి కూడా ఢిల్లీపై ఆరంభంలో తడబాటు కనిపించింది. కానీ మళ్లీ హర్మన్, సివర్ భాగస్వామ్యమే జట్టును నడిపించింది. ప్రతికూల పరిస్థితుల్లోనూ వీరిద్దరు పట్టుదలగా ఆడటంతో జట్టు ప్రత్యర్థికి సవాల్ విసిరేంత స్కోరును సాధించగలిగింది. ఫైనల్ సహా ఇదే వేదికపై వరుసగా నాలుగో మ్యాచ్ ఆడటం కూడా జట్టుకు కలిసొచ్చింది. టోర్నీలో ఢిల్లీ ఫామ్ చూస్తే 150 పరుగుల ఛేదన పెద్ద కష్టం కాదనిపించినా... ముంబై బౌలర్లంతా సమష్టిగా చెలరేగి మూడేళ్ల వ్యవధిలో రెండో టైటిల్‌ను అందించడం విశేషం.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ఫ్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా



● సమంత

థ్రిల్‌కి గురి చేసే శుభం

హీరోయిన్ సమంత నిర్మాతగా మారిన సంగతి తెలిసిందే. 'త్రలాలా మూవింగ్ పిక్చర్స్' అనే బ్యానర్ ఆరంభించి, ఆమె నిర్మిస్తున్న తొలి చిత్రం 'శుభం'. ఈ సినిమా షూటింగ్ పూర్తయినట్లు శనివారం మేకర్స్ ప్రకటించారు. సి. మల్గిరెడ్డి, శ్రియ కొంతం, చరణ్ పెరి, షాలినీ కొండేపూడి, గవిరెడ్డి శ్రీనివాస్, శ్రావణి ముఖ్య పాత్రలు పోషించారు. 'సినిమా బండి' ఫేమ్ ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించారు. ''ఎంటర్‌టైన్మెంట్‌తో పాటు థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చేలా 'శుభం' ఉంటుంది. వసంత్ మరిగంటి రాసిన ఈ కథని ప్రవీణ్ కండ్రేగుల చక్కగా తెరకెక్కించారు. ఈ సినిమా చిత్రీకరణ విజయవంతంగా పూర్తయింది. త్రలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై మొదటి ప్రాజెక్ట్‌గా 'శుభం'ని ఎందుకు ఎంచుకున్నాం అనేది త్వరలోనే తెలుస్తుంది. మా మూవీని త్వరలో విడుదల చేయనున్నాం'' అని సమంత పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: మృదుల్ సుజిత్ సేన్.

వెళ్లిపో... అదే నీకు మంచిది



● విక్రమ్, దుషారా విజయన్

'ఏవండీ... కొట్లో ఎవరండీ... ఏవండీ...' అంటూ నటి దుషారా విజయన్ చెప్పే డైలాగ్‌తో 'వీర ధీర శూర: పార్ట్ 2' మూవీ ట్రైలర్ ఆరంభమైంది. విక్రమ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'వీర ధీర శూర: పార్ట్ 2'. ఎస్.యు. అరుణ్ కుమార్ దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో దుషారా విజయన్ హీరోయిన్‌గా నటించగా, ఎస్‌జే సూర్య, సూరజ్ వెంజరాముడు ముఖ్య పాత్రలు పోషించారు. రియా శిబు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. తెలుగులో ఎన్వీఆర్ సినిమాస్ సంస్థ విడుదల హక్కులు సొంతం చేసుకోగా, నైజాంలో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ విడుదల చేయనున్నారు. తెలుగు ట్రైలర్‌ని శనివారం రిలీజ్ చేశారు. 'ఈ కేసు మిగతా కేసుల్లాంటిది కాదు... ఈరోజు మిస్ అయితే లైఫ్ టైమ్ మిస్సే', 'అయిపోయావురా ఈ రోజు... రా లేపేస్తా' అంటూ ఎస్‌జే సూర్య చెప్పే డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి. 'వద్దురా... మూస్కొని వెళ్లిపో... అదే నీకు మంచిది' అంటూ విక్రమ్ చెప్పే డైలాగ్‌తో ట్రైలర్ ముగుస్తుంది. ''యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'వీర ధీర శూర: పార్ట్ 2'' అని చిత్రబృందం పేర్కొంది.



'అనగనగా ఒక కథ' అంటూ పీరియాడికల్ ఫిల్మ్స్ చేస్తున్న హీరోలపై ఆర్టికల్, విష్ణు మంచు 'కన్నప్ప', కార్తీ 'ఖైదీ 2' చిత్రాల విశేషాల కోసం 'సాక్షి' ఫ్లస్ ఈ పేజీని చదవండి.

రాబిన్‌హుడ్‌కి అతిథి



● డేవిడ్ వార్నర్

'భీష్మ' (2020) వంటి హిట్ మూవీ తర్వాత హీరో నితిన్, డైరెక్టర్ వెంకీ కుడుముల కాంబినేషన్‌లో రూపొందిన ద్వితీయ చిత్రం 'రాబిన్‌హుడ్'. శ్రీలీల హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో రాజేంద్ర ప్రసాద్, 'వెన్నెల' కిశోర్ కీలక పాత్రలు పోషించారు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 28న విడుదలవుతోంది. ఈ చిత్రంలో ఆస్ట్రేలియన్ డైనమిక్ క్రికెటర్ డేవిడ్ వార్నర్ ప్రత్యేక అతిథి పాత్రలో నటించారు. ఆయన ఫస్ట్ లుక్‌ని శనివారం రిలీజ్ చేశారు. షార్ట్ హెయిర్ కట్, ట్రెండీ దుస్తులు, చిరునవ్వు, కూల్ ఎక్స్‌ప్రెషన్‌తో ఉన్న వార్నర్ లుక్ అదుర్స్ అంటున్నారు ఆయన ఫ్యాన్స్. ''రాబిన్‌హుడ్‌లో డేవిడ్ వార్నర్‌ది అతిథి పాత్ర అయినప్పటికీ ఆయనకు ఉన్న ప్రపంచ ప్రజాదరణ, మ్యాసీవ్ సోషల్ మీడియా ఫాలోయింగ్ సినిమాపై స్పెషల్ ఇంపాక్ట్ క్రియేట్ చేస్తుంది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సీఈఓ: చెర్రీ, కెమెరా: సాయి శ్రీరామ్, సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: హరి తుమ్మల, లైన్ ప్రొడ్యూసర్: కిరణ్ బళ్లపల్లి.

మంచి మార్కులు వేసుకున్నాను

- సప్తగిరి

''పెళ్లి కాని ప్రసాద్ సినిమా చాలా బాగా వచ్చింది. నేను చేసిన మురళి గౌడ్ పాత్రలో ఒక నిజాయతీ కనిపిస్తుంది. ఈ చిత్రం కోసం మాకు మేము ఒక ఎగ్జామ్ రాసుకున్నాం. నా మనస్సాక్షిగా 100 శాతం మంచి మార్కులు వేసుకున్నాను. ప్రేక్షకుల నుంచి కూడా మంచి మార్కులు పడతాయని ఆశిస్తున్నాను. ఈ సినిమాలోని వినోదం ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తుంది'' అని సప్తగిరి చెప్పారు. అభిలాష్ రెడ్డి గోపిడి దర్శకత్వంలో సప్తగిరి, ప్రియాంకా శర్మ జోడీగా నటించిన చిత్రం 'పెళ్లి కాని ప్రసాద్'. చాగంటి సినిమాటిక్ వరల్డ్ సమర్పణలో కేవై బాబు, భానుప్రకాశ్ గౌడ్, సుక్కా వెంకటేశ్వర్ గౌడ్, వైభవ్ రెడ్డి ముత్యాల నిర్మించారు. నిర్మాత 'దిల్' రాజుకు చెందిన శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ ఈ నెల 21న ఈ చిత్రాన్ని విడుదల చేస్తోంది. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో సప్తగిరి మాట్లాడుతూ– ''అభిలాష్ రెడ్డిగారు ప్రేక్షకులందరూ గొప్పగా మాట్లాడే సినిమా తీశారు. నిర్మాతలు గ్రాండ్‌గా నిర్మించారు'' అని తెలిపారు. ''థియేటర్స్‌కి వచ్చి మా సినిమాని చూడాలి'' అన్నారు అభిలాష్ రెడ్డి. ''మా చిత్రకథ, వినోదం చాలా బాగుంటాయి. ప్రేక్షకులు ఆదరించాలి'' అని కేవై బాబు కోరారు. ''ఫ్యామిలీతో కలిసి చూడదగ్గ సినిమా ఇది'' అన్నారు అన్నపూర్ణమ్మ.



● సప్తగిరి, అన్నపూర్ణమ్మ, ప్రియాంకా శర్మ

అనగనగా ఆస్ట్రేలియాలో...

నూతన తారలతో ఆస్ట్రేలియాలో చిత్రీకరణ జరుపుకున్న చిత్రం 'అనగనగా ఆస్ట్రేలియాలో'. తారక రామ కథ అందించి, దర్శకత్వం వహించారు. బి.టి.ఆర్ శ్రీనివాస్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21 ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో తారక రామ మాట్లాడుతూ– ''తెలుగువాణ్ణి అయిన నేను ఐటీ జాబ్ చేస్తూ ఆస్ట్రేలియాలో స్థిరపడ్డాను. సినిమాలపై ఇష్టంతో ఫిల్మ్ కోర్స్‌లో మాస్టర్స్ చేసి, తొలి చిత్రంగా 'అనగనగా ఆస్ట్రేలియాలో' తీశాను. వాస్తవ ఘటనల ఆధారంగా థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందిన మూవీ ఇది. షూటింగ్ మొత్తం ఆస్ట్రేలియాలోనే చిత్రీకరించినా.. నటీనటులు, సాంకేతిక నిపుణులు మాత్రం తెలుగు వారే. ప్రస్తుతం తెలుగులోనే రిలీజ్ చేస్తున్నాం.. ప్రేక్షకులు ఆశీర్వదించాలి'' అన్నారు.



● తారక రామ

థ్రిల్లింగ్ స్టోరీ

లోహిత్ కల్యాణ్, రాజేశ్ కుంచాడా, జోషిత్ రాజ్ కుమార్, కైలాశ్ వేలాయుధన్, పూజా విశ్వేశ్వర్, టీవీ రామన్, ఆర్కే నాయుడు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రాజుగారి దొంగలు'. లోకేశ్ రనాల్ హిటాసో దర్శకత్వం వహించారు. నడిమింటి లిఖిత సమర్పణలో హిటాసో ఫిలిం కంపెనీ బ్యానర్‌పై నడిమింటి బంగారు నాయుడు నిర్మించిన ఈ సినిమాని ఈ నెల 21న విడుదల చేయనున్నట్లు ప్రకటించింది యూనిట్. ఈ సందర్భంగా లోకేశ్ రనాల్ మాట్లాడుతూ– ''వైవిధ్యమైన కథతో సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందించిన చిత్రమిది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందనే నమ్మకం ఉంది. మా యూనిట్‌ని ఆడియన్స్ సపోర్ట్ చేయాలి'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: సందీప్ బదుల, ప్రకాశ్ రెడ్డి, సంగీతం: నాఫల్ రాజా ఏఐఎస్.



● లోహిత్ కల్యాణ్, రాజేశ్, జోషిత్, కైలాశ్

ఓటీటీ – ఇది చూడొచ్చు

100 ప్రాబ్లమ్స్... 0 సొల్యూషన్స్

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో తమిళ చిత్రం 'కుడుంబస్తన్' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

ఆకాశంలో చందమామ ఎక్కడ ఉంది అని అడిగితే ఓ కుటుంబంలోని నలుగురు నాలుగు దిక్కులు చూపిస్తే ఆ కుటుంబంలోని ఫ్యామిలీ మేన్ పరిస్థితి ఏంటి? అదే 'కుడుంబస్తన్' సినిమా. ఇదో తమిళ మూవీ. సూపర్ ఫ్యామిలీ ఓరియంటెడ్ కామెడీ మూవీ. దీనికి దర్శకుడు రాజేశ్వర్. ప్రముఖ తమిళ నటులు మణికందన్, మేఘన హీరో హీరోయిన్లుగా ఈ సినిమాలో నటించారు. ఓ ప్రధాన పాత్రలో నాటి ప్రముఖ నటుడు ఆర్. సుందర్ రాజన్ కూడా నటించారు. ఈ సినిమా చూస్తున్నంత సేపు మనం మన పొరిగింటి వాళ్ల కథ చూసినట్టుంటుంది కానీ సినిమా అని ఎక్కడా అనిపించదు. దర్శకుడు అంతలా చక్కటి స్క్రీన్‌ప్లేను, పాత్రలను ఎన్నుకున్నాడు. మరి... 'కుడుంబస్తన్' కథేంటి అంటే... ఇదో సింపుల్ కథ. నవీన్, వెన్నెల పెద్దలను ఎదిరించి పెళ్లి చేసుకుంటారు. అయినా నవీన్ తల్లిదండ్రుల దగ్గరే కాపురముంటారు. వెన్నెల సివిల్స్‌కి ప్రిపేర్ అవుతుంటుంది. నవీన్ అడ్వర్టైజ్‌మెంట్స్ కంపెనీలో డిజైనర్. నవీన్ ఒక్కడే ఆ కుటుంబంలో సంపాదించేవాడు. తండ్రి రియల్ ఎస్టేట్ అని తిరుగుతాడు తప్ప ఏమీ సంపాదించడు. ఇక తల్లి వెన్నెలను విసుక్కుంటూ తీర్థయాత్రలకని కొడుకుని కాకా పడుతుంటుంది. నవీన్‌ది బొటాబొటీ ఉద్యోగం. సంపాదించే ప్రతి రూపాయిని చాలా జాగ్రత్తగా చూసుకుని ఖర్చు పెడుతుంటాడు. నవీన్‌కి ఓ చెల్లెలు ఉంటుంది. ఆమె పెళ్లి చేసుకుని వేరుగా ఉంటుంది. నవీన్ బావమరిది పెద్ద ఉద్యోగం చేస్తుంటాడు. అందుకే నవీన్‌ని కాస్త హేళనగా చూస్తుంటాడు. ఈ దశలో నవీన్‌కి అనుకోకుండా ఉద్యోగం ఊడిపోతుంది. ఈ విషయాన్ని ఇంట్లో వాళ్ల దగ్గర దాస్తాడు. అంతలో వెన్నెల గర్భవతి అవుతుంది. ఓ పక్క తండ్రి తాము ఉంటున్న ఇంటిని బాగు చేయమని గోల, తల్లి తన తీర్థయాత్రలకు ఏర్పాట్లు చేయమని ఏడుపు, అలాగే వెన్నెల మెడికల్ ఖర్చులు... మరో పక్క లేని ఉద్యోగం ఆ పై బావమరిది హేళన... వీటన్నిటినీ నవీన్ ఎలా అధిగమించాడన్నది జీ 5 ఓటీటీ వేదికగా స్ట్రీమ్ అవుతున్న 'కుడుంబస్తన్'లో చూడాల్సిందే. సినిమా మొత్తం మంచి కామెడీతో ఆఖరున ఓ చక్కని మెసేజ్‌తో మంచి సినిమా చూశామన్న ఫీలింగ్ కలుగుతుంది. వర్తబుల్ వాచ్ ఫర్ ది వీకెండ్.



– ఇంటూరు హరికృష్ణ

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

డబ్బు పంపకాల్లో కుమారులతో ఘర్షణ

రిటైర్డ్ ఉద్యోగి బలవన్మరణం



ఏర్పుల వీరయ్య (ఫైల్)

మహబూబాబాద్ రూరల్: రిటైర్మెంట్ డబ్బుల పంపకాల విషయంలో కుమారులతో జరిగిన ఘర్షణతో మనస్తాపానికి గురైన ఓ రిటైర్డ్ ఉద్యోగి ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. మహబూబాబాద్ టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని రామచంద్రపురం కాలనీలో నివాసం ఉండే ఏర్పుల వీరయ్య (63) పంచాయతీరాజ్ శాఖలో ఆఫీస్ సబార్డినేట్‌గా ఐదేళ్ల క్రితం ఉద్యోగ విరమణ పొందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఇటీవల కుమారులకు, ఆయనకు మధ్య ఉద్యోగ విరమణ డబ్బుల పంపకాల విషయంలో మనస్పర్థలు ఏర్పడ్డాయి. దీంతో మనస్తాపానికి గురైన వీరయ్య వారం రోజులక్రితం ఇంటినుంచి వెళ్లిపోయాడు. శుక్రవారం రాత్రి మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ లాడ్జిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఉదయం లాడ్జి నిర్వాహకులు వీరయ్య మృతి చెందిన విషయాన్ని ఆయన కుటుంబ సభ్యులకు, పోలీసులకు తెలిపారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వీరయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ దేవేందర్ తెలిపారు.

స్కాలర్‌షిప్‌ల కోసం భిక్షాటన

జనగామ రూరల్: ఉపకార వేతనాలకు ప్రభుత్వం దగ్గర నిధులు లేవనడం సరికాదని, తామే ప్రభుత్వానికి నిధులు పంపిస్తామంటూ వందేమాతరం స్టూడెంట్ ఫెడరేషన్ (వీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో శనివారం జనగామలో విద్యార్థులు పలు దుకాణాల వద్దకు వెళ్లి భిక్షాటన చేసి నిరసన వ్యక్తం చేశారు. ఉపకార వేతనాలు విడుదల చేయక.. తమ చదువులు మధ్యలోనే ఆగిపోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సర్కారు పెండింగ్ ఉపకార వేతనాలు విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా భిక్షాటన చేసి నిధులు సేకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నల్ల రాహుల్, పట్టణ అధ్యక్షుడు మహ్మద్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



జనగామలో రోడ్డుపై భిక్షాటన చేస్తున్న విద్యార్థులు

సికింద్రాబాద్‌లో కవచ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్

- రూ.39,300 కోట్లతో రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులు
- త్వరలో అన్ని రైల్వేస్టేషన్లలో ఉచిత వైఫై సౌకర్యం
- మహిళా రైల్వేస్టేషన్‌గా బేగంపేట
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి


బేగంపేట స్టేషన్ పనులు పరిశీలిస్తున్న కిషన్‌రెడ్డి

సనత్‌నగర్: రైల్వే 'కవచ్'రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సికింద్రాబాద్‌లో ఏర్పాటు కానుందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ సంస్థ తెలంగాణ రాష్ట్రానికి తలమానికంగా నిలవనుందని పేర్కొన్నారు. రైల్వే భద్రతలో కవచ్ వ్యవస్థ ఇప్పటికే పలు ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్టుగా విజయవంతమైందని చెప్పారు. బేగంపేట రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులను రైల్వే అధికారులతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. బేగంపేట, చర్లపల్లి, మేడ్చల్, యాకుత్‌పురా, నాంపల్లి, కాచిగూడ, హైటెక్‌సిటీ, హఫీజ్‌పేట్, మలక్‌పేట్, ఉందానగర్ రైల్వేస్టేషన్ల ఆధునీకరణకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ అంగీకరించారని తెలిపారు. ఆయా రైల్వేస్టేషన్లకు అప్రోచ్ రోడ్ల కోసం భూమిని సమకూర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్లు వెల్లడించారు. బేగంపేట రైల్వేస్టేషన్‌ను రూ.38 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే తొలివిడత పనులు పూర్తయ్యాయని చెప్పారు. దీనిని మహిళా రైల్వేస్టేషన్‌గా మార్చనున్నట్లు కిషన్‌రెడ్డి ప్రకటించారు. ఇక్కడ సెక్యూరిటీ గార్డ్ నుంచి ఉన్నతాధికారి వరకు అంతా మహిళలే ఉంటారని తెలిపారు. ఇప్పటివరకు జైపూర్‌లోని గాంధీనగర్ రైల్వేస్టేషన్ ఒక్కటే దేశంలో పూర్తిగా మహిళా సిబ్బందితో నడుస్తున్న రైల్వేస్టేషన్‌గా ఉంది.

రైల్వే ప్రాజెక్టులకు రూ.39,300 కోట్లు..

తెలంగాణ రాష్ట్రానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రైల్వేల కోసం కేంద్రం రూ.5,337 కోట్లు కేటాయించిందని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. అలాగే రైల్వేల ఆధునీకరణలో భాగంగా రూ.39,300 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో 1,096 కిలోమీటర్ల ఎలక్ట్రిఫికేషన్ పనులు చేపట్టినట్లు వివరించారు. 753 కిలోమీటర్ల మేర కొత్త ట్రాక్‌లు నిర్మిస్తామని, 453 ఆర్‌ఓబీ, ఆర్‌యూబీల నిర్మాణం పూర్తిచేశామని వెల్లడించారు. సికింద్రాబాద్ నుంచి తెలంగాణలో ఏడు జిల్లాలను కలుపుతూ 9 స్టాప్‌లతో 5 వందే భారత్ రైళ్లను నడుపుతున్నట్లు తెలిపారు. రూ.715 కోట్లతో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ మాదిరిగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు కిషన్‌రెడ్డి చెప్పారు. రూ.327 కోట్లతో నాంపల్లి రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు కూడా త్వరలో చేపట్టనున్నట్లు ప్రకటించారు. అన్ని రైల్వేస్టేషన్లలో ఉచిత వైఫై సౌకర్యం కల్పిస్తామని తెలిపారు.

ఏబీసీడీలు కూడా తెలియకుండా కేంద్రంపై యుద్ధమా?

ఏబీసీడీలు కూడా తెలియకుండా కేంద్రంపై యుద్ధం చేయాలంటే ఎలా? అంటూ తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌కు కిషన్‌రెడ్డి చురకలంటించారు. గతంలో లాగా రెచ్చగొడితే ప్రజలు ఊరుకోరని, చైతన్యవంతులు అయ్యారని పేర్కొన్నారు. డీ లిమిటేషన్ వల్ల సీట్లు తగ్గుతాయని ఎలా చెబుతున్నారని ప్రశ్నించారు.



మా పిల్లలు కాలేజీకి సరిగానే వెళ్తున్నారా? వాళ్ల ప్రవర్తన ఎలా ఉంది? డ్రగ్స్.. గంజాయి లాంటి వాటికి ఆకర్షితులవుతున్నారా? ప్రేమ వ్యవహారాల్లాంటివి ఏమైనా ఉన్నాయా? మీరో కన్నేసి ఉంచండి.

హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు డిటెక్టివ్ ఏజెన్సీకి వచ్చిన అభ్యర్థన ఇదీ..

గతంలో కాబోయే జీవిత భాగస్వామి నేపథ్యం, ప్రవర్తన తెలుసుకోవడానికి, పోటీ కంపెనీల వ్యూహాలను కనిపెట్టడానికి ఇలా పలు విషయాల్లో ప్రైవేటు డిటెక్టివ్ ఏజెన్సీల సేవలను వినియోగించుకునే వాళ్లు. ఇటీవలి కాలంలో మాత్రం తమ పిల్లలపై కన్నేసి ఉంచాలంటూ డిటెక్టివ్ ఏజెన్సీలను ఆశ్రయిస్తున్న తల్లిదండ్రుల సంఖ్య పెరుగుతోంది. ముంబై, బెంగళూరు, ఢిల్లీలాంటి మెట్రో నగరాల్లోని ఈ ధోరణి.. ఇప్పుడు హైదరాబాద్‌కూ పాకింది. దీని కోసం కొన్ని ఏజెన్సీలు ప్రత్యేకంగా 'టీనేజ్ ప్యాకేజీలు' ప్రకటించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

- హైదరాబాద్‌లో కొత్త ధోరణి.. పెరిగిన టీనేజ్ మానిటరింగ్
- ప్రత్యేక ప్యాకేజీలు ఇస్తున్న డిటెక్టివ్ ఏజెన్సీలు
- నెలకు రూ.10 వేల నుంచి రూ.1.5 లక్షల వరకూ చార్జీలు

ఎందుకిలా?



ఉమ్మడి కుటుంబాలు కరువవడం, తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగాలు చేస్తుండటంతో పిల్లలు ఏం చేస్తున్నారు? వారి దైనందిన కార్యకలాపాలు, స్నేహితులు, ఇతర అంశాలపై దృష్టి పెట్టే తీరిక వారికి ఉండటం లేదు. సంపన్న కుటుంబాల్లో అయితే డబ్బుకు కొదవ లేకపోవడంతో పలువురు టీనేజర్లు దారి తప్పుతున్నారు. ఈ అలవాట్లు.. వ్యసనాల స్థాయిని దాటి నేరాలు చేసే వరకు తీసుకెళ్తున్నాయి. నగరంలో ఇటీవల పలు డ్రగ్స్ కేసుల్లో విద్యార్థులు పట్టుబడుతున్న తీరు దీనికి నిదర్శనం. అలాగే సోషల్ మీడియా ప్రభావం, అందులో ఏర్పడుతున్న పరిచయాలు, పరిపక్వత లేని ప్రేమలతో ఇంటి నుంచి వెళ్లిపోతున్నవారి సంఖ్యా పెరుగుతోంది. వరుసగా వెలుగుచూస్తున్న ఇలాంటి ఉదంతాలతో ఉలిక్కిపడిన తల్లిదండ్రులు పిల్లలపై నిఘా కోసం ప్రైవేట్ డిటెక్టివ్‌లను ఆశ్రయిస్తున్నారు. ఈ ఏజెన్సీలు ఇచ్చే ఇన్‌పుట్స్ ఆధారంగా ఏవైనా సమస్యలు ఉంటే తొలి దశలోనే నివారణ చర్యలు తీసుకోవచ్చన్నది ఆయా తల్లిదండ్రుల భావనగా ఉంటోందని ఏజెన్సీల నిర్వాహకులు చెబుతున్నారు. వీటిని ఆశ్రయిస్తున్న వారిలో ఎగువ మధ్య తరగతి, సంపన్న వర్గాల వారే ఎక్కువగా ఉంటున్నారు.

సాక్షి, హైదరాబాద్

మా పిల్లలేం చేస్తున్నారు ఓ కన్నేసి ఉంచండి!

డ్రగ్స్, సోషల్ మీడియా ప్రభావం నేపథ్యంలో డిటెక్టివ్ ఏజెన్సీలను ఆశ్రయిస్తున్న తల్లిదండ్రులు

టీనేజ్ మానిటరింగ్‌ను ప్రధానంగా రెండు విధానాల్లో (ఆఫ్‌లైన్, ఆన్‌లైన్) చేస్తారు. కేసును బట్టి అనునిత్యం లేదా అవసరమైన సమయాల్లో నీడలా వెంటాడుతూ చేసే ఆఫ్‌లైన్ మానిటరింగ్ ప్రాథమికమైంది. దీని కోసం రహస్య కెమెరాలు, మైకులతో పాటు అవసరమైనప్పుడు డ్రోన్లు సైతం వినియోగిస్తున్నారు. చాలాకాలంగా ఈ విధానంలో పర్యవేక్షణ నడుస్తోంది. ఇటీవల కాలంలో సోషల్ మీడియా వినియోగం పెరిగిన తర్వాత టీనేజర్లపై ఆన్‌లైన్ నిఘా కూడా మొదలైంది. వాళ్లు తరచూ వీక్షిస్తున్న సైట్లు, చాటింగ్స్, పోస్టింగ్స్ సహా అనేక అంశాలను తెలుసుకుంటారు. దీనికోసం స్పైవేర్‌లు వినియోగించాల్సి రావడంతో అతి తక్కువ ఏజెన్సీలు మాత్రమే ఈ తరహా సేవల్ని అందిస్తున్నాయి. వాళ్లు వినియోగించే సాఫ్ట్‌వేర్స్‌ను బట్టి చార్జ్ చేస్తున్నారు. కొన్ని సాఫ్ట్‌వేర్స్ ఒకసారి వినియోగించడానికి మాత్రమే ఉపకరించేవి ఉండటంతో ఆయా కేసుల్లో సేవలు చాలా ఖరీదైనవిగా మారుతున్నాయి. టీనేజ్ మానిటరింగ్‌లో భాగంగా వారి అలవాట్లు, వ్యక్తిగత ప్రవర్తనతోపాటు వారి మానసిక, శారీరక స్థితిగతులు, పరిస్థితుల్ని ఏజెన్సీలు బేరీజు వేస్తూ నివేదికలు రూపొందిస్తున్నాయి. ఈ టాస్కులు పూర్తిచేయడానికి కొందరు ఏజెన్సీల నిర్వాహకులు మానసిక నిపుణుల సహాయం కూడా తీసుకుంటున్నారు. అలాగే పిల్లలు అసాధారణ ప్రవర్తన కలిగి ఉండటం, డిప్రెషన్, ఒంటరితనం, షార్ట్ టెంపర్, పాఠశాలలు, కాలేజీల బయట వారి ప్రవర్తన, రాత్రి వేళల్లో వారి కార్యకలాపాలు తెలుసుకోవడానికి కూడా తల్లిదండ్రులు వీరి సేవలు వినియోగించుకుంటున్నారు. ఆయా టీనేజర్ల తీరుతెన్నుల్ని బట్టి అవసరమైన రీహాబ్ సెంటర్లు, సైకాలజిస్టుల వివరాలను డిటెక్టివ్ ఏజెన్సీలే వారికి సూచిస్తున్నాయి.

ఎలా చేస్తారు?



ధరలు ఎలా?

ఈ కొత్త ట్రెండ్ నేపథ్యంలో ప్రైవేట్ డిటెక్టివ్ ఏజెన్సీలు కూడా కొన్ని స్కీములతో ముందుకొస్తున్నాయి. వీటిని ప్రాంతాల వారీగానూ నిర్వహిస్తున్నాయి. కేవలం ఇంటి బయట, కాలేజీలో, స్నేహితులతో సంచరించేప్పుడు ఒక ప్యాకేజీ.. ఈ మూడుచోట్లతోపాటు ఇంట్లో ఉన్నప్పుడు.. అలాగే యుక్త వయసులోకి వచ్చిన వారిపై కన్నేసి ఉంచడానికీ వేర్వేరు ప్యాకేజీలున్నాయి. నెలకు కనిష్టంగా రూ.10 వేల నుంచి గరిష్టంగా రూ.1.5 లక్షలు వసూలు చేస్తున్నాయి.

నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో-2022 నివేదిక ప్రకారం తెలుగు రాష్ట్రాల్లో ఇళ్ల నుంచి వెళ్లిపోతున్న వారిలో 12 నుంచి 18 ఏళ్ల మధ్య వయస్కులే ఎక్కువగా ఉంటున్నారు. తెలంగాణ నుంచి 1,621 మంది, ఆంధ్రప్రదేశ్ నుంచి 497 మంది ఇలా వెళ్లిపోయారు.

ఖరీదైన విద్యాసంస్థల్లో..

సాధారణ విద్యాసంస్థల్లో విద్యనభ్యసించే వారి కంటే కార్పొరేట్ స్థాయి వాటిల్లో చదివే వారే ఎక్కువగా డ్రగ్స్ తదితరాలకు అలవాటుపడుతున్నారు. ఏసీ బస్సులు, ఏసీ తరగతి గదులు.. ఇలా వారికి కంఫర్ట్ జోన్ ఎక్కువగా ఉంటుంది. చిన్న చిన్న స్కూళ్లలో విద్యార్థులపై ఉపాధ్యాయులు, మేనేజ్‌మెంట్ దృష్టి ఎక్కువగా ఉంటుంది. కార్పొరేట్ స్కూళ్లల్లో పరిస్థితులు పూర్తి భిన్నం. ఈ కారణంగానే కొందరు విద్యార్థులు తేలిగ్గా వ్యసనాలకు బానిసలుగా మారుతున్నారు.


మండలి గిరిధర్
రిలయబుల్ సెక్యూరిటీ ఏజెన్సీస్, తార్నాక

నిఘా పెట్టి పట్టుకుంటున్నాం

నగరంలోని టీనేజర్లు, విద్యార్థుల్లో మాదకద్రవ్యాలు, గంజాయి వినియోగం గతంతో పోలిస్తే తగ్గింది. వీటిని వినియోగించే ఆస్కారం ఉన్న ప్రాంతాలను ఎప్పటికప్పుడు గుర్తిస్తున్నాం. ఆయాచోట్ల ప్రత్యేక నిఘా పెట్టి దాడులు చేసి పట్టుకుంటున్నాం. ఒక గ్రాము గంజాయితో దొరికిన వారిపైనా కఠిన చర్యలు తీసుకుంటున్నాం. కౌన్సెలింగ్‌తో సరిపెట్టకుండా ఠాణాలకు అప్పగించి, కేసులు నమోదు చేయించి, జైలుకు తరలిస్తున్నాం.


వైవీఎస్ సుధీంద్ర
డీసీపీ, టాస్క్‌ఫోర్స్, హైదరాబాద్

పాఠశాల మొదటి గంట 7.45కి

- ఒంటిపూట బడి ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు
- పాఠశాల విద్య డైరెక్టర్ ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: ఒంటిపూట బడుల నిర్వహణ పకడ్బందీగా అమలు చేయాలని పాఠశాల విద్య డైరెక్టర్ ఈవీ నరసింహారెడ్డి ఆదేశించారు. పాఠశాల మొదటి బెల్ ఉదయం 7.45, అసెంబ్లీ ఉదయం 7.50, పాఠ్య ప్రణాళిక ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొనసాగించాలని సూచించారు. టెన్త్ పరీక్ష కేంద్రాలున్న పాఠశాలలను.. మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించాలని శనివారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

సైబర్ నేరాల కట్టడికి 'ఐ4సీ'

- ఎప్పటికప్పుడు అడ్డుకట్ట వేస్తున్న దర్యాప్తు సంస్థలు
- డిజిటల్ స్కామ్‌లకు వాడిన 7.81 లక్షల సిమ్‌లు బ్లాక్
- రాజ్యసభలో కేంద్ర మంత్రి బండి సంజయ్ వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, హైదరాబాద్: రోజుకో తరహా మోసంతో అమాయకులను దోచుకుంటున్న సైబర్ నేరగాళ్లకు దర్యాప్తు సంస్థలు తమదైన శైలిలో అడ్డుకట్ట వేస్తున్నాయి. ఇటీవల డిజిటల్ అరెస్టుల పేరిట మోసగాళ్ల ఆగడాలు బాగా పెరగడంతో వారికన్నా ఒకడుగు ముందుకేసి, వారు మోసాలకు వినియోగిస్తున్న సిమ్‌కార్డులు, స్కైప్ ఐడీలు, వాట్సాప్ నంబర్లను బ్లాక్ చేస్తున్నాయి. తాము చేపట్టిన చర్యల్లో భాగంగా సైబర్ మోసగాళ్లు డిజిటల్ స్కామ్‌లకు వాడిన సుమారు 7.81 లక్షల సిమ్‌లను బ్లాక్ చేసినట్లు కేంద్ర హోంశాఖ వెల్లడించింది. సైబర్ నేరాల కోసం వినియోగిస్తున్న 2,08,469 ఐఎంఈఐ నంబర్లను కూడా బ్లాక్ చేసినట్లు పేర్కొంది. దేశంలో జరుగుతున్న డిజిటల్ స్కామ్‌లు, సైబర్ నేరాలపై ఇటీవల ఓ ఎంపీ అడిగిన ప్రశ్నకు రాజ్యసభలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఈ మేరకు రాతపూర్వకంగా సమాధానమిచ్చారు. దేశంలోని అన్ని రకాల సైబర్ నేరాలను సమన్వయంతో పరిష్కరించేందుకు హోంశాఖ ఆధ్వర్యంలోని 'ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్'(ఐ4సీ) కృషి చేస్తోందన్నారు. వార్తా పత్రికలు, మెట్రో రైళ్లలో ప్రకటనలు, ఆకాశవాణి.. తదితర మాధ్యమాల ద్వారా దీనిపై ప్రచారం చేస్తున్నామన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కాలర్‌ట్యూన్ ప్రచారాన్ని ప్రారంభించామన్నారు. టెలికం సర్వీస్ ప్రొవైడర్లు రోజుకు 7 నుంచి 8 సార్లు విధిగా ప్రతి వినియోగదారుడికి వినిపించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. డిజిటల్ స్కామ్‌లపై 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు వస్తున్న ఫిర్యాదులపై తక్షణం స్పందిస్తున్నామని చెప్పారు. డిజిటల్ స్కామ్‌ల కోసం ఉపయోగించిన 3,962 స్కైప్ ఐడీలు, 83,668 వాట్సాప్ ఖాతాలను ఐ4సీ గుర్తించి బ్లాక్ లిస్టులో పెట్టిందన్నారు. అలాగే అంతర్జాతీయ స్పూఫ్డ్ కాల్స్‌ను కూడా గుర్తించి అరికడుతున్నట్లు తెలిపారు. వివిధ సైబర్ నేరాలపై వచ్చిన 13.36 లక్షల ఫిర్యాదుల ఆధారంగా రూ.4,386 కోట్లు నేరగాళ్లబారిన పడకుండా చర్యలు తీసుకున్నట్లు బండి వివరించారు.

కోదాడ వాసికి గ్లోబల్ రాక్ మెకానిక్స్ అవార్డు

భూగర్భ గనుల్లో స్తంభాల రూపకల్పనకు గుర్తింపు



కోదాడ: మైనింగ్ రంగంలో ప్రతిష్టాత్మకమైన 'గ్లోబల్ రాక్ మెకానిక్స్'అవార్డు సూర్యాపేట జిల్లాకు చెందిన మురళి గద్దెను వరించింది. కోదాడ నియోజకవర్గంలోని అనంతగిరి మండలం వాయిలసింగారం గ్రామానికి చెందిన మురళికి భూగర్భ గనుల్లో రక్షణ ఏర్పాట్లపై చేసిన పరిశోధనకు గాను సొసైటీ ఫర్ మైనింగ్, మెటలర్జీ అండ్ ఎక్స్‌ప్లోరేషన్ (ఎస్ఎంఈ) 2024 సంవత్సరానికి ఈ అవార్డును ప్రదానం చేసింది. గద్దె శివరామకృష్ణ–చాముండేశ్వరిల కుమారుడైన మురళి.. కొత్తగూడెంలోని మైనింగ్ కళాశాలలో మైనింగ్ ఇంజనీరింగ్ పూర్తిచేశాడు. ఆ తరువాత అమెరికాకు వెళ్లి మైనింగ్ రంగంలో డాక్టరేట్ పొందాడు. భూగర్భ గనుల్లో రక్షణ కోసం ఏర్పాటుచేసే కొత్త రకం స్తంభాల (పిల్లర్ డిజైన్) రూపకల్పనలో ఆయన చేసిన కృషికి ఈ అవార్డు లభించింది. మురళి మైనింగ్ రంగంలో దాదాపు 33 పరిశోధన పత్రాలను సమర్పించడంతో పాటు ప్రపంచవ్యాప్తంగా దాదాపు 900 ప్రాజెక్ట్‌లలో భాగస్వామిగా వ్యవహరించారు. 2009లోనే ఆయనకు అమెరికా ప్రభుత్వం యంగ్ సైంటిస్ట్ అవార్డును ప్రదానం చేసింది.

ఈఏపీసెట్-2025కి 1.20 లక్షల దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్, అగ్రి, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఈఏపీసెట్–2025 పరీక్షకు శనివారం సాయంత్రం వరకు రాష్ట్రవ్యాప్తంగా 1,20,333 మంది అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇందులో ఇంజనీరింగ్ స్ట్రీమ్ కోసం 85,702 మంది, అగ్రికల్చర్, ఫార్మసీ స్ట్రీమ్ కోసం 34,541 మంది, రెండు కేటగిరీల కోసం 90 మంది దరఖాస్తు చేసుకున్నట్లు సెట్ కన్వీనర్ బి.డీన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

రేపట్నుంచి 'రాజీవ్ యువ వికాసం' దరఖాస్తు షురూ

సాక్షి, హైదరాబాద్: నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధిని కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన రాజీవ్ యువవికాసం పథకం కింద దరఖాస్తుల స్వీకరణ 17 నుంచి ప్రారంభం కానుంది. ఆసక్తి ఉన్న యువత ఓబీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. అర్హులైన ఎస్సీ, బీసీ యువత తగిన ధ్రువీకరణ పత్రాలతో వచ్చేనెల 5లోగా దరఖాస్తులు సమర్పించాలని ఆయా కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, మైనార్టీ కార్పొరేషన్లు కూడా త్వరలో ప్రకటన జారీ చేస్తాయని అధికారులు చెబుతున్నారు. అర్హతలు, ఇతర సమాచారం కోసం వెబ్‌సైట్‌లో లేదా సంబంధిత జిల్లా సంక్షేమాధికారిని సంప్రదించాలని సూచించారు.

లిఫ్ట్ ప్రమాదాలకు చెక్!

గత ఏడాది మే 27న హైదరాబాద్ నాగోల్‌లోని ఓ హోటల్లో లిఫ్ట్ కేబుల్ తెగి ఎనిమిది మంది గాయపడ్డారు. జూలై 27న తుకారాంగేట్‌లో 68 ఏళ్ల వృద్ధుడు మృతిచెందాడు. జూలై 15న హఫీజ్‌పేటలో లిఫ్ట్ వైర్‌తెగిపడి ఒకరు చనిపోగా, మరో ఇద్దరు గాయపడ్డారు. ఆగస్టు 26న గుడిమల్కాపూర్‌లో లిఫ్ట్ పైకప్పు కూలి 65 ఏళ్ల వృద్ధుడు చనిపోయాడు. గతనెల 22న మాసబ్‌ట్యాంక్‌లో ఓ అపార్ట్‌మెంట్‌లో లిఫ్ట్ మధ్యలో ఇరుక్కుని ఆరేళ్ల బాలుడు మృతి చెందాడు. తాజాగా మార్చి 12న సంతోష్‌నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్ లిఫ్ట్‌లో చిక్కుకుని నాలుగేళ్ల బాలుడు మృతి చెందాడు' ఇలా నిత్యం ఏదో ఒక అపార్ట్‌మెంట్‌లో లిఫ్ట్ ప్రమాదాలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి.

- త్వరలో లిఫ్ట్ అండ్ ఎస్కలేటర్స్ యాక్ట్
- నిర్వహణలేమితో తరచూ ప్రమాదాలు
- 2015 ముసాయిదా బిల్లుకు మెరుగులు దిద్దాలని ప్రభుత్వం ఆదేశం
- ఇతర రాష్ట్రాల్లో అధ్యయనానికి నిర్ణయం



సాక్షి, రంగారెడ్డి జిల్లా: కేవలం షాపింగ్ మాల్స్, హోటల్స్, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లోనే కాదు సామూహిక, వ్యక్తిగత గృహ సముదాయాల్లోనూ లిఫ్టులు/ఎస్కలేటర్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. మెట్లు ఎక్కలేని వృద్ధులు, పిల్లల కోసం వీటిని అమర్చుకుంటున్నారు. అయితే లిఫ్టుల తయారీ కంపెనీలపై మెజార్టీ ప్రజలకు అవగాహన లేదు. నిర్మాణ ఖర్చులను తగ్గించుకునేందుకు చాలామంది బిల్డర్లు మార్కెట్లో తక్కువ ధరకు లభించే లిఫ్ట్ పరికరాలను కొనుగోలు చేసి అమర్చుతున్నారు. అయితే, వీటిపై నిర్వహణతోపాటు నియంత్రణ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ప్రమాదాలకు చెక్ పెట్టాలని ప్రభుత్వం భావిస్తుంది. ఇప్పటికే ఏపీ, కర్ణాటక, తమిళనాడు, గుజరాత్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌ల్లో అమల్లో ఉన్న లిఫ్ట్ పాలసీని తెలంగాణలోనూ తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. అధ్యయనం, ముసాయిదా రూపకల్పన కోసం రెండు రోజుల క్రితం ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ లిఫ్ట్ యాక్ట్- 2015 ముసాయిదాకు మెరుగులు దిద్దాలని ఆదేశించింది. అలాగే, ఇతర రాష్ట్రాల్లో పాలసీ ఏ విధంగా ఉందనే అంశంపై ఆరా తీసే పనిలో తెలంగాణ ప్రధాన విద్యుత్ తనిఖీ విభాగం నిమగ్నమైంది.

ప్రమాణాల మేరకు లేకపోవడం వల్లే..

అపార్ట్‌మెంట్ నిర్మాణం పూర్తయ్యాక ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) ఇవ్వడానికి పురపాలక శాఖ అమలు చేస్తున్న జీఓ 168లో లిఫ్ట్ ఏర్పాటు గురించి ప్రస్తావన ఉన్నా.. దాని నాణ్యత, నిర్వహణ, నియంత్రణపై ఎలాంటి ఆంక్షలు లేవు. తెలంగాణ ఎలివేటర్స్ అండ్ ఎస్కలేటర్స్ అసోసియేషన్ లెక్కల ప్రకారం రాష్ట్రంలో ఏటా 10 వేల వరకు ఎలివేటర్లను విక్రయిస్తున్నారు. వీటిలో 20 శాతమే బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) ప్రమాణాల మేరకు ఉన్నట్లు అంచనా. మిగిలినవి కనీస నైపుణ్యంలేని తయారీ దారులు విక్రయిస్తున్నవే. తయారీ సంస్థల వద్ద ఐదారేళ్లు పని చేసిన వర్కర్లే స్వయంగా ఎలివేటర్ల తయారీని ప్రారంభిస్తున్నారు. వీరు బిల్డర్ల వద్ద తక్కువ ధరకు కాంట్రాక్టులు తీసుకుని నాసిరకం లిఫ్టులను అమర్చుతున్నారు. అపార్ట్‌మెంట్ సంక్షేమ సంఘాలు, ప్రభుత్వ ఆఫీసుల్లో లిఫ్టులను ఏర్పాటు చేసిన సంస్థలు ఆ తర్వాత వాటి నిర్వహణను పట్టించుకోవడం లేదు. బీఐఎస్ నిబంధనల ప్రకారం లిఫ్ట్‌ను నిర్మించే సమయంలో దానిలో ఎంత మంది వెళ్లొచ్చు? ఎంత బరువు మోయగలదు? వంటి అంశాలను స్పష్టం చేయాల్సి ఉంది. ప్రమాణాల మేరకు కరెంట్ సరఫరా ఉందా? నాణ్యమైన పరికరాలు (ఆటోమేటిక్ డోర్లు, మోటారు, కేబుల్, సెన్సర్లు, ఫ్యాన్లు, లైట్లు, అత్యవసర ఫోన్, అగ్ని నిరోధక పరికరాలు) ఏర్పాటు చేయాలనే నిబంధనలున్నా.. చట్టం లేకపోవడంతో చాలా మంది పట్టించుకోవడం లేదు. 20 ఏళ్లకు పైబడిన వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాల్సి ఉన్నా.. చాలాచోట్ల ఇప్పటికీ పాతవే దర్శనమిస్తున్నాయి. సర్టిఫైడ్ నిపుణులతోనే ఎలివేటర్లను ఇన్‌స్టాల్ చేయించుకోవడంతోపాటు నిర్వహణ సరిగా ఉందని నిర్ధారించుకుంటేనే లిఫ్ట్ ప్రమాదాల నుంచి బయటపడొచ్చని తెలంగాణ విద్యుత్ ప్రధాన తనిఖీ అధికారి సీహెచ్.రామాంజనేయులు వివరించారు.

హైదరాబాద్‌లో భారత్ సమ్మిట్

- ఏప్రిల్‌లో పొలిటికల్, ఇన్వెస్ట్‌మెంట్ డైలాగ్ సదస్సు
- రాహుల్‌గాంధీతోపాటు ఇతర కాంగ్రెస్ నేతలను ఆహ్వానిస్తాం
- మే నెలలో హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీలు
- ఏప్రిల్ 19న నగరానికి మిస్ వరల్డ్ నిర్వాహకులు
- ఫార్ములా ఈ-రేస్ తప్పు కాదు.. నిధులు చెల్లింపు విధానమే తప్పు
- అసెంబ్లీ సమావేశాలు ముగిసేలోగా ఎథిక్స్ కమిటీని నియమిస్తాం
- మీడియా చిట్‌చాట్‌లో శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏప్రిల్ నెలలో హైదరాబాద్‌లో 'భారత్ సమ్మిట్'నిర్వహిస్తున్నట్లు పరిశ్రమలు, ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ 'పొలిటికల్, ఇన్వెస్ట్‌మెంట్ సదస్సు'కు అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానిస్తామని చెప్పారు. విదేశాల నుంచి కూడా పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్నామని వెల్లడించారు. శనివారం అసెంబ్లీ లాబీల్లోని తన కార్యాలయంలో మీడియాతో శ్రీధర్‌బాబు చిట్‌చాట్ చేశారు. భారత్ సమ్మిట్‌కు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ హాజరవుతారని తెలిపారు. ఓవర్‌సీస్ కాంగ్రెస్ చైర్మన్ సామ్ పిత్రోడా బృందంలోని ఒక వ్యక్తి హైదరాబాద్ వస్తున్నారని, ఆయనతో చర్చించిన తరువాత సదస్సుకు తుది రూపు వస్తుందని పేర్కొన్నారు. ఈ సదస్సును రెండురోజులపాటు నిర్వహిస్తామని చెప్పారు.

12 రాష్ట్రాలను కాదని తెలంగాణలో మిస్ వరల్డ్ పోటీలు

మే నెలలో తెలంగాణలో మిస్ వరల్డ్ పోటీలు జరుగుతాయని శ్రీధర్‌బాబు తెలిపారు. ఏప్రిల్ 19న మిస్ వరల్డ్ పోటీల నిర్వాహకులు రాష్ట్రానికి వస్తున్నారని, ఈ కార్యక్రమాలు ఎక్కడెక్కడ నిర్వహించేది అప్పుడు నిర్ణయమవుతుందని చెప్పారు. దేశంలోని 12 రాష్ట్రాలు ఈ పోటీల నిర్వహణకు ముందుకు వస్తే.. తెలంగాణను నిర్వాహకులు ఎంపిక చేశారని తెలిపారు.

ఫార్ములా ఈ–రేస్‌ను వ్యతిరేకించలేదు: తమ ప్రభుత్వం ఫార్ములా ఈ–రేస్ పోటీలను తప్పుపట్టలేదని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టంచేశారు. రేస్ నిర్వహణకు నిధులు చెల్లించిన తీరే తప్పు అని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా నిధులు చెల్లించారని ఆరోపించారు. నిధులు చెల్లింపు విధానమే లోపభూయిష్టంగా ఉన్నప్పుడు ఆ రేస్‌ను తాము నిర్వహించడంలో అర్థం లేదని అన్నారు.

సమావేశాలు ముగిసేలోగా ఎథిక్స్ కమిటీ: శాసనసభ సమావేశాలు ముగిసేలోగా ఎథిక్స్ కమిటీని ఏర్పాటు చేస్తామని శ్రీధర్‌బాబు తెలిపారు. శాసనసభలో స్పీకర్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ప్రదర్శించిన హావభావాలు, మాట్లాడిన తీరు, సభ్యులను మూసుకొని కూర్చోండి అని తీవ్ర అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. ఈ విషయాన్ని ఎథిక్స్ కమిటీకి పంపిస్తామని తెలిపారు.

సామాజిక న్యాయమే బీసీ వాదం..

- సామాజిక తెలంగాణ కోసం పోరాటం
- బీసీ మేధావుల సమావేశంలో వక్తల పిలుపు


బీసీ సంఘాల సమావేశంలో మధుయాష్కీ, జాజుల, చిరంజీవులు, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

సనత్‌నగర్ (హైదరాబాద్): సామాజిక న్యాయమే బీసీ వాదమని పలువురు వక్తలు పేర్కొన్నారు. 'రాష్ట్ర ఏర్పాటు ఆకాంక్షను నెరవేర్చుకున్నాం. ఇక ఇప్పుడు సామాజిక తెలంగాణ కోసం పోరాటం చేయాలి' అని పిలుపునిచ్చారు. శనివారం బేగంపేటలోని టూరిజం ప్లాజాలో కాన్షీరాం జయంతి సందర్భంగా 'రాష్ట్ర బడ్జెట్–బీసీల వాటా–సబ్‌ప్లాన్'ఆవశ్యకతపై బీసీ సంఘాలు, బీసీ మేధావుల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యం వహించగా బీసీ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు టి.చిరంజీవులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో సామాజిక న్యాయం ఉండాలని పోరాడి ఉంటే ఇప్పుడు పరిస్థితి ఇలా ఉండేది కాదన్నారు. బీసీల పోరాటంలో విద్యావంతులు, రాజకీయేతర నేతలతో మాట్లాడి సలహాలు తీసుకోవాలని చెప్పారు. బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ మాట్లాడుతూ.. మనమెంతో, మనకంత వాటా కావాలన్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఒకే డీఎన్ఏ అన్నారు. బీసీల కోసం బడ్జెట్ పెడతారు కానీ ఖర్చు చేయరన్నారు. ఇది 70 ఏళ్లుగా చూస్తున్నామన్నారు. జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ గత అసెంబ్లీ సమావేశాల్లో బీసీల అంశం చర్చకు రాలేదన్నారు. ప్రభుత్వమేదైనా బీసీల వాటా బీసీలకు దక్కాల్సిందేనన్నారు. రాహుల్ గాంధీ దృష్టికి తీసుకువెళ్లి బీసీ సబ్‌ప్లాన్‌ను ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే పెట్టాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ మురళీ మనోహర్, కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసిన ప్రసన్న హరికృష్ణ, మినరల్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్, డీఎస్పీ అధ్యక్షుడు విశారదన్ మహరాజ్, బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేశ్‌చారి, కన్వీనర్ బాలగోని బాలరాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐతో పాఠాలు..



ఈ బాలుడిని చూస్తే.. ఏదో కాల్‌సెంటర్‌లో పనిచేస్తున్నట్లు ఉంది కదూ.. ఈ బాలుడు సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థి. చదువులో వెనుకబడిన 3, 4, 5 తరగతుల విద్యార్థులకు.. ప్రత్యేకంగా కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ద్వారా పాఠాలు బోధించేందుకు విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. ఎంపిక చేసిన పాఠశాలల్లో శనివారం నుంచి ఈ విధానాన్ని అమలు చేస్తోంది. - హుజూర్‌నగర్

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

దగా యాష్.. నిఘా ట్రాష్

- బూడిద తరలింపు పేరిట యథేచ్ఛగా దందా
- నేషనల్ హైవే నిర్మాణాల పేరిట అక్రమాలు
- ఇటుక బట్టీలకు అక్రమంగా అమ్మకం
- అధికార, ప్రతిపక్ష నేతల మాటల యుద్ధం
- రచ్చకెక్కిన బూడిద పంచాయితీ



సాక్షి, పెద్దపల్లి:

భారతావనికి ఎన్టీపీసీ విద్యుత్ వెలుగులు పంచుతుంటే, విద్యుదుత్పత్తిలో భాగంగా విడుదలయ్యే బూడిద (యాష్) రాజకీయ నేతలకు కాసుల వర్షం కురిపిస్తోంది. బూడిదతో ఎన్నిరకాలుగా దందా చేయవచ్చో, అన్నిరకాలుగా అక్రమమార్గాల్లో అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికే రామగుండం కేంద్రంగా యాష్ పాండ్‌లో జరుగుతున్న అక్రమాలపై ఇంటలిజెన్స్ రిపోర్టు సీఎంవో కార్యాలయానికి చేరుకున్నా.. ఈ దందాకు అడ్డుకట్ట పడలేదు.

దీంతో బూడిద సరఫరా పేరుతో జరుగుతున్న అక్రమాలపై అధికార, ప్రతిపక్ష పార్టీల నేతల మధ్య మొదలైన మాటల యుద్ధం.. చివరకు గోదావరిఖని పోచమ్మ ఆలయంలో తడిబట్టలతో ప్రమాణం చేసేస్థాయికి చేరుకోవడం రాజకీయంగా దుమారం రేపుతోంది.



రామగుండం సమీపంలోని కుందనపల్లి యాష్‌పాండ్ నుంచి బూడిద తరలిస్తున్న లారీలు

నేషనల్ హైవేకి తరలింపు పేరుతో..

ఉత్పత్తిలో భాగంగా విడుదలయ్యే బూడిద.. చెరువులో నిర్ణీత స్థాయికి మించితే కాలుష్య సమస్యలు తలెత్తుతాయి. దీంతో ఎన్టీపీసీ అవసరమైన వారికి ఎప్పటికప్పుడు అందులో బూడిదను ఉచితంగా సరఫరా చేస్తోంది. కానీ జాతీయ అవసరాల దృష్ట్యా కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా.. కొత్తగా నిర్మించే జాతీయ రహదారులకు.. రామగుండంలోని కుందనపల్లిలోని బూడిద చెరువు నుంచి తరలించాల్సి ఉంటుంది.

అందుకు లోడింగ్, రవాణా ఖర్చులు సైతం ఎన్టీపీసీయే భరిస్తుంది. రవాణా చార్జీలుగా టన్నుకు రూ.1,250 చొప్పున చెల్లిస్తుంది. అంటే ఒక లారీకి రూ.50 వేల వరకు బూడిద రవాణాకు చెల్లిస్తుంది. దీంతో కొంతమంది కాంట్రాక్టర్లు కొత్త దందాకు తెర తీశారు. నేషనల్ హైవే పేరిట తరలించే లారీల్లో సగం లారీలను నేషనల్ హైవేల నిర్మాణానికి చేరుస్తూ, మిగిలిన సగం లారీల బూడిదను బ్లాక్ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పాండ్ నుంచి లోడింగ్ అయి బయటకు వచ్చాక వాటికి నంబర్ ప్లేట్లు మార్చి జీపీఎస్‌ను మరో లారీలో పెట్టడం తదితర జిమ్మిక్కులతో నేషనల్ హైవేకు తరలించాల్సిన బూడిదను.. కరీంనగర్, సిద్దిపేట, జగిత్యాల తదితర ప్రాంతాల్లోని ఇటుక బట్టీలకు విక్రయిస్తున్నారు. దీంతో పక్కదారి పట్టించిన ఒక్కొక్క లారీకి ఎన్టీపీసీ నుంచి రవాణా చార్జీల పేరిట రూ.50 వేలు, ఇటుక బట్టీలకు లారీ బూడిదను రూ.50 వేలకు అమ్మి తమ ఖాతాల్లో వేసుకుంటున్నారు. బూడిదతో పాటు నిర్వహణ ఖర్చుల పేరిట అక్రమార్కులు డబుల్ ధమాకా పొందుతున్నారు.

లోడింగ్ పేరుతో..

పెద్దపల్లి జిల్లా రామగుండంలోని ఎన్టీపీసీ థర్మల్ పవర్ ప్లాంట్‌లో విద్యుదుత్పత్తిలో భాగంగా వెలువడే నీటితో కలిసిన బూడిదను.. బూడిద చెరువులో నింపుతారు. ఆ బూడిదను డీసిల్టేషన్ ప్రక్రియలో భాగంగా అధికారులు టన్నుకు రూ.130 చొప్పున 38 ఏజెన్సీలు 15 లక్షల మెట్రిక్ టన్నుల బూడిద తరలించేలా టెండర్లు ఖరారు చేశారు. కాగా, ఎన్టీపీసీ ఈ టెండర్లను రద్దు చేసి రూ.1కే టన్ను ఇచ్చేందుకు టెండర్లు పిలిచింది. దీంతో 114 మంది ఈ టెండర్లను దక్కించుకున్నారు. టెండర్లు దక్కించుకున్న వారిలో ఐదుగురు.. రాజకీయ బలంతో లోడింగ్ పేరుతో దందాకు తెర తీశారు. లారీల సామర్థ్యాన్ని బట్టి రూ.4,600 నుంచి రూ.9,600 వరకు అక్రమంగా వసూలు చేస్తూ ఇటుకబట్టీలకు సరఫరా చేస్తున్నారు. రోజుకు వెయ్యి వాహనాల్లో బూడిద తరలిస్తూ రూ.లక్షల్లో జేబుల్లో వేసుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

పరస్పర ఆరోపణలతో..

బూడిద చెరువులోకి వచ్చి చేరే బూడిదను జాతీయ రహదారుల నిర్మాణం, ఇటుకల తయారీతో పాటు ఇతరత్రా నిర్మాణాలకు ఉచితంగా ఎన్టీపీసీ అందిస్తుంది. కానీ, ఈ బూడిద తరలింపు వ్యవహారంలో రాజకీయ నేతల జోక్యంతో అక్రమాలు సాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోజుకు వెయ్యి లారీల చొప్పున సరఫరా అవుతుండటంతో.. అంతే మొత్తంలో బూడిద దందాలో డబ్బులు చేతులు మారుతున్నాయి. దీంతో కొన్నిరోజులుగా జిల్లాలో బూడిద పంచాయితీపై నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. చివరకు ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మిక సంఘం అధ్యక్షుడు కౌశిక్‌హరి తడిబట్టలతో గోదావరిఖని పోచమ్మ గుడిలో ప్రమాణం చేయడం రాజకీయంగా దుమారం రేపింది.

బీఆర్‌ఎస్ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ

కాంగ్రెస్ శాసనసభ్యుడు రాంచందర్ నాయక్

సాక్షి, హైదరాబాద్: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని, ప్రశ్నించేవారి గొంతులను నొక్కేశారని కాంగ్రెస్ శాసనసభ్యుడు రాంచందర్ నాయక్ ఆరోపించారు. పదేళ్లలో ఉద్యోగాల భర్తీ లేక, పేపర్ లీకేజీలతో యువత నిర్వీర్యమైందన్నారు. గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శనివారం శాసనసభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 55 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేసిందని గుర్తు చేశారు.

హెచ్‌సీయూ భూముల వేలాన్ని ఉపసంహరించాలి

బీజేపీ నేత కె.లక్ష్మణ్ డిమాండ్

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) భూముల వేలాన్ని ఉపసంహరించాలని లేనిపక్షంలో తమ పార్టీ ఉద్యమిస్తుందని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్ హెచ్చరించారు. ఈ వర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని విక్రయించాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. శనివారం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ హెచ్‌సీయూలో ఎంతో ఆదరణ పొందిన మష్రూమ్ రాక్ వంటి ప్రదేశాలున్నాయని తెలిపారు. ఈ స్థలంలో జాతీయ పక్షి నెమలి, జింకలు, అనేక రకాల పక్షులున్నాయని, అరుదైన వృక్ష జీవ సంపదకు ఇది నిలయంగా ఉందని చెప్పారు. ఇంతటి ప్రాముఖ్యం ఉన్న స్థలాన్ని ప్రైవేట్, కార్పొరేట్ శక్తులు స్వార్థ ప్రయోజనాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ధారాదత్తం చేయాలనుకుంటోందని లక్ష్మణ్ ఆరోపించారు. ఈ వైఖరి విద్య, పర్యావరణ పరిరక్షణ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిని సూచిస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్ర పరిశ్రమలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీఎస్ఐఐసీ) శేరిలింగంపల్లి మండలంలోని కంచ గచ్చిబౌలి ప్రాంతంలోని 400 ఎకరాల హెచ్‌సీయూ స్థలాన్ని రూ.10 వేల కోట్ల (అంచనా విలువ)కు వేలం వేయబోతున్నట్లు ప్రకటించిందన్నారు.

మార్చిలోనే మూర్ఛలు!



ఎండలు దంచికొడుతుండటంతో జిల్లా వాసులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మార్చిలోనే ఎండల తీవ్రత ఇలా ఉంటే.. మేలో ఎలా ఉంటుందనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో శనివారం భానుడి భగభగలతో పాదచారులు, వాహనదారులు విలవిల్లాడారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



శాంతి సరోవర్‌లో న్యాయమూర్తుల ప్రసంగాలు

న్యాయవాదికి ఆర్జన కొలమానం కాదు: జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి

న్యాయవాదులు వృత్తితోపాటు వ్యక్తిగత విషయాలపై కూడా శ్రద్ధ తీసుకోవాలి. ధ్యానం, ఆధ్యాత్మికం, ఇతర కార్యకలాపాలపై దృష్టిసారించాలి. ఆధ్యాత్మిక గురువులు ఆరోగ్యం, ఆధ్యాత్మికం, విద్య సహా పలు రంగాలపై కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆరోగ్యం, ఆధ్యాత్మికం కలిపి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఫిజికల్‌గా పాల్గొనడమే కాకుండా ఆన్‌లైన్‌లోనూ ఇలాంటి వాటిని పెద్ద ఎత్తున ప్రజలు అనుసరిస్తున్నారు. ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయుక్తం. ఈ సదస్సులో ప్రముఖుల సూచనలను.. న్యాయవాదులు, న్యాయమూర్తులే కాదు.. యువత కూడా స్వీకరించాలి. ఆర్జన అనేది న్యాయవాది విజయానికి కొలమానం కాదు. సామాజిక సేవ, పేదలకు సాయం అనేది అసలైన కొలమానం. అదే ఆత్మ సంతృప్తినిస్తుంది.

సేవలు అద్భుతం: జస్టిస్ సూరేపల్లి నంద

బ్రహ్మకుమారీల సేవలు అద్భుతం. వృత్తిలో గెలిచినప్పుడే వ్యక్తిగత విజయం సాధ్యం. ఆధ్యాత్మికతతోనే మానవత్వం ఉద్భవిస్తుంది. పాజిటివ్ ఎనర్జీతో సమస్యలను పరిష్కరించే సామర్థ్యాన్ని ఇస్తుంది. ధర్మానికి కట్టుబడిన కారణంగానే పాండవులు విజయం సాధించారు. భగవద్గీతలోను కృష్ణ భగవానుడు అదే బోధించారు.

విశాల దృక్పథం అవసరం: జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి

వృత్తిపరంగా ఎంత ఎదిగినా కూడా నిత్య విద్యార్థిగా ఉండాలి. అలా అనుకుంటేనే మనం జీవితంలో ఏదైనా సాధించగలం. అంతా నాకే తెలుసు అనే భావన విజయ తీరాలకు చేర్చదు. ప్రతీ వ్యక్తి విశాల దృక్పథంతో ఆలోచించాలి.

మానసిక నియంత్రణతోనే విజయతీరాలకు..: జస్టిస్ అమర్‌నాథ్‌గౌడ్

నేను గొప్ప విద్యార్థిని, న్యాయవాదిని కాదు. కానీ, కష్టాన్ని నమ్ముకుని ముందుకు నడిచా. అదే నన్ను విజయతీరాలకు చేర్చింది. జస్టిస్ ఈశ్వరయ్య ద్వారా నాకు బ్రహ్మకుమారి సంస్థతో అనుబంధం ఏర్పడింది. మరింత మానసిక వికాసానికి ఇలాంటి పలు సంస్థలు తోడవుతున్నాయి. అకుంఠిత దీక్షతో వృత్తిలో రాణించేలా భగవద్గీత దోహదం చేసింది. ఇలాంటివన్నీ కలిసి 91వేలకు పైగా కేసుల్లో తీర్పు ఇచ్చి గిన్నిస్ రికార్డు సాధించే స్థాయికి తీసుకెళ్లాయి. వీటిల్లో కేవలం 19 మంది మాత్రమే అప్పీల్‌కు వెళ్లారు. ఇన్ని కేసులు చేసినా అలసిపోలేదు. మానసిక నియంత్రణతోనే ఇది సాధ్యమైంది.

అక్కడే మనశ్శాంతి పొందా..: జస్టిస్ ఈశ్వరయ్య

1999, మే 17న రాజస్తాన్ మౌంట్ అబులోని బ్రహ్మకుమారీల ప్రధాన కార్యాలయం జ్ఞాన సరోవర్‌కు వెళ్లా. అక్కడ అడుగుపెట్టిన తర్వాత మనశ్శాంతి పొందా. అప్పటి నుంచి నిత్యం బ్రహ్మకుమారీల కార్యక్రమాల్లో పాల్గొంటున్నా. జీవితాన్ని సరైన దారితో నడిపించే సంస్థ ఇది. ఇకపై నేను ఏ కేసు స్వీకరించినా.. ఫీజు మాత్రం తీసుకోను. బ్రహ్మకుమారీల కార్యక్రమాలతో నిజమైన శాంతిని పొందవచ్చు.

లవ్, లా రెండూ తప్పనిసరి: బీకే కుల్‌దీప్ దీదీ, బ్రహ్మకుమారీ సంస్థ

ప్రతీ మనిషి జీవితంలో 'లవ్', 'లా' రెండూ తప్పనిసరి. పెళ్లికాక ముందు తల్లిదండ్రులు (మదర్, ఫాదర్) ప్రేమ ఉంటుంది. ఆ తర్వాత ఆ ప్రేమకు 'లా' చేరి మదర్ ఇన్ లా, ఫాదర్ ఇన్ లాగా మారుతుందని చమత్కరించారు.

మెడిటేషన్ అనేది మెడిసిన్: మాజీ ఏజీ దేశాయి ప్రకాశ్‌రెడ్డి

న్యాయవాదులు కేసులు తీసుకున్నప్పుడు కక్షిదారుల ఆందోళన కూడా తీసుకోవద్దు. ఎందుకంటే కక్షిదారుడికి ఒకటే ఆందోళన ఉంటుంది.. కానీ, పలు కేసులు వాదించే న్యాయవాది అందరి ఆందోళనను తీసుకుంటే అది హానికర పరిణామాలకు దారితీస్తుంది. మనిషి.. తనని తాను తెలుసుకుంటే అంతకంటే గొప్ప విషయం లేదు. మెడిటేషన్ చాలా సమస్యలకు మెడిసిన్. సమాజం అంతా, అన్ని రకాలుగా మంచిగా ఉంటే ఎన్జీవోల అవసరం ఉండదు. బ్రహ్మకుమారీల సేవలు అభినందనీయం.

ఔరా.. వైరా..

తడారిన భూములకు ఊపిరి పోస్తోంది. ఎండిన గొంతుల దాహార్తి తీరుస్తోంది. అన్నదాతలకు ఆసరాగా నిలుస్తోంది.. లక్షలాది బతుకులకు అన్నం పెడుతోంది. పర్యాటక కేంద్రంగా కూడా వర్ధిల్లుతున్న ఆ జలాశయం వయసు వందేళ్లు.. ఖమ్మం జిల్లాలో అతి పెద్ద నీటిపారుదల ప్రాజెక్టుగా పేరొందిన వైరా జలాశయంపై కథనమిది.

- చెక్కుచెదరని వందేళ్ల వైరా జలాశయం
- ఖమ్మం జిల్లాలో సాగు, తాగునీటి వనరు
- పచ్చని సిరులు పండిస్తూ.. దాహార్తి తీరుస్తూ..
- వందలాది మంది మత్స్యకారులకు జీవనోపాధి
- 1923లో శంకుస్థాపన.. రూ.36 లక్షలతో నిర్మాణం



వందేళ్లుగా చెక్కు చెదరని ఆనకట్ట

వైరా: రాష్ట్రంలోని మధ్యతరహా నీటిపారుదల ప్రాజెక్టుల్లో ఒకటైన వైరా జలాశయం..

సుమారు 25 వేల ఎకరాలకు సాగునీటిని అందిస్తోంది. కల్పతరువుగా నిలుస్తున్న ఈ జలాశయాన్ని స్వాతంత్ర్యానికి ముందు నైజాం నవాబు నిర్మించారు.

వృథా నీటిని అరికట్టేలా..

తొలినాళ్లలో ఇల్లెందు, కారేపల్లి, కామేపల్లి అటవీ ప్రాంతం నుంచి ప్రవహించే నిమ్మవాగు, ఏన్కూరు మండలం నుంచి ప్రవహించే గండివాగు, గిన్నెలవాగు, పెద్ద వాగుల నుంచి వచ్చే మరో ఏరు.. వైరా సమీపాన కలిసి అతిపెద్ద ప్రవాహంగా తయారై వృథాగా పోయేది. ఈ పరిస్థితుల్లో ప్రవాహానికి అడ్డుకట్ట నిర్మించి వేలాది ఎకరాల బీడు భూములకు సాగునీరు అందించాలని.. నాటి పాలకుడైన నైజాం నవాబ్ మీర్ ఉస్మాన్ అలీఖాన్ బహదూర్ ఆలోచన చేశారు. దీంతో సాయిద్ జాదా నవాబ్ అలావత్‌జంగ్ బహదూర్ 1923వ సంవత్సరంలో శంకుస్థాపన చేయగా అప్పటి నిజాం ప్రభుత్వ కార్యదర్శి నీటిపారుదల శాఖ ఇంజనీర్ అయిన నవాబ్ అలీ, నవాబ్ జంగ్ బహదూర్ పర్యవేక్షణలో సుమారు రూ.36 లక్షలతో ఏడేళ్లలో నిర్మాణం పూర్తి చేశారు. డంగు సున్నం, రాయితో ఈ ప్రాజెక్టును నిర్మించగా.. 274 చదరపు మైళ్ల భూమి ముంపునకు గురైంది. అలాగే, 130 చదరపు మైళ్ల భూమిని రైతుల నుంచి సేకరించి.. అప్పట్లోనే సుమారు రూ.3 లక్షలకు పైగా నష్టపరిహారం చెల్లించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 18.3 అడుగులుగా ఉన్నప్పుడు మొత్తం 60 వేల క్యూసెక్కుల నీరు నిల్వ ఉంటుంది. ప్రాజెక్టు ఆనకట్ట ఎత్తు 88 అడుగులు కాగా, పొడవు 5,800 అడుగులుగా ఉంది. ఈ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలు 19 మైళ్ల దూరం ప్రవహిస్తూ.. 25 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తాయి. కుడి కాల్వ 15 మైళ్ల దూరం ప్రవహించి 29 ఉపకాల్వల ద్వారా 16 వేల ఎకరాలు, ఎడమ కాల్వ ఐదు మైళ్ల దూరం ప్రవహిస్తూ 22 ఉప కాల్వల ద్వారా తొమ్మిది వేల ఎకరాలను సాగులోకి తీసుకొచ్చింది. 1930లో కేవలం 12 వేల ఎకరాల భూములను సాగులోకి తెచ్చేలా డిజైన్ చేసినా ప్రస్తుతం రెండింతలుగా సాగవుతుండడం విశేషం.

దాహార్తి తీరుస్తూ..

ఖమ్మం జిల్లాలోని వైరా, బోనకల్, మధిర, ఎర్రుపాలెం, కల్లూరు, వేంసూరు, కొణిజర్ల, చింతకాని, ఏన్కూరు, పెనుబల్లి తదితర 11 మండలాల్లోని 420 గ్రామాల ప్రజలకు ఈ ప్రాజెక్టు ద్వారానే తాగునీరు అందుతోంది. మిషన్ భగీరథ పథకం ద్వారా ఈ రిజర్వాయర్ నుంచి ఫ్లోరైడ్ రహిత తాగునీటిని సరఫరా చేస్తున్నారు.

వైఎస్సార్ కృషితో మహర్దశ..

జలయజ్ఞంలో భాగంగా అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రత్యేక కృషి వల్ల ఈ జలాశయం రూపురేఖలు మారాయి. తొలిసారిగా ఈ ప్రాజెక్టు ఆధునికీకరణకు అప్పట్లో రూ.51 కోట్లు మంజూరు చేయగా మహర్దశ పట్టింది. జలాశయం ఆధునికీకరణలో భాగంగా కుడి, ఎడమ కాల్వల్లో పూడిక తీత, సిమెంట్‌తో లైనింగ్ చేయించి కాల్వలు పటిష్టం చేశారు. దీంతో ఈ ప్రాంత రైతుల చిరకాల స్వప్నం ఫలించింది.



వైరా రిజర్వాయర్ అలుగు అందాలు

పర్యాటకంగానూ అభివృద్ధి

రిజర్వాయర్ కట్టపై పచ్చిక బయళ్లు.. అందమైన పూల తోటలు.. చుట్టూ నీరు.. కొండపై నుంచి చూస్తే రమణీయమైన ప్రకృతి దృశ్యాలు ఇక్కడ మైమరిపింపజేస్తాయి. ఈ సుందర దృశ్యాలను చూస్తూ.. అందమైన సాయంత్రాలు గడిపేందుకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నలుమూలల నుంచి పర్యాటకులు వస్తుంటారు. సూర్యోదయం లేదా సాయంసంధ్య వేళల్లో ఇక్కడి దృశ్యాలను తిలకించేందుకు రెండు కళ్లు సరిపోవనే చెప్పాలి. ఈమేరకు పర్యాటక అభివృద్ధిలో భాగంగా పిల్లల పార్క్ నిర్మించి.. పూలతోటలు అభివృద్ధి చేయడమే కాక ప్రత్యేక లైటింగ్ ఏర్పాటు చేశారు. ఇందుకోసం 2006లో పర్యాటక శాఖ రూ.70 లక్షలు వెచ్చించింది. ఇక్కడ పలు టీవీ సీరియళ్ల షూటింగ్ కూడా జరగడం విశేషం.

మత్స్యకారులకు జీవనోపాధి

వైరా రిజర్వాయర్‌పై కొణిజర్ల, వైరా, తల్లాడ మండలాలకు చెందిన సుమారు 500 మత్స్యకార కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేయడానికి.. ముందు నుంచే మత్స్యకారులు చేపలు, రొయ్య పిల్లలు వేసి ఏటా ఫిబ్రవరి నుంచి జూన్ వరకు వేటతో జీవనం సాగిస్తుంటారు.



వైరా రిజర్వాయర్ అందాలు



రిజర్వాయర్ నుంచి విడుదలవుతున్న కాల్వ



రిజర్వాయర్ సామర్థ్యం, వివరాలు తెలిపే శిలా ఫలకం

క్లుప్తంగా...

ఆటో డ్రైవర్ వీరంగం... లాఠీలకు పనిచెప్పిన ఖాకీలు

విజయనగరం జిల్లా బుదరాయవలసలో ఘటన



మెరకముడిదాం: ఓ ఆటో డ్రైవర్ మద్యం మత్తులో వీరంగం సృష్టించగా... పోలీసులు తమ లాఠీలకు పనిచెప్పిన ఘటన విజయనగరం జిల్లా మెరకముడిదాం మండలం బుదరాయవలస పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... బుదరాయవలస గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ సిరిపురపు రాంబాబు కొన్నినెలల కిందట అదే గ్రామానికి చెందిన ఓ మహిళను తీసుకెళ్లిపోయాడు. అప్పటికే రాంబాబుకు భార్య లక్ష్మితో పాటు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. తీసుకెళ్లిన మహిళతో సైతం మద్యం సేవించి గొడవపడడంతో ఆమె బుదరాయవలస పోలీస్ స్టేషన్‌లో కొద్దిరోజుల కిందట ఫిర్యాదు చేసింది. విచారణ కోసం పోలీసులు రాంబాబును పిలిచారు. విచారిస్తున్న సమయంలో రాంబాబు అక్కడ పనిచేస్తున్న సిబ్బందిపై తిరగబడడం, ఆటోను పోలీసులపైకి ఎక్కించే ప్రయత్నం చేశాడు. దీంతో పోలీసులు రాంబాబుని చుట్టుముట్టి లాఠీలకు పనిచెప్పారు. ఈ దాడిలో రాంబాబు వీపుపై తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన ఆటో డ్రైవర్‌ను కుటుంబ సభ్యులు చీపురుపల్లి ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. తనను విచారణకు పిలిచి నలుగురు పోలీసులు నిర్దాక్షిణ్యంగా కొట్టినట్టు ఆటోడ్రైవర్ పేర్కొన్నాడు.

పసుపు సాగుకు సిరుల ఛాయ



- మాడుగుల పసుపునకు భలే గిరాకీ
- రంగు, నాణ్యతలో టాప్
- ఏజెన్సీలో విరివిగా పసుపు సాగు
- మాడుగుల, ఎస్.కోట, నర్సీపట్నం కేంద్రాలకు లక్షలాది టన్నుల సరఫరా
- ఏటా 1100 కుటుంబాలకు జీవనోపాధి
- రూ.96 కోట్ల టర్నోవర్

గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో విశాఖ ఏజెన్సీలో పూర్తి స్థాయిలో గంజాయి సాగును అరికట్టడంతో రెండేళ్లుగా ఏజెన్సీ రైతులు పసుపు, పిప్పలి సాగుపై దృష్టి సారించారు. ప్రస్తుతం పసుపు సాగు సులువుగా ఉండడంతో పాటు అధిక లాభాలు వస్తుండడంతో ఏజెన్సీలో 11 మండలాల్లో పలువురు రైతులు గంజాయి వదిలి పసుపు సాగుపై దృష్టి సారించారు. మూడేళ్లుగా ధరలు పెరుగుతూ వస్తుండడంతో పసుపు సాగు పెరుగుతూ వస్తోంది. దేశీయ మార్కెట్‌తో పాటు అంతర్జాతీయ మార్కెట్‌లో మాడుగుల పసుపునకు మంచి డిమాండ్ ఉంది.



ఏజెన్సీ నుంచి వచ్చిన దుంప పసుపు ఎండబెట్టిన దృశ్యం



పసుపు దుంపలు గ్రేడింగ్ చేస్తున్న దృశ్యం

మాడుగుల : ఉమ్మడి విశాఖ జిల్లాలో మన్యం ముఖద్వారమైన మాడుగుల పసుపు వ్యాపారానికి ప్రధాన కేంద్రంగా ప్రసిద్ధి చెందింది. ఏజెన్సీలో 11 మండలాల్లో పండించిన పసుపు మాడుగుల పసుపు ప్రాసెసింగ్ కేంద్రాలకు సరఫరా అవుతుంది. గతంలో 3 వేల ఎకరాలకు పరిమితమైన పసుపు సాగు నేడు 6 వేల ఎకరాలకు పైగా పెరిగింది. ఏజెన్సీ 11 మండలాల నుంచి 80 కిలోలున్న బస్తాలు 80 వేల బస్తాలు వచ్చేవి. ఈ ఏడాది సుమారు లక్షా 70 వేల బస్తాలు సరఫరా అవుతాయని రైతులు, వ్యాపారులు అంచనా వేస్తున్నారు.

పసుపు ప్రాసెసింగ్ ఇలా...

విశాఖ ఏజెన్సీలో పండించిన పసుపు దుంపలు మాడుగుల చేరాక, అక్కడ డ్రమ్ముల్లో వేసి ఉడక బెట్టి ప్రాసెసింగ్ చేస్తారు. అనేకమైన ప్రాసెసింగ్ తరువాత ఆరెంజ్ ఎల్లో రంగుకు మారిన తరువాత ఆకర్షణీయమైన ప్యాకింగ్ చేసి ఎగుమతులు చేస్తారు. పంట పండించే దగ్గర నుంచి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ పసుపు వ్యాపారంపై సుమారు 1100 కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నారు.

అంతర్జాతీయంగా గుర్తింపు

దక్షిణ భారతదేశంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో నర్సీపట్నం, పాలకొండ, రాజమండ్రి, వరంగల్, నిజామాబాద్, దుగ్గిరాల, తమిళనాడు, కేరళ, ఒడిశా, కురుపాం, ఈరోడ్డు, బరంపురంలో పసుపు పరిశ్రమలున్నాయి. ఉత్తరాంధ్రాలో మాడుగుల, ఎస్.కోట, తుని, నర్సీపట్నం, సాలూరుల్లో పసుపు ప్రాసెసింగ్ కేంద్రాలున్నాయి. కానీ మాడుగుల పసుపునకు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లో మంచి గిరాకీ ఉంది. విశాఖ మన్యంలో పండించే పసుపులో అధిక కుర్కుమిన్‌తో పాటు, చర్మ సౌందర్యానికి ఉపయోగపడే, ఓలంట యిల్ ఉండడమే ఇందుకు కారణమని నిపుణులు చెబుతున్నారు. మిగతా ప్రాంతాల పసుపులో 2 శాతం కుర్కుమిన్ ఉంటే మాడుగుల పసుపులో మాత్రం 5 శాతం కుర్కుమిన్ ఉండడంతో పాటు రంగు ఆరంజ్ ఎల్లో కావడంతో మంచి క్రేజ్ ఉంది. నాణ్యమైన పసుపు కావడంతో సౌందర్యానికి, వివిధ రకాల వంటకాల్లోనూ ఈ పసుపు విరివిగా వినియోగించడం వల్ల డిమాండ్ బాగుంటుంది.

పసుపు ఎగుమతులు ఇలా

ఈ ప్రాంతంలో పండించే దుంప పసుపు సుమారు 300 ఏళ్ల నుంచి వ్యాపారుల ద్వారా మాడుగుల చేరుకుంటుంది. మాడుగులలో సుమారు 10 పసుపు ప్రాసెసింగ్ కేంద్రాల ద్వారా ఛాయ పసుపు తయారు చేస్తున్నారు. ఏటా సుమారుగా 800 లారీల పసుపు డిసెంబర్ నుంచి ఏప్రిల్ వరకు మాడుగుల ప్రాసెసింగ్ కేంద్రాలకు చేరుకుంటుంది. ఇక్కడ అనేక రకాలుగా ప్రాసెసింగ్ చేసిన తరువాత గ్రేడింగ్ చేసి మేలిమి పసుపు, నార పసుపు విడివిడిగా ప్యాకింగ్ చేసి ఎగుమతులు చేస్తారు. సుమారు 500 లారీల వరకు చెన్నైకి ఇక్కడ నుంచి ఎగుమతి చేస్తారు. మరో 200 లారీల వరకు కొచ్చిన్‌కు ఎగుమతులు చేస్తారు. 100 లారీల వరకు స్థానికంగా శుభకార్యాలతో పాటు వంటకాల కోసం వ్యాపారులకు విక్రయాలు జరుగుతాయి. బస్తా 80 కిలోల చొప్పున ఒక్కో లారీకి 125 బస్తాలు ఎగుమతులు చేస్తారు. ఈ లెక్కన 800 లారీలకు కిలో పసుపు రూ.125 చొప్పున ప్రతి ఏటా సుమారుగా రూ.96 కోట్ల టర్నోవర్ ఉంటుంది.



ప్రాసెసింగ్ అనంతరం రంగు మారిన పసుపు

అధిక కుర్కుమిన్‌తో గిరాకీ



కుర్కుమిన్ అధికంగా ఉండే పసుపు ఎక్కువగా తమిళనాడులో ఉపయోగిస్తున్నారు. ఔషధ తయారీలో కూడా ఉపయోగించడంతో మాడుగుల పసుపునకు మంచి గిరాకీ ఉంది. గతంలో కిలో పసుపు ధర రూ.70 నుంచి రూ.90 వరకు పలికేది. రెండేళ్లుగా రూ. 120 నుంచి రూ.140 వరకు ధరలు పలుకుతున్నాయి. ఈ ఏడాది సీజన్ తొలినాళ్లలోనే రూ.125 పలకడం విశేషం. దీంతో అటు రైతులకు, ఇటు వ్యాపారులకు లాభాలు వస్తున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గంజాయి అరికట్టడంతో ఏజెన్సీలో అందుకు ప్రత్యామ్నాయంగా పసుపు సాగు పెరిగింది.

– నూతిగట్టు నాగశంకర్, పసుపు వ్యాపారి, మాడుగుల

నిద్ర కరువైతే అనారోగ్యం..!



ఓఎస్‌ఏ మిషన్ పెట్టుకుని నిద్రపోతున్న గురక సమస్య ఉన్న వ్యక్తి

ఎక్కువ మందికి నిద్రలేమి సమస్య



చాలామంది నిద్రలేమి సమస్య బారిన పడుతున్నారు. అయితే ఈసమస్యకు ఎవరిని సంప్రదించాలో చాలామందికి తెలియదు. పలమనాలజిస్టును గాని, ఈఎన్‌టీ వైద్యుడిని గానీ సంప్రదించాలి. ఆరోగ్యంగా జీవించడం కోసం రోజులో 6 నుంచి 7 గంటల పాటు నిద్రపోవాలి. సెల్‌ఫోన్ ఎక్కువగా వినియోగించకూడదు. అదేవిధంగా టీవీ కూడా గంటల తరబడి చూడకూడదు.

డాక్టర్ బొత్స సంతోష్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

పెరుగుతున్న నిద్రలేమి సమస్య

నిద్రలేమితో బీపీ, సుగర్, గుండెపోటు, బ్రెయిన్‌స్ట్రోక్ వచ్చే ఆస్కారం

మొబైల్, టీవీలు అతిగా చూడడం వల్ల సమస్య



నిద్రలేమి సమస్య ఉన్న వ్యక్తిని పరీక్షిస్తున్న వైద్యుడు

విజయనగరం ఫోర్ట్: మానవుని జీవనశైలిలో మార్పులు, అధికంగా మొబైల్ వాడడం, టీవీ ఎక్కువగా చూడడం వల్ల అధికశాతం మంది నిద్రలేమి బారిన పడుతున్నారు. ఎక్కువసేపు ఒకే చోట కూర్చుని పనిచేయడం, జంక్‌ఫుడ్స్ ఎక్కువగా తినడం, రాత్రివేళ ఆలస్యంగా నిద్రపోవడం, రాత్రి షిఫ్టుల్లో విధులు నిర్వహించడం వల్ల తగినంత నిద్ర ఉండదు. దీని వల్ల వారు బీపీ, సుగర్, ఊబకాయం, గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్, థైరాయిడ్ వంటి వ్యాధుల బారిన పడుతున్నారు. చాలా మంది నిద్ర లేకపోతే ఏం జరుగుతుంది? అని తేలికగా తీసుకుంటారు. అర్ధ రాత్రి వరకు చాలా మంది నిద్రపోరు. దీని వల్ల అనేక సమస్యల బారిన పడతారు. నిద్రలేమి వల్ల ఓఎస్‌ఏ (అబ్స్ట్రక్టివ్ స్లీప్ అస్నియా) అనే సమస్యకు గురవుతారు. ఈ సమస్య ఉన్న వ్యక్తి శ్వాస తీసుకోవడం పదేపదే ఆగిపోవడం, ఊపిరి లోతుగా తీసుకోవడం (అల్పశ్వాస) జరుగుతుంది. అదే విధంగా పెద్దగా గురక పెట్టడం, శ్వాస పునఃప్రారంభం అయినప్పుడు ఉక్కిరిబిక్కిరి అయి వింత శబ్దాలు రావడం, పగటి సమయంలో మధ్య మధ్య కునుకుపాట్లు పడుతూ ఉండడం, అలసటగాను, మత్తుగాను ఉంటుంది. మద్యం తాగడం, పొగతాగడం, స్థూలకాయం వల్ల ఓఎస్‌ఏ సమస్య తీవ్రతరం అవుతుంది. చిన్నపిల్లల్లో అయితే ఎదుగుదల ఉండదు. మానసిక సమస్యల బారిన పడతారు.నెలకు 1000 మంది వరకు నిద్రలేమి సమస్య బారిన పడుతున్నారు.

6నుంచి 7 గంటల నిద్ర అవసరం

ప్రతి వ్యక్తి రోజులో 6 నుంచి 7 గంటలు నిద్రపోవాలి. ఇలా నిద్ర పోవడం వల్ల హార్మోన్స్ తయారవుతాయి. ఒత్తిడి తగ్గుతుంది. పనిచేయడానికి అవసరమైన శక్తి తయారవుతుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది. శరీర ఉష్ణోగ్రత నియంత్రణలో ఉంటుంది.

జాగ్రత్తలు

నిద్రలేమి సమస్య బారిన పడకుండా ఉండాలంటే ప్రతిరోజూ వ్యాయమం చేయాలి. కనీసం రోజులో 6 గంటలు నిద్ర పోవాలి. నిద్రలేమి సమస్య ఉన్నట్లయితే పలమనాలజిస్టునుగాని, ఈఎన్‌టీ వైద్యుడిని గాని సంప్రదించాలి. ఊబకాయం రాకుండా చూసుకోవాలి. పానీపూరీ, చాట్, పిజ్జా, బర్గర్లు వంటివి ఎక్కువగా తినకూడదు.

పార్ట్ టైమ్ జాబ్.. ఫుల్ టైమ్ ఫ్రాడ్

- పార్ట్ టైమ్ జాబ్ పేరిట సైబరాసురుల వల
- అమాయకుల పేరిట బ్యాంకు ఖాతాలు, సిమ్‌లు ఓపెన్ చేసి సొమ్ము చేసుకుంటున్న వైనం




శ్రీకాకుళం క్రైమ్ :


నరసన్నపేటలో ఓ వ్యక్తి తన ఇన్‌స్టాగ్రామ్‌లో తెలియని లింక్ రావడంతో ఓపెన్ చేశాడు. ఓ వెబ్ పేజీ ఓపెన్ అయ్యింది. పార్ట్‌టైమ్ జాబ్ చేసుకోవచ్చని చేయాల్సిందల్లా టాస్కులు క్లియర్ చేయడమేనని మెయిల్‌లో రావడంతో ఓకే చేశాడు. మొదట్లో తన అకౌంట్‌లో డబ్బులు పడ్డాయి. తర్వాత రూ.7.50 లక్షల వరకు లాగేశారు. మోసపోయానని తెలుసుకున్నలోపే అంతకుముందు అతని నంబర్‌ను యాడ్ చేసిన గ్రూపు నుంచి తొలగించి బ్లాక్‌లిస్టులో పెట్టేశారు.

- **శ్రీకాకుళం కేంద్రంగా టెలిగ్రామ్ యాప్‌లో ఓ యువతి పైన చెప్పిన తరహాలోనే రూ.2.80 లక్షలు మోసపోయింది. ఆమె సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావడం విశేషం.**
- **ఇచ్ఛాపురానికి చెందిన ఓ యువకుడు వర్క్‌ఫ్రం హోం అంటూ ఆన్‌లైన్ టాస్కుల పేరిట రూ.12.50 లక్షలు అప్పు చేసి పెట్టుబడి పెట్టాడు. ఆఖరికి ఇంట్లో వాళ్లు అప్పు తీర్చాల్సి వచ్చింది.**

టాస్క్ బేస్డ్ పార్ట్ టైమ్ జాబ్.. మోసగాళ్ల సరికొత్త వల. డబ్బులు సంపాదించుకోవచ్చనే ఆశ చూసి ఖాతాలు ఖాళీ చేసేందుకు వేసిన తాజా ప్రణాళిక. శ్రీకాకుళం జిల్లాలోనూ ఈ తరహా మోసాలు వెలుగుచూస్తున్నాయి. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో తెలియని లింక్‌లు, పార్ట్‌టైం జాబ్ ఆఫర్స్ కొన్నిమార్లు వస్తుంటాయి. క్లిక్ చేశాక వెబ్‌పేజీ ఓపెన్ అవుతుంది. మనకు తెలియకుండానే అవతలి వాళ్లు మనల్ని గ్రూపులో యాడ్‌చేస్తారు. కొన్ని టాస్కులు (లైకులు కొట్టడం, సబ్‌స్క్రైబ్ చేయడం) మీరు గెలుచుకుంటే సొమ్ము రెట్టింపు వస్తుందని నమ్మబలుకుతారు. మొదటి టాస్కులో రూ. 1000 నుంచి రూ. 2 వేలు పెట్టుబడి పెడితే దానికి డబుల్ అమౌంట్ తర్వాత టాస్క్ రూ. 10 వేలు అని ఫినిష్ చేస్తే డబుల్ అంటారు.. సక్సెస్‌గా పూర్తి చేసినా మన ఖాతాలో డబ్బులు రావు. మన పేరుతో ఓ ఫేక్ యాప్ అకౌంట్‌ను వ్యాలెట్ రూపంలో చూపించి అందులో డబ్బులు యాడ్ అయినట్లు చూపిస్తారు. మనం విత్‌డ్రా చేయడానికి అవ్వదు. మళ్లీ మూడో టాస్క్ రూ. 50 వేలు అని పూర్తి చేస్తే రూ. 1 లక్ష వస్తుందని నమ్మిస్తారు. కంప్లీట్ అయ్యాక డబ్బులు విత్‌డ్రా చేద్దామంటే అవ్వకపోవడంతో వారిని మనం అడిగితే అందులో మొదట పంపిన రూ. 10 వేలకు రూ. 10 వేలు, తర్వాత పంపిన రూ. 50 వేలకు రూ. 50 వేలు చూపించి విత్‌డ్రా ఆప్షన్ డిజేబుల్ అని చూపిస్తుందంటారు. టాస్కులో మీరేదో తప్పు చేయడం వలనే ఇలా జరిగిందని అది ఎనేబుల్ చేయడానికి నాలుగో టాస్క్ చేయాలంటారు. రూ. లక్ష నుంచి రూ. 5 లక్షల వరకు ఆ టాస్క్ ఉంటుందంటారు. మనం నమ్మి ఆ డబ్బులు పంపిస్తే అక్కడికి కొద్ది క్షణాల్లోనే అకౌంట్ బ్లాక్ అయిపోయిందని మీ అకౌంట్‌లో రూ. 7 లక్షల నుంచి రూ. 8 లక్షలుందని అవి విత్‌డ్రా అవ్వాలంటే మరో రూ. 2లక్షలు, లేదా రూ. 3లక్షలు వేయాలని చెబుతారు. పైగా మనకు తెలియకుండానే వేరే బాధితుడి అకౌంట్‌కు సైతం రూ. 10 వేలు వేయించి మన చేతే ముందుగా ఫ్రాడ్ చేయించి ఉంటారు. డబ్బులు వేశాక గ్రూపు నుంచి రిమూవ్ చేసి నంబర్లు బ్లాక్ చేస్తారు.



కాంబోడియా, చైనాలో..



ఈ తరహా మోసాలకు పాల్పడేవాళ్లు కాంబోడియా, చైనాలోనే ఉంటారని సైబర్ నిపుణులంటున్నారు. ఇక్కడి మధ్య వర్తులు అమాయక ప్రజల చేత బ్యాంకు ఖాతాలు తెరిపించి, వారి పేరుతోనే ఫోన్ సిమ్‌లు కొనిపించి మోసపోయిన బాధితుల సొమ్మును వీరి ఖాతాలో పడేటట్లు చేసి తర్వాత అనేక ఖాతాలు మార్చి చివరికి వారికిల్లేలా చేస్తారు. ఇదంతా ఓ లింక్ సిస్టమ్ మాదిరిగా జరు గుతుంది. ఇప్పటివరకు ఎన్నో సైబర్ కేసుల్లో మన జిల్లా పోలీసులు పక్క రాష్ట్రాల వరకు వెళ్లారు. బ్యాంకు ఖాతా చిరునామా లున్నవారికి, నడిపిన మధ్యవర్తులకు నోటీసులిచ్చారు. కొందరు ఇక్కడి కోర్టులకు సైతం వచ్చారు. కానీ మోసం చేసే కేటుగాళ్లు మాత్రం విదేశాల్లో దాక్కుని ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి..

తెలియని లింక్‌లు క్లిక్ చేయకూడదు. స్పామ్ కాల్స్, అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్ లిఫ్ట్ చేయొద్దు. టాస్కుబేస్డ్ ఆఫర్స్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. సైబర్ నేరాలను అరికట్టేందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు వ్యూహాత్మకంగా కొన్ని నిర్ణయాలను తీసుకుంటున్నాయి. జిల్లాకు సైబర్ పోలీస్ స్టేషన్ అందుబాటులోకి వస్తుంది.

– కేవీ మహేశ్వరరెడ్డి, ఎస్పీ, శ్రీకాకుళం

ఆధ్యాత్మిక సమాచారం

వైభవంగా నృసింహుడి వసంతోత్సవం



మంగళగిరి: మంగళాద్రి శ్రీ లక్ష్మీనృసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. శుక్రవారం అంగరంగ వైభవంగా వేలాది మంది భక్తులతో సాగిన స్వామి దివ్య రథోత్సవంతో ఉత్సవాలు చివర దశకు చేరాయి. శనివారం ఉదయం శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి చూర్ణోత్సవం, వసంతోత్సవం నిర్వహించారు. రాత్రి స్వామికి ధ్వజావరోహణం, కేళీ గుర్రంపై విహారం, దొంగల దోపిడీ నిర్వహించారు. ఉదయం చూర్ణోత్సవం అనంతరం స్వామి వసంతోత్సవం జరుపుకుంటూ పురవీధుల్లో విహరించారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

రైల్వేకోడూరు అర్బన్: రైల్వేకోడూరు పట్టణంలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అర్చకులు మణికంఠశర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేక అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఘనంగా జాతర మహోత్సవం

వీరబల్లి: మండలంలోని గుర్రప్పగారిపల్లి పంచాయతీని మాదిరెడ్డిగారిపల్లి వద్ద వెలసి ఉన్న వీరనాగమ్మ జాతర మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ రెడ్డి పాల్గొని వీరనాగమ్మ దేవతకు పూజలు చేశారు. ఆయనతోపాటు స్థానిక మండల నాయకులు, సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ గాలివీటి విజయభాస్కర్ రెడ్డి, ఎంపీపీ రాజేంద్రనాథ్ రెడ్డి, వైఎస్సార్ సిపి యువ నాయకులు మదన్ రెడ్డిలు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి గ్రామస్తులతో, స్థానిక నాయకులతో సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు.

శ్రీవారి క్షేత్రంలో పోటెత్తిన భక్తులు



ద్వారకాతిరుమల: ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలోని శ్రీవారి దివ్య క్షేత్రానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో వేలాది మంది భక్తులు సుదూర ప్రాంతాల నుంచి ఆలయానికి తరలివచ్చారు. దీంతో క్షేత్ర పరిసరాలు కళకళలాడాయి. ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కల్యాణకట్ట ఇతర విభాగాలు భక్తులతో కిక్కిరిశాయి. వకుళ మాత నిత్యాన్నదాన భవనం వద్ద ఉచిత అన్నప్రసాదం కోసం భక్తులు బారులు తీరారు. పార్కింగ్ ప్రదేశాలు భక్తుల వాహనాలతో నిండిపోయాయి.

కమనీయం.. కల్యాణం

నందలూరు: మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో శనివారం ఉదయం సీతారాముల కల్యాణాన్ని వేదపండితులు బండాత్మకూరు శివకుమార్ శర్మ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. భక్తులు గోవింద నామస్మరణలతో ఆలయ ప్రాంగణం భక్తి పారవశ్యంతో నిండిపోయింది. కల్యాణ ఉభయదారులుగా భారతాల శ్రీధర్ బాబు యాదవ్, సుప్రియ దంపతులు వ్యవహరించారు.

పారిజాతగిరిలో పూజలు

జంగారెడ్డిగూడెం: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం సందర్భంగా ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారికి నిత్య కైంకర్యాలతో పాటు సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరీక్షలు పూర్తయిన తరుణంలో ఇంటర్ విద్యార్థులు, పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో 10వ తరగతి విద్యార్థులు స్వామి వారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో వచ్చినట్టు ఈవో మానికల రాంబాబు తెలిపారు.

మద్దిలో పూజలు



జంగారెడ్డిగూడెం: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలంలోని గుర్వాయిగూడెం శ్రీ మద్ది ఆంజనేయస్వామి వారి క్షేత్రంలో శనివారం సందర్భంగా స్వామి వారికి అభిషేక సేవ నిర్వహించారు. అర్చకులు ఆలయ ముఖమండపంపై స్వామి వారి ఉత్సవమూర్తిని ఉంచి శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. శనివారం మధ్యాహ్నం వరకు ఆలయానికి వివిధ సేవల రూపేణా రూ.1,03,018 ఆదాయం సమకూరినట్లు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు.

- టాలీవుడ్‌లో పదికిపైగా పీరియాడికల్ చిత్రాలు
- ఈ జానర్‌పై ఆసక్తి చూపుతున్న అగ్ర హీరోలు

అనగనగా ఒక కథ

తెలుగు సినిమాల కలెక్షన్స్ స్పీడ్‌గా ముందుకెళుతున్నాయి.
కానీ తెలుగు సినిమా కథలు మాత్రం వెనక్కి వెళ్తున్నాయి.
అరవై - డెబ్బై ఏళ్ల క్రితం నాటి కథలతో ప్రేక్షకులను మెప్పించేందుకు
తెలుగు హీరోలు పాత కాలం కథలను ఓకే చేస్తున్నారు.
ఇలా 'కట్ చేస్తే... అనగనగా ఒక కథ' అంటూ కొందరు
స్టార్ హీరోలు చేస్తున్న పీరియాడికల్ ఫిల్మ్స్ గురించి తెలుసుకుందాం...



మహేశ్‌బాబు
ప్రభాస్
ఎన్టీఆర్
రామ్‌చరణ్
శర్వానంద్
విజయ్ దేవరకొండ
సాయి దుర్గాతేజ్
రోషన్

అడవిలో అడ్వెంచర్

మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో అంతర్జాతీయ స్థాయిలో ఓ పీరియాడికల్ యాక్షన్ మూవీ తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఇది ఫారెస్ట్ అడ్వెంచరస్ యాక్షన్ డ్రామాగా సాగే పీరియాడికల్ ఫిల్మ్ అని సమాచారం. రామాయణంలోని కొన్ని ముఖ్య ఘటనల స్ఫూర్తితో ఈ చిత్రకథను, రచయిత విజయేంద్రప్రసాద్ రెడీ చేశారనే ప్రచారం సాగుతోంది. ఇక ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం ఒడిశాలో జరుగుతోంది. మహేశ్‌బాబు, ప్రియాంకా చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ పాల్గొంటుండగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు రాజమౌళి. దుర్గా ఆర్ట్స్ పతాకంపై కేఎల్ నారాయణ నిర్మిస్తున్న ఈ చిత్రం 2027 ప్రారంభంలో రిలీజ్ అవుతుందనే టాక్ వినిపిస్తోంది.

సైనికుడి స్టోరీ

ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో 'ఫౌజి' (ప్రచారంలో ఉన్న టైటిల్) అనే చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో ఇమాన్వీ ఎస్మాయిల్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కాగా ఈ సినిమా 1940 నేపథ్యంలో సాగుతుంది. ఈ సినిమాలో ప్రభాస్ ఓ సైనికుడిగా కనిపిస్తారనే టాక్ తెరపైకి వచ్చింది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న 'ఫౌజీ' సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. మిథున్ చక్రవర్తి, జయప్రద, అనుపమ్‌ఖేర్ కీలక పాత్రల్లో యాక్ట్ చేస్తున్నారు. 2026లో ఈ సినిమా విడుదల కానుందని తెలిసింది. మరోవైపు ప్రభాస్ చేస్తున్న హారర్ అండ్ కామెడీ ఫిల్మ్ 'రాజా సాబ్'. మారుతి డైరెక్షన్‌లో రూపొందుతున్న ఈ మూవీ కూడా పీరియాడికల్ చిత్రమే. నిధీ అగర్వాల్, మాళవికా మోహనన్ ఈ మూవీలో హీరోయిన్స్‌గా చేస్తున్నారు. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ దాదాపు పూర్తి కావొచ్చింది. 'రాజా సాబ్' సినిమాను ఏప్రిల్ 10న రిలీజ్ చేస్తామని గతంలో యూనిట్ ప్రకటించింది. కానీ ఈ చిత్రం ఏప్రిల్‌లో రిలీజ్ కావడం లేదని, త్వరలోనే మేకర్స్ కొత్త రిలీజ్ డేట్‌ని ప్రకటిస్తారని తెలిసింది.

డ్రాగన్ వార్

హీరో ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా 'డ్రాగన్ (ప్రచారంలో ఉన్న టైటిల్). ఈ చిత్రంలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమా కాన్సెప్ట్ పోస్టర్‌పై 1969 అని కనిపిస్తోంది. సో... ఈ 'డ్రాగన్' పీరియాడికల్ యాక్షన్ మూవీ అని ఆల్మోస్ట్ ఖరారైపోయినట్లే. కథ ప్రధానంగా కోల్‌కత్తా నేపథ్యంలో సాగుతుందని తెలిసింది. ఓ పెద్ద డ్రగ్స్ మాఫియా ఈ సినిమాలోని మరో ముఖ్య అంశమని సమాచారం. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకాలపై కల్యాణ్ రామ్ నందమూరి, నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు ఈ సినిమా నిర్మిస్తున్నారు. 2026 జనవరి 9న 'డ్రాగన్' సినిమాను రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ ఆల్రెడీ ప్రకటించిన సంగతి తెలిసిందే.

ఆటగాడు

'క్రికెట్, కుస్తీ, కబడ్డీ'... ఈ మూడు స్పోర్ట్స్ ఆడుతున్నారట రామ్ చరణ్. మరి... మల్టీస్పోర్ట్స్ పర్సన్‌గా రామ్‌చరణ్ ఎందుకు మారారు? అనేది 'పెద్ది' (ప్రచారంలో ఉన్న టైటిల్) సినిమాలో చూడాలి. రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో ఓ పీరియాడికల్ మల్టీస్పోర్ట్స్ డ్రామా రూపొందుతున్న సంగతి తెలిసిందే. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా చేస్తున్న ఈ మూవీలో కన్నడ నటుడు శివ రాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. 1970-1980 నేపథ్యంలో ఈ మూవీ కథనం సాగుతుందని సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో క్రికెట్ బ్యాక్‌డ్రాప్ సన్నివేశాల చిత్రీకరణ జరిగింది. కానీ ఈ చిత్రకథలో... కుస్తీ, కబడ్డీ.. ఖోఖో ఆటల ప్రస్తావన కూడా ఉంటుందట. అయితే మెయిన్ స్పోర్ట్‌గా కబడ్డీ ఉంటుందట. సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. కాగా 'పెద్ది' సినిమాను ఈ ఏడాదే రిలీజ్ చేయాలనుకుంటున్నారట. ఈ నెల 27న రామ్‌చరణ్ బర్త్ డే. ఆ రోజున ఈ సినిమా టీజర్ రిలీజ్ అవుతుందని, ఆ సమయంలోనే ఈ మూవీ రిలీజ్‌పై కూడా ఓ స్పష్టత వస్తుందని సమాచారం.

విలేజ్‌లో యాక్షన్

విలేజ్‌లో యాక్షన్‌కు సై అన్నారు శర్వానంద్. సంపత్ నంది దర్శకత్వంలో శర్వానంద్ హీరోగా ఓ రూరల్ పీరియాడికల్ ఫిల్మ్ తెరకెక్కనుంది. కేకే రాధామోహన్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ రూరల్ యాక్షన్ డ్రామా ఫిల్మ్ 1960 నేపథ్యంలో సాగుతుంది. ఉత్తర తెలంగాణ, మహారాష్ట్ర- తెలంగాణ సరిహద్దు ప్రాంతాల నేపథ్యంలో ఈ సినిమా కథనం ఉంటుంది. ఈ సినిమా కోసం హైదరాబాద్‌లో ఓ పెద్ద సెట్‌ను క్రియేట్ చేశారు. అలాగే శర్వానంద్ హీరోగా అభిలాష్ కంకర డైరెక్షన్‌లో ఓ మూవీ షూటింగ్ జరుగుతోంది. ఈ సినిమా మూడు తరాల నేపథ్యంలో సాగుతుంది. ఈ సినిమాలోని మేజర్ సీన్స్ 1990లో ఉంటాయని తెలిసింది. విక్రమ్ సమర్పణలో వంశీ - ప్రమోద్ నిర్మిస్తున్నారు. కాగా ఈ సినిమాలో శర్వానంద్ ఓ బైక్ రేసర్‌గా నటిస్తున్నారు.

కింగ్‌డమ్

హీరో విజయ్ దేవరకొండ, దర్శకుడు గౌతమ్ తిన్ననూరి కాంబినేషన్‌లో రూపొందుతున్న మూవీ 'కింగ్‌డమ్'. ఈ పీరియాడికల్ ఇంటెన్స్ యాక్షన్ డ్రామాలో భాగ్య శ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్నారని తెలిసింది. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో పోలీస్ ఆఫీసర్ పాత్రలో విజయ్ దేవరకొండ కనిపిస్తారని తెలిసింది. అలాగే విజయ్ దేవరకొండ క్యారెక్టరైజేషన్‌లో డిఫరెంట్ షేడ్స్ ఉంటాయట. ఈ సినిమా చిత్రీకరణ దాదాపు పూర్తయింది. ఈ మూవీని మే 30న రిలీజ్ చేయనున్నట్లుగా ఆల్రెడీ మేకర్స్ అనౌన్స్ చేసిన సంగతి తెలిసిందే. ఈ మూవీతో పాటు రవికిరణ్ కోలా డైరెక్షన్లో 'రౌడీ జనార్ధన' అనే మూవీ చేయనున్నారు విజయ్ దేవరకొండ. ఈ రూరల్ యాక్షన్ డ్రామా కూడా పీరియాడికల్ చిత్రమే అని తెలిసింది. ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుంది.

మాస్ సంబరాలు

సాయిదుర్గా తేజ్ కెరీర్‌లోనే అత్యధిక భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న సినిమా 'సంబరాల యేటిగట్టు'. రూ. 125 కోట్ల బడ్జెట్‌తో కె.నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ పీరియాడికల్ ఇంటెన్స్ యాక్షన్ డ్రామాతో రోహిత్ కేపీ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఐశ్వర్యా లక్ష్మీ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీలో జగపతిబాబు, సాయి కుమార్, శ్రీకాంత్, అనన్య నాగళ్ల, సంజయ్ దత్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారని తెలిసింది. కాగా ఈ సినిమా రెండు భాగాలుగా విడుదలవుతుందనే ప్రచారం సాగుతోంది. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో 'సంబరాల యేటిగట్టు' మూవీ సెప్టెంబరు 25న విడుదల కానుంది.

చాంపియన్

బ్రిటిష్ పరిపాలన కాలంలో ఓ యువ ఫుట్‌బాల్ ఆటగాడి జీవితం ఏ విధంగా సాగిందనే కథాంశంతో రూపొందుతున్న సినిమా 'ఛాంపియన్'. శ్రీకాంత్ తనయుడు రోషన్ హీరోగా చేస్తున్న ఈ పీరియాడికల్ స్పోర్ట్స్ మూవీకి ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహిస్తున్నారు. జీ స్టూడియోస్ సమర్పణలో స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్ ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. ఈ మూవీకి చెందిన ఇతర వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని మేకర్స్ ఇటీవల తెలిపారు.

ఇలా పీరియాడికల్ ఫిల్మ్స్ చేస్తున్న మరికొంతమంది హీరోలు ఉన్నారు.

- ముసిమి శివాంజనేయులు

విష్ణు మంచు ప్రత్యేక పూజలు

- భక్త కన్నప్ప స్వగ్రామం వెళ్లిన 'కన్నప్ప' చిత్రయూనిట్



- విష్ణు మంచు

శివ భక్తుడు భక్త కన్నప్ప జీవితం ఆధారంగా రూపొందుతున్న సినిమా 'కన్నప్ప'. ఈ చిత్రంలో విష్ణు మంచు హీరోగా నటిస్తున్నారు. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, అవా ఎంటర్‌టైన్మెంట్స్ పతాకాలపై మోహన్‌బాబు నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 25న విడుదల కానుంది. అయితే 'కన్నప్ప' రిలీజ్ అయ్యేలోపు ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించుకుంటానని విష్ణు మంచు చెప్పిన సంగతి తెలిసిందే. తాజాగా ఆయన భక్త కన్నప్ప సొంతూరికి వెళ్లారు. అన్నమయ్య జిల్లాలోని రాజంపేట మండలంలోని ఊటుకూరు గ్రామానికి వెళ్లారు. గ్రామస్తులు, ఆలయ సిబ్బంది విష్ణు మంచుకి, 'కన్నప్ప' టీమ్‌కు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడ కన్నప్ప స్వగృహాన్ని విష్ణు మంచుతో సహా 'కన్నప్ప' టీమ్ సందర్శించింది. అక్కడి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివాలయాన్ని అభివృద్ధి చేస్తానని కూడా విష్ణు మంచు హామీ ఇచ్చారు. ప్రీతీ ముకుందన్ హీరోయిన్‌గా మోహన్‌బాబు, ఆర్. శరత్‌కుమార్, మోహన్‌లాల్, అక్షయ్ కుమార్, ప్రభాస్, కాజల్ అగర్వాల్, బ్రహ్మానందం ఇతర పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళీ, హిందీ భాషల్లో రిలీజ్ కానుంది.

దిల్లీ రిటర్న్స్



- కార్తీ, లోకేశ్ కనగరాజ్

దిల్లీ రిటర్న్స్ అని హీరో కార్తీ అంటున్నారు. హీరో కార్తీ, దర్శకుడు లోకేశ్ కనగరాజ్ కాంబినేషన్‌లో రూపొందిన 'ఖైదీ (2019)' సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ చిత్రంలో దిల్లీ అనే ఖైదీ పాత్రలో కార్తీ మంచి నటన కనబరిచారు. ఇక ఈ సినిమాకు సీక్వెల్‌గా 'ఖైదీ 2' చేయాలని కార్తీ, లోకేశ్ ఎప్పట్నుంచో ప్లాన్ చేస్తున్నారు. కానీ లోకేశ్‌కు ఉన్న ఇతర కమిట్‌మెంట్స్ కారణంగా 'ఖైదీ 2' చిత్రీకరణ వాయిదా పడుతూ వస్తోంది. కాగా ఈ ఏడాది 'ఖైదీ 2' చిత్రీకరణ ప్రారంభం అవుతుందన్నట్లుగా 'ఎక్స్'లో 'దిల్లీ రిటర్న్స్' అంటూ పేర్కొన్నారు కార్తీ. 'ఖైదీ' సీక్వెల్ 'ఖైదీ 2' సినిమాను డ్రీమ్ వారియర్ పిక్చర్స్, కేవీన్ ప్రొడక్షన్స్ సంస్థలు నిర్మించనున్నట్లుగా తెలుస్తోంది. ప్రస్తుతం రజనీకాంత్ 'కూలీ' సినిమా పనులతో బిజీగా ఉన్నారు లోకేశ్ కనగరాజ్. 'సర్దార్ 2' మూవీతో బిజీగా ఉన్నారు కార్తీ... వీరిద్దరూ వారి వారి కమిట్‌మెంట్స్ పూర్తి చేసుకున్న తర్వాత 'ఖైదీ 2' చిత్రం సెట్స్‌పైకి వెళ్తుందని ఊహించవచ్చు.

అమ్మా... నాన్నా... ఒక రాహా!



- ఆలియా భట్, రణ్‌బీర్ కపూర్, రాహా

'అమ్మాయి పుట్టాక మా ఆయనలో పూర్తిగా మార్పు వచ్చింది' అనే మాట అక్కడక్కడా వింటుంటాం. అంటే... ఎప్పుడూ ఫైర్‌బ్రాండ్‌లా ఉండే భర్త శాంతమూర్తిగా మారిపోతాడు. వ్యసనాల బారిన పడిన భర్త ఆ చీకటి నుంచి బయటికి వస్తాడు. ఒక్క ముక్కలో చెప్పాలంటే... పిల్లలకు ఉండే పవర్ అదే!

తాజా విషయానికి వస్తే... ఒక ఇంటర్వ్యూలో భర్త రణ్‌బీర్ కపూర్ గురించి చెప్పారు ఆలియా. 'రాహా పుట్టిన తరువాత రణ్‌బీర్ మారిపోయాడు' అనడమే కాదు 'రాహాను ఎంటర్‌టైన్ చేయడానికి చాలా క్రియేటివ్‌గా ఆలోచిస్తాడు' అని ప్రశంసలు కురిపించారు ఆలియా.


మరి ముద్దుల కూతురు మాటేమిటి? 'రాహా కూడా రణ్‌బీర్‌ను బాగా ఎంటర్‌టైన్ చేస్తుంది' అని చెప్పారామె. 'వారిద్దరూ మాట్లాడుకుంటుంటే తండ్రీ కూతుళ్లు మాట్లాడుకున్నట్లుగా కాకుండా ఇద్దరు స్నేహితులు మాట్లాడుకుంటున్నట్లుగా ఉంటుంది' అని మురిసిపోతారు ఆలియా. 'వాళ్లిద్దరూ మాట్లాడుకుంటున్నప్పుడు తీసిన వీడియోలు నాకు భవిష్యత్ కాలంలో అపూర్వమైన నిధులు' అని కూడా అంటారామె.

ఇంతకీ రాహా వల్ల రణ్‌బీర్‌లో వచ్చిన మార్పు ఏమిటి?
ఆలియా సూటిగా చెప్పకపోయినా ఆమె మాటలను బట్టి అర్థమయ్యేదేమిటంటే....
'మునుపటితో పోల్చితే చాలా ప్రశాంతంగా కనిపిస్తున్నాడు'
'ఇతరులతో మాట్లాడే విధానంలో మార్పు వచ్చింది'
మార్పు... మంచిదే కదా! థ్యాంక్స్.... రాహా!
రాహా అంటే స్వాహిలీ భాషలో 'సంతోషం' అని అర్థం.

అప్పు... ఆర్థిక భద్రతకు ముప్పు!

- 2024-25 జీడీపీలో 57.1 శాతం
- 2031 నాటికి 50 శాతానికి తిరిగి తీసుకువస్తామంటున్న కేంద్రం
- సవాళ్లున్నా... సానుకూలతలూ ఉన్నాయని భరోసా





ఇప్పుడు ఆర్థికవేత్తల చర్చల్లో కీలకాంశం.. భారత్ స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ), దానితో పోల్చితే భారత్ రుణ నిష్పత్తి. ఒక కుటుంబానికి తీర్చగలిగిన స్థాయిలోనే అప్పు ఎలా ఉండాలో.. ఒక దేశానికి తన ఆర్థిక వ్యవస్థ స్థాయికి తగినట్లుగానే రుణం ఉండాలి. ఒక కుటుంబం ఆదాయం- అప్పు ఎలా బేరీజు వేసుకోవాలో దేశం కూడా తన జీడీపీని, అందులో రుణ నిష్పత్తిని తూకం వేసుకోవాలి. ఒక దేశం ఆర్థిక 'ఆరోగ్యానికి' చక్కటి సూచిక జీడీపీ-రుణ నిష్పత్తి. విస్తృత స్థాయిలో ఆమోదం పొందిన ఈ సూచీని అదుపులో పెడతామని కేంద్రం ఇస్తున్న హామీ ఇప్పుడు ఆర్థిక వర్గాలకు ఊరటనిస్తోంది. అయితే ఇది అంత తేలిక్కాదని వాస్తవ పరిస్థితులు అడ్డం పడుతున్నాయి. ప్రత్యేకించి కేంద్ర ప్రభుత్వ అప్పు (సెంట్రల్ గవర్నమెంట్ డెట్) కొంత అదుపులో ఉన్నా.. రాష్ట్రాలను కూడా కలుపుకుంటే (జనరల్ గవర్నమెంట్ డెట్) ఆందోళన కలిగిస్తున్న విషయం ఇక్కడ గమనార్హం. ఆయా అంశాలపై చర్చించిందే ఈ కథనం.

– సాక్షి, బిజినెస్ డెస్క్



కేంద్రానికి రుణ-జీడీపీ నిష్పత్తి 2024-25 ఆర్థిక సంవత్సరంలో 57.1 శాతం. ఏప్రిల్ నుంచి ప్రారంభమయ్యే రానున్న 2025-26లో 56.1 శాతానికి తగ్గించాలని ఈ ఏడాది ఫిబ్రవరి 1న ఆర్థికమంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ నిర్దేశించుకుంది. ప్రభుత్వ ఆదాయాలు-వ్యయాలకు మధ్య ఉన్న నికర వ్యత్యాసం- ద్రవ్య లోటును తగ్గించుకోవడం... ఆర్థికాభివృద్ధి ద్వారా జీడీపీలో రుణ నిష్పత్తిని గణనీయంగా తగ్గించుకోవాలన్న సంకల్పాన్ని బడ్జెట్ ఉద్ఘాటించింది. తద్వారా ఈ నిష్పత్తిని 2031 మార్చి 31 నాటికి ఒక శాతం అటుఇటుగా 50 శాతానికి చేర్చాలని ప్రణాళికలను వెల్లడించింది. అంటే జీడీపీలో రుణ నిష్పత్తిని 2031 నాటికి ఏడాదికి ఒక శాతం చొప్పున తగ్గించుకుంటూ వెళ్లాలన్నది కేంద్రం లక్ష్యం. ఇందుకు రెండు ప్రధానదారులు ఒకటి ద్రవ్యలోటు కట్టడికాగా, స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి మరొకటి. 2024-25లో ద్రవ్యలోటు 4.9 శాతం ఉండాలని బడ్జెట్ నిర్దేశించుకున్నప్పటికీ, ఇది సవరించిన అంచనాల ప్రకారం మరింత మెరుగ్గా 4.8 శాతానికి తగ్గించుకోగలిగింది. రానున్న ఆర్థిక సంవత్సరంలో (2025-26) ఈ రేటును 4.4 శాతానికి తగ్గించుకోవాలని కూడా తాజా బడ్జెట్ నిర్దేశించుకుంది. లక్ష్యాలకు అనుగుణంగా నడుస్తూ, జీడీపీ- రుణ నిష్పత్తిని లక్ష్యాల మేరకు తగ్గించుకుంటామని కేంద్రం స్పష్టం చేస్తోంది. అనుకున్నది అనుకున్నట్లు జరిగితే ఇది బాండ్ మార్కెట్, ప్రభుత్వం చెల్లించాల్సిన రుణ వడ్డీరేట్లు స్థిరత్వానికి తద్వారా దేశ ఎకానమీ పురోగతికి దోహదపడే అంశమనడంలో సందేహాలే అక్కర్లేదు.

తొమ్మిదేళ్లలో రూ.93.26 లక్షల కోట్ల నుంచి రూ.200.16 లక్షల కోట్లు

లోక్‌సభలో ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి ప్రకటన ప్రకారం ఫిబ్రవరి 10వ తేదీన 2018-19లో కేంద్ర ప్రభుత్వ రుణం 93.26 లక్షల కోట్లు. నిర్దిష్ట ఆర్థిక సంవత్సరం స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)తో పోల్చితే ఇది 49.3 శాతమే. మహమ్మారి కోవిడ్ ప్రభావిత ఆర్థిక సంవత్సరం 2020-21లో రుణ భారం ఏకంగా 121.86 లక్షల కోట్లకు ఎగసింది. జీడీపీలో ఇది 61.4 శాతానికి చేరింది. కరోనా పరిస్థితుల్లో దేశ ఎకానమీ తీవ్రంగా దెబ్బతినడం దీనికి నేపథ్యం. అయితే అటు తర్వాత ఆర్థిక సంవత్సరాలు చూస్తే, (2021-22 నుంచి ఇటీవల బడ్జెట్ 2025-26) జీడీపీలో రుణ నిష్పత్తులు వరుసగా తీవ్ర స్థాయిల్లో (వరుసగా 58.8 శాతం, 57.9 శాతం, 58.1 శాతం, 7.1%, 56.1 శాతం)నే కొనసాగాయి తప్ప, తిరిగి 2018-19 నాటి స్థితికి (49.3 %) చేరుతుందన్న ఆశలు మాత్రం కల్పించలేదు. రూపాయిల్లో చూస్తే, గడచిన తొమ్మిది ఆర్థిక సంవత్సరాల్లో రుణ పరిమాణం 93.26 లక్షల కోట్ల నుంచి రెట్టింపుకన్నా అధికంగా 200.16 లక్షల కోట్లకు చేరింది. అయితే తిరిగి వచ్చే ఆరేళ్లలో జీడీపీలో ఒక శాతం అటుఇటుగా 50 శాతానికి రుణ నిష్పత్తిని తీసుకువెళతామని తన బడ్జెట్ ప్రసంగంలో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడం ఎకానమీ పరంగా కొంత ఊరటనిచ్చే అంశం.

2018-19 నుంచి కేంద్ర ప్రభుత్వ రుణం- రుణ: జీడీపీ నిష్పత్తి

ఆర్థిక సంవత్సరం	రుణం (రూ.లక్షల కోట్లు)	జీడీపీలో శాతం
2018-19	93.26	49.3
2019-20	105.07	52.3
2020-21	121.86	61.4*
2021-22	138.66	58.8
2022-23	156.02	57.9
2023-24	171.70	58.1
2024-25*	185.11	57.1
2025-26*	200.16	56.1



* కోవిడ్ 19 మహమ్మారి ఎఫెక్ట్. * సవరిత అంచనాలు. * బడ్జెట్ అంచనాలు
ఆధారం: 2025 ఫిబ్రవరి 10న పార్లమెంటులో ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి ప్రసంగం



రాష్ట్రాలనూ కలుపుకుంటే.. కలవరమే!

భారతదేశ ఆర్థిక వ్యవస్థపై అప్పుల భారం ఇప్పటికే తీవ్రంగా ఉంది. కేంద్ర ప్రభుత్వ అప్పుతో పాటు రాష్ట్రాల రుణ భారం కలుపుకొని చూస్తే, పరిస్థితి మరింత ఆందోళన కలిగించేలా మారుతోంది. దీనిని 'జనరల్ గవర్నమెంట్ డెట్' (జీజీడీ) అని వ్యవహరిస్తారు. ప్రస్తుతం ఇది జీడీపీలో 80 శాతానికి పైగా స్థిరంగా కొనసాగుతుండటం ఆర్థిక నిపుణులను ఆందోళనకు గురిచేస్తోంది. ప్రభుత్వ వర్గాలు 2030-31 నాటికి ఈ నిష్పత్తిని 70 శాతం లోపుకు తగ్గించేందుకు కృషి చేస్తున్నట్లు చెబుతున్నా, ఇది అంత తేలికైన విషయం కాదని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ద్రవ్య లోటు (వ్యయాలు - ఆదాయాల మధ్య వ్యత్యాసం) జీడీపీలో 5 శాతానికి దిగువన కొనసాగుతుందనే అంచనా ఉంది. అయితే రాష్ట్రాల అప్పును కలుపుకుంటే ఈ నిష్పత్తి 7 శాతం పైగా పెరిగే అవకాశం ఉంది, ఇది ఆర్థిక స్థిరత్వానికి హానికరమైన అంశం. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) సహా పలు ఆర్థిక సంస్థలు భారత సాధారణ ప్రభుత్వ అప్పు జీడీపీకి 100 శాతానికి మించిపోవచ్చని ఇప్పటికే హెచ్చరించాయి. ఈ పరిణామాలు భారత సావరిన్ రేటింగ్‌లపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉంది. మూడీస్, ఎస్అండ్‌పీ, ఫిచ్ వంటి అంతర్జాతీయ రేటింగ్ సంస్థలు భారత్‌కు ఇస్తున్న సావరిన్ రేటింగ్.. 'జంక్' స్థాయి కన్నా కేవలం ఒక అంచె ఎక్కువగా ఉండడం గమనార్హం. ఇది విదేశీ పెట్టుబడులపై ప్రతికూల ప్రభావం చూపి, భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటును దెబ్బతీస్తోంది.



విదేశీ రుణ భారం.. ఊరట

అయితే 2018-19 ఆర్థిక సంవత్సరం జీడీపీలో 2.5 శాతంగా ఉన్న భారత్ ప్రభుత్వ రుణ భారం (రూ.4.74 లక్షల కోట్లు), 2025-26కు సంబంధించి ఆర్థికమంత్రి ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ లోనూ 2.5 శాతంగా (రూ.8.92 లక్షల కోట్లు) యథాతథంగా కొనసాగడం కొంత ఊరటనిచ్చే అంశం. విదేశీ రుణ భారాలను స్థిరంగా ఉంచాలన్న కేంద్ర ప్రభుత్వ సంకల్పాన్ని ఇది సూచిస్తోంది.

2018-19 నుంచి కేంద్ర ప్రభుత్వ విదేశీ రుణం- విదేశీ రుణ: జీడీపీ నిష్పత్తి

ఆర్థిక సంవత్సరం	విదేశీ రుణం (రూ.లక్షల కోట్లు)	జీడీపీలో శాతం
2018-19	4.74	2.5
2019-20	5.44	2.7
2020-21	6.15	3.1
2021-22	6.58	2.8
2022-23	7.48	2.8
2023-24	7.96	2.7
2024-25	8.46	2.6
2025-26	8.92	2.5

లక్ష్య సాధన తేలిక్కాదు

బడ్జెట్‌లో నిర్దేశించుకున్నట్లు 2031 నాటికి జీడీపీలో రుణ నిష్పత్తిని నిజంగానే తిరిగి 50 శాతానికి చేర్చడం సాధ్యమేనా అన్నది ఇక్కడ బిలియన్ డాలర్ల ప్రశ్న. ముఖ్యంగా అంతర్జాతీయ పరిణామాలు భారత్ ఎకానమీకి ప్రస్తుతం తీవ్ర ప్రతికూలంగా ఉన్నాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయెల్-హమాస్ సమస్యలతో తీవ్ర అనిశ్చితిలో ఉన్న ప్రపంచ ఆర్థిక పరిస్థితులు ట్రంప్ తాజా పాలనా కాలంలో మరింత క్షీణించాయి. టారిఫ్‌ల యుద్ధం కూడా దాదాపు ప్రారంభమైంది. ఒకపక్క అమెరికా టారిఫ్‌ల యుద్ధం, మరోపక్క చైనాకి విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు తరలిపోవడం వంటి అంశాలు భారత్ ఎకానమీపై తీవ్ర ఇప్పుడు తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి లక్ష కోట్ల ఎఫ్ఐఐ పెట్టుబడులు భారత్ నుంచి వెనక్కు మళ్లాయి. వీటిలో అధిక భాగం చైనా ఆకర్షించడం గమనార్హం. బలహీనమైన ప్రపంచ డిమాండ్, ఉత్పాదక రంగంపై ఒత్తిళ్లు, డాలర్ మారకంలో రూపాయి మారకపు విలువలో తీవ్ర అనిశ్చితి, భారత్ ఎకానమీకి తీవ్ర సవాళ్లను విసురుతున్నాయి. అయితే పటిష్ట దేశీయ డిమాండ్, ప్రైవేటు వినియోగం, ద్రవ్యలోటు వంటి అంశాల్లో క్రమశిక్షణ, పటిష్ట విదేశీ మారకద్రవ్యాలు, సేవల రంగంలో మిగులు, చక్కటి రెమిటెన్సుల (ఎన్ఆర్ఐలు దేశానికి పంపే విదేశీ డబ్బు) వృద్ధి భారత్ ఎకానమీకి మూలస్తంభాలని, ఈ దన్నుతో ఎకానమీ పురోగతి సాధ్యమేనని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. దేశ పౌరునిగా అంతా మంచే జరగాలని మనమూ కోరుకుందాం.

రుణ భారం ఎక్కువైతే...

- మౌలిక సదుపాయాలు, అభివృద్ధి, విద్య వంటి ముఖ్యమైన రంగాలకు కేటాయింపుల కంటే వడ్డీ చెల్లింపులపై ప్రభుత్వం ఎక్కువగా ఖర్చు చేయాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవుతాయి.
- భవిష్యత్ తరాలకు ప్రయోజనం చేకూర్చే పెట్టుబడుల నుండి ప్రభుత్వం దూరంగా జరిగి.. వడ్డీ వ్యయాలకు అధిక మొత్తాన్ని కేటాయించాల్సిన పరిస్థితి నెలకొంటుంది.
- తీసుకున్న రుణం ఎక్కడికి వెళుతోందన్న అంశమూ కీలకం. ఇది వృద్ధికి దోహదపడే దీర్ఘకాలిక ప్రాజెక్టుల వ్యయాల్లో భాగం కావాలి. అసమానత, పేదరికం, నిరుద్యోగం సమస్యల పరిష్కారానికి దోహదపడే వ్యయాలు ఎకానమీ పురోగతికి బాటలు వేస్తాయి.



అమెరికాకు 123 శాతం ఉంటే.. భారత్‌కు 56 శాతం.. భయమెందుకు!



జీడీపీలో అమెరికాసహా కొన్ని అగ్ర దేశాల రుణ నిష్పత్తులు 100 శాతం దాటిపోతే భారత్‌ది 56 శాతమేగా భయమెందుకు? అన్న సందేహాలు కొందరికి కలగవచ్చు. ఇక్కడ ఒక్కటే సమాధానం. కోట్ల ఆస్తి ఉన్న వ్యక్తి ఎంత డబ్బు అయినా అప్పు తీసుకోవచ్చు. అది ఆ వ్యక్తి తేలిగ్గా తీర్చేయగలడు. ధనికుడు అప్పు అడగడంతోనే ఇచ్చేవాడూ వెనకాముందూ చూడకుండా ఇచ్చేస్తాడు. మరి పేదవాడు అప్పుచేస్తే అది ఎంత ఎక్కువుంటే.. అతనికి అంత కష్టం. ఇదీ అంతే. అమెరికా, జపాన్ వంటివి అగ్ర దేశాలు. వాటి ఎకానమీలు స్వల్పకాలంలో ఆటుపోట్లకు గురైనా.. అవి అత్యంత శక్తివంతమైనవి. అయితే ఆయా దేశాల అప్పులనూ అంత తేలిగ్గా తీసిపారేయవద్దని, ఇది అవి మునగడంతోపాటు, ప్రపంచ దేశాలనూ ముంచే వ్యవహారమనీ.. విమర్శలూ వెల్లువెత్తుతున్నాయి.

కొన్ని ముఖ్య దేశాల రుణ: జీడీపీ నిష్పత్తి (2025 నాటికి అంచనాలు)

దేశం	నిష్పత్తి
జపాన్	263
ఇటలీ	138
అమెరికా	123
కెనడా	107
ఫ్రాన్స్	110
బ్రిటన్	100
చైనా	84
దక్షిణాఫ్రికా	76
జర్మనీ	62
ఆస్ట్రేలియా	49
రష్యా	15

ముందుచూపు అవసరం

భారత ఆర్థిక వ్యవస్థ మెరుగుపడాలంటే రాజకీయ పార్టీలు పొదుపు విధానాలను అలవర్చుకోవడంతో పాటు, అప్పులను సమర్థంగా నిర్వహించాలి. వృద్ధిని పెంచే సంస్కరణలను ప్రోత్సహించడంతో పాటు, ప్రభుత్వ వ్యయాలను సద్వినియోగం అయ్యేలా చూడ్డం అత్యవసరం. ఇకపై ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలు దేశ ఆర్థిక భద్రతను నిర్దేశించనున్నాయి!



రేసింగ్‌కు టీవీఎస్, పెట్రోనాస్ జట్టు

భాగస్వామ్య పటిష్టతకు సై



చెన్నై: ద్విచక్ర వాహన దిగ్గజం టీవీఎస్ మోటార్ కంపెనీ పెట్రోనాస్ లూబ్రికెంట్స్ ఇంటర్నేషనల్‌తో భాగస్వామ్యాన్ని పటిష్ట పరచుకుంటోంది. తద్వారా దేశీయంగా మోటార్ స్పోర్ట్స్‌ను ప్రోత్సహించడంలో పరస్పరం కట్టుబడి ఉన్నట్లు సంస్థలు పేర్కొన్నాయి. భాగస్వామ్యంలో భాగంగా రానున్న మూడేళ్ల కాలానికి టీవీఎస్ రేసింగ్ టీమ్ టైటిల్ స్పాన్సర్‌గా టీవీఎస్ మోటార్, పెట్రోనాస్ లూబ్రి కెంట్స్ వ్యవహరించనున్నాయి. 2022-23 సీజన్‌లో టీవీఎస్ రేసింగ్‌కు టైటిల్ స్పాన్సర్‌గా పెట్రోనాస్ లూబ్రికెంట్స్ ఇండియా వ్యవహరించింది. ఇండియన్ నేషనల్ సూపర్‌క్రాస్ చాంపియన్‌షిప్, ఇండియన్ నేషనల్ ర్యాలీ చాంపియన్‌షిప్, ఇండియన్ నేషనల్ మోటార్‌సైకిల్ రేసింగ్ చాంపియన్‌షిప్‌లలో రేసింగ్ టీమ్ పాల్గొనేందుకు మద్దతివ్వనున్నాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)
16-3-2025

విశాఖ	400-00
చిత్తూరు	443-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	395-00
విజయవాడ	420-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	385-00
వరంగల్	387-00
రిటైల్ ధర	4.45

కార్మిక శక్తిలో కనబడని మహిళా ప్రాతినిధ్యం

- బ్లూ కాలర్ ఉద్యోగాల్లో 20 శాతమే
- వేతనాల్లో వ్యత్యాసంతో నిరుత్సాహం
- మహిళా కార్మికులకు ప్రతికూల పని పరిస్థితులు
- జాబ్ పోర్టల్ ఇండీడ్ సర్వేలో వెల్లడి



న్యూఢిల్లీ: చేతివృత్తులు, నైపుణ్యాలతో కూడిన కార్మికశక్తిలో (బ్లూకాలర్ ఉద్యోగాలు) మహిళల భాగస్వామ్యం ప్రతి ఐదుగురిలో ఒకరిగానే (20 శాతం) ఉన్నట్లు జాబ్ ప్లాట్‌ఫామ్ 'ఇండీడ్' నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. ముఖ్యంగా వేతనాల్లో తీవ్ర అంతరాలు, పనిచేసే చోటు పారిశుద్ధ్య పరిస్థితులు దారుణంగా ఉండడం వంటి సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుండడం మహిళలను పనులకు దూరం చేస్తోంది. టైర్ 1, 2 పట్టణాల్లో 14 రంగాల్లోని 4,000 కంపెనీలు, ఉద్యోగులను ఇండీడ్ సర్వే చేసింది.

సర్వే అంశాలు..

- 2024లో 73 శాతం కంపెనీలు బ్లూ కాలర్ ఉద్యోగాల్లోకి మహిళలను నియమించుకున్నట్టు తెలిపాయి. బ్లూకాలర్ ఉద్యోగాలన్నీ శ్రామికశక్తితో కూడినవే.
- రిటైల్, హెల్త్‌కేర్, ఫార్మాస్యూటికల్స్, నిర్మాణం, రియల్ ఎస్టేట్, రవాణా, ఆతిథ్య పరిశ్రమలో మహిళల ప్రాతినిధ్యం సగటున 30 శాతం స్థాయిలో ఉంది.
- అదే టెలికమ్యూనికేషన్స్, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ), ఐటీ/ఐటీఈఎస్ రంగాల్లో మహిళల ప్రాతినిధ్యం 10 శాతం కంటే తక్కువగా ఉంది.
- ఆర్థిక స్వాతంత్ర్యం కోసం మహిళలు బ్లూకాలర్ ఉద్యోగాలు కోరుకుంటున్నారు. కానీ, పరి పరిస్థితులు కఠినంగా ఉంటున్నట్టు చెబుతున్నారు.
- ఉద్యోగ వేళలు (షిఫ్టులు) అనుకూలంగా లేవని సగం మందికి పైగా తెలిపారు. కఠినమైన పనివేళల కారణంగా మహిళలు ఉద్యోగం, వ్యక్తిగత జీవితాన్ని సమన్వయం చేసుకోలేకపోతున్నారు.
- పురుషులతో పోల్చితే 42 శాతం మంది మహిళలు తమకు తక్కువ వేతనం చెల్లిస్తున్నట్టు చెప్పారు. అంతేకాదు కెరీర్‌లో పురోగతి (పదోన్నతులు తదితర) ఉండడం లేదని భావిస్తున్నారు.
- సర్వేలో పాల్గొన్న ప్రతి ఇద్దరు మహిళల్లో ఒకరు నైపుణ్యాలను పెంచుకుంటామని ఆసక్తి చూపించారు. అయితే, నైపుణ్య శిక్షణ తమకు సవాలుగా పేర్కొన్నారు. నేర్చుకునేందుకు సరైన మార్గాలు లేకపోవడం కెరీర్‌లో ముందుకు వెళ్లేందుకు అడ్డంకిగా పేర్కొన్నారు.
- 78% కంపెనీలు 2025లో మహిళలను నియమించుకుంటామని చెప్పాయి. గతేడాదితో పోల్చితే నియామకాల ఉద్దేశ్యం 5% పెరిగింది.
- అయితే సరిపడా నైపుణ్యాలు కలిగిన వారు లభించడం లేదని, దీనికితోడు వలసలు తమకు సమస్యాత్మమని కంపెనీలు పేర్కొన్నాయి.
- ఇన్సూరెన్స్, పెయిడ్ మెడికల్ లీవ్‌ను మహిళలు కోరుకుంటుండగా, ఆరోగ్య సంరక్షణ వ్యయాలు పెరిగిపోవడం తమకు సవాలుగా కంపెనీలు తెలిపాయి.

మెరుగైన విధానాలతోనే..

''మరింత మంది మహిళలను ఉద్యోగాల్లోకి తీసుకునేందుకు వ్యాపార సంస్థలు చర్యలు తీసుకుంటున్నాయి. కానీ నిజమైన ప్రగతి అన్నది వారిని కాపాడుకునేందుకు మెరుగైన విధానాలు అమలు చేయడం, కెరీర్‌లో పురోగతికి వీలు కల్పించడం, ఆర్థిక భద్రత, ఆరోగ్య సంరక్షణ దిశగా విధానాలు అమలు చేయడం కీలకం''అని ఇండీస్ సర్వే సూచించింది.

ఇండస్‌ఇండ్ వ్యవహారంపై ఆందోళన వద్దు

- బ్యాంకు ఆర్థిక పరిస్థితి మెరుగ్గానే ఉంది
- కస్టమర్లు, డిపాజిటర్లకు ఆర్‌బీఐ భరోసా



ముంబై: బ్యాంకింగ్ రంగంలో గుబులు రేపిన ఇండస్‌ఇండ్ బ్యాంక్ రూ.2,100 కోట్ల అవకతవకల వ్యవహారంపై కేంద్ర రిజర్వ్ బ్యాంకు(ఆర్‌బీఐ) స్పందించింది. డెరివేటివ్స్ పోర్ట్‌ఫోలియోలో లోపాలకు సంబంధించి తీసుకున్న నివారణ చర్యలు ఈ త్రైమాసికం చివరి నాటికి (మార్చి 31లోగా) పూర్తి చేయాలంటూ బ్యాంక్ బోర్డుకు ఆదేశాలు జారీ చేసింది. ''ఇండస్‌ఇండ్ బ్యాంక్ ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంది. ఊహాజనిత వార్తల గురించి కస్టమర్లు, డిపాజిటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. బ్యాంకు తన ప్రస్తుత వ్యవస్థలను సమీక్షించడానికి, అకౌంటింగ్ తప్పిదం వాస్తవ ప్రభావాన్ని త్వరగా అంచనా వేయడానికి, లోపాలపై పూర్తి స్థాయి విచారణకు ఒక ప్రత్యేక ఆడిట్ బృందాన్ని నియమించింది'' అని ప్రకటన ద్వారా తెలిపింది. 2024 డిసెంబర్ 31 ముగిసిన మూడో త్రైమాసికం నాటికి ఇండస్‌ఇండ్ బ్యాంకు ఆడిటర్ సమీక్షించిన గణాంకాల ప్రకారం క్యాపిటల్ అడెక్వసీ రేషియో(సీఏఆర్) 16.46%, ప్రొవిజన్ కవరేజ్ రేషియో 70.20% సంతృప్తికర స్థాయిలో ఉన్నాయి. అలాగే 2025 మార్చి 9 నాటికి లిక్విడిటీ కవరేజ్ రేషియో(ఎల్‌సీఆర్) 100 శాతానికి మించి 113% ఉంది.

భారీగా పెరిగిన ఫారెక్స్ నిల్వలు



ముంబై: భారత విదేశీ మారక నిల్వలు(ఫారెక్స్ నిల్వలు) భారీగా పెరిగాయి. మార్చి 7తో ముగిసి న వారానికి 15.267 బిలియన్ డాలర్లు పెరిగి 653.966 డాలర్లకు చేరాయని ఆర్‌బీఐ తెలిపింది. గడిచిన రెండేళ్లలో ఈ స్థాయిలో అనూహ్యంగా పెరగడం ఇదే తొలిసారి. వ్యవస్థలో లిక్విడిటీని పెంచేందుకు ఆర్‌బీఐ ఫిబ్రవరి 28న 10 బిలియన్ డాలర్లకు సమానమైన డాలర్-రూపాయి వేలాన్ని నిర్వహించడం ఫారెక్స్ నిల్వల అనూహ్య పెరుగుదలకు కారణమని నిపుణులు చెబుతున్నారు. అంతకు మార్చి 1తో ముగిసిన వారం 1.781 బిలియన్ డాలర్లు తగ్గి 638.698 డాలర్లుగా ఉన్నాయి. సమీక్షా వారం(మార్చి 7)లో విదేశీ కరెన్సీ ఆస్తులు 13.993 బిలియన్ డాలర్లు పెరిగి 557.282 బిలియన్ డాలర్లకు.., పసిడి నిల్వలు 1.053 బిలియన్ డాలర్ల నుంచి 74.325 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ వద్ద నిల్వలు 69 మిలియన్ డాలర్లు తగ్గి 4.148 బిలియన్ డాలర్లకు దిగివచ్చినట్లు ఆర్‌బీఐ గణాంకాలు తెలియజేశాయి.

వ్యూయర్‌షిప్‌లో జియోహాట్‌స్టార్ కొత్త రికార్డులు

చాంపియన్స్ ట్రోఫీకి 540 కోట్ల వ్యూస్

న్యూఢిల్లీ: దేశీయంగా లైవ్ స్పోర్ట్స్ స్ట్రీమింగ్ వ్యూయర్‌షిప్‌లో జియోహాట్‌స్టార్ కొత్త రికార్డులు నెలకొల్పింది. ఇటీవల ముగిసిన 'ఐసీసీ పురుషుల క్రికెట్ చాంపియన్స్ ట్రోఫీ 2025' మ్యాచ్‌లకు సంబంధించి 540 కోట్ల వ్యూస్, దాదాపు 11,000 కోట్ల నిమిషాల వాచ్‌టైమ్ నమోదైంది. డిస్నీ స్టార్ ఇండియా, రిలయన్స్ ఇండస్ట్రీస్‌లో భాగమైన వయాకామ్ 18 విలీనంతో జియోహాట్‌స్టార్ ఏర్పాటైన తర్వాత స్ట్రీమ్ చేసిన తొలి భారీ క్రికెట్ టోర్నమెంట్ ఇది. ఇందులో న్యూజిల్యాండ్ మీద భారత్ గెల్చిన ఫైనల్ మ్యాచ్‌కి ఏకంగా 124.2 కోట్ల వ్యూస్ వచ్చాయి. ఒక దశలో, ఏకకాలంలో వీక్షించిన వారి సంఖ్య 6.12 కోట్లుగా నమోదైంది. గతంలో డిస్నీ హాట్‌స్టార్‌లో ప్రసారమైన 2023 క్రికెట్ వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌ని అత్యధికంగా 5.9 కోట్ల మంది వీక్షించారు. తాజా టోర్నీలో భారత్-పాకిస్తాన్ మ్యాచ్‌కు 60.2 కోట్ల స్ట్రీమింగ్ వ్యూస్ వచ్చాయి. భారత్‌లో డిజిటల్ స్ట్రీమింగ్‌కు పెరుగుతున్న ఆదరణను తాజా గణాంకాలు సూచిస్తున్నాయని జియోస్టార్ డిజిటల్ సీఈవో కిరణ్ మణి తెలిపారు. ఐసీసీ టోర్నమెంటును తొలిసారిగా తెలుగు, తమిళం తదితర తొమ్మిది భాషల్లోను, సైన్ ల్యాంగ్వేజ్‌లోను, ఆడియో కామెంటరీ రూపంలోనూ అందించినట్లు వివరించారు.





రష్మికకు ఐటీఎఫ్ టైటిల్

సాక్షి, హైదరాబాద్: భారత యువ టెన్నిస్ ప్లేయర్ భమిడిపాటి శ్రీవల్లి రష్మిక కెరీర్‌లో ఆరో అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) టైటిల్ ఖాతాలో వేసుకుంది. భారత్‌కే చెందిన వైదేహి చౌదరీతో కలిసి రష్మిక డబ్ల్యూ 35 డబుల్స్ టైటిల్ కైవసం చేసుకుంది. ఐటీఎఫ్ వరల్డ్ టెన్నిస్ టూర్‌లో భాగంగా... థాయ్‌లాండ్ వేదికగా జరిగిన డబ్ల్యూ 35 టోర్నీ మహిళల డబుల్స్ ఫైనల్లో రష్మిక-వైదేహి జంట 6-4, 6-3తో పునిన్ కొవాపిటుక్‌టెడ్ (థాయ్‌లాండ్)-యుకీ నైటో (జపాన్) ద్వయంపై విజయం సాధించింది. మ్యాచ్ ఆరంభం నుంచి చక్కటి ఆటతీరు కనబర్చిన భారత జోడీ... వరుస సెట్లలో విజృంభించి టైటిల్ చేజిక్కించుకుంది. 1 గంట 18 నిమిషాల పాటు సాగిన పోరులో రష్మిక-వైదేహి 2 ఏస్‌లు సంధించి ఒక డబుల్ ఫాల్ట్ చేసింది. 9 బ్రేక్ పాయింట్లు కాచుకున్న భారత ప్లేయర్లు... ఓవరాల్‌గా 61 పాయింట్లు సాధించి సునాయాసంగా గెలుపొందారు. హైదరాబాద్‌కు చెందిన రష్మికకు ఇది రెండో డబ్ల్యూ 35 టైటిల్ కాగా... ఓవరాల్‌గా ఆరోది. 2024లో డబ్ల్యూ 35 ఇండోర్, 2023లో డబ్ల్యూ 15 అహ్మదాబాద్, డబ్ల్యూ 15 థాయ్‌లాండ్, డబ్ల్యూ 25 థాయ్‌లాండ్, 2022లో డబ్ల్యూ 15 గురుగ్రామ్ టోర్నమెంట్‌లలో రష్మిక డబుల్స్ చాంపియన్‌గా నిలిచింది. ఈ ఆరింట్లో నాలుగుసార్లు వైదేహి చౌదరీతో కలిసే రష్మిక విజయాలు సాధించింది.

ఒలింపిక్ చాంపియన్‌గా నిలిస్తే బాగుంటుంది!

దానికి మరేదీ సాటిరాదన్న విరాట్ కోహ్లి

- ఇప్పట్లో రిటైర్మెంట్ ఆలోచన లేదని వ్యాఖ్య
- ఆటను ఆస్వాదించినంత కాలం కొనసాగుతానని వెల్లడి

బెంగళూరు: ఒక క్రికెటర్‌గా ఒలింపిక్ పతకాన్ని గెలుచుకోగలిగితే అది ఎంతో ప్రత్యేకం అవుతుందని, దానికి మరేదీ సాటి రాదని భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లి అన్నాడు. 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో క్రికెట్ పోటీలు జరగనున్న నేపథ్యంలో కోహ్లి వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. 1900 తర్వాత తొలిసారి విశ్వక్రీడల్లో క్రికెట్‌ను ప్రవేశ పెడుతున్నారు. ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు చోటు దక్కడంలో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) కూడా కీలక పాత్ర పోషించిందని కోహ్లి అభిప్రాయపడ్డాడు. 'ఒలింపిక్ చాంపియన్‌గా నిలిస్తే ఎంతో బాగుంటుంది. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న ఐపీఎల్ ఇందులో ప్రముఖ పాత్ర పోషించింది. క్రికెట్‌ను ఒలింపిక్స్‌లో భాగమయ్యే స్థాయికి తెచ్చింది. ఇది యువ ఆటగాళ్లకు గొప్ప అవకాశం. ప్రతి అథ్లెట్ దాని కోసమే కష్టపడతాడు. పురుషుల, మహిళల విభాగాల్లో మన జట్టు పతకానికి చేరువవుతుందని అనుకుంటున్నా' అని విరాట్ అన్నాడు. ఇటీవల చాంపియన్స్ ట్రోఫీలో చక్కటి ప్రదర్శన కనబర్చిన కోహ్లి... లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్ వరకు కెరీర్ కొనసాగిస్తాడా అనేది చూడాలి. 2028కి విరాట్ 40వ పడిలోకి అడుగుపెట్టనున్నాడు. 'ఇప్పుడే దాని గురించి మాట్లాడటం తొందరపాటు అవుతుంది. ఒకవేళ ఒలింపిక్ పసిడి పతకం కోసం మ్యాచ్ ఆడుతుంటే... నేను గుట్టు చప్పుడు కాకుండా జట్టులో చేరి పతకం సాధించి ఇంటికి వస్తా' అని విరాట్ చమత్కరించాడు. ఐపీఎల్ ప్రారంభానికి ముందు వివిధ అంశాలపై విరాట్ పంచుకున్న విశేషాలు అతడి మాటల్లోనే...

* మహిళల ప్రీమియర్ లీగ్ వల్ల దేశంలో మహిళల క్రికెట్ ప్రాధాన్యత మరింత పెరిగింది. భారత మహిళల క్రికెట్ జట్టు గత కొంతకాలంగా నిలకడైన ప్రదర్శన చేస్తూ అభిమానుల మనసులు గెలుచుకుంటోంది.

* ఆరేడేళ్ల క్రితం మహిళల ఆటకు ఇంత ప్రాధాన్యత దక్కలేదు. డబ్ల్యూపీఎల్‌కు వస్తున్న ఆదరణ చూస్తుంటే ముచ్చటేస్తోంది. ఇప్పుడు ఎక్కడ చూసినా వారి గురించి చర్చ జరుగుతోంది. రోజు రోజుకు ఆటలో ప్రమాణాలు పెరుగుతున్నాయి.

* వేరే రంగాల్లో విజయం సాధించినప్పుడు రాని పేరు, ప్రఖ్యాతలు క్రీడల్లో సులువుగా వస్తాయి. ఎందుకంటే మైదానంలో ఆడేది తామే అని ప్రతి ఒక్క అభిమాని ఊహించుకుంటాడు కాబట్టే ఇది సాధ్యం. అందుకే క్రీడాకారులు విజయాలు సాధించినప్పుడు యావత్ భారత్ సంబరాలు చేసుకుంటుంది.

* ఆటను ఆస్వాదించడం నాకు ఇష్టం... అదే చేస్తున్నా. ఎలాంటి తీవ్ర నిర్ణయాలు తీసుకోవాలని అనుకోవడం లేదు. మైదానంలో వంద శాతం కష్టపడటం అలవాటు. దాన్ని ఇక మీద కూడా కొనసాగిస్తా. భావోద్వేగాలు ఆటలో భాగం. వాటిని దాచుకోవడానికి ఎప్పుడూ ప్రయత్నించను.

* ఆటలో పోటీ సహజం. అప్పుడే మన సహజ నైపుణ్యం బయటకు వస్తుంది. ఈ స్థాయికి చేరుకున్నాక కూడా ఇంకేదో గుర్తింపు పొందాలనుకోవడం లేదు. ఆటపై ప్రేమ ఉన్నంతకాలం మైదానంలో కొనసాగుతా. ఈ అంశంలో రాహుల్ ద్రవిడ్ విలువైన సూచనలిచ్చారు. "నీతో నువ్వు తరచూ మాట్లాడుతూ ఉండు ఎప్పుడు ఆపేయాలో నీకే తెలుస్తుంది" అన్నారు. దాన్నే పాటిస్తున్నా.

* జీవితంలో సాధించిన దాంతో సంతృప్తిగా ఉన్నా. కెరీర్ ఆరంభంతో పోల్చుకుంటే సుదీర్ఘ అనుభవం సాధించిన తర్వాత అన్నీ విషయాలను అనుకున్న విధంగా పూర్తి చేయడం కష్టం. వయసు పెరుగుతున్న భావన కలగడం సహజం. ఫిట్‌గా ఉండేందుకు మరింత కష్టపడాల్సి వస్తుంది.



* అప్పుడప్పుడు అసంతృప్తి ఆవరిస్తుంది. నా వరకు ఈ ఏడాది ఆరంభంలో ఆస్ట్రేలియా పర్యటనలో మెరుగైన ప్రదర్శన చేయలేకపోయా. దీంతో తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నా.. అయితే దాన్ని ఒత్తిడిగా భావించలేదు. అందులో నుంచి బయటపడేందుకు మార్గాలు అన్వేషించి వాటిపై కసరత్తు చేసి ఫలితాలు సాధించా. 2014లో ఇంగ్లండ్ పర్యటన సందర్భంగా కూడా ఇలాంటి పరిస్థితే ఎదురైంది. అయితే అన్నింటిని అధిగమించాల్సిందే. మరో అవకాశం వచ్చినప్పుడు దాన్ని మరింపిచే ప్రదర్శన చేయాలి. 2018లో నేను అదే చేశా.

* క్రికెటేతర విషయాల గురించి ఆలోచించి ఒత్తిడి పెంచుకోను. డ్రెస్సింగ్ రూమ్ బయటి వ్యాఖ్యలకు పెద్దగా ప్రాముఖ్యత ఇవ్వను. ఒక్కసారి వాటిని పట్టించుకోవడం ప్రారంభిస్తే ఇక ఒత్తిడి కొండలా పెరుగుతుంది.

ఏప్రిల్ 12న ఐఎస్ఎల్ ఫైనల్



ప్లే ఆఫ్స్ షెడ్యూల్ విడుదల

ముంబై: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) 2024-25 సీజన్ ప్లే ఆఫ్స్ షెడ్యూల్ విడుదలైంది. ఈ సీజన్‌లో మొత్తం 13 జట్లు పాల్గొనగా... ఈ నెల 12తో లీగ్ దశ ముగిసింది. పాయింట్ల పట్టికలో తొలి 6 స్థానాల్లో నిలిచిన జట్లు ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించాయి. పాయింట్ల ఆధారంగా మోహన్ బగాన్ (56 పాయింట్లు), గోవా ఫుట్‌బాల్ క్లబ్ (48 పాయింట్లు) నేరుగా సెమీఫైనల్‌కు అర్హత సాధించగా... మిగిలిన నాలుగు జట్లు నాకౌట్ మ్యాచ్‌లు ఆడనున్నాయి. ఈ నెల 29న బెంగళూరు జట్టుతో ముంబై సిటీ జట్టు తొలి నాకౌట్ మ్యాచ్ ఆడనుంది. రెండో నాకౌట్ మ్యాచ్‌లో నార్త్ ఈస్ట్ యునైటెడ్ జట్టుతో జంషెడ్పూర్ ఫుట్‌బాల్ క్లబ్ అమీతుమీ తేల్చుకోనుంది. వీటిలో విజయాలు సాధించిన జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. ఏప్రిల్ 2 నుంచి 7 వరకు జరగనున్న సెమీఫైనల్స్‌ను రెండు అంచెల విధానంలో నిర్వహించనున్నారు. అంటే సెమీస్‌కు చేరిన జట్లు ఇంటా బయటా ఒక్కో మ్యాచ్ ఆడతాయి. అందులో విజయం సాధించిన జట్ల మధ్య ఏప్రిల్ 12న ఫైనల్ నిర్వహించనున్నారు. ఈ మేరకు శనివారం ప్లే ఆఫ్స్ షెడ్యూల్ విడుదల చేశారు.

ఐఎస్ఎల్ ప్లే ఆఫ్స్ షెడ్యూల్

తేదీ	మ్యాచ్	ఎవరితో ఎవరు
మార్చి 29	నాకౌట్ 1	బెంగళూరు ఎఫ్‌సీ X ముంబై ఎఫ్‌సీ
మార్చి 30	నాకౌట్ 2	నార్త్ ఈస్ట్ యునైటెడ్ ఎఫ్‌సీ X జంషెడ్పూర్ ఎఫ్‌సీ
ఏప్రిల్ 2	సెమీఫైనల్ 1 (తొలి అంచె)	నాకౌట్ 1 విజేత X గోవా ఎఫ్‌సీ
ఏప్రిల్ 3	సెమీఫైనల్ 2 (తొలి అంచె)	నాకౌట్ 2 విజేత X మోహన్ బగాన్
ఏప్రిల్ 6	సెమీఫైనల్ 1 (రెండో అంచె)	గోవా ఎఫ్‌సీ X నాకౌట్ 1 విజేత
ఏప్రిల్ 7	సెమీఫైనల్ 2 (రెండో అంచె)	మోహన్ బగాన్ X నాకౌట్ 2 విజేత
ఏప్రిల్ 12	ఫైనల్	తొలి సెమీస్ విజేత X రెండో సెమీస్ విజేత

నోరిస్‌కు పోల్ పొజిషన్



- 8వ స్థానంలో నిలిచిన హామిల్టన్
- ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రి క్వాలిఫయింగ్ సెషన్

మెల్‌బోర్న్: ఫార్ములావన్ సీజన్ ఆరంభ రేసు ఆస్ట్రేలియన్ గ్రాండ్ ప్రిలో మెక్‌లారెన్ డ్రైవర్ లాండో నోరిస్ (బ్రిటన్) పోల్ పొజిషన్ సాధించాడు. 24 రేసులతో కూడిన ఈ సీజన్‌కు ఆదివారం తెర లేవనుండగా... శనివారం క్వాలిఫయింగ్ ఈవెంట్ జరిగింది. ఇందులో లాండో నోరిస్ 1 నిమిషం 15.096 సెకన్లలో ల్యాప్‌ను పూర్తి చేసి అగ్ర స్థానంలో నిలిచాడు. మెల్‌బోర్న్‌లో నోరిస్‌కు ఇదే తొలి 'పోల్' కాగా... ఓవరాల్‌గా కెరీర్‌లో 10వది. ఎఫ్1 సీజన్ ప్రారంభోత్సవ క్వాలిఫయింగ్ టోర్నీకి శనివారం 1,36,347 మంది అభిమానులు హాజరవడం విశేషం. 'కొత్త సీజన్ ఘనంగా ప్రారంభమైంది. సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు. ఈ ట్రాక్‌పై కఠిన నిర్ణయాలు తీసుకుంటేనే ముందు వరుసలో నిలవగలం' అని రేసు అనంతరం నోరిస్ అన్నాడు. మెక్‌లారెన్ జట్టుకే చెందిన ఆస్కార్ పియాస్ట్రి (ఆస్ట్రేలియా) 0.084 సెకన్ల తేడాతో రెండో స్థానంలో నిలిచాడు. క్వాలిఫయింగ్‌లో పియాస్ట్రి 1 నిమిషం 15. 180 సెకన్ల టైమింగ్ నమోదు చేశాడు. ట్రాక్‌పై గత నాలుగేళ్లుగా ఎదురులేకుండా దూసుకెళ్తున్న రెడ్‌బుల్ డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ (నెదర్లాండ్స్)... క్వాలిఫయింగ్ ఈవెంట్‌లో మూడో స్థానంలో నిలిచాడు. వెర్‌స్టాపెన్ 1 నిమిషం 15.481 సెకన్లలో వేగవంతమైన ల్యాప్ పూర్తి చేశాడు. ఈ సీజన్ నుంచి ఫెరారీ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న మాజీ చాంపియన్ లూయిస్ హామిల్టన్ (బ్రిటన్) 1 నిమిషం 15.973 సెకన్లతో ఎనిమిదో స్థానంలో నిలిచాడు. 'ఇలాంటి ప్రదర్శనను ఆశించలేదు. కానీ ఓవరాల్‌గా సంతృప్తిగా ఉన్నా... గత రెండు రోజులుగా పడ్డ కష్టానికి ఫలితం దక్కింది. ప్రధాన రేసులో మరింత వేగంగా దూసుకెళ్లేందుకు ప్రయత్నిస్తా' అని హామిల్టన్ అన్నాడు. ఫెరారీ మరో డ్రైవర్ చార్లెస్ లెక్‌లెర్క్ (1 నిమిసం 15.755 సెకన్లు; మొనాకో) ఏడో ప్లేస్‌లో, మెర్సెడెస్ డ్రైవర్ జార్జి రసెల్ (1 నిమిషం 15. 546 సెకన్లు; బ్రిటన్) నాలుగో స్థానంలో నిలిచారు. ఆదివారం జరగనున్న ప్రధాన రేసులో 10 జట్లకు చెందిన 20 మంది డ్రైవర్లు పాల్గొంటున్నారు.

ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రి క్వాలిఫయింగ్ సెషన్

డ్రైవర్	జట్టు	టైమింగ్
నోరిస్	మెక్‌లారెన్	1:15.096
పియాస్ట్రి	మెక్‌లారెన్	1:15.180
వెర్‌స్టాపెన్	రెడ్‌బుల్	1:15.481
రసెల్	మెర్సిడెస్	1:15.546
సునోడా	రేసింగ్ బుల్స్	1:15.670
అల్బన్	విలియమ్స్	1:15.737
లెక్‌లెర్క్	ఫెరారీ	1:15.755
హామిల్టన్	ఫెరారీ	1:15.973
గ్యాస్లీ	ఆల్పైన్	1:15.980
సెయింజ్	విలియమ్స్	1:16.062







ఆసియా చాంపియన్‌షిప్స్‌కు

అంతిమ్, దీపక్

30 మంది రెజ్లర్లు ఎంపిక

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ)పై కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ విధించిన సస్పెన్షన్ ఎత్తేయడంతో చాన్నాళ్ల తర్వాత దేశంలో రెజ్లింగ్ ట్రయల్స్ జరిగాయి. ఈ నెల 25 నుంచి 30 వరకు జోర్డాన్ వేదికగా జరగనున్న ఆసియా చాంపియన్‌షిప్స్ కోసం శనివారం న్యూఢిల్లీలో ట్రయల్స్ నిర్వహించారు. పురుషుల ఫ్రీస్టయిల్, గ్రీకో రోమన్, మహిళల విభాగాల్లో నిర్వహించిన ట్రయల్స్‌లో దీపక్ పూనియా, అంతిమ్ పంఘాల్ సహా 30 మంది రెజ్లర్లు పాల్గొన్నారు. సంజయ్ సింగ్ అధ్యక్షతన డబ్ల్యూఎఫ్ఐ కార్యవర్గం ఈ ట్రయల్స్ నిర్వహించింది. 2019 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రజతం, 2022 కామన్వెల్త్ క్రీడల్లో స్వర్ణం నెగ్గిన దీపక్ 86 కేజీల విభాగం నుంచి 92 కేజీల విభాగంలో బరిలోకి దిగి సత్తా చాటాడు.

ఆసియా చాంపియన్స్ ట్రోఫీకి ఎంపికైన రెజ్లర్లు

పురుషుల ఫ్రీస్టయిల్: చిరాగ్ (57 కేజీలు), ఉదిత్ (61 కేజీలు), సుజిత్ (65 కేజీలు), విశాల్ (70 కేజీలు), జైదీప్ (74 కేజీలు), చంద్రమోహన్ (79 కేజీలు), ముకుల్ దహియా (86 కేజీలు), దీపక్ పూనియా (92 కేజీలు), జాంటీ కుమార్ (97 కేజీలు), దినేశ్ (125 కేజీలు).

పురుషుల గ్రీకో రోమన్: నితిన్ (55 కేజీలు), సుమిత్ (60 కేజీలు), ఉమేశ్ (63 కేజీలు), నీరజ్ (67 కేజీలు), కుల్దీప్ మాలిక్ (72 కేజీలు), సాగర్ (77 కేజీలు), రాహుల్ (82 కేజీలు), సునీల్ కుమార్ (87 కేజీలు), నితేశ్ (97 కేజీలు), ప్రేమ్ (130 కేజీలు).

మహిళల విభాగం: అంకుశ్ (50 కేజీలు), అంతిమ్ (53 కేజీలు), నిశు (55 కేజీలు), నేహ శర్మ (57 కేజీలు), ముస్కాన్ (59 కేజీలు), మనీషా (62 కేజీలు), మోనిక (65 కేజీలు), మాన్సి లాథర్ (68 కేజీలు), జ్యోతి (72 కేజీలు), రీతిక (76 కేజీలు).

చాంపియన్స్ లయోలా, సెయింట్ ఫ్రాన్సిస్



సాక్షి, హైదరాబాద్: సంపత్ కుమార్ స్మారక వార్షిక బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో లయోలా అకాడమీ, సెయింట్ ఫ్రాన్సిస్ డిగ్రీ కళాశాల జట్లు చాంపియన్‌గా నిలిచాయి. హైదరాబాద్ జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ చాంపియన్‌షిప్ పురుషుల విభాగంలో లయోలా అకాడమీ జట్టు విజయం సాధించగా... మహిళల విభాగంలో సెయింట్ ఫ్రాన్సిస్ డిగ్రీ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. సికింద్రాబాద్ వేదికగా జరిగిన పురుషుల ఫైనల్లో లయోలా అకాడమీ జట్టు 93-69 పాయింట్ల తేడాతో నిజామాబాద్ బాస్కెట్‌బాల్ అకాడమీపై గెలుపొందింది. లయోలా జట్టు తరఫున మాజిద్ 26 పాయింట్లు, స్టీవ్ 21 పాయింట్లు, వివేక్ 14 పాయింట్లు, విగ్నేశ్ 12 పాయింట్లు సాధించి విజయంలో కీలక పాత్ర పోషించారు. నిజామాబాద్ జట్టు తరఫున చరణ్ 22 పాయింట్లతో పోరాడినా ఫలితం లేకపోయింది. తొలి అర్ధ భాగం ముగిసేసరికి లయోలా 40-37తో నిలిచింది. ద్వితీయార్ధంలో వరుస పాయింట్లతో విజృంభించిన ఆ జట్టు... ప్రత్యర్థికి తిరిగి పుంజుకునే అవకాశం ఇవ్వకుండా విజయం సాధించింది. మహిళల తుది పోరులో సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాల జట్టు 38-36 పాయింట్ల తేడాతో వైఎంసీఏ సికింద్రాబాద్‌పై నెగ్గింది. సెయింట్ ఫ్రాన్సిస్ జట్టు తరఫున రేఖ 12 పాయింట్లు, పరినిష్ఠ 10 పాయింట్లతో సత్తాచాటారు. వైఎమ్‌సీఏ సికింద్రాబాద్ తరఫున లాస్య 10 పాయింట్లు, జాహ్నవి 9 పాయింట్లు సాధించారు. హైదరాబాద్ బాస్కెట్‌బాల్ సంఘం అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు.

సవిత, హర్మన్‌ప్రీత్ సింగ్‌కు ప్లేయర్ ఆఫ్ ద ఇయర్ అవార్డులు



న్యూఢిల్లీ: అంతర్జాతీయ స్థాయిలో నిలకడైన ప్రదర్శనతో జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న భారత పురుషుల హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, మహిళల జట్టు గోల్‌కీపర్ సవితా పూనియాకు... 'ప్లేయర్ ఆఫ్ ద ఇయర్' అవార్డులు దక్కాయి. హాకీ దిగ్గజం బల్బీర్ సింగ్ పేరిట ప్రతి ఏడాది ఉత్తమ ప్రదర్శన కనబర్చిన ప్లేయర్లకు హాకీ ఇండియా (హెచ్ఐ) ఈ పురస్కారాలు అందజేస్తోంది. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలో భారత జట్టు వరుసగా రెండో సారి విశ్వ క్రీడల్లో కాంస్య పతకం సాధించింది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యం నెగ్గిన జట్టులోనూ హర్మన్‌ప్రీత్ సభ్యుడు. ఇక టోక్యో ఒలింపిక్స్‌లో భారత జట్టు నాలుగో స్థానంలో నిలవడంలో సవిత ప్రధాన పాత్ర పోషించింది. 2024 సంవత్సరానికి గానూ సవిత హాకీ ఇండియా బల్జీత్ సింగ్ 'గోల్‌కీపర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు కూడా దక్కించుకుంది. 'ఈ పురస్కారాలకు ఎంపికవడం చాలా ఆనందంగా ఉంది. జట్టు సభ్యుల సహకారం లేనిదే ఇది సాధ్యం కాదు. ఈ అవార్డులు ఆటపై ఏకాగ్రతను మరింత పెంచుతాయి' అని సవిత పేర్కొంది. 'ఈ అవార్డు నాకు ప్రేరణ వంటిది. యువ ఆటగాళ్లు మరింత మెరుగైన ప్రదర్శన చేసేలా ఇవి తోడ్పాటునిస్తాయి' అని హర్మన్‌ప్రీత్ సింగ్ అన్నాడు. భారత పురుషుల హాకీ జట్టు 1975లో ప్రపంచకప్ నెగ్గి 50 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా హాకీ ఇండియా ప్రతిష్టాత్మకంగా వేడుకలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగానే ప్లేయర్లకు పురస్కారాలు అందజేసింది.



ఈ బస్సుకు డ్రైవర్ లేడు!

బార్సిలోనా నగర వీధుల్లో డ్రైవర్‌రహిత బస్సు సందడి



బస్సెక్కుతున్న ప్రయాణికులు



రోడ్డుపై దూసుకెళ్తున్న బస్సు

బార్సిలోనా: స్పెయిన్‌లోని బార్సిలోనా నగర వీధుల్లో ఒక కొత్త బస్సు సందడిచేస్తోంది. అందులో ఎక్కే ప్రయాణికుల నుంచి ఒక వారంరోజులపాటు ఎలాంటి రుసుము వసూలుచేయట్లేరు. ఈ బస్సుకు ప్రత్యేకత ఉంది. అదేంటంటే బస్సుకు డ్రైవర్ అంటూ ఎవరూ ఉండరు. ఈ డ్రైవర్‌లెస్ విద్యుత్ బస్సు ఇప్పుడు బార్సిలోనా సిటీ వీధుల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. డ్రైవర్‌లేకున్నా ధైర్యంచేసి బస్సులో దూరిపోయే ప్రయాణికులూ ఎక్కువైపోయారు. గంటకు 40కిలోమీటర్ల వేగంతో ఈ బస్సు దూసుకుపోతుంది. ఒక్కసారి చార్జ్‌చేస్తే 120 కిలోమీటర్లదాకా ప్రయాణించవచ్చు. చుట్టూతా 10 అత్యాధునిక కెమెరాలు, సెన్సార్‌లతో పనిచేసే ఎనిమిది లిడార్‌లను అమర్చారు.

అతి చిన్న రూట్

సుదూరాలకు ప్రయాణించకుండా తొలి దఫాలో ఈ మినీ బస్సును కేవలం 2.2 కిలోమీటర్ల వృత్తాకార పరిధిలోనే తిప్పుతున్నారు. ప్రయాణంలో ఇది మొత్తం నాలుగు చోట్ల మాత్రమే ఆగుతుంది. స్వయంచాలిత వాహనాల తయారీలో ప్రత్యేకత సాధించిన వీరైడ్ అనే సంస్థతో ఫ్రెంచ్ కార్ల తయారీ దిగ్గజ సంస్థ రెనాల్ట్ చేతులు కలిపి ఈ అధునాతన బస్సును రూపొందించింది. తొలిసారిగా ఈ బస్సు నమూనాను గత ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ టెన్నిస్ కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఇప్పుడు బస్సు బార్సిలోనా నగర వీధుల్లో సేవలందిస్తోంది. ఇలాంటి ప్రయోగ ప్రాజెక్టులను ఫ్రాన్స్‌లోని వాలెన్స్ సిటీ, జ్యూరిచ్ ఎయిర్‌పోర్ట్‌లోనూ ప్రారంభించారు. ''సాధారణ ఇంజన్‌తో నడిచే బస్సును ఎక్కి బోర్ కొట్టింది. అందుకే ఈ రోజు డ్రైవర్‌లెస్ బస్సెక్కా''అని 18 ఏళ్ల పావ్లా కగాట్ చెప్పారు. ''శాన్‌ఫ్రాన్సిస్కో మొదలు టోక్యో దాకా ఇప్పటికే పలు నగరాల్లో డ్రైవర్‌లెస్ బస్సును పరీక్షించినా యూరప్‌లో మాత్రం వీటి సందడి ఇంకా మొదలుకాలేదు. అందుకే ఈ పంథాను ఇక్కడ మేం మొదలెట్టాం''అని రేనాల్ట్ అటానమస్ మొబిలిటీ ప్రాజెక్ట్స్ హెడ్ ప్యాట్రిక్ వర్గిలాస్ చెప్పారు. బస్సు సిగ్నళ్ల వద్ద ఆగుతూ, పాదచారులు రోడ్డు దాటేటప్పుడు ఆగి వెళ్తూ ట్రాఫిక్ నిబంధనలనూ చక్కగా అనుసరిస్తోంది. ఇప్పటిదాకా ఎలాంటి రోడ్డు ప్రమాదాలకు ఇది కారణం కాలేదని బార్సిలోనా సిటీ అధికారులు చెప్పారు. ఇప్పుడే బస్సులో ఎక్కిన వాళ్లు లోపల కూర్చొని, బయట నిలబడి సెల్ఫీలు దిగుతూ తెగ షేర్‌లు చేసుకుంటున్నారు. దీంతో బుల్లి బస్సుకు భలే గిరాకీ ఉందే అని కొందరు నెటిజన్లు వ్యాఖ్యానాలు చేశారు.

లోక్‌సభ ఎన్నికల కోసమే ఇండియా కూటమి

లౌకిక పార్టీలతో విస్తృత వేదిక ఏర్పాటు కావాలి • సీపీఎం అగ్ర నేత ప్రకాశ్ కారత్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: ప్రతిపక్ష ఇండియా కూటమి లోక్‌సభ ఎన్నికల కోసం ఏర్పాటైందే తప్ప, రాష్ట్రాల్లో ఎన్నికల కోసం కాదని సీపీఎం నేత, పార్టీ మధ్యంతర సమన్వయ కర్తగా వ్యవహరిస్తున్న ప్రకాశ్ కారత్ స్పష్టం చేశారు. ప్రతిపక్ష లౌకిక పార్టీలతో కూడిన విస్తృత వేదిక ఏర్పాటు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఇటువంటి విస్తృత కూటమి మాత్రమే ఎన్నికల రాజకీయ ప్రయోజనాలకు పరిమితమై పోకుండా ఉంటుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. శనివారం ఆయన పీటీఐకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలపై మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏను దీటుగా ఎదుర్కోవడమే లక్ష్యంగా ప్రతిపక్ష పార్టీలు ఇండియా కూటమిగా ఏర్పడటం తెల్సిందే. అయితే, లోక్‌సభ ఎన్నికల అనంతరం జాతీయ స్థాయిలో కూటమి ఏర్పాటుకు సంబంధించి ఎటువంటి చర్చలు జరగలేదని కారత్ వివరించారు. ప్రతిపక్ష పార్టీలు ఐకమత్యంగా వ్యవహరించాల్సిన అవసరం కూడా ఎంతో ఉందన్నారు. కూటమి పార్టీలకు రాష్ట్రాల్లో తమ సొంత రాజకీయ సమీకరణాలు ఉన్నాయని ఆయన వ్యాఖ్యానించారు. ఇండియా కూటమి ఏర్పాటు, అన్ని రాష్ట్రాల్లో కాకున్నా కనీసం కొన్ని చోట్లయినా సభ్య పార్టీల్లో సమన్వయం కుదరడంతో లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ కోల్పోయేందుకు కారణమైందన్న విషయం మాత్రం వాస్తవమని కారత్ విశ్లేషించారు. ఆ తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికలు, ముఖ్యంగా మహారాష్ట్రలో ఫలితాలపై ఆయన మాట్లాడుతూ.. 'లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ మెరుగైన పనితీరు కనబరిచి, బీజేపీకి షాక్ ఇవ్వగలిగింది. అయితే, అసెంబ్లీ ఎన్నికలకు వచ్చే సరికి కూటమిలో అనైక్యత కారణంగా ఫలితాలు తారుమారయ్యాయి'అని కారత్ చెప్పారు. 'జార్ఖండ్‌కు వచ్చే సరికి ఫలితాలు వేరుగా ఉన్నాయి. ఇండియా కూటమిలోని పార్టీలు ఇక్కడ ఐక్యంగా పనిచేసి, బీజేపీని ఓడించాయి. పరిస్థితులను బట్టి రాష్ట్రాల్లో ఫలితాలు మారుతూ వచ్చాయి'అని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రతిపక్ష లౌకికవాద పార్టీలు విశాల వేదిక ఏర్పాటు కోసం ముందుగా ఆయా పార్టీల అవసరాలను, లక్ష్యాలను పరిగణనలోకి తీసుకుంటూ ఒక రూపు తీసుకు రావాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే, బిహార్, తమిళనాడుల్లో ఇటువంటి కూటములు కొనసాగుతున్నాయని గుర్తు చేసిన ప్రకాశ్ కారత్.. పశ్చిమబెంగాల్, ఢిల్లీల్లో పరిస్థితులు ఇందుకు విరుద్ధంగా ఉన్నాయని చెప్పారు. బెంగాల్‌లో టీఎంసీ, సీపీఎంలకు పొసగనట్లే ఢిల్లీలో కూడా కాంగ్రెస్, ఆప్‌లు కలిసి సాగడం సాధ్యం కాని నేపథ్యముందని తెలిపారు. అసలు ఇండియా కూటమి లక్ష్యం ఎన్నికలేనా? అదే అయితే, ఎన్నికల నుంచి ఎన్నికల వరకు ఈ కూటమి కొనసాగుతుందా?అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయని కారత్ వ్యాఖ్యానించారు. అయితే, అసెంబ్లీ ఎన్నికలకు వచ్చే సరికి ఇండియా కూటమి వైఖరి ఎంతో సంక్లిష్టంగా తయారవుతుందని చెప్పారు. 'ప్రతిపక్ష ఐక్య వేదిక పూర్తిగా ఎన్నికలకు సంబంధించింది అనుకోరాదు. మోడీ ప్రభుత్వం, బీజేపీని వ్యతిరేకిస్తున్న పార్టీల వేదిక ఇది'అని కారత్ తెలిపారు. లౌకికవాదం, ప్రజాస్వామ్యం, సమాఖ్య విధానం పరిరక్షణ గురించి ప్రతిపక్ష పార్టీలు ఆందోళన చెందుతున్నట్లయితే ఉమ్మడి వేదిక ఏర్పాటుకు ఇప్పటికీ అవకాశాలున్నాయని, ఇదే ప్రాతిపదికగా ఈ ఉద్యమాన్ని తీసుకువెళ్లవచ్చునని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం, దాని విధానాలకు ప్రత్యామ్నాయమే లక్ష్యమైతే ఆ దిశగా ఇండియా కూటమిని నిర్మించుకోవాల్సి ఉంటుందని కారత్ తెలిపారు.



త్రిభాష సూత్రంపై కేంద్రం మొరటు ధోరణి

నూతన విద్యా విధానంలోని త్రిభాష సిద్ధాంతం అమలుపై కారత్ మాట్లాడుతూ..'దక్షిణాది రాష్ట్రాల అభ్యంతరాల విషయంలో కేంద్రం సున్నితంగా వ్యవహరించడం లేదు. అన్ని భాషలకు సమాన ప్రాముఖ్యం ఇవ్వాలే తప్ప, ఒక భాషను బలవంతంగా అమలు చేసేందుకు ప్రయత్నించరాదు'అని కారత్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ విషయంలో తమిళనాడు అభిప్రాయాలకు తగు ప్రాతిపదిక ఉందని చెప్పారు. హిందీని ప్రోత్సహించాలన్నది కేంద్రం ఉద్దేశంగా ఉందన్నారు. దక్షిణాది రాష్ట్రాల అభ్యంతరాలకు కారణమిదేనని కారత్ తెలిపారు. విద్యావిధానంపై కేంద్రంతోపాటు రాష్ట్రాలకు సమాన హక్కులు ఇవ్వాలని ఆయన సూచించారు. ప్రస్తుతం ఈ విషయంలో కేంద్రం పెత్తనమే కనిపిస్తోందని సీపీఎం నేత ప్రకాశ్ కారత్ చెప్పారు.

బెంగాల్‌లో సీపీఎంను మళ్లీ నిలబెడతాం

పశ్చిమబెంగాల్‌లో సీపీఎంను మళ్లీ బలోపేతం చేయడమే తమ లక్ష్యమని ప్రకాశ్ కారత్ వివరించారు. ఇందులో భాగంగా, వామపక్ష, ప్రజాస్వామిక శక్తులను బీజేపీ, టీఎంసీలకు వ్యతిరేకంగా ఏకం చేస్తామన్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, వామపక్షాలు కలిసి పోటీ చేసే విషయమై ఇప్పటి వరకు ఎలాంటి చర్చలు జరగలేదని కారత్ వెల్లడించారు. బెంగాల్‌లో పార్టీ పునాదులు బలహీనమయ్యాయని, అందుకే ఎన్నికల్లో ఫలితాలను సాధించలేకపోతోందని వివరించారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో మద్దతును తిరిగి కూడగట్టేందుకు ప్రయత్నాలు ప్రారంభించామని చెప్పారు. ఈ విషయంలో కొంతమేర ఫలితాలు కనిపించాయన్నారు. అదే సమయంలో కేరళలో అనూహ్యంగా వరుసగా రెండోసారి అధికారం చేపట్టిన సీపీఎం సారథ్యంలోని ఎల్డీఎఫ్ కూటమి, దీర్ఘ కాలం అధికారంలో కొనసాగడంపై దృష్టి సారించిందని అన్నారు.

తరచూ వియత్నామెందుకో!

రాహుల్ పర్యటనల వెనుక రహస్యమేంటి?

సమాధానం చెప్పాలని బీజేపీ నేతల డిమాండ్

న్యూఢిల్లీ: లోక్‌సభలో ప్రతిపక్ష నేత అయిన కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తరచుగా వియత్నాం ఎందుకు వెళ్తున్నారని బీజేపీ ప్రశ్నించింది. సొంత నియోజకవర్గమైన రాయ్‌బరేలీ కంటే వియత్నాంలోనే ఎక్కువ సమయం గడుపుతున్నారని, దీని వెనుక ఉన్న రహస్యం ఏమిటో చెప్పాలని నిలదీసింది. వియత్నాం పట్ల అంతటి అసాధారణమైన అనురాగం ఎందుకు? అని అనుమానం వ్యక్తంచేసింది. నూతన సంవత్సరం సందర్భంగా రాహుల్ గాంధీ వియత్నాంలో గడిపారని, హోలీ పండుగ కూడా అక్కడే చేసుకున్నారని బీజేపీ సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ శనివారం చెప్పారు. ప్రస్తుతం ఆయన అక్కడే ఉన్నారని వెల్లడించారు. రాహుల్ చాలా రోజులుగా వియత్నాంలో ఉంటున్నట్లు తెలిసిందని అన్నారు. ప్రజలకు తెలియకుండా రహస్యంగా వెళ్లాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. స్వదేశంలో ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన ప్రతిపక్ష నాయకుడు విదేశాల్లో కాలం గడిపేయడం ఏమిటని విమర్శించారు. బీజేపీ ఐటీ విభాగం అధినేత అమిత్ మాలవీయా సైతం శనివారం 'ఎక్స్'లో స్పందించారు. ప్రజలకు గానీ, పార్లమెంట్‌కు గానీ తెలియకుండా తరచుగా విదేశీ పర్యటనలు ఎందుకు చేస్తున్నారో రాహుల్ చెప్పాలని అన్నారు. కనీసం కాంగ్రెస్ పార్టీ అయినా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న కీలకమైన తరుణంలో ప్రతిపక్ష నాయకుడు విదేశాలకు వెళ్లిపోవడం చూస్తే దేశ భద్రతపై కొత్త ప్రశ్నలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ఆయన పర్యటనల వెనుక ఔచిత్యం ఏమిటో తెలియడం లేదన్నారు. ఇదిలా ఉండగా, రాహుల్ విదేశీ పర్యటనపై బీజేపీ నేతలు చేసిన విమర్శలను కాంగ్రెస్ పార్టీ తిప్పికొట్టింది. ప్రైవేట్ పర్యటనలను సైతం రాజకీయం చేయడం దారుణమని మండిపడింది. విదేశాలకు వెళ్లే హక్కు ఒక పౌరుడిగా రాహుల్ గాంధీకి ఉందని స్పష్టంచేసింది. గత ఏడాది డిసెంబర్‌లో మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మృతి చెందిన తర్వాత రాహుల్ గాంధీ వియత్నాంకు వెళ్లిపోయారు. అప్పట్లో రాహుల్ తీరుపై బీజేపీ నేతలు ఆరోపణలు చేశారు. మన దేశంలో సంతాప దినాలు పాటిస్తున్న సమయంలో రాహుల్ గాంధీ వియత్నాంలో నూతన సంవత్సరాల వేడుకల్లో మునిగి తేలుతున్నారని ధ్వజమెత్తారు.



విమానం రెక్కపై ప్రయాణికులు (ఫైల్)

ప్రాణం పోయినంత పనైంది

డెన్వర్ ఎయిర్‌పోర్ట్‌లో త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్న ప్రయాణికులు

డెన్వర్: ఏదైనా ఒక విమాన ప్రమాదం నుంచి కాస్తంతలో తప్పించుకోగానే అందులోని ప్రయాణికుల ప్రాణాలు లేచొస్తాయి. హమ్మయ్య అనుకుని ఊపిరి పీల్చుకున్న కొద్దిసేపటికే మళ్లీ అదే విమానం మరో రకమైన ప్రమాదంలో పడితే ఆ ప్రయాణికుల భయాందోళనలు వర్ణనాతీతం. శుక్రవారం అమెరికాలోని డెన్వర్ ఎయిర్‌పోర్ట్‌లో అత్యవసరంగా ల్యాండ్ అయ్యాక మంటలు చెలరేగిన విమానంలోని ప్రయాణికుల పరిస్థితి దాదాపు అలాగే ఉంది. స్వల్పగాయాలతో బయటపడిన ప్రయాణికులు ఎట్టకేలకు బతుకుజీవుడా అంటూ విమానం రెక్క పైనుంచి, అత్యవసర ఎస్కేప్ స్లైడ్ నుంచి బయటపడ్డారు. కొలరాడో స్ప్రింగ్స్ నుంచి టెక్సాస్‌లోని డల్లాస్ ఫోర్ట్‌వర్త్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్తున్న విమానం ఒక్కసారిగా కుదుపులకు లోనవడం, అత్యవసరంగా డెన్వర్ ఎయిర్‌పోర్ట్‌లో దిగడం తెల్సిందే. మంటల్లో చిక్కుకున్న విమానం నుంచి సురక్షితంగా బయటపడిన మైఖేల్ ఉడ్స్ అనే మహిళ ప్రమాద ఘటనను గుర్తుచేసుకున్నారు. ''కొలరాడో స్ప్రింగ్స్ నుంచి బయల్దేరినప్పుడు అంతా బాగానే ఉంది. కానీ మార్గమధ్యంలో విమాన ఇంజన్లలో ఒకదాని నుంచి ఒక్కసారిగా భారీ శబ్దం వినిపించింది. దాని తర్వాత విమానం అటూ ఇటూ ఊగడం మొదలైంది. మా పని అయిపోయిందనుకున్నాం. కానీ విమానాన్ని వెంటనే డెన్వర్‌కు తీసుకొచ్చి సురక్షితంగా ల్యాండ్ చేయడంతో హమ్మయ్య అనుకున్నా. హాయిగా ఊపిరిపీల్చుకునేలోపే విమానం క్యాబిన్‌లో దట్టమైన పొగకమ్ముకోవడం మొదలైంది. తర్వాత మంటలు వ్యాపించాయి''అని ఆమె చెప్పారు. ''విమానం ఆగగానే కదిలే మెట్లను తీసుకురాలేదు. ఆలోపు బయటకు వెళ్లేందుకు మార్గంలేక చివరకు విమానం రెక్క మీదకు వచ్చేశాం. రెక్క నుంచి ఎలా దిగాలో, ఎలా బయటపడాలో ఎవరికీ అర్థంకాలేదు. అందుకే అందరం అలా నిల్చుని హాహాకారాలు చేశాం. ఈలోపు సాయం చేయడానికి ఎయిర్‌పోర్ట్ సిబ్బంది ఎవరూ ముందుకురాలేదు. ఈలోపు నా భర్త, కుమార్తె ఏమయ్యారో తెలియలేదు. భయంతో వణికిపోయా. కుదురుగా ఒక్కచోట రెక్కపై నిలబడలేకపోయా''అని ఇన్‌గ్రిడ్ హిబిట్ అనే మహిళ తెలిపింది. ''అంతా సర్దుకుంటుందిలే అని మనసులో చెప్పుకున్నాగానీ మాకేమైపోతుందోనన్న భయం మరింత పెరిగింది. ఒక పది నిమిషాల తర్వాత ఎయిర్‌పోర్ట్ సిబ్బంది వచ్చి సహాయకచర్యలు హుటాహుటిన మొదలెట్టారు. కానీ ఆ ఒక్క పది నిమిషాలే పది యుగాలుగా గడిచాయి. స్వల్ప గాయాలు మినహా అందరూ క్షేమంతా బయటపడటం నిజంగా అద్భుతంలా అనిపించింది''అని ఆమె అన్నారు. ''కుదుపులకు లోనైన కొద్దిసేపటి తర్వాత విమానం ల్యాండ్ అయిందికాబట్టి సరిపోయింది. ఒకవేళ ల్యాండ్ చేయకుంటే అలాగే వెళ్లిఉంటే మార్గమధ్యంలో ఆకాశంలో మంటలు చెలరేగి మేమంతా ఏమయ్యేవాళ్లమో''అని ఆమె భయందోళనలు వ్యక్తంచేశారు.

18న కేంద్ర ఎన్నికల సంఘం కీలక సమావేశం

ఆధార్ కార్డుతో ఓటర్ ఐడీ కార్డుల అనుసంధానంపై చర్చ !

సాక్షి, న్యూఢిల్లీ: వేర్వేరు రాష్ట్రాల్లో వేర్వేరు ఓటర్లకు ఒకే సిరీస్‌తో ఓటర్ ఐడీ కార్డులు జారీ అయిన అంశంపై విపక్షాలు విమర్శిస్తున్న వేళ కేంద్ర హోం శాఖ కార్యదర్శి, యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) సీఈఓలతో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ భేటీకానున్నట్లు తెలుస్తోంది. వేర్వేరు రాష్ట్రాల్లో కొందరు ఓటర్లకు ఒకే సిరీస్ ఓటర్‌ఐడీ కార్డులు జారీఅవడం వెనుక బీజేపీకి లబ్ధిచేకూర్చే కుట్ర దాగుందని ఇటీవల తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఆరోపించడం తెల్సిందే. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం మార్చి 18వ తేదీన ఈ కీలక సమావేశం నిర్వహించనుందని తెలుస్తోంది. ఆధార్ కార్డులతో ఓటర్ ఐడీ కార్డుల సీడింగ్ అంశంపై ప్రధానంగా ఈ భేటీలో చర్చించే వీలుంది. కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్, కేంద్ర న్యాయశాఖ పరిధిలోని శాసన శాఖ కార్యదర్శి డా.రాజీవ్ మణి, యూఐడీఏఐ సీఈఓ భువనేశ్ కుమార్‌లు ఈ భేటీలో పాల్గొంటారని సంబంధిత విశ్వసనీయ వర్గాలు శనివారం తెలిపాయి. ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్‌ఓ), జిల్లా ఎన్నికల అధికారులు (డీఈఓ), చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ల (సీఈఓ) స్థాయిలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ఏప్రిల్ 30లోపు సూచనలు ఇవ్వాలని అన్ని జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీలను కేంద్ర ఎన్నికల సంఘం ఆహ్వానించిన విషయం తెలిసిందే.

గ్రామస్తుల దాడిలో ఏఎస్‌ఐ మృతి

ముంగెర్: బిహార్‌లోని ముంగెర్ జిల్లాలో కేసు దర్యాప్తు కోసం వెళ్లిన అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్(ఏఎస్‌ఐ) గ్రామస్తుల దాడిలో ప్రాణాలు కోల్పోయారు.ఘర్షణపై విచారణ కోసం ముఫస్సిల్ పోలీస్ స్టేషన్ ఏఎస్సై సంతోష్ కుమార్ సిబ్బందితో కలిసి శుక్రవారం రాత్రి 8.30 గంటల సమయంలో నందలాల్ పూర్ గ్రామానికి వెళ్లారు. ఓ వ్యక్తి ఏఎస్‌ఐ తలపై పదునైన ఆయుధంతో మోదగా తీవ్రంగా గాయపడ్డారు. శనివారం వేకువ జామున ఆస్పత్రిలో ఆయన కన్నుమూశారు. ఘటనకు సంబంధించి 8 మందిపై కేసు నమోదు చేసి, ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు డీజీపీ వినయ్ కుమార్ చెప్పారు. బుధవారం రాత్రి లఖీంపూర్ ఖేరి ఏరియాలోని అరారియాలో జరిగిన ఇలాంటి ఘటనలో రాజీవ్ రంజన్ మరో ఏఎస్‌ఐ ప్రాణాలు కోల్పోయారని చెప్పారు.

దేశంలో ప్రజాస్వామ్యం ముట్టడిలో ఉంది

టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ వ్యాఖ్య

కోల్‌కతా: దేశంలో ప్రజాస్వామ్యం ముట్టడిలో ఉందని తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ వ్యాఖ్యానించారు. 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈసీ స్వతంత్రత కోల్పోయిందన్నారు. పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల సంఘం(ఈసీ)చర్యలపై అనుమానం వ్యక్తం చేసిన ఆయన.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈసీని అడ్డుపెట్టుకుని ఓటరు జాబితాలో నకిలీ పేర్లను చేరుస్తోందని ఆరోపించారు. శనివారం ఆయన పార్టీ శ్రేణులతో జరిగిన వర్చువల్ సమావేశంలో మాట్లాడారు.

డ్యాన్స్ చేస్తావా? సస్పెండ్ చేయించమంటావా?

హోలీ వేడుకలో పోలీసుకు తేజ్ ప్రతాప్ హెచ్చరిక

పట్నా: హోలీ వేడుకల సమయంలో డ్యాన్స్ చేస్తావా లేక సస్పెండ్ చేయించమంటావా అంటూ ఒక పోలీసును ఆర్‌జేడీ నేత, మాజీ మంత్రి తేజ్‌ప్రతాప్ యాదవ్ బెదిరించడం వివాదం రేపుతోంది. మాజీ సీఎంలు లాలు ప్రసాద్, రబ్రీదేవిల పెద్ద కుమారుడు ఎమ్మెల్యే తేజ్ ప్రతాప్ యాదవ్ అధికార నివాసం వద్ద శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. తండ్రి లాలు మాదిరిగానే హోలీ వేడుక సమయంలో పండగ శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన మద్దతు దారుల చొక్కాలను తేజ్ ప్రతాప్ చించివేశారు. అనంతరం స్కూటర్‌పై 'పిల్లిమొగ్గల చిన్నాన్నకు హోలీ శుభాకాంక్షలు'అని పరోక్షంగా సీఎం నితీశ్‌కుమార్‌నుద్దేశించి తన నివాసం చుట్టుపక్కల వీధుల్లో కేకలు వేస్తూ తిరిగారు. అదేవిధంగా, తాత్కాలికంగా ఏర్పాటుచేసిన వేదికపై సోఫాలో కూర్చుని .. 'ఏయ్ పోలీస్.. దీపక్..ఇప్పుడు మేమొక పాట వేస్తాం. డ్యాన్స్ చేయాలి. లేదంటే నువ్వు సస్పెండ్ అవుతావ్. ఏమనుకోకు, ఇది హోలీ పండగ'అని అక్కడే ఉన్న దీపక్ అనే కానిస్టేబుల్‌నుద్దేశించి అంటున్న వీడియో వైరల్‌గా మారింది. దీంతో, ఆ కానిస్టేబుల్ అక్కడి వారితో కలిసి కొద్దిసేపు డ్యాన్స్ చేశారు. దీనిపై బీజేపీ మండిపడింది. 'తండ్రి మాదిరిగానే కుమారుడు కూడా. అప్పట్లో సీఎంగా లాలు చట్టాన్ని డ్యాన్స్ చేయించాడు. బిహార్‌ను జంగిల్ రాజ్‌గా మార్చాడు. ఇప్పుడు కుమారుడు అధికారంలో లేకున్నా, చట్టాన్ని, రక్షకులను డ్యాన్స్ చేయించేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఇటువంటి వారికి అధికారం ఇవ్వరాదు'అని పేర్కొంది.

వందలాది డ్రోన్లతో రష్యా, ఉక్రెయిన్ దాడులు

కీవ్: రష్యా, ఉక్రెయిన్‌లు శుక్రవారం అర్ధరాత్రి నుంచి మరో దఫా భారీ సంఖ్యలో డ్రోన్లతో పరస్పరం దాడులకు పాల్పడ్డాయి. 30 రోజుల కాల్పుల విరమణ ప్రతిపాదనపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దూత స్టీవ్ విట్కాఫ్‌తో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ చర్చలు ముగిసి 24 గంటలైనా కాకముందే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. రష్యా తమపైకి వివిధ రకాలైన 178 డ్రోన్లతోపాటు రెండు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించగా వాటిలో 130 వరకు డ్రోన్లను కూల్చివేసినట్లు ఉక్రెయిన్ ఆర్మీ ప్రకటించింది. మరో 38 డ్రోన్లు గురి తప్పి ఎక్కడో పడిపోయాయంది. రష్యా దాడులతో ఒడెసా, డ్నిప్రోపెట్రోవ్‌స్క్ ప్రాంతాల్లో ఇంధన మౌలిక వసరులు తీవ్రంగా దెబ్బతిన్నట్లు డీటీఈకే అనే ప్రైవేట్ సంస్థ తెలిపింది. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని, పునరుద్ధరణ పనిలో నిమగ్నమై ఉన్నట్లు వివరించింది. మరో వైపు, ఉక్రెయిన్ తమపైకి ప్రయోగించిన 126 డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా ఆర్మీ తెలిపింది. వీటిలో అత్యధికంగా 64 డ్రోన్లను వోల్గోగ్రాడ్ ప్రాంతంలోనే ధ్వంసం చేశామంది. ఇంకా, వొరొనెజ్, బెల్గొరోడ్, బ్రియాన్స్క్, రొస్టోవ్, కస్క్ ప్రాంతాలపైనా ఉక్రెయిన్ డ్రోన్లతో దాడికి పాల్పడిందని రష్యా ఆర్మీ వివరించింది. వీటి శకలాలు పడి క్రాస్నో ఆర్మెస్కీ జిల్లాలోని ల్యూక్ ఆయిల్ రిఫైనరీలో మంటలు చెలరేగాయని వోల్గోగ్రాడ్ గవర్నర్ ఆంద్రీ చెప్పారు. డ్రోన్ దాడుల నేపథ్యంలో తాత్కాలికంగా విమానాల రాకపోకలను నిలిపివేశారని, ఎటువంటి నష్టం జరిగినట్లు వివరాలు లేవని మీడియా పేర్కొంది.

ఏప్రిల్‌లో ప్రధాని మోదీ శ్రీలంక పర్యటన

కొలంబో: భారత ప్రధాని నరేంద్ర మోదీ ఏప్రిల్ మొదటి వారంలో శ్రీలంకలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఇరు దేశాలు పలు ఒప్పందాలను కుదుర్చుకోనున్నాయి. శ్రీలంక విదేశాంగ మంత్రి విజితా హెరాత్ శనివారం పార్లమెంట్‌లో ఈ విషయం తెలిపారు. 'పొరుగు దేశం భారత్‌తో సన్నిహిత సంబంధాలను కొనసాగిస్తాం. మా మొట్టమొదటి దౌత్య పర్యటన భారత్‌లోనే జరిగింది. ఈ సందర్భంగా ద్వైపాక్షిక సహకారానికి సంబంధించిన పలు ఒప్పందాలు కుదుర్చుకున్నాం'అని ఆమె తెలిపారు. వచ్చే నెలలో పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ ట్రింకోమలీ జిల్లాలోని సంపూర్‌లో ఏర్పాటైన 135 మెగావాట్ల సోలార్ విద్యుత్ కేంద్రాన్ని ప్రారంభిస్తారని మంత్రి విజిత వెల్లడించారు. గతేడాది శ్రీలంక అధ్యక్షుడు అనురా దిస నాయకే భారత్ వచ్చారు. కాగా, 2015 తర్వాత ప్రధాని మోదీ శ్రీలంకలో ఇప్పటి వరకు మూడు పర్యాయాలు పర్యటించారు.

'పద్మ' అవార్డులకు నామినేషన్లు షురూ

న్యూఢిల్లీ: అసాధారణ విజయాలు, సేవలకు గాను విశిష్ట వ్యక్తులకు అందించే పద్మ అవార్డులు–2026కు నామినేషన్లు, ప్రతిపాదనల స్వీకరణ శనివారం మొదలైంది. 2026 గణతంత్ర వేడుకల్లో ప్రకటించే ఈ అవార్డుల కోసం ప్రతిపాదనలను పంపే తుది గడువు 2025 జూలై 31వ తేదీ అని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. నామినేషన్లు, ప్రతిపాదనలను https://awards.gov.in అనే పోర్టల్ ద్వారా మాత్రమే స్వీకరిస్తామని వెల్లడించింది. దేశ అత్యున్నత పౌర పురస్కారాల్లో పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ ఉన్నాయి. ఈ అవార్డులను 1954 నుంచి ఏటా గణతంత్ర దినోత్సవం సమయాన అందజేస్తున్నారు. ఎటువంటి లింగ బేధం లేకుండా అన్ని వృత్తులు, కులాలు, మతాల వారు అవార్డులకు అర్హులని ప్రభుత్వం తెలిపింది. ఇందుకు సంబంధించిన నిబంధనలను https:// padmaawards.gov.in/AboutAwards.aspxలో చూడొచ్చని వివరించింది.

కెనడా కొత్త కేబినెట్‌లో ఇద్దరు భారతీయులు

ఒట్టావా: కెనడా నూతన ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన మార్క్ కార్నీ భారత సంతతికి చెందిన ఇద్దరు మహిళలను తన మంత్రివర్గంలోకి తీసుకున్నారు. అనిత ఆనంద్, ఢిల్లీలో జన్మించిన కమల్ ఖేరాలు ఇకపై కెనడా మంత్రులుగా కొనసాగారు. కెనడా పార్లమెంట్‌కు ఎన్నికైన అతి పిన్న వయసుకలైన మహిళల్లో కమల్ ఖేరా సైతం ఉన్నారు. 58 ఏళ్ల అనితా ఆనంద్‌కు ఆవిష్కరణలు, శాస్త్ర, వాణిజ్య శాఖలకు మంత్రిగా బాధ్యతలు కట్టబెట్టారు. 36 ఏళ్ల కమల్ ఖేరాను ఆరోగ్య మంత్రిగా బాధ్యతలు అప్పగించారు. ఢిల్లీలో పాఠశాల విద్యనభ్యసిస్తున్న కాలంలో కమల్ కుటుంబం కెనడాకు తరలిపోయింది. టొరంటోలో యార్క్ వర్సిటీలో కమల్ సైన్స్ డిగ్రీ సాధించారు. నర్సుగా, కమ్యూనిటీ వలంటీర్‌గా, రాజకీయ కార్యకర్తగా మొదలెట్టి చివరకు మంత్రిస్థాయికి కమల్ ఎదిగారు. నోవా స్కాటియాలో పుట్టిన అనిత 1985లో ఒంటారియోకు వలసవచ్చారు. లాయర్, పరిశోధకురాలు, అధ్యాపకురాలు అయిన అనిత 2019లో తొలిసారిగా ఎంపీ అయ్యారు. గతంలో ట్రెజరీ బోర్డ్ అధ్యక్షురాలిగా, రక్షణ మంత్రిగా, ప్రజాసేవలు, సేకరణ మంత్రిగా సేవలందించారు.


రైతు నేత తికాయత్‌కు తప్పిన ప్రమాదం

ముజఫర్‌నగర్: రైతు నేత, భారతీయ కిసాన్ యూనియన్ జాతీయ ప్రతినిధి రాకేశ్ తికాయత్‌కు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. యూపీలోని ముజఫర్‌నగర్‌లో ఆయన ప్రయాణిస్తున్న కారును నీల్‌గాయి(మనుబోతు) ఢీకొట్టింది. దీంతో, వాహనం ముందుభాగం దెబ్బతిందని అధికారులు తెలిపారు. మీర్‌పూర్ బైపాస్ రోడ్డులో వెళ్తుండగా నీల్‌గాయి అకస్మాత్తుగా రోడ్డుపైకి వేగంగా వచ్చి, కారును ఢీకొందని తికాయత్ తెలిపారు. సీటు బెల్టు ధరించి ఉండటంతో తనకు ప్రమాదం తప్పిందన్నారు. తన గన్‌మన్‌కు స్వల్ప గాయాలైనట్లు చెప్పారు.

నిర్మాణంలోని రోడ్డు కూలి ఐదుగురు మృతి

బ్యాంకాక్: థాయ్‌ల్యాండ్ రాజధాని బ్యాంకాక్‌లో నిర్మాణంలో ఉన్న ఎలివేటెడ్ రహదారి కుప్పకూలిన ఘటనలో ఐదుగురు మృత్యువాత పడ్డారు. మరో 24 మంది గాయపడ్డారు. మృతుల్లో నలుగురు కార్మికులు కాగా, ఒకరు ఇంజనీర్ అని మంత్రి సురియా తెలిపారు. ఘటన సమయంలో నిర్మాణ ప్రాంతంలో రాకపోకలను నిలిపివేయడంతో వాహనదారులెవరికీ అపాయం వాటిల్లలేదన్నారు. బాధితులకు కాంట్రాక్టర్లు, సంబంధిత విభాగాలు తగు పరిహారం అందజేస్తాయని తెలిపారు. ప్రమాదానికి కారణాలపై దర్యాప్తు జరుపుతున్నారని మంత్రి వివరించారు. కాంక్రీట్, ఐరన్ శిథిలాలను తొలగించడానికి కనీసం వారం పట్టొచ్చని తెలిపారు.

భారత రాజ్యాంగ రచనకు పట్టిన కాలం?



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

భారత రాజ్యాంగం - పీఠిక, విశిష్ట లక్షణాలు

1. భారత రాజ్యాంగాన్ని ప్రధానంగా ఏ ఉద్దేశంతో ఏర్పాటు చేశారు?
   ఎ) ప్రజల మధ్య సత్సంబంధాలను నెలకొల్పడానికి
   బి) నేరస్థులను శిక్షించడానికి
   సి) దేశాన్ని పరిపాలించడానికి
   డి) విదేశాలతో వ్యాపార, వాణిజ్య సంబంధాలను పెంపొందించడానికి
2. భారతదేశ రాజ్యాంగ రచన చేసింది?
   ఎ) రాజ్యాంగ పరిషత్ అధ్యక్షుడు
   బి) రాజ్యాంగ ముసాయిదా కమిటీ
   సి) సలహా కమిటీ
   డి) రాజ్యాంగ పరిషత్ సచివాలయం
3. కింది వారిలో భారత రాజ్యాంగ పరిషత్‌లో సభ్యులు ఎవరు?
   ఎ) బ్రిటిష్ పాలిత రాష్ట్రాల శాసనసభలతో ఎన్నికైనవారు, స్వదేశీ సంస్థానాల నుంచి నియమించినవారు
   బి) రాజకీయ పార్టీలు నియమించినవారు
   సి) ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నుకున్నవారు
   డి) బ్రిటిష్ ప్రభుత్వం నియమించినవారు
4. జవహర్‌లాల్ నెహ్రూ ప్రవేశపెట్టిన లక్ష్యాలు, ఆశయాల తీర్మానాన్ని రాజ్యాంగ పరిషత్ ఏకగ్రీవంగా ఆమోదించిన రోజు?
   ఎ) 1946 డిసెంబర్ 17
   బి) 1946 డిసెంబర్ 11
   సి) 1947 డిసెంబర్ 22
   డి) 1947 జనవరి 22
5. లౌకికవాదం అంటే..?
   ఎ) తన మతాన్నే గౌరవించాలనుకోవడం
   బి) అన్ని మతాలను గౌరవించడం
   సి) ఇతర మతాలను వ్యతిరేకించడం
   డి) రాజకీయాల్లో మత ప్రసక్తి
6. భారత్ 'గణతంత్ర రాజ్యం'గా ఏ తేదీన అవతరించింది?
   ఎ) 1950 జనవరి 26
   బి) 1949 నవంబర్ 26
   సి) 1947 ఆగస్టు 15
   డి) 1949 డిసెంబర్ 11
7. సామ్యవాదం అంటే ఏమిటి?
   ఎ) సంపదను సమానంగా పంపిణీ చేయడం
   బి) ఆర్థిక వ్యవహారాల్లో రాజ్యం ప్రధానపాత్ర పోషించడం
   సి) పరిశ్రమలన్నింటినీ రాజ్యం ఆధ్వర్యంలో నిర్వహించడం
   డి) పైవన్నీ
8. భారతదేశ రాజ్యాంగంలో 'సామ్యవాదం' అనే పదాన్ని ఏ సవరణ ద్వారా చేర్చారు?
   ఎ) 42వ రాజ్యాంగ సవరణ-1976
   బి) 44వ రాజ్యాంగ సవరణ-1976
   సి) 45వ రాజ్యాంగ సవరణ-1976
   డి) 48వ రాజ్యాంగ సవరణ-1976
9. భారత రాజ్యాంగ చట్టంలో ప్రారంభంలో (ఒరిజినల్) ఎన్ని అధికరణలున్నాయి?
   ఎ) 495 బి) 395
   సి) 295 డి) 396
10. భారతదేశం ఏ రాజ్య వ్యవస్థను అనుసరిస్తోంది?
   ఎ) ఏకకేంద్ర రాజ్య వ్యవస్థ
   బి) సమాఖ్య రాజ్య వ్యవస్థ
   సి) పాక్షిక సమాఖ్య రాజ్య వ్యవస్థ
   డి) బహుళ రాజ్య వ్యవస్థ
11. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో వాస్తవ అధికారాన్ని ఎవరు చెలాయిస్తారు?
   1. ప్రజలు 2. రాష్ట్రపతి
   3. కేబినెట్ 4. ప్రధానమంత్రి
   ఎ) 1, 2 బి) 2, 3
   సి) 1, 4 డి) 3, 4
12. ప్రాథమిక విధులను ఏ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా పొందుపరిచారు?
   ఎ) 46వ రాజ్యాంగ సవరణ చట్టం
   బి) 45వ రాజ్యాంగ సవరణ చట్టం
   సి) 44వ రాజ్యాంగ సవరణ చట్టం
   డి) 42వ రాజ్యాంగ సవరణ చట్టం
13. భారతదేశ ప్రజాస్వామ్యం ఏ ప్రాథమిక సూత్రంపై ఆధారపడి పనిచేస్తుంది?
   ఎ) ఒక పౌరుడికి ఒక ఓటు
   బి) ఒక పౌరుడికి రెండు ఓట్లు
   సి) ఒక పౌరుడికి మూడు ఓట్లు
   డి) పైవన్నీ
14. భారత రాజ్యాంగంలో పొందుపరిచిన అత్యవసర అధికారాలను రాష్ట్రపతి ఎప్పుడు ఉపయోగిస్తారు?
   ఎ) సాధారణ పరిస్థితుల్లో
   బి) అసాధారణ పరిస్థితుల్లో
   సి) ఎప్పుడైనా డి) భవిష్యత్‌లో
15. ఏక పౌరసత్వం అంటే..?
   ఎ) ఒక వ్యక్తి దేశంలో ఎక్కడైనా పౌరుడిగా జీవించడం
   బి) ఒక వ్యక్తి తన నివాస ప్రాంతంలో పౌరుడిగా జీవించడం
   సి) ఒక వ్యక్తి తన సొంత రాష్ట్రంలోనే పౌరుడిగా జీవించడం
   డి) ఏదీకాదు
16. భారత రాజ్యాంగ పరిషత్తు తొలి సమావేశానికి అధ్యక్షత వహించింది ఎవరు?
   ఎ) బి. నర్సింగరావు
   బి) బి. రాజేంద్రప్రసాద్
   సి) సచ్చిదానంద సిన్హా
   డి) డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్
17. ప్రపంచంలో మొదటి రాజ్యాంగ పరిషత్తు ఏది?
   ఎ) వైమార్ రిపబ్లిక్
   బి) ఫిలడెల్ఫియా కన్వెన్షన్
   సి) నేషనల్ అసెంబ్లీ
   డి) భారత రాజ్యాంగ పరిషత్తు
18. రాజ్యాంగ పీఠికకు ఇప్పటివరకు ఎన్నిసార్లు సవరణ చేశారు?
   ఎ) 1 బి) 3
   సి) 2 డి) 4
19. 'కేబినెట్ మిషన్ ప్లాన్'ను ఎప్పుడు ప్రకటించారు?
   ఎ) 1948 జూన్ 16
   బి) 1946 జూలై 17
   సి) 1946 మే 16
   డి) 1946 ఏప్రిల్ 16
20. భారత రాజ్యాంగ పరిషత్ ఏర్పాటు చేసిన ముసాయిదా కమిటీలోని సభ్యుల సంఖ్య?
   ఎ) 5 బి) 6
   సి) 7 డి) 8
21. ప్రవేశికలో భారతదేశం గురించి ఏ విధంగా పేర్కొన్నారు?
   ఎ) సర్వసత్తాక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యం
   బి) సర్వసత్తాక, సామ్యవాద, గణతంత్ర రాజ్యం
   సి) సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యం
   డి) ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యం
22. భారత రాజ్యాంగం అత్యున్నత సార్వభౌమ అధికారాన్ని ఎవరికి కల్పించింది?
   ఎ) సుప్రీంకోర్టు బి) రాష్ట్రపతి
   సి) భారత ప్రజలు డి) ప్రధానమంత్రి
23. భారత సమాఖ్య వ్యవస్థ ఏ దేశ సమాఖ్య వ్యవస్థకు దగ్గరగా ఉంటుంది?
   ఎ) ఆస్ట్రేలియా బి) కెనడా
   సి) అమెరికా డి) నైజీరియా
24. ప్రవేశికను భారత రాజ్యాంగానికి ఆత్మ, హృదయం, ఒక ఆభరణంగా అభివర్ణించిన వారెవరు?
   ఎ) వల్లభాయ్ పటేల్
   బి) కృష్ణస్వామి
   సి) మహాత్మా గాంధీ
   డి) డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్
25. డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ రాజ్యాంగ పరిషత్‌కు శాశ్వత అధ్యక్షుడిగా ఎప్పుడు ఎన్నికయ్యారు?
   ఎ) 1945 డిసెంబర్ 11
   బి) 1946 డిసెంబర్ 11
   సి) 1946 డిసెంబర్ 13
   డి) 1946 డిసెంబర్ 14
26. భారత రాజ్యాంగ పరిషత్ చిహ్నంగా దేన్ని పేర్కొంటారు?
   ఎ) హంస బి) నెమలి
   సి) ఐరావతం డి) పావురం
27. భారత రాజ్యాంగ పరిషత్‌కు ఏ సంవత్సరంలో ఎన్నికలు నిర్వహించారు?
   ఎ) 1946 బి) 1948
   సి) 1947 డి) 1949
28. భారత రాజ్యాంగ పరిషత్‌కు ఎన్నికలు నిర్వహించినప్పుడు మొత్తం సభ్యుల సంఖ్య ఎంత?
   ఎ) 189 బి) 389
   సి) 489 డి) 289
29. ముసాయిదా కమిటీ సమర్పించిన రాజ్యాంగాన్ని భారత రాజ్యాంగ పరిషత్ ఎప్పుడు ఆమోదించింది?
   ఎ) 1949 జనవరి 26
   బి) 1949 నవంబర్ 26
   సి) 1950 జనవరి 26
   డి) 1950 నవంబర్ 26
30. భారత రాజ్యాంగంలోని మొదటి అధికరణం మనదేశాన్ని ఏ విధంగా వర్ణిస్తుంది?
   ఎ) యూనియన్ ఆఫ్ స్టేట్స్
   బి) యూనిటరీ
   సి) ఫెడరేషన్
   డి) కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్
31. భారత రాజ్యాంగ నిర్మాణ సభ 'ముసాయిదా కమిటీ'కి చైర్మన్‌గా ఎవరిని నియమించింది?
   ఎ) పట్టాభి సీతారామయ్య
   బి) బాబూ రాజేంద్రప్రసాద్
   సి) రాజగోపాలాచారి
   డి) డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్
32. 'భారత రాజ్యాంగం న్యాయవాదుల స్వర్గం' అని పేర్కొన్నవారు?
   ఎ) ఐవర్‌జెన్నింగ్ బి) కె.సి. వేర్
   సి) ఎ. కృష్ణస్వామి
   డి) ఎర్నెస్ట్ బార్కర్
33. లార్డ్ అట్లీ భారతీయులకు ఎప్పటిలోగా అధికారాలను బదిలీ చేస్తామని ప్రకటన చేశాడు?
   ఎ) 1947 ఆగస్టు 15
   బి) 1948 జూన్ 15
   సి) 1947 ఫిబ్రవరి 20
   డి) 1949 జూన్ 20
34. ప్రాథమిక విధులను ఏ దేశ రాజ్యాంగం నుంచి గ్రహించారు?
   ఎ) చైనా బి) రష్యా
   సి) ఫ్రాన్స్ డి) అమెరికా
35. ప్రస్తుతం ప్రాథమిక విధుల సంఖ్య ఎంత?
   ఎ) 11 బి) 9 సి) 10 డి) 15
36. భారత రాజ్యాంగ రచనకు పట్టిన కాలం?
   ఎ) 2 సంవత్సరాల 11 నెలల 18 రోజులు
   బి) 2 సంవత్సరాల 8 నెలల 18 రోజులు
   సి) 2 సంవత్సరాల 9 నెలల 18 రోజులు
   డి) 2 సంవత్సరాల 7 నెలల 18 రోజులు
37. సమానత్వ హక్కు ప్రధాన ఆశయం ఏ సమానత్వాన్ని స్థాపించడం?
   ఎ) సాంఘిక సమానత్వం
   బి) రాజకీయ సమానత్వం
   సి) నైతిక సమానత్వం డి) పైవేవీ కావు
38. వ్యక్తి స్వాతంత్ర్య హక్కులో ఎన్ని రకాల స్వాతంత్ర్యాలకు రక్షణ కల్పించారు?
   ఎ) 5 బి) 6 సి) 8 డి) 7
39. ఒక వ్యక్తిని పి.డి.చట్టం (ప్రివెంటివ్ డిటెన్షన్) కింద అరెస్ట్ చేసినప్పుడు అతడిని ఎంతకాలం పాటు జైలులో నిర్బంధించవచ్చు?
   ఎ) 3 నెలలు బి) 12 నెలలు
   సి) 18 నెలలు డి) 6 నెలలు
40. అరెస్ట్ చేసిన వ్యక్తిని పోలీసులు ఎన్ని గంటల్లోపు సమీప న్యాయమూర్తి ముందు హాజరు పరచాలి?
   ఎ) 36 బి) 24 సి) 12 డి) 48
41. 'ట్రాఫిక్ ఇన్ హ్యూమన్ బీయింగ్' అంటే అర్థం ఏమిటి?
   ఎ) మనుషులను అక్రమంగా తరలించడం (సరకుల మాదిరిగా అమ్మడం, కొనడం)
   బి) సరకులు అమ్మకం
   సి) సరకులు కొనడం డి) పైవేవీ కావు
42. న్యాయస్థానం ఆదేశాల మేరకు పోలీసులు నిర్బంధంలోకి తీసుకున్న వ్యక్తిని న్యాయస్థానం ముందు హాజరు పరచాలని తెలియజేసే రిట్ ఏది?
   ఎ) హెబియస్ కార్పస్ బి) మాండమస్
   సి) ప్రొహిబిషన్ డి) కోవారెంటో
43. భారతదేశంలో రిట్లను జారీ చేసే న్యాయస్థానాలు ఏవి?
   ఎ) దిగువ కోర్టులు
   బి) సబార్డినేట్ కోర్టులు
   సి) జిల్లా కోర్టులు
   డి) ఉన్నత న్యాయస్థానాలు
44. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు దేశంలో అక్షరాస్యత శాతం ఎంత?
   ఎ) 12 బి) 16 సి) 14 డి) 18
45. జాతీయ విద్యా విధానాన్ని ఏ సంవత్సరంలో ప్రారంభించారు?
   ఎ) 1984 బి) 1988
   సి) 1989 డి) 1986
46. సమాఖ్య వ్యవస్థలో ఏ రకమైన రాజ్యాంగం అమల్లో ఉంటుంది?
   ఎ) లిఖిత రాజ్యాంగం
   బి) పరిమాణాత్మక రాజ్యాంగం
   సి) అలిఖిత రాజ్యాంగం
   డి) దృఢ రాజ్యాంగం
47. రాజ్యాంగ సవరణ ప్రతిపాదనలను మొదటగా ఏ ప్రభుత్వం చేస్తుంది?
   ఎ) కేంద్ర బి) రాష్ట్ర
   సి) కేంద్రపాలిత ప్రాంతాలు
   డి) స్థానిక ప్రభుత్వాలు
48. భారత రాజ్యాంగంలో ప్రభుత్వ అధికారాలను ఎన్ని జాబితాలుగా వర్గీకరించారు?
   ఎ) 3 బి) 2 సి) 1 డి) 4

సమాధానాలు

1) సి; 2) బి; 3) ఎ; 4) డి; 5) బి; 6) ఎ; 7) ఎ; 8) ఎ; 9) బి; 10) బి; 11) డి; 12) డి; 13) ఎ; 14) బి; 15) ఎ; 16) సి; 17) బి; 18) ఎ; 19) సి; 20) సి; 21) సి; 22) సి; 23) బి; 24) డి; 25) బి; 26) సి; 27) ఎ; 28) బి; 29) బి; 30) ఎ; 31) డి; 32) ఎ; 33) బి; 34) బి; 35) ఎ; 36) ఎ; 37) ఎ; 38) బి; 39) ఎ; 40) బి; 41) ఎ; 42) ఎ; 43) డి; 44) సి; 45) డి; 46) ఎ; 47) ఎ; 48) ఎ.

కుడి, ఎడమలు తెలుసుకుంటే సమాధానం సులువే!



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

మెంటల్ ఎబిలిటీ

Alphabet Test Model Questions

1. Alphabetలోని ఎడమ నుంచి 17వ అక్షరం ఏది?
   ఎ) P బి) Q సి) R డి) S
2. Alphabetలోని కుడి నుంచి 12వ అక్షరం ఏది?
   ఎ) O బి) L సి) M డి) N

Sol: Shortcut:
కుడి నుంచి 12వ అక్షరం అడిగినప్పుడు ఎడమ నుంచి 12వ అక్షరం తెలుసుకోవాలి. ఎడమ నుంచి 12వ అక్షరం L. Lకి జత అక్షరం 'O'
∴ కుడి నుంచి 12వ అక్షరం 'O'.

3. Alphabetలో ఎడమ నుంచి 30వ అక్షరం ఏది?
   ఎ) X బి) Y సి) D డి) చెప్పలేం

Sol: Alphabetలో మొత్తం అక్షరాలు 26
ఎడమ నుంచి 30వ అక్షరం = 30–26=4
∴ ఎడమ నుంచి 4వ అక్షరం D

4. Alphabetలో ఎడమ నుంచి 52వ అక్షరం ఏది?
   ఎ) A బి) Z సి) Y డి) B
5. Alphabetలో ఎడమ నుంచి G, Tల మధ్య అక్షరం ఏది?
   ఎ) M బి) N సి) O
   డి) అలాంటి అక్షరం ఉండదు

Sol: G, Tల మధ్య 12 అక్షరాలు ఉంటాయి. రెండు అక్షరాల మధ్యలో సరిసంఖ్య అక్షరాలు ఉంటే ఆ రెండింటి మధ్య అక్షరం ఉండదు. బేసి సంఖ్య అక్షరాలు ఉంటేనే వాటి మధ్య అక్షరం ఉంటుంది. కాబట్టి G,T మధ్య అక్షరం ఉండదు.

short cut:
ఎడమ నుంచి G = 7, T = 20. ఒకటి బేసి సంఖ్య అక్షరం, మరొకటి సరిసంఖ్య అక్షరం ఉన్నప్పుడు ఆ రెండు సంఖ్యల మధ్య అక్షరం ఉండదు. ఆ రెండూ బేసిసంఖ్య అక్షరాలు లేదా సరిసంఖ్య అక్షరాలు అయినప్పుడు మాత్రమే ఆ రెండింటి మధ్య అక్షరం ఉంటుంది.

6. Alphabetలో ఎడమ నుంచి G, Sల మధ్య అక్షరం ఏది?
   ఎ) N బి) M
   సి) O డి) చెప్పలేం

Sol: $\frac{G(7)+S(19)}{2} = \frac{7+19}{2}$
$= \frac{26}{2} = 13$
కాబట్టి ఎడమ నుంచి 13వ అక్షరం M
G, Sల మధ్య అక్షరం = M

7. Alphabetలో ఎడమ నుంచి L, Vల మధ్య అక్షరం ఏది?
   ఎ) O బి) P సి) Q డి) చెప్పలేం
8. Alphabetలో ఎడమ నుంచి 9వ అక్షరానికి కుడివైపు ఉండే 6వ అక్షరం ఏది?
   ఎ) I బి) F సి) O డి) N

Sol: ఎడమ (9) + కుడి (6) = 15
∴ ఎడమ నుంచి 15వ అక్షరం = O

Important Note:
1. ఎడమ + కుడి = ఎడమవైపు
2. ఎడమ – ఎడమ = ఎడమవైపు
3. కుడి – కుడి = కుడివైపు

9. Alphabetలో ఎడమ నుంచి 20వ అక్షరానికి, ఎడమవైపు ఉండే 6వ అక్షరం ఏది?
   ఎ) T బి) F సి) N డి) Z

Sol: ఎడమ (20) – ఎడమ (6) = ఎడమ 14
∴ ఎడమ నుంచి 14వ అక్షరం N

10. Alphabet లో కుడి నుంచి 8వ అక్షరానికి, ఎడమవైపు ఉన్న 7వ అక్షరం ఏది?
   ఎ) L బి) M సి) O డి) N

Sol: కుడి (8) + ఎడమ 7 = కుడి 15
∴ కుడి నుంచి 15వ అక్షరం L

Short cut:
కుడి నుంచి 15వ అక్షరం, ఎడమ నుంచి 12వ అక్షరానికి సమానం.
కుడి నుంచి (15) L
= ఎడమ నుంచి (12) L

11. Alphabetలో కుడి నుంచి 18వ అక్షరానికి, కుడివైపు ఉన్న 7వ అక్షరం ఏది?
   ఎ) R బి) G సి) Q డి) P

Sol: కుడి (18) – కుడి (7) = కుడి (11)
కుడి నుంచి 11వ అక్షరం = P

Short cut:
కుడి నుంచి 11వ అక్షరం = ఎడమ నుంచి 16వ అక్షరం
కాబట్టి కుడి నుంచి 11వ అక్షరం = P

12. Alphabetను రివర్సులో రాస్తే కుడి నుంచి 9వ అక్షరానికి ఎడమవైపు ఉన్న 6వ అక్షరం ఏది?
   ఎ) O బి) P సి) I డి) F

Sol: Alphabet Reverse order లో రాస్తే
Z Y X W V U T S R Q P O N
M L K J I H G F E D C B A
కుడి (9) + ఎడమ (6) = కుడి(15)
∴ కుడి నుంచి 15వ అక్షరం O.

13. Alphabetను రివర్సులో రాస్తే ఎడమ నుంచి 15వ అక్షరానికి, కుడివైపు ఉన్న 10 వ అక్షరం ఏది?
   ఎ) Y బి) J సి) B డి) O

Sol: Alphabet Reverse order లో రాస్తే
Z Y X W V U T S R Q P O N
M L K J I H G F E D C B A
ఎడమ 15 + కుడి 10 = ఎడమ 25
∴ఎడమ నుంచి 25వ అక్షరం = B

14. Alphabetలోని మొదటి సగాన్ని రివర్సులో రాస్తే కుడి నుంచి 16వ అక్షరానికి ఎడమవైపు ఉన్న 9వ అక్షరం ఏది?
   ఎ) L బి) P సి) G డి) W

Alphabetలోని మొదటి సగాన్ని రివర్సులో రాస్తే..
M L K J I H G F E D C B A
N O P Q R S T U V W X Y Z

Sol: కుడి 16 + ఎడమ 9 = కుడి 25
∴ కుడి నుంచి 25వ అక్షరం = L

Short cut:
మొదటి సగం మాత్రమే రివర్స్ ఆర్డర్, రెండో సగం ఆల్ఫాబెట్ ఆర్డర్ కాబట్టి రెండో సగం 13 అక్షరాలు (26–13) మిగిలిన మొదటి సగం రివర్స్ చేస్తే
M – A. అప్పుడు కుడి నుంచి 12వ అక్షరం L అవుతుంది.

15. Alphabet orderలో ప్రతి రెండో అక్షరాన్ని తీసివేస్తే ఎడమ నుంచి 7వ అక్షరానికి కుడివైపు ఉన్న 4వ అక్షరం ఏది?
   ఎ) V బి) X సి) U డి) B

ప్రతి రెండో అక్షరాన్ని తొలగిస్తే వచ్చే ఆర్డర్
A C E G I K M O Q S U W Y
ఎడమ 7 + కుడి 4 = ఎడమ 11వ అక్షరం
∴ పై ఆర్డర్‌లో ఎడమ నుంచి 11వ అక్షరం U

సమాధానాలు

1) బి; 2) ఎ; 3) సి; 4) బి; 5) డి; 6) బి; 7) సి; 8) సి; 9) సి; 10) ఎ; 11) డి; 12) ఎ; 13) సి; 14) ఎ; 15) సి.

ప్రాక్టీసు ప్రశ్నలు

1. S అనే అక్షరానికి ఎడమవైపు ఉండే 5వ అక్షరం ఏది?
   ఎ) N బి) M సి) O డి) T
2. L అనే అక్షరానికి కుడివైపు ఉండే 6వ అక్షరం ఏది?
   ఎ) N బి) M సి) R డి) T
3. Alphabet orderలో ప్రతి మూడో అక్షరాన్ని తొలగిస్తే ఎడమ నుంచి 4వ అక్షరానికి కుడివైపు ఉండే 5వ అక్షరం ఏది?
   ఎ) M బి) K సి) L డి) N
4. Alphabet orderలో ప్రతి మూడో అక్షరాన్ని తొలగిస్తే మిగిలిన వాటిలో మధ్య అక్షరం ఏది?
   ఎ) M బి) N సి) A
   డి) అలాంటి అక్షరం ఉండదు
5. Alphabetలోని చివరి 10 అక్షరాలను రివర్సులో రాస్తే ఎడమ నుంచి 9వ అక్షరానికి కుడివైపు ఉండే 8వ అక్షరం ఏది?
   ఎ) Z బి) Q సి) P డి) O
6. Alphabetలోని మొదటి 15 అక్షరాలను రివర్సులో రాస్తే కుడి నుంచి 7వ అక్షరానికి ఎడమవైపు ఉండే 5వ అక్షరం ఏది?
   ఎ) O బి) L సి) Z డి) A

సూచన(ప్రశ్నల సంఖ్య 7–10): Alphabetలోని మొదటి సగాన్ని రివర్సులో రాస్తే కింది ప్రశ్నలకు సరైన సమాధానాలు గుర్తించండి.

7. Kకి ముందు (పైన) ఎన్ని అక్షరాలు ఉంటాయి?
   ఎ) 2 బి) 12 సి) 4 డి) 14
8. B తర్వాత ఎన్ని అక్షరాలు ఉంటాయి?
   ఎ) 1 బి) 24 సి) 14 డి) 4
9. A నుంచి Z వరకు ఎన్ని అక్షరాలు ఉంటాయి?
   ఎ) 12 బి) 14 సి) 13 డి) 1
10. ఎడమ నుంచి 18వ అక్షరం ఏది?
   ఎ) M బి) N సి) Q డి) R

సమాధానాలు

1) ఎ; 2) సి; 3) ఎ; 4) డి; 5) ఎ; 6) డి; 7) ఎ; 8) సి; 9) బి; 10) డి.

మాదిరి ప్రశ్నలు

1. 'DEPRESSION' అనే పదంలో ఒకటో స్థానంలో ఉన్న అక్షరాన్ని రెండో స్థానంలో, రెండో స్థానంలోని అక్షరాన్ని మొదటి స్థానంలో, మూడో స్థానంలో ఉన్న అక్షరాన్ని నాలుగో స్థానంలో, నాలుగో స్థానంలో ఉన్న అక్షరాన్ని మూడో స్థానంలో రాశారు. ఈ విధంగా పదంలోని అన్ని అక్షరాలు తారుమారైతే ఏర్పడే పదంలో ఎడమ నుంచి ఏడో అక్షరం ఏది?
   ఎ) S బి) I సి) O డి) R

Sol: ఇచ్చిన పదం:
D E P R E S S I O N
1 2 3 4 5 6 7 8 9 10
స్థానాలు మారితే వచ్చే పదం:
E D R P S E I S N O
1 2 3 4 5 6 7 8 9 10
∴ కొత్త పదంలో ఎడమ నుంచి ఏడో అక్షరం 'I' జవాబు: బి

2. 'EXHAUSTIVE' అనే పదంలో మొదటి మూడు, చివరి మూడు, మధ్య అక్షరాలను రివర్స్‌లో రాశారు. తర్వాత మొదటి మూడు అక్షరాలను చివర, చివరి మూడు అక్షరాలను మొదట రాశారు. ఈ విధంగా ఏర్పడిన నూతన పదంలో ఎడమ నుంచి నాలుగో అక్షరానికి కుడివైపు ఉన్న మూడో అక్షరం ఏది?
   ఎ) A బి) T సి) H డి) E

Sol: E X H A U S T I V E లో
చివరి మూడు అక్షరాలను రివర్స్‌లో రాస్తే: E V I
తర్వాత నాలుగు అక్షరాలను రివర్స్‌లో రాస్తే: T S U A
మొదటి మూడు అక్షరాలను రివర్స్‌లో రాస్తే: H X E
మొదటి మూడు అక్షరాలను చివర, చివరి మూడు అక్షరాలను మొదట రాస్తే వచ్చే పదం 'E V I T S U A H X E'
∴ఈ పదంలో ఎడమ నుంచి నాలుగో అక్షరానికి, కుడివైపు ఉన్న మూడో అక్షరం ఎడమ 4 + కుడి 3 = ఎడమ నుంచి 7వ అక్షరం 'A' జవాబు: ఎ

3. 'COMPREHENSION'లోని మొదటి మూడు అక్షరాలు, చివర మూడు అక్షరాలను వరస క్రమంలో పక్కపక్కన రాశారు. మిగిలిన అక్షరాలను వీటి పక్కన రివర్స్‌లో రాస్తే మధ్యలో ఉండే అక్షరం ఏది?
   ఎ) C బి) O సి) S డి) M

Sol: ఇచ్చిన పదం: COM/PREHENS/ION
మొదటి మూడు అక్షరాలు COM, చివరి మూడు అక్షరాలు ION లను వరుస క్రమంలో పక్కపక్కన రాస్తే
COMION
మధ్య అక్షరాలను రివర్స్‌లో రాస్తే:
SNEHERP
ఏర్పడిన నూతన పదం:
COMIONSNEHERP
∴ మధ్య అక్షరం 'S' జవాబు: సి

విద్య, ఉద్యోగ సమాచారం

ఐపీఆర్, విజయవాడలో ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, విజయవాడలోని ఇన్ఫర్మేషన్ అండ్ పబ్లిక్ రిలేషన్స్(ఐపీఆర్) తాత్కాలిక ప్రాతిపదికన టీమ్ లీడర్ పర్సనల్ లేదా ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీఏ, ఎంఏలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 34 నుంచి 50 ఏళ్ల ఉండాలి.
» **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మార్కులు, స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఈమెయిల్:** apiprdepartment@gmail.com.
» **దరఖాస్తులకు చివరితేది:** 26.03.2025.
» **వెబ్‌సైట్:** http://http//ipr.ap.gov.in

సీఎస్ఐఆర్-సీబీఆర్ఐ, రూర్కీలో 31 సైంటిస్ట్ పోస్టులు

రూర్కీ (ఉత్తరాఖండ్) లోని సీఎస్ఐఆర్-సెంట్రల్ బిల్డింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీబీఆర్ఐ) సైంటిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 31.
» **పోస్టుల వివరాలు:** ప్రిన్సిపల్ సైంటిస్ట్-02, సీనియర్ సైంటిస్ట్-02, సైంటిస్ట్-27.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ, ఎంఆర్క్, ఎంఈ/ఎంటెక్, పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** ప్రిన్సిపల్ సైంటిస్ట్‌కు 45 ఏళ్లు, సీనియర్ సైంటిస్ట్‌కు 37 ఏళ్లు, సైంటిస్ట్‌కు 32 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు ప్రిన్సిపల్ సైంటిస్ట్‌కు రూ.1,23,100, సీనియర్ సైంటిస్ట్‌కు రూ.78,800, సైంటిస్ట్‌కు రూ.67,700.
» **ఎంపిక విధానం:** విద్యార్హతలు, ఉద్యోగానుభవం, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 04.04.2025
» **వెబ్‌సైట్:** https://cbri.res.in

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

అత్యంత కఠిన లోహం టంగ్‌స్టన్

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

రసాయన శాస్త్రం

మన పూర్వీకుల లోహశాస్త్ర ప్రావీణ్యానికి ప్రతీక ఢిల్లీలోని ఇనుప స్తంభం. గత 1600 ఏళ్లుగా అది తుప్పు పట్టలేదు. దాని తయారీలో ఫాస్ఫరస్ శాతాన్ని పెంచి సల్ఫర్, మెగ్నీషియం లేకుండా చూడటమే అది తుప్పు పట్టకపోవడానికి కారణం. సాధారణంగా తీర ప్రాంతాల్లో తేమ ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల ఇనుము త్వరగా తుప్పు పడుతుంది. కానీ ఒడిశా తీరప్రాంతంలోని కోణార్క్ సూర్యదేవాలయంలో వాడిన ఇనుప దూలాలు, పశ్చిమ తీరంలో కొల్లూర్‌లో ఉన్న మూకాంబికా ఆలయంలోని ఇనుప స్తంభం తుప్పు పట్టలేదు. వాటి తయారీలో వాడిన ఐరన్ మిశ్రమ లోహంలో ఫాస్ఫరస్ గాఢత ఎక్కువగా ఉండటమే దీనికి కారణమని పరిశోధనలో తేలింది.



మిశ్రమ లోహాలు

రెండు లేదా అంతకంటే ఎక్కువ లోహాలు లేదా ఒక లోహంతోపాటు ఇతర మూలకాల సజాతీయ మిశ్రమమే మిశ్రమ లోహం. శుద్ధ లోహాలతో పోల్చినప్పుడు మిశ్రమ లోహాల ధర్మాలు కాస్త భిన్నంగా ఉంటాయి.

మిశ్రమ లోహాలు - ఇతరాంశాలు

- ఇనుము ఒక అనుఘటకంగా ఉన్న మిశ్రమ లోహాలను ఫెర్రస్ మిశ్రమ లోహాలు అంటారు.
  ఉదా: స్టెయిన్‌లెస్ స్టీలు
  (ఐరన్ + కార్బన్ + క్రోమియం)
- ఐరన్ లేని మిశ్రమ లోహాలను నాన్ ఫెర్రస్ మిశ్రమ లోహాలు అంటారు.
  ఉదా: జర్మన్ సిల్వర్
  (కాపర్ + జింక్ + నికెల్)
- పాదరసం (మెర్క్యురీ) ఒక అనుఘటకంగా ఉన్న మిశ్రమ లోహాన్ని అమాల్గం అంటారు. ఉదా: సోడియం అమాల్గం (మెర్క్యురీ + సోడియం)
- ఐరన్, ప్లాటినం లోహాలు అమాల్గంను ఏర్పరచవు.
- దంతాల్లోని రంధ్రాలను ఫిల్లింగ్ చేయడానికి డెంటల్ అమాల్గంను ఉపయోగిస్తారు. ఇది మెర్క్యురీ, సిల్వర్, టిన్, కాపర్‌ల మిశ్రమ లోహం.
- సాంకేతికంగా మిశ్రమ లోహాన్ని ఘనరూపంలో ఉన్న ద్రవంగా పరిగణించవచ్చు.
- మిశ్రమ లోహాల వల్ల పదార్థ గట్టిదనం పెరుగుతుంది.
- వీటి సాగే గుణం తక్కువగా ఉంటుంది.
- ద్రవీభవన స్థానం తక్కువ.
- తుప్పు పట్టే గుణం తగ్గుతుంది.
- విద్యుత్ వాహకత తగ్గుతుంది.
- లోహ కాంతిని, రంగును మెరుగుపర్చవచ్చు.
- చర్యాశీలత మార్చవచ్చు.
- ఆమ్లాలను, క్షారాలను తట్టుకునే గుణం పెరుగుతుంది.
- బంగారు ఆభరణాల స్వచ్ఛతను క్యారెట్ ప్రమాణాల్లో కొలుస్తారు.
- 24 క్యారెట్ల బంగారంలో 100 శాతం బంగారం ఉంటుంది. x క్యారెట్ల బంగారంలో $(x\times100)/24$ శాతం బంగారం ఉంటుంది.

ఒక క్యారెట్ 100/24 శాతం బంగారానికి సమానం. 18 క్యారెట్ల బంగారు ఆభరణాల్లో $(18\times100)/24 = 75$ శాతం బంగారం, మిగతా 25 శాతం రాగి ఉంటుంది. 22 క్యారెట్ల బంగారు ఆభరణాలు 91.6 శాతం స్వచ్ఛత కలిగి ఉంటాయి. మిగతా 8.4 శాతం రాగి ఉంటుంది.

తుప్పు పట్టడం: లోహం తుప్పు పట్టడమనేది ఆక్సీకరణ ప్రక్రియ. ఉదా: ఇనుము తుప్పు పట్టినప్పుడు ఆక్సీకరణం చెంది ఐరన్ ఆక్సైడ్ (ఫెర్రిక్ ఆక్సైడ్) ఏర్పడుతుంది. ఈ ప్రక్రియలో దాని బరువు పెరుగుతుంది. సాధారణంగా గాలిలో తేమ ఎక్కువగా ఉండే తీరప్రాంతాల్లో తుప్పుపట్టడం వేగంగా జరుగుతుంది.

గాల్వనైజేషన్: ఇనుము లాంటి లోహాలు తుప్పు పట్టకుండా వాటిపై జింక్ లాంటి లోహాలతో పూత పూయడాన్నే గాల్వనైజేషన్ అంటారు. గాల్వనైజేషన్ చేయడం వల్ల ఇనుము క్షయం కాకుండా నివారించవచ్చు. గాల్వనైజేషన్ చేయడానికి ఎక్కువ చర్యాశీలత ఉన్న లోహాన్ని తీసుకుంటారు. ఉదా: జింక్ క్రియాశీలత ఎక్కువ కాబట్టి దీంతో ఇనుముపై పూత పూయడం వల్ల ఇది క్షయం చెంది ఐరన్‌ను పరిరక్షిస్తుంది.

- ఎలక్ట్రోప్లేటింగ్‌లో కావాల్సిన లోహపు పూతను విద్యుద్విశ్లేషణ పద్ధతిలో వేస్తారు. ఏ లోహంపై పూత పూయాలో దాన్ని కాథోడ్(రుణధ్రువం)గా, పూతపూయాల్సిన లోహమున్న లవణ ద్రావణాన్ని విద్యుద్విశ్లేష్యం(ఎలక్ట్రోలైట్)గా తీసుకుంటారు. ఉదా: కారు విడిభాగాలు, కుళాయిలు, గ్యాస్ బర్నర్‌లపై క్రోమియం ప్లేటింగ్ చేస్తారు. దీనివల్ల తుప్పు పట్టవు. మన్నిక పెరుగుతుంది. నకిలీ నగల తయారీలో కూడా ఈ పద్ధతిని ఉపయోగిస్తారు.
- మెర్క్యురీ తప్ప మిగతా లోహాలన్నీ ఘన పదార్థాలే. పాదరసం(మెర్క్యురీ) మాత్రం ద్రవం. గాలియం అతి తక్కువ ఉష్ణోగ్రత వద్ద కరిగే లోహం.
- లిథియం, సోడియం, పొటాషియం, రుబీడియం, సీసియం లాంటి క్షారలోహాలు మెత్తని లోహాలు. ఇవి కత్తితో కోయగలిగేంత మృదువైనవి.
- లోహాలు మంచి విద్యుత్ వాహకాలు. స్వేచ్ఛా ఎలక్ట్రాన్లు విద్యుత్‌ను మోసుకెళ్తాయి(ఎలక్ట్రాన్ కండక్టర్). లోహాలన్నింటిలో సిల్వర్ మంచి విద్యుత్ వాహకం. గృహావసరాల కోసం రాగి వైర్లను వాడితే, విద్యుత్ పంపిణీ సంస్థలు అల్యూమినియం వైర్లను ఉపయోగిస్తాయి.
- అనాది నుంచి నాణేల తయారీలో ఉపయోగించిన బంగారం, సిల్వర్, కాపర్ లోహాలను కాయినేజ్ మెటల్స్ అంటారు.
- బంగారానికి రేకులుగా సాగే గుణం ఎక్కువ. దీనిపై గీతలు పడవు. ఆభరణాలను తయారుచేసేటప్పుడు గట్టిదనం కోసం బంగారానికి రాగిని కలుపుతారు.
- అత్యంత తేలికైన లోహం లిథియం. అత్యంత మృదువైన లోహం సీసియం.
- అత్యంత కఠిన లోహం టంగ్‌స్టన్.
- మానవుడు విరివిగా వాడే లోహం ఇనుము. మన రక్తంలోని హిమోగ్లోబిన్‌లో ఐరన్ (ఫెర్రస్) అయాన్లు ఉంటాయి.
- మొక్కల్లోని పత్రహరితంలో మెగ్నీషియం, విటమిన్ బి12 (సయనోకోబాలమిన్)లో కోబాల్ట్ లోహాల అయాన్లు ఉంటాయి.
- భూమి పొరల్లో అత్యధికంగా లభించే లోహం అల్యూమినియం. దీనికి బాక్సైట్ గనులు ఆధారం. సిల్వర్ పెయింట్‌లో సిల్వర్ ఉండదు. అల్యూమినియం ఉంటుంది. గోల్డ్ పెయింట్‌లో కాపర్ ఉంటుంది.
- కండరాల సంకోచానికి సోడియం అయాన్లు అవసరం.
- ట్రాన్సిస్టర్ల తయారీలో ప్రధానమైంది జెర్మేనియం.
- సహజ సిద్ధంగా లభించే భారాత్మక లోహం యురేనియం.
- ఉప్పునీటి కాఠిన్యానికి కారణమైన ప్రధాన లోహ అయాన్లు కాల్షియం, మెగ్నీషియం.
- తేలికగా ఉండి, గట్టిదనం కోసం విమాన విడిభాగాల తయారీలో మెగ్నీషియంను ఉపయోగిస్తారు.
- బంగారాన్ని లోహాల రాజుగా పిలుస్తారు.
- మన శరీరంలో ఎక్కువగా ఉండే లోహం కాల్షియం.
- ద్విస్వభావం(ఆంఫోటరిక్) ఉన్న అర్ధలోహాలు ఆర్సెనిక్, జెర్మేనియం, ఆంటిమొని, జింక్.
- లిథియం, సోడియం లాంటి లోహాలు గాలిలోనూ అత్యంత చర్యాశీలత చూపుతాయి. అందుకే వీటిని కిరోసిన్ లేదా పారాఫిన్ నూనెలో నిల్వచేస్తారు.
- సోడియం అయాన్లు రక్తపోటును పెంచుతాయి. పొటాషియం అయాన్లు అధిక రక్తపోటును నియంత్రిస్తాయి.
- బాణసంచా తయారీలో విరివిగా వాడే లోహాలు మెగ్నీషియం(మిరుమిట్లు గొలిపే తెలుపు), స్ట్రాన్షియం(సింధూర ఎరుపు).
- ఇమిటేషన్ జ్యువెలరీలో వాడే నికెల్-సిల్వర్‌లో కాపర్, నికెల్, జింక్ ఉంటాయి. సిల్వర్ ఉండదు.

ముఖ్య మిశ్రమ లోహాలు - ఉపయోగాలు

మిశ్రమ లోహం	సంఘటనం	అనువర్తనాలు
ఇత్తడి (బ్రాస్)	కాపర్ + టిన్	పాత్రలు, యంత్రభాగాలు, బుల్లెట్లు
కంచు (బ్రాంజ్)	కాపర్ + టిన్	విగ్రహాలు, పాత్రలు
బెల్ మెటల్	కాపర్ + టిన్ (తగరం)	గంటల తయారీ
మాగ్నాలియం	మెగ్నీషియం + అల్యూమినియం	విమాన, మోటార్ వాహన భాగాలు
గన్‌మెటల్	కాపర్ + టిన్ + జింక్	గేర్లు, బేరింగ్‌లు, తుపాకీ పరిశ్రమ
జర్మన్ సిల్వర్	కాపర్ + జింక్ + నికెల్	పాత్రలు, నగలు, నిరోధక చుట్టలు
స్టెయిన్‌లెస్ స్టీల్	ఐరన్ + కార్బన్ + క్రోమియం + నికెల్	పాత్రలు, బ్లేడ్లు, బాల్ బేరింగ్‌లు, సర్జికల్ పరికరాలు
మాంగనీస్ స్టీల్	ఐరన్ + కార్బన్ + మాంగనీస్	హెల్మెట్లు, రైల్వే ట్రాక్, రోడ్ రోలర్లు, రాళ్లను పగులగొట్టే యంత్రాలు
టంగ్‌స్టన్ స్టీల్	ఐరన్ + కార్బన్ + టంగ్‌స్టన్ + కోబాల్ట్ + క్రోమియం	శాశ్వత అయస్కాంతాలు
క్రోమ్ స్టీల్	ఎక్కువ క్రోమియం ఉన్న స్టీల్	వంటపాత్రలు
నిక్రోమ్	ఐరన్ + క్రోమియం + నికెల్	ఇస్త్రీపెట్టెలోని ఫిలమెంట్, ఫ్యూజులు, నిరోధక తీగెలు,
డ్యూరాల్యుమిన్	మెగ్నీషియం + అల్యూమినియం	విమాన భాగాలు
అల్యూమినియం బ్రాంజ్	కాపర్ + అల్యూమినియం+టిన్	ఆభరణాలు, నాణేలు
సోల్డర్	టిన్ + లెడ్	సోల్డరింగ్
డొమెటల్	మెగ్నీషియం + అల్యూమినియం + జింక్	కార్లు, జలాంతర్గాములు, విమానాల తయారీలో

గత పరీక్షల్లో అడిగిన ప్రశ్నలు

1. ఇత్తడి దేని మిశ్రమం? (Gr-I, 2010)
   1) రాగి, అల్యూమినియం
   2) రాగి, తగరం (టిన్)
   3) రాగి, తుత్తునాగం(జింక్)
   4) రాగి, నికెల్
2. 22 క్యారెట్ల బంగారంలో రాగి శాతం? (Gr-I, 2010)
   1) 8.4 2) 10.2
   3) 11.4 4) 12.6
3. ఇనుము తుప్పు పట్టినప్పుడు దాని బరువు? (AEE, 2011)
   1) తగ్గుతుంది
   2) పెరుగుతుంది
   3) ఒకేలా ఉంటుంది
   4) పైవేవీ కావు
4. విద్యుత్ తంతువులో ఉపయోగించే మూలకం? (Gr-I, 2010)
   1) అల్యూమినియం 2) రాగి
   3) టంగ్‌స్టన్ 4) ఇనుము

సమాధానాలు

1) 3; 2) 1; 3) 2; 4) 3.

మాదిరి ప్రశ్నలు

1. కిందివాటిలో మిశ్రమ లోహం ఏది?
   1) గ్రాఫైట్ 2) వజ్రం
   3) నిక్రోమ్ 4) తామ్రం
2. సోల్డరింగ్ పనిలో సోల్డర్‌గా ఉపయోగించే పదార్థం ఏ మూలకాల మిశ్రమం?
   1) ఇనుము, టిన్ (తగరం)
   2) సీసం, తగరం
   3) అల్యూమినియం, సిల్వర్
   4) అల్యూమినియం, ఐరన్
3. గన్ మెటల్‌లో ఉండే లోహాలు?
   1) రాగి 2) తగరం (స్టానస్)
   3) జింక్ 4) పైవన్నీ
4. స్టెయిన్‌లెస్ స్టీల్‌లోని లోహాలు?
   1) ఐరన్ 2) కార్బన్
   3) క్రోమియం 4) 1, 2, 3
5. క్విక్ సిల్వర్ అని దేనికి పేరు?
   1) మెర్క్యురీ 2) సిల్వర్
   3) ప్లాటినం 4) గోల్డ్
6. విద్యుత్ క్రేన్‌లలో ఉపయోగించే బలమైన అయస్కాంతాల తయారీకి ఉపయోగించేది?
   1) స్టీల్ 2) చేత ఇనుము
   3) పోత ఇనుము 4) దుక్క ఇనుము
7. అత్యంత స్థితిస్థాపకత (ఎలాస్టిసిటీ) కలిగింది?
   1) రబ్బరు 2) స్టీలు
   3) సిల్వర్ 4) బంగారం
8. జతపర్చండి.

   A
   i) 22 క్యారెట్ల బంగారంలో రాగి
   ii) 18 క్యారెట్ల బంగారంలో రాగి
   iii) ఒక క్యారెట్ బంగారం
   iv) 24 క్యారెట్ల బంగారం

   B
   ఎ) 25 శాతం
   బి) 2 క్యారెట్లు
   సి) 100 శాతం
   డి) 100/24 శాతం

	i	ii	iii	iv
1)	ఎ	బి	సి	డి
2)	బి	సి	ఎ	డి
3)	బి	ఎ	డి	సి
4)	బి	ఎ	సి	డి

సమాధానాలు

1) 3; 2) 2; 3) 4; 4) 4; 5) 1; 6) 2; 7) 2; 8) 3.

What is the code for 'BE' in the..



BANK EXAMS

REASONING

Model questions

Directions(Q. 1 to 5):- Read the questions carefully and answer them:

In these questions, a relationship between different elements is shown in the statement(s). The statements are followed by two conclusions. Give answer

1) If only conclusion I is true.
2) If only conclusion II is true.
3) If either conclusion I or II is true.
4) If neither conclusion I nor II is true.
5) If both conclusions I and II are true.

1. **Statements:** B < A, B ≥ D, P = A, P ≤ L
   Conclusion: I. A > D II. L > B
2. **Statements:** B > Z, M ≤ T ≤ Q, Z < M
   Conclusions: I. Q > B II. Z > T
3. **Statements:** C ≥ D > L, D= N < A, C < B
   Conclusions:I.B = A II. N ≤ C
4. **Statements:** A > B = X, X ≥ Q, C ≤ Q
   Conclusions: I. B = C II. B > C
5. **Statements:** S ≥ O > L, O = N < A, S < M
   Conclusions: I.M >A II. M ≤ A

Directions (Q. 6 to 10):- Study the information carefully and answer the following questions:

In a certain code language-
a) 'WEALTH, HEALTH, PROSPERITY, PEACE' is written as 'kat lat ho gat'
b) 'HEALTH SHOULD BE MAINTAINED' is written as, 'mat ta pat kat'
c) 'PEACE IS FINAL OUTCOME' is written as, 'zi lat ne ki'
d) 'GOOD HEALTH SHOULD RESULTS' is written as, 'zat mat kat da

6. What is the code for 'HEALTH' in the given code language?
   1) gat 2) ho 3) pat
   4) kat 5) da
7. What is the code for 'SHOULD' in the given code language?
   1) kat 2) da 3) mat
   4) gat 5) zi
8. What is the code for 'PEACE' in the given code language?
   1) lat 2) ho 3) kat
   4) zi 5) da
9. What is the code for 'RESULTS' in the given code language?
   1) zat 2) da
   3) either (1) or (2)
   4) mat (5) da
10. What is the code for 'BE' in the given code language?
    1) mat 2) pat
    3) kat 4) ta
    5) cannot be determined

Directions (Q. 11 to 16): Study the following information carefully and answer the given questions:

A word and number arrangement machine when given an input line of words and numbers rearranges them following a particular rule in each step. The following is an illustration of input and rearrangement. (All the numbers are two-digit numbers.)

Input: sound night 12 19 wonder 20 78 around 90 twinkle 36 pot 42 calyx
Step I: wonder sound night 19 20 78 around 90 twinkle 36 pot 42 calyx 12
Step II: wonder twinkle sound night 20 78 around 90 36 pot 42 calyx 12 19
Step III: wonder twinkle sound pot night 78 around 90 36 42 calyx 12 19 20
Step IV: wonder twinkle sound pot night calyx 78 around 90 42 12 19 20 36
Step V: wonder twinkle sound pot night calyx around 78 90 12 19 20 36 42
Step VI: wonder twinkle sound pot night calyx around 90 12 19 20 36 42 78
Step VII: wonder twinkle sound pot night calyx around 12 19 20 36 42 78 90

Step VII is the last step of the above input, as the desired arrangement is obtained.

As per the rule followed in the above steps, find out in each of the following questions the appropriate step for the given input.

Input: orange 16 any 90 total 88 12 mask 19 soil 21 thus 56 nexus. (All the numbers are two-digit numbers.)

11. Which step number is the following output?
    Total thus soil orange nexus any 90 88 mask 56 12 16 19 21
    1) Step V 2) Step VI
    3) Step IV 4) Step III
    5) There is no such step
12. How many elements (words or numbers) are there between 'mask' and '19' as they appear in last but one step?
    1) 3 2) 4 3) 5
    4) 2 5) 6
13. How many steps would be required to get the final output?
    1) Five 2) Six
    3) Four 4) Seven
    5) None of these
14. Which of the following represents the position of 'any' in the fifth step?
    1) Sixth from the left
    2) Seventh from the left
    3) Fourth from the right
    4) Eighth from the left
    5) Sixth from the right
15. Which word/number would be at 5th position from the right in Step VI?
    1) 12 2) 19 3) 90
    4) any 5) 16
16. Which word/number is 5th to the left of 12th word/number from the left end in Step V?
    1) 12 2) 19 3) 90
    4) any 5) 16

Explanations

1. A > B ≥ D
   Hence, A > D.
   Conclusion I is true.
   L ≥ P = A > B
   Hence, L > B.
   Conclusion II is also true.
   Ans: 5
2. Q ≥ T ≥ M > Z < B. Hence, Q and B cannot be compared.
   Conclusion I is not true.
   T ≥ M > Z. Hence, T > Z.
   So, conclusion II is not true.
   Ans: 4
3. B > C ≥ D = N < A. As B and A cannot be compared, conclusion I is not true.
   C ≥ D = N. Hence, C ≥ N.
   so, conclusion II is true.
   Ans: 2
4. B=X ≥ Q ≥ C. Hence, B ≥ C, which means B > C or B = C.
   Either I or II is true.
   Ans: 3
5. M > S ≥ O = N < A.
   As contradictory symbols (>, <) are there between the terms B and A, they cannot be compared. But, Either I or II follows.
   Ans: 3
6. By comparing (a) (b) & (d)
   HEALTH = kat
   Ans: 4
7. By comparing (b) & (d)
   SHOULD = mat
   Ans: 3
8. By comparing
   (a) & (c) PEACE = lat
   Ans: 1
9. (d) RESULTS = Either zat or da
   Ans: 3
10. (b) BE = Either ta or pat.
    Hence, cannot be determined.
    Ans: 5

11 - 16:

The machine rearranges words and numbers in such a way that numbers are arranged from right side and words are arranged from left side. While numbers are arranged in ascending order, words are arranged in reverse alphabetical order.

Input: orange 16 any 90 total 88 12 mask 19 soil 21 thus 56 nexus.
Step I: total orange 16 any 90 88 mask 19 soil 21 thus 56 nexus 12
Step II: total thus orange any 90 88 mask 19 soil 21 56 nexus 12 16
Step III: total thus soil orange any 90 88 mask 21 56 nexus 12 16 19
Step IV: total thus soil orange nexus any 90 88 mask 56 12 16 19 21
Step V: total thus soil orange nexus mask any 90 88 12 16 19 21 56
Step VI: total thus soil orange nexus mask any 90 12 16 19 21 56 88
Step VII: total thus soil orange nexus mask any 12 16 19 21 56 88 90

11. Ans: 3
12. Sixth step is the last but one. There are four elements between 'mask' and '19'.
    The elements are:
    any, 90, 12, 16
    Ans: 2
13. Ans: 4
14. **Step V:** total thus soil orange nexus mask any 90 88 12 16 19 21 56
    Thus, seventh from the left is 'any'.
    Ans: 2
15. **Step VI:** total thus soil orange nexus mask any 90 12 16 19 21 56 88.
    Thus fifth from the right is 16
    Ans: 5
16. In Step V, 12th from the left end is '19', and fifth one on the left from 19 is ' any'
    (Short cut: 12th - 5th = 7th from the left end i.e 'any')
    Ans: 4